
'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 8.00

సంపుటి: 18

సంచిక: 242

SUNDAY Special

ఆదివారం 23-11-2025

## అవమానాల నుంచి అందాల కిరీటం వరకు..

'బాష్'కు అడవి అని అర్థం. అడవిలో 'పచ్చదనం' అనే సానుకూల శక్తి ఉంటుంది. ఆ శక్తితోనే ప్రతికూలతలను అధిగమించి మిస్ యూనివర్స్ పోటీల్లో అందాల కిరీటాన్ని గెలుచుకుంది మెక్సికో సుందరి ఫాతిమా బాష్.

- వివరాలు 11లో

## భారత్‌తో రెండో టెస్టు.. దక్షిణాఫ్రికా 247/6

గువహటిలో శనివారం భారత్‌తో మొదలైన రెండో టెస్టులో మొదటి రోజు దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 247 పరుగులు చేసింది. కుల్దీప్‌కు 3 వికెట్లు దక్కాయి.

- వివరాలు 12లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

### కేసుల కొండ కరిగిస్తా

కోర్టుల నెత్తిన గుదిబండగా మారిన కేసుల సత్వర పరిష్కారంపై దృష్టి సారిస్తానని కాబోయే సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

వివరాలు 6లో ▸

### ట్రంప్, మమ్దానీ స్నేహగీతం

భిన్నధ్రువాలైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, న్యూయార్క్ మేయర్ మమ్దానీ వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు.

వివరాలు 6లో ▸

### పాక్ నుంచి డ్రోన్లతో ఆయుధాలు

చైనా తయారీ అత్యాధునిక ఆయుధాలను డ్రోన్లతో భారతగడ్డపైకి తీసుకొస్తున్న ముఠాను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు.

వివరాలు 6లో ▸

### బొల్సనారో ముందే అరెస్ట్

తిరుగుబాటు యత్నం ఆరోపణలపై గృహ నిర్బంధంలో ఉన్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బొల్సనారోను ముందుగానే అరెస్ట్ చేశారు.

వివరాలు 6లో ▸

## జీ20 సౌభాగ్యానికి 4 సూత్రాలు

**జీ20 దేశాధినేతల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదన**

- ప్రపంచ సంప్రదాయ విజ్ఞానాన్ని భద్రపర్చుకోవాలి
- ఆఫ్రికా స్కిల్స్ మల్టీప్లయర్ కార్యక్రమం ప్రారంభిద్దాం
- గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసుకుందాం
- డ్రగ్స్–టెర్రర్ బంధాన్ని కలిసికట్టుగా ఎదుర్కొందాం
- అభివృద్ధి విధానాలపై పునరాలోచన చేయాలని పిలుపు

6లో

### జాబుల్లేవ్.. జాబు కార్డులూ పోయె!

# 'ఉపాధి'కి ఉరి!

**కనీస సమాచారం ఇవ్వకుండా ఎడాపెడా జాబ్‌కార్డుల తొలగింపు**

**ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 18.63 లక్షల కార్డులు ఔట్**

**గత 40 రోజుల్లోనే ఏకంగా 16 లక్షల కార్డులపై దెబ్బ**

**ఉపాధి పనులకు దూరమై అల్లాడుతున్న లక్షలాది నిరుపేద కుటుంబాలు**

పేదల ఉపాధిలోనూ గ్రామాల్లో చిచ్చు రగిలిస్తున్న అధికార పార్టీ నేతలు.. ఈ-కేవైసీ ప్రక్రియ ముసుగులో వందల కొద్దీ కార్డుల ఏరివేత

తమకు గిట్టనివారి, ప్రత్యర్థి పార్టీ మద్దతుదారుల జాబ్‌కార్డులు ఇష్టానుసారంగా తొలగింపు

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామసభలో చర్చించాకే తగిన నిర్ణయం తీసుకోవాలి

లబ్ధిదారులు ఉపాధి పనులకు రావడం లేదని జాబ్ కార్డులు తొలగించకూడదు..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే గ్రామాల్లో 'ఉపాధి' కరువు.. పనిదినాల్లో కోతలు

2లో

| S.No | State | No. of Registered | | No. of Jobcard deleted in current YR | | No. of Jobcard included in current YR | | Cumulative No. of HH issued jobcards | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Household | Persons | Household | Persons | Household | Persons | SCs | STs | Others | Total |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | ANDHRA PRADESH | 6438934 | 11053799 | 748662 | 1863821 | 154798 | 350731 | 1446198 | 555245 | 4403155 | 640459 |
| 2 | ARUNACHAL PRADESH | 362633 | 473855 | 8288 | 31023 | 22751 | 26160 | 117 | 341555 | 18788 | 36046 |
| 3 | ASSAM | 7252728 | 11614967 | 29804 | 102030 | 685798 | 1018852 | 316455 | 936364 | 5068154 | 634097 |
| 4 | BIHAR | 22475222 | 27181891 | 70710 | 96341 | 1238047 | 1569768 | 3554923 | 333532 | 13953991 | 1784244 |

ఏపీలో 18.63 లక్షల మంది జాబ్ కార్డులు తొలగించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పోర్టల్‌లో నమోదైన వివరాలు

పుట్టపర్తిలో సత్యసాయి సమాధి వద్ద ప్రార్థిస్తున్న రాష్ట్రపతి ముర్ము

## సత్యసాయి బోధనలు విశ్వశాంతికి మార్గదర్శకాలు

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

3లో

## ఈక్వెస్ట్రియన్ లీగ్‌కు వైఎస్ జగన్, కేటీఆర్ హాజరు

2లో

బెంగళూరులో ఈక్వెస్ట్రియన్ లీగ్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### భక్తుల మనోభావాలతో

## రాజకీయాలొద్దు

- టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మండిపాటు
- రాజకీయ ప్రయోజనాల కోసం శ్రీవారి లడ్డూపై దుష్ప్రచారం అపరాధం
- లడ్డూల తయారీలో నకిలీ నెయ్యి వాడారన్నది తప్పుడు ప్రచారమే
- జంతువుల కొవ్వు వాడారని ల్యాబ్ నివేదిక ఉందా?
- సిట్ అధికారికంగా ప్రకటించిందా? లీకుల పేరిట విష ప్రచారం ఎందుకు?

10లో

## డీల్ కుదిరితేనే కాంట్రాక్టు

నేతలకు ఆదాయ వనరుగా పెద్దాస్పత్రులు

స్థానిక మందుల కొనుగోళ్లలో పారదర్శకతకు పాతర

గోప్యంగా ఆఫ్‌లైన్‌లో టెండర్‌లు

టెండర్‌లలో ఎక్కువ మంది పాల్గొనకుండా గూడుపుఠాణి

- వివరాలు 14లో

## అండమాన్‌లో అల్పపీడనం

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అండమాన్‌లో శనివారం అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది ఈ నెల 24 నాటికి వాయుగుండంగా, 26కు తుపానుగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

13లో


నేటి గ్రుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| 12 గ్రుడ్ల రిటైల్ ధర ₹90 | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 108 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 196 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 135 కిలో | స్కిన్ లెస్ | 223 కిలో |

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

డోంట్ వర్రీ సార్! రైతులు ఎలాగూరారు.. వచ్చినా మీకు ఇబ్బందే. అందుకే ఏఐ టెక్నాలజీతో ఈ పరదాలు ఏర్పాటు చేయించాం! ఇక మీరు ధైర్యంగా వెళ్లొచ్చు!!

ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నంద్యాల జిల్లా ఆత్మకూరు యార్డులో తడిసిపోయిన మొక్కజొన్న

### మొక్కజొన్నకు

# దక్కని మద్దతు

**కోతలు ప్రారంభమై 45 రోజులైనా జాడలేని కొనుగోలు కేంద్రాలు**

పండించిన పంటను అమ్ముకోవడానికి నానా తిప్పలు

దళారీలు, వ్యాపారుల దోపిడీకి గురవుతున్న రైతులు

కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.2,400

రైతులకు దక్కుతున్నది రూ.1,900 లోపే

2లో

## క్లుప్తంగా...

### నేడు రాప్తాడుకు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో పర్యటించనున్నారు. ఉదయం 11.30 గంటలకు రాప్తాడుకు చేరుకుని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు హాజరుకానున్నారు.

### 28 నుంచి వన్డే టికెట్ల విక్రయాలు

- 4న దక్షిణాఫ్రికా, భారత్ జట్లు రాక
- 6న విశాఖలో మూడో మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: భారత్‌తో దక్షిణాఫ్రికా తలపడనున్న వన్డే మ్యాచ్ టికెట్లను ఈనెల 28నుంచి విక్రయించనున్నారు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా విశాఖలోని వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో మూడో మ్యాచ్ డిసెంబర్ 6న జరగనుంది. స్టేడియంలో దాదాపు 22 వేల టికెట్లను ఆన్‌లైన్‌లో డిస్ట్రిక్ట్స్ యాప్ ద్వారా విక్రయిండానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. రూ.1,200, రూ.2,000, రూ.2,500, రూ.3,000, రూ.3,500, రూ.4,000 డినామినేషన్లలో టికెట్లను అందుబాటులో ఉంచారు. రూ.5,000, రూ.10,000, రూ.15,000, రూ.18,000 టికెట్లను హస్పిటాలిటీ, సెమీ హాస్పిటాలిటీ పేరిట విక్రయించనున్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ఆధ్వర్యంలో ఈ మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

### జేడీఎస్ జాతీయ అధ్యక్షుడిగా దేవెగౌడ

కర్ణాటక అధ్యక్షుడిగా కుమారస్వామి

సమావేశంలో దేవెగౌడ, కుమారస్వామి

శివాజీనగర: కర్ణాటకలో జేడీఎస్(జనతా దళ్ సెక్యులర్) పగ్గాలు మరోసారి మాజీ ప్రధాని దేవెగౌడకే దక్కాయి. జేడీఎస్ పార్టీ స్థాపితమై 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో రజత మహోత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. శనివారం జేడీఎస్ జాతీయ అధ్యక్షుడిగా మాజీ ప్రధాని హెచ్‌డి.దేవెగౌడ, రాష్ట్రాధ్యక్షుడిగా ఆయన కుమారుడు, కేంద్రమంత్రి హెచ్‌డి.కుమారస్వామిలను పార్టీ నాయకత్వం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. స్థానిక పార్టీ కార్యాలయంలో దేవెగౌడ పార్టీ జెండా ఆవిష్కరించి, బాధ్యతలు చేపట్టారు.

### ఏపీలో 30 పత్తి కొనుగోలు కేంద్రాలు

కొరిటిపాడు (గుంటూరు వెస్ట్): పత్తి కొనుగోలుకు ఏపీలో 30 కేంద్రాలు ప్రారంభించినట్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జీఎం రాజేంద్రప్రషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పథకంతో పత్తి విక్రయించేందుకు కాప్స్ కిసాన్ యాప్‌ను రూపొందించిందన్నారు. ఏపీ ప్రభుత్వ సీఎం యాప్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నాక రైతులు ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, ఓటీపీ ద్వారా లాగిన్ అవ్వాలన్నారు. అందులో భారతీయ పత్తి సంస్థకు పత్తి విక్రయించేందుకు సమీప కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకుని కనీస మద్దతు ధరను పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్ 76599 54529ను సంప్రదించాలని తెలిపారు.

రేసులో గుర్రంపై దూసుకుపోతున్న పోటీదారు

గుర్రపు స్వారీ పోటీలను తిలకిస్తున్న వైఎస్ జగన్, కేటీఆర్

గోల్డ్ మెడల్ సాధించిన విజేతకు బహుమతి అందజేస్తున్న వైఎస్ జగన్, కేటీఆర్

## ఈక్వెస్ట్రియన్ లీగ్‌కు వైఎస్ జగన్, కేటీఆర్ హాజరు

ఫైనల్‌లో విజేతలకు బహుమతుల ప్రదానం

ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన 'ది సర్జ్ ఈక్వెస్ట్రియన్ లీగ్' ముగింపు వేడుకలకు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ మాజీ మంత్రి కె.తారకరామారావు హాజరయ్యారు. బెంగళూరులోని సర్జ్ స్టేబుల్ సంస్థలో శనివారం సాయంత్రం ఈ అంతర్జాతీయ గుర్రపు స్వారీ ఫైనల్ పోటీలు జరిగాయి. అనంతరం జరిగిన కార్యక్రమంలో వీరిద్దరూ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. వివిధ దేశాల నుంచి ప్రపంచ స్థాయి గుర్రపు స్వారీ పోటీదారులు కూడా హాజరయ్యారు. ఈ సర్జ్ ఈక్వెస్ట్రియన్ లీగ్ ద్వారా మనదేశ గుర్రపు స్వారీ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పినట్లు అయిందని నిర్వాహకులు తెలిపారు. - సాక్షి, బెంగళూరు

జాబుల్లేవ్.. జాబు కార్డులూ పోయె!

# 'ఉపాధి'కి ఉరి!

## కనీస సమాచారం ఇవ్వకుండా ఎడాపెడా జాబ్‌కార్డుల తొలగింపు

## ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 18.63 లక్షల మంది కార్డులు ఔట్

- పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం కొత్తపల్లిలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు మధ్య 233 నిరుపేద కుటుంబాల ఉపాధి హామీ జాబ్ కార్డులను చంద్రబాబు ప్రభుత్వ తొలగించింది. మార్చిలో గ్రామంలో 570కి పైగా జాబ్‌కార్డులు ఉండగా ఇప్పుడు 346 మాత్రమే మిగిలాయి. కార్డుల తొలగింపుపై కనీస సమాచారం ఇవ్వలేదని బాధితులు 'సాక్షి' ఎదుట వాపోయారు.
- ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం పెదారికట్లలో గత ఏడున్నర నెలల వ్యవధిలో 350 కుటుంబాల ఉపాధి జాబ్ కార్డులను తొలగించారు. గ్రామంలో ఇప్పుడు 820 కార్డులే మిగిలాయి.
- విజయనగరం జిల్లా గంట్యాడ మండలం బుడతనాపల్లిలో 247 కుటుంబాల జాబ్ కార్డులను తొలగించారు.
- శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం ఆర్.అనంతపురంలో 337 కుటుంబాల జాబ్ కార్డులను చంద్రబాబు ప్రభుత్వం తొలగించింది.
- కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం గంజిహాలిలో ఏప్రిల్ నుంచి 421 కుటుంబాల జాబ్‌కార్డులను చంద్రబాబు ప్రభుత్వం తొలగించింది.
- కాకినాడ జిల్లాలో 73,359, అన్నమయ్య జిల్లాలో 67,485, ప్రకాశం జిల్లాలో 50,926, కర్నూలు జిల్లాలో 44,499, శ్రీసత్యసాయి జిల్లాలో 40,785 కుటుంబాలు.. ఇలా ప్రతి చోటా వేల కుటుంబాల ఉపాధి హామీ జాబ్‌కార్డులను గత ఏడున్నర నెలల వ్యవధిలో బాబు ప్రభుత్వం ఊడగొట్టింది!

సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాలన్నింటినీ నీరుగార్చి, పేదలను నిలువునా ముంచిన చంద్రబాబు.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ పథకమైన 'ఉపాధి హామీ'ని కూడా నిరుపేదలకు దక్కకుండా చేస్తూ పేదల పొట్టకొడుతున్నారు. నిరుపేద కుటుంబాలకు కనీసం సమాచారం లేకుండా చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులను తొలగిస్తోంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వెబ్‌పోర్టల్ వివరాల ప్రకారమే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 18.63 లక్షల మంది జాబ్ కార్డులను నిర్దాక్షిణ్యంగా రద్దు చేసింది. ఒక్క అక్టోబరు 8వ తేదీ నుంచే దాదాపు 16 లక్షల మంది పేదలు జాబ్‌కార్డులు కోల్పోయినట్లు వివిధ స్వచ్ఛంద సంస్థలు పేర్కొంటున్నాయి. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఈ–కేవైసీ నమోదు ప్రక్రియ చేపట్టింది. ఈ ముసుగులో చాలా గ్రామాల్లో అధికార టీడీపీ నేతలు తమకు గిట్టనివారితోపాటు ప్రత్యర్థి పార్టీ సానుభూతిపరులు, మద్దతుదారుల జాబ్‌కార్డులను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతేడాది జూన్‌లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి వారి స్థానంలో అధికార పార్టీ నేతలు సూచించిన వారిని నియమించింది. వీరంతా జాబ్ కార్డుల తొలగింపులో చురుగ్గా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

### జాబులు లేవు.. జాబు కార్డులూ మాయం!

రాష్ట్రంలో యాక్టివ్ జాబ్ కార్డులున్న దాదాపు 48 లక్షల కుటుంబాలకు చెందిన 75 లక్షల మంది నిరుపేదలు ఏటా ఉపాధి హామీ ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. పథకం ద్వారా దాదాపు రూ.7 వేల కోట్ల మేర లబ్ధి చేకూరుతోంది. పథకం ఖర్చులో 90 శాతం మేర కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఓ కుటుంబంలో ఎవరైనా ఉపాధి పనులకు హాజరు కావాలంటే జాబ్‌కార్డు ఉండాలి. ఒకసారి జాబ్ కార్డు మంజూరు చేశాక తొలగించాలంటే కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించింది. అంతేగానీ సాధారణ పద్ధతిలో జాబ్‌కార్డులు తొలగించకూడదని మాస్టర్ సర్క్యులర్ 3.4లో పేర్కొంది. గ్రామ సభ నిర్వహించి బహిరంగ చర్చ అనంతరమే తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. కొద్ది రోజులు పనులకు హాజరు కాకపోయినా జాబ్ కార్డులు తొలగించవద్దని నిబంధనల్లో స్పష్టంగా పేర్కొంది. ఆధార్, బ్యాంకు ఖాతాలతో లింక్ చేసుకోలేదనే కారణాలతో జాబ్‌కార్డులు రద్దు చేసే నిబంధన ఏదీ లేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ ఏడాది ఆగస్టులో రాజ్యసభకు లిఖితపూర్వకంగా వెల్లడించింది.



GOVERNMENT OF INDIA
MINISTRY OF RURAL DEVELOPMENT
DEPARTMENT OF RURAL DEVELOPMENT

RAJYA SABHA
UNSTARRED QUESTION NO. 1583
TO BE ANSWERED ON 01/08/2025

JOB CARDS DELETED UNDER MGNREGA

1583 Smt. RanjeetRanjan:
Shri NeerajDangi:
Shri HarisBeeran:

(a): To ensure timely payment of wages to the beneficiaries under Mahatma Gandhi National Rural Employment Guarantee Scheme (Mahatma Gandhi NREGS) and to address the issues arising due to frequent changes in bank account numbers of the beneficiaries and subsequent non-updation, it was decided to implement Aadhar Payment Bridge System (APBS). This has been made mandatory with effect from 1st January 2024.It is a mode of payment of wages under the scheme.

The Job cards are not deleted due to reason of non-linking of Aadhaar with bank accounts.

The responsibility of implementation of the scheme is vested with the Government of concerned States/UTs. Verification of Job Card is a regular exercise conducted by the concerned

Job Card.

3.4 Cancellation of Job Cards

No JC is to be cancelled in a routine manner and certainly not on the ground of non-demand / non-reporting for work. The JCs can be cancelled, after due verification, only if,

I. The household has migrated permanently to the urban areas, or
II. It is proved to be a duplicate, or
III. It has been registered based on forged documents (i.e., Not issued by authorized personnel and/or issued to non-existent person or to a person on the basis of fake identity), or
IV. The household has migrated to a different Gram Panchayat.

Further, in case a Gram Panchayat area is declared as a Municipality/ Municipal Corporation, all households residing in the area will cease to have the facilities of employment on production of the existing Job Cards. All such Job Cards shall be considered as automatically cancelled. The DPCs will ensure that these are done immediately after such notification. Concomitant changes will also be made by the concerned State Government, who will also bring this to the notice of the Ministry.

In all cases, the Programme Officer, after independent verification of the facts, may direct the Gram Panchayat to cancel the JC. All additions / deletions / cancellations must be made public, presented to the Gram Sabha / Ward Sabha, reported to the Programme Officer and updated in the MIS.

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ ఏడాది ఆగస్టు ఒకటిన ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు తొలగింపు నిబంధనలపై రాజ్యసభకు ఇచ్చిన లిఖిత పూర్వక జవాబు..

### జాబ్‌కార్డులపై కేంద్రం నిబంధనలివీ..

- ఏ జాబ్‌కార్డునూ సాధారణ పద్ధతిలో రద్దు చేయకూడదు.
- పనులకు డిమాండ్ లేకపోవడం లాంటి కారణంతో రద్దు చేయకూడదు.
- జాబ్ కార్డులున్న కుటుంబం ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లడం, నకిలీ అని నిరూపణ కావడం, నకిలీ పత్రాల ఆధారంగా నమోదు చేయడం లాంటి సందర్భాల్లో మాత్రమే తగిన ధ్రువీకరణ తరువాతే తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలి.
- జాబ్‌కార్డుకి సంబంధించి చేర్పులు/తొలగింపులు/రద్దులను బహిరంగంగా ప్రకటించి గ్రామసభ / వార్డు సభకు సమర్పించాలి. ప్రోగ్రామ్ అధికారికి నివేదించాలి.

### 'ఉపాధి'కి బాబు సర్కార్ కోత!

- రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ – సెప్టెంబరు మధ్య ఉపాధి హామీ పనుల కల్పన తగ్గడం వల్ల ఆర్నెల్ల వ్యవధిలో ఏకంగా రూ.435.40 కోట్ల మేర నష్టపోయినట్లు లిబిటెక్ లాంటి స్వచ్ఛంద సంస్థలు నిర్ధారించాయి.
- గత ఆర్థిక సంవత్సరం తొలి ఆర్నెల్లలో ఉపాధి హామీ ద్వారా 17.95 కోట్ల పనిదినాలు కల్పించగా ఇప్పుడు అదే సమయంలో 15.51 కోట్ల పనిదినాల కల్పన మాత్రమే జరిగింది.
- ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఉపాధి హామీ లబ్ధిదారులు గత ఆర్థిక సంవత్సరం తొలి ఆర్నెల్లలో నాలుగు కోట్ల పనిదినాలు పొందగా ఈ ఏడాది 3.23 కోట్ల పనిదినాలు మాత్రమే లబ్ధి పొందారు. మొత్తంగా ఎస్సీలు 18.7 శాతం మేర ఉపాధి కోల్పోయారు. పని దినాలు తగ్గిపోవడంతో ఎస్టీలు 17.6 శాతం, ఇతరులు 11.3 శాతం మేర ఉపాధిని కోల్పోవాల్సి వచ్చింది.

## భారతి సిమెంట్స్‌పై బాబు సర్కారు కక్ష సాధింపు

- ఆ కంపెనీ రెండు లీజులు రద్దు చేస్తున్నారని ఎల్లో మీడియాకు లీకులు
- నిజానికి భారతి సిమెంట్స్ లీజులున్న భూములు ప్రైవేటువి
- 20 ఏళ్ల క్రితమే ఆ కంపెనీ కొనుగోలు చేసిన భూములవి
- ఇప్పుడు లీజులు రద్దు చేస్తే ఆ భూములు కంపెనీవి కాకుండా పోతాయా?
- ఇలా కక్ష సాధింపునకు పాల్పడితే పరిశ్రమలు ఎలా వస్తాయంటున్న పారిశ్రామికవేత్తలు

సాక్షి, అమరావతి: భారతి సిమెంట్స్ కంపెనీపై సీఎం చంద్రబాబు కక్ష సాధింపునకు దిగడంపై పారిశ్రామిక వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నేతలపై ఇష్టానుసారం తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేస్తున్న బాబు ప్రభుత్వం.. మరో అడుగు ముందుకు వేసి భారతి సిమెంట్ కంపెనీ లీజులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ వాటి రద్దుకు సన్నాహాలు చేస్తోంది. లీజులు రద్దు చేస్తున్నారంటూ తన కరపత్రిక ఈనాడుకు లీకులు ఇచ్చి కథనాలు రాయిస్తోంది. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం మండలంలో భారతి సిమెంట్స్ కంపెనీకి 509.18 ఎకరాలు, ఎర్రగుంట్ల మండలంలో 235.56 ఎకరాలు గతంలోనే లీజులు మంజూరయ్యాయి. తప్పుడు ఆరోపణలతో ఈ లీజులను రద్దు చేసి, దెబ్బ కొట్టాలని చంద్రబాబు కుట్ర పన్నారు. ఇందుకోసం అధికారంలోకి రాగానే 15 ఏళ్లకు పైగా సుదీర్ఘ చట్టపరమైన, పరిపాలనా ప్రక్రియలు పూర్తయిన తర్వాత పొందిన లీజులపై ఎటువంటి కారణం లేకుండానే విచారణకు ఆదేశించారు. ఆ నివేదికను తనకు కావాల్సిన విధంగా తయారు చేయించుకుని, తద్వారా భారతి సిమెంట్స్ కంపెనీకి త్వరలో నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు టీడీపీ కరపత్రికలో శనివారం కథనం రాయించారు. నోటీసులకు కంపెనీ వివరణ ఇచ్చిన తర్వాత.. ఆ వివరణ ఎలా ఉన్నప్పటికీ, సున్నపురాయి లీజులు రద్దు చేస్తారంటూ సదరు పత్రికకు లీకులిచ్చారు. వివరణతో సంబంధం లేకుండా లీజులు రద్దు చేస్తారని చెప్పడం ద్వారా చంద్రబాబు వాటి రద్దుకు కంకణం కట్టుకున్నారని స్పష్టమవుతోంది.

### అది 20 ఏళ్ల క్రితం కొన్న ప్రైవేటు భూమి

నిజానికి సున్నపురాయి లీజులు ఉన్న ఆ భూమిని 20 ఏళ్ల క్రితం ఆ కంపెనీ కొనుగోలు చేసింది. ఇప్పుడు లీజులు రద్దు చేస్తే, ఆ భూమి కంపెనీది కాకుండా పోతుందా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమలు వస్తే రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని, కానీ ఇలా కక్షపూరితంగా వ్యవహరిస్తే పరిశ్రమలు ఎలా వస్తాయని పరిశ్రమల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వ్యూహాత్మకంగా భారతి సిమెంట్స్ లీజు మాత్రమే కాకుండా రామ్‌కో, ఏసీసీకి లీజులను కూడా రద్దు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఒకవైపు రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని ప్రచారం చేసుకుంటూ మరోవైపు ఉన్న పరిశ్రమలపై రాజకీయ కక్ష సాధింపులకు దిగడం చంద్రబాబుకే చెల్లిందని, ఇలాగైతే కొత్త పరిశ్రమలు ఎలా వస్తాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమని పారిశ్రామిక వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

## మొక్కజొన్నకు దక్కని మద్దతు

కోతలు ప్రారంభమై 45 రోజులైనా జాడలేని కొనుగోలు కేంద్రాలు

సాక్షి, అమరావతి: మొక్కజొన్నకు మద్దతు కరువైంది. అగ్రివాచ్‌తో పాటు వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం (ఎఎంఐసీ) ముందస్తు అంచనా ధరల కంటే దిగజారిపోతున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోంది. కోతలు ప్రారంభమై 45 రోజులు దాటినా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలోచన చేయకపోవడం పట్ల రైతులు మండిపడుతున్నారు. మార్కెట్‌లో మద్దతు ధర దక్కకపోవడంతో వ్యాపారులు, దళారీల చేతిలో నిలువు దోపిడికి గురవుతున్నారు.

### భారీగా తగ్గిన దిగుబడులు

ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 3.32 లక్షల ఎకరాలు కాగా, ఈ ఏడాది సాగు లక్ష్యం 3.62 లక్షల ఎకరాలుగా నిర్దేశించారు. కాగా, లక్ష్యానికి మించి 4.67 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. నంద్యాల, అనంతపురం, సత్యసాయి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, ప్రకాశం జిల్లాలో అధిక సాగు నమోదయ్యింది. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే దిగుబడులు సగటున 25–35 క్వింటాళ్లు రావాల్సి ఉండగా, అధిక వర్షాల ప్రభావంతో 20–23 క్వింటాళ్లకుమించి రాని పరిస్థితి నెలకొంది. నాణ్యత కూడా పడిపోవడంతో మార్కెట్‌లో మద్దతు ధర దక్కని పరిస్థితి ఏర్పడింది.

### ధరల అంచనా తారుమారు

ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధరగా క్వింటా రూ.2400గా కేంద్రం ప్రకటించింది. కాగా, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ధరలను అంచనా వేసే మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం (ఎఎంఐసీ) ప్రకటించిన ముందస్తు ధరల అంచనా ప్రకారం కోతలు ప్రారంభమయ్యే సమయానికి ధర రూ.2,335–2,625 మధ్య పలకాల్సి ఉంది. కానీ, క్షేత్ర స్థాయిలో క్వింటా రూ.1,600 నుంచి రూ.1,900కు మించి పలకని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఎకరాకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు రైతులు నష్టపోతున్నారు. అక్టోబర్ మొదటి వారం నుంచే కోతలు మొదలయ్యాయి.

### రైతుల గోడు పట్టని చంద్రబాబు

కోతల సమయంలో అధిక వర్షాలు, ఆ తర్వాత మోంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు మొక్కజొన్న రైతులను కోలుకోలేని దెబ్బతీసాయి. దీంతో తేమశాతం అధికంగా ఉంటోంది. ఆరుదల కోసం రోజుల తరబడి ఎండలో ఆరబెడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. మొక్కజొన్న విత్తనాలను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. యార్డులో ఆరబెడుతున్న రైతులు ప్రత్యేకంగా కాపలా ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ధరలు పతనమైన సమయంలో మార్కెట్‌లో జోక్యం చేసుకొని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాల్సిన చంద్రబాబు ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంటే మాకీ తిప్పలు ఉండేవి కావని చెబుతున్నారు. మార్కెట్‌లో కొనేవారు లేకపోవడంతో రైతులు దళారీలను ఆశ్రయించి, నష్టపోవాల్సి వస్తోంది.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

## సత్యసాయి బోధనలు
# విశ్వ శాంతికి మార్గదర్శకాలు

**భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

- ప్రతి సాయి భక్తుడు విశ్వ శాంతి సాధనకు కృషి చేయాలి
- ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిపోయిన లవ్ ఆల్.. సర్వ్ ఆల్ నినాదం
- ఉచిత వైద్యం, విద్య, తాగు నీటి ప్రాజెక్టులు అమోఘం
- ఇదే స్ఫూర్తితో ధార్మిక, సేవా సంస్థలు దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**ప్రశాంతి నిలయం:** సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, మానవతా విలువలు విశ్వశాంతికి మార్గదర్శకాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. విశ్వశాంతి సాధనకు ప్రతి సాయి భక్తుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రశాంతి నిలయంలో జరుగుతున్న సత్యసాయి శత జయంతి వేడుకల్లో శనివారం ఆమె పాల్గొన్నారు. ఉదయం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయం చేరుకున్న రాష్ట్రపతి.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభా మందిరానికి వచ్చారు. అక్కడ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ రాజు ఘన స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆమె సత్యసాయి మహా సమాధిని దర్శించుకుని, పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవ అంటూ సత్యసాయి ఇచ్చిన సందేశం స్ఫూర్తిదాయకమన్నారు. సత్యసాయి బోధనలు, సేవా కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ముందుకు నడిపిస్తున్నాయని చెప్పారు. సాయి ఇచ్చిన లవ్ ఆల్.. సర్వ్ ఆల్.. నినాదం ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిపోయిందన్నారు. బాబా బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస వంటి మానవతా విలువలు భక్తుల మదిలో పాఠ్యాంశాలుగా నిలిచిపోయాయని తెలిపారు. విలువలతో కూడిన విద్యను ఉచితంగా అందించిన సత్యసాయి ఎందరో పేద విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపారని కొనియాడారు. మహిళా సాధికారతకూ పాటుపడ్డారని, ఇందుకు 1969లో అనంతపురంలో నెలకొల్పిన మహిళా క్యాంపస్ నిదర్శనం అని చెప్పారు. ఉచిత విద్యతో పాటు నయా పైసా ఖర్చులేని నాణ్యమైన వైద్యం, కరువు ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు అమోఘమన్నారు. ఇదే స్ఫూర్తితో భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడూ కృషి చేయాలన్నారు. దేశాభివృద్ధిలో ధార్మిక సంస్థలు, సేవా సంస్థలు, ఎన్జీఓలు, ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సత్యసాయి శత జయంతి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు. అనంతరం సత్యసాయి శత జయంతి వేడుకలలో భాగంగా ప్రపంచ శాంతిని నెలకొల్పే లక్ష్యంతో 140 దేశాల గుండా పయనించే శాంతి కాగడాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెలిగించారు.

### సత్యసాయి మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలి: చంద్రబాబు

సత్యసాయి బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించడం ద్వారా ఉత్తమ సమాజాన్ని స్థాపించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యసాయి స్ఫూర్తిని ప్రతి సాయి భక్తుడూ ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. మానవాళి సౌభాగ్యం కోసం సత్యసాయి చేపట్టిన తాగు నీరు, ఉచిత వైద్యం, విద్య ప్రాజెక్టులు ఆదర్శనీయమన్నారు. సత్యసాయి సిద్ధాంతాన్ని మరింతగా విస్తరించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టిన గిరిజన మహిళల ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. తొలుత ఆర్జే రత్నాకర్ రాజు ప్రారంభోపన్యాసం చేస్తూ సత్యసాయి ట్రస్ట్ చేపట్టిన ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య, ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, డాక్టర్ మోహన్, నాగానంద తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో యువత
# భాగస్వాములు కావాలి

- నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలి
- ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పిలుపు
- ఘనంగా సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 44వ స్నాతకోత్సవం
- 521 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాల ప్రదానం.. 20 మందికి బంగారు పతకాలు
- 14 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు

విద్యార్థికి పట్టా ప్రదానం చేస్తున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, చిత్రంలో సీఎం చంద్రబాబు

**ప్రశాంతి నిలయం:** ఉన్నత విద్యా సంస్థల ద్వారా డిగ్రీ పట్టాలు పొందిన యువత అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. శనివారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 44వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించేందుకు సత్యసాయి ఎంతో గొప్ప విద్యా వ్యవస్థను రూపొందించారని కొనియాడారు. ప్రస్తుత మార్కెట్‌లో శాస్త్ర, సాంకేతికత ఆధారంగా నూతన ఆవిష్కరణలకు డిమాండ్ ఉందని, ఈ దృష్ట్యా ప్రతి విద్యార్థి వాటి వైపు దృష్టి సారించాలన్నారు. కోవిడ్ కష్ట సమయంలో భారతీయ శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కరణల ద్వారా టీకాను కనుగొన్నారని, తద్వారా భారత్.. ప్రపంచంలో కొన్ని కోట్ల మంది ప్రజలను ఆదుకోగలిగిందని గుర్తు చేశారు. ప్రపంచ నాలుగో ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగిందని, ఇందుకు ప్రధాని మోదీ కృషే కారణమని చెప్పారు. ప్రస్తుత సమాజాన్ని డ్రగ్స్ భూతం పట్టి పీడిస్తోందని, దీన్ని పారదోలాల్సిన అవసరం యువతపై ఉందని స్పష్టం చేశారు. మన కోసం మనం బతకడంతో పాటు ఇతరులనూ బతికించాలన్న ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. సత్యసాయి బోధనలు, సిద్ధాంతాలే నిజమైన విద్య అని చెప్పారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ భవిష్యత్తు రంగాలైన ఏఐ డేటా సెంటర్లు, క్వాంటం కంప్యూటింగ్, ఏరోస్పేస్, డ్రోన్ వంటి రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

### కన్నుల పండువగా పట్టాల ప్రదానం

తొలుత ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత ఉప రాష్ట్రపతి, సీఎం ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థుల బ్రాస్ బ్యాండ్ వాయిద్యాల నడుమ అతిథులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్, మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సభ్యులు ప్రత్యేక వేదిక వద్దకు చేరుకున్నారు. యూనివర్సిటీ చాన్సలర్ చక్రవర్తి స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. పట్టాల ప్రదానం కన్నుల పండువగా సాగింది. 521 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, 20 మందికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. 14 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు నాగానంద, డాక్టర్ మోహన్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఎందుకు?

### సీఎంకు ప్రజా ఆరోగ్య వేదిక లేఖ

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని కొత్త మెడికల్ కాలేజీలపై పూర్తి అజమాయిషీ, నియంత్రణ ప్రభుత్వం వద్దే ఉంటాయని సీఎం చెబుతున్నారని.. మరి ప్రభుత్వ నియంత్రణలో ఉండే మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించడం ఎందుకని ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రజా ఆరోగ్య వేదిక ప్రశ్నించింది. ఈ మేరకు సీఎంకు రాసిన లేఖను రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎంవీ రమణయ్య, టి.కామేశ్వర్‌రావు శనివారం మీడియాకు విడుదల చేశారు. ప్రభుత్వ భూమి, బడ్జెట్ కేటాయింపులు, అన్ని అనుమతులతో పాటు పూర్తి నిర్వహణ సైతం ప్రభుత్వ పరిధిలో ఉన్న కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదని వేదిక సూచించింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు జవాబుదారీతనంతో నడుస్తాయని.. రోగులు, విద్యార్థులకు నాణ్యమైన వైద్యం, విద్య అందుతాయని పేర్కొంది. అందువల్ల ప్రభుత్వం వెంటనే మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించడం విరమించుకోవాలని డిమాండ్ చేసింది.

# బంగారం వ్యాపారిని ఎత్తుకెళ్లిన పోలీసులు

- 10 కిలోల ఆభరణాలు తీసుకుని డబ్బు చెల్లించని ప్రొద్దుటూరు వ్యాపారి
- బాధిత హైదరాబాద్ వ్యాపారి ఫిర్యాదుతో కేసు నమోదు
- నిందితుడి నుంచి ఆస్తి పత్రాలు, దుకాణం తాళాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఇంటికి వచ్చిన తనికెంటి శ్రీనివాస్ (నిలబడిన వ్యక్తి) పక్కన పోలీసులు

**ప్రొద్దుటూరు క్రైం:** ఓ బంగారు వ్యాపారిని పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లిన సంఘటన శనివారం పట్టణంలో సంచలనం సృష్టించింది. భార్య అడ్డుపడినా ఆమెను పక్కకు తోసేసి కారులో తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని ఓ బంగారం వ్యాపారికి చెందిన సుమారు 10 కిలోల స్వర్ణాభరణాలను తీసుకుని అతను మోసగించడమే ఇందుకు కారణం. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఈ బంగారు వ్యాపారిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలివీ..

హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాకు చెందిన బంగారం వ్యాపారి హేమంత్‌శర్మకు 2015లో ప్రొద్దుటూరుకు చెందిన తనికెంటి శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. డబ్బులు ఎప్పటికప్పుడు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. 2018లో హేమంత్‌శర్మ మొత్తం 10 కిలోల బంగారు నగలను శ్రీనివాస్‌కు పంపించారు. వీటికి సంబంధించిన డబ్బు అడిగితే శ్రీనివాస్ అదిగో ఇదిగో అంటూ వాయిదా వేస్తూ వచ్చాడు. 2021లో.. డబ్బులిస్తానని, ప్రొద్దుటూరుకు రమ్మని హేమంత్‌శర్మకు శ్రీనివాస్ చెప్పాడు. ఆయన రాగానే శ్రీనివాస్, అతని అనుచరులు పట్టణ శివారులోని ఓ చోటికి తీసుకెళ్లి హేమంత్‌శర్మను చితకబాదారు. ఆ తర్వాత హేమంత్‌శర్మ శ్రీనివాస్‌కు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా డబ్బులివ్వనంటూ శ్రీనివాస్ బెదిరిస్తూ వచ్చాడు. దీంతో హేమంత్ శర్మ ఈనెల 20న ప్రొద్దుటూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

**భార్యతో ఇంటికి వెళ్తుండగా..**

ఈ నేపథ్యంలో.. తనికెంటి శ్రీనివాస్ శుక్రవారం రాత్రి భార్య శ్రీలక్ష్మితో కలసి బంగారు షాపు నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో కొందరు వారిని అడ్డగించి శ్రీనివాస్‌ను కారులో తీసుకెళ్లారు. తన భర్తను ఎందుకు తీసుకెళ్తున్నారని శ్రీలక్ష్మి అడ్డుకుని ప్రశ్నించగా త్రీటౌన్ పోలీసులమని చెప్పి ఆమెను తోసేసి వెళ్లిపోయారు. దీంతో కారు వెనకాలే శ్రీలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ తన భర్త గురించి అడగ్గా పోలీసులు తామెవరినీ తీసుకురాలేదని చెప్పారు. పట్టణంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల చుట్టూ ఆమె తిరిగినా భర్త ఆచూకి తెలియలేదు. అయితే, శనివారం రాత్రి శ్రీనివాస్‌ను పోలీసులు వదలిపెట్టారు. ఆ తర్వాత వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి, త్రీటౌన్ సీఐ వేణుగోపాల్, విజయవాడ నుంచి వచ్చిన వసంత్ అనే ఎస్ఐ కలిసి శ్రీనివాస్ ఇంటికెళ్లి గతంలో జరిగిన పంచాయతీ ఒప్పందం ప్రకారం హేమంత్‌శర్మకు ఇవ్వాల్సిన డబ్బుకుగాను రూ.కోట్లు విలువచేసే శ్రీనివాస్ ఆస్తి పత్రాలు, బంగారు దుకాణం తాళాలను తీసుకెళ్లారు.

## డిప్యూటీ ఎంపీడీవోలను సొంత మండలాల్లో నియమించొద్దు

### గ్రామ, వార్డు సచివాలయాలు, పంచాయతీరాజ్ శాఖల ఆదేశాలు

**సాక్షి, అమరావతి:** గ్రామ, వార్డు సచివాలయాల శాఖలోనూ కొత్తగా మండల, జిల్లా స్థాయి కార్యాలయాల ఏర్పాటులో భాగంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో డిప్యూటీ ఎంపీడీవోల హోదాలో పనిచేసే 660 మందిని జోన్ల వారీగా కేటాయిస్తూ ఆ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. వారిని సొంత మండలాల్లో నియమించవద్దని స్పష్టం చేశారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరక్టర్ శివప్రసాద్ శనివారం మరో విడత మెమో విడుదల చేశారు. డిప్యూటీ ఎంపీడీవోల నియామక ప్రక్రియ ఈ నెల 26లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరినీ కూడా సొంత మండలాల్లో నియమించవద్దని అన్ని జిల్లాల కలెక్టర్లతోపాటు జిల్లాల గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులకు స్పష్టం చేశారు. కాగా, అత్యధిక చోట్ల డిప్యూటీ ఎంపీడీవోలు తమను సొంత మండలాల్లో నియమించాలంటూ స్థానిక ఎమ్మెల్యేల నుంచి కలెక్టర్లకు సిఫార్సు లేఖలు సమర్పిస్తున్నట్లు తెలిసింది. జిల్లాల్లో పెద్ద ఎత్తున ఈ పైరవీలు సాగుతున్నట్లు సమాచారం.

## యలమంచిలి నుంచి హోస్పేట్‌కు జంతుమాంసం తరలింపు

**సింగరాయకొండ:** ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని జాతీయ రహదారిపై అక్రమంగా రవాణా చేస్తున్న 550 కేజీల జంతు మాంసం పట్టుబడటం సంచలనం రేకెత్తించింది. దీనిపై పోలీసులు జరిపిన విచారణలో విస్తుబోయే వాస్తవాలు బట్టబయలయ్యాయి. విశాఖ జిల్లా యలమంచిలి ప్రాంతంలోని మటన్ షాపుల నుంచి మటన్ వ్యాపారి షేక్ నజీమ్ నిత్యం యలమంచిలి కేంద్రంగా పలు ప్రాంతాలకు జంతుమాంసం సరఫరా చేస్తుంటాడని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బెంగళూరుకు సమీపంలోని హోస్పేట్‌కు తరచూ జంతుమాంసం రవాణా చేస్తుంటాడు. దీనిపై పోలీసులకు ముందస్తు సమాచారం రావడంతో జరిపిన తనిఖీల్లో ఎస్‌వీడీ వేదాంశ్ ట్రావెల్స్ బస్సులో థర్మాకోల్ బాక్స్‌లో ఎవరికీ అనుమానం రాకుండా చేపల పేరుతో రవాణా చేస్తున్న జంతు మాంసం విషయం బట్టబయలైంది. కాగా ఈ మాంసాన్ని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపి పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఉందని ఎస్సై బీ మహేంద్ర తెలిపారు. ల్యాబ్ రిపోర్టు వచ్చే సరికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామని సీఐ సీహెచ్ హజరత్తయ్య వివరించారు.

# బాబు పాలనలో దిగజారిన పోలీసు వ్యవస్థ

- అత్యంత దారుణంగా 36వ స్థానానికి దిగజారిన పోలీస్ శాఖ
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి

**సాక్షి, విశాఖపట్నం:** చంద్రబాబు పాలనలో ఏపీ పోలీస్ వ్యవస్థ పూర్తిగా దిగజారిందని.. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం బదులు రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ పోలీసుల పనితీరు బిహార్ వంటి రాష్ట్రాల కంటే అత్యంత దారుణంగా 36వ స్థానానికి దిగజారడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని తేల్చి చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం అవినీతికి కేరాఫ్‌గా మారి ప్రజల రక్షణ కోసం ఉపయోగపడాల్సిన పోలీసు వ్యవస్థను అరాచకాలు, అక్రమ కేసులు, అడ్డగోలు అరెస్టులకు అడ్రస్‌గా మార్చిందని ఆక్షేపించారు. ప్రజల రక్షణలో విఫలమైన సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పోలీసులు గర్వంగా తలెత్తుకుని తిరిగారు. ఒకే ఏడాది 85 అవార్డులు తెచ్చుకుని నాడు దేశంలోనే అత్యున్నత స్థాయిలో ఉన్న మన రాష్ట్ర పోలీసులు ఇప్పుడు కేంద్ర హోంశాఖ నివేదికలో 36వ స్థానం అంటే అట్టడుగు స్థానానికి దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. 100కు 16.70 పాయింట్లతో మన రాష్ట్రం చిట్టచివర నిలిచింది. కేంద్రం నివేదికను చూస్తే సాంకేతికతలో 25 పాయింట్లకు గానూ మన రాష్ట్రం సాధించింది సున్నా. ఇంటిగ్రేషన్(సమన్వయం)లో 10 పాయింట్లకు 0 పాయింట్లు రాగా.. ఆపరేషన్ ఎఫిషియెన్సీలో పోలీస్ శాఖలో 45కు 7.93 పాయింట్లు, పాలనా సంస్కరణల్లో 20 పాయింట్లకు 8.77.. ఇలా మొత్తం 100 పాయింట్లకు 16.70 పాయింట్లు మాత్రమే తెచ్చుకుంది. దీనికి కూటమి నాయకులంతా సిగ్గుతో తలదించుకోవాలి. ఏపీ పోలీస్ సర్వీస్‌ని ఏపీ పొలిటికల్ రివెంజ్ సర్వీసుగా మార్చేశారు. దేశమంతా బీఎన్ఎస్ యాక్ట్‌ని ప్రజల కోసం వాడితే.. ఏపీలో మాత్రం బాబు రాజకీయ న్యాయసంహిత యాక్ట్ కింద మార్చివేశారు. నిష్పాక్షపాతంగా డ్యూటీ చేసే పోలీసులను ఎల్లో దుస్తులుగా మార్చివేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు సింహాలను తమ దుస్తులపై ధరించే పోలీసులను.. మూడు పార్టీలకు తొత్తులుగా మార్చేయడమే కాకుండా వాళ్ల చేతుల్లో పోలీసులను కీలుబొమ్మలుగా మార్చివేశారు. ధర్మానికి ప్రతీకగా నిల్చిన అశోక చక్రాన్ని ధరించిన వాళ్లను అధర్మానికి ప్రతినిధులుగా మార్చివేశారు. మహిళలపై అరాచకాలను నియంత్రించడం, చిన్నారులపై అఘాయిత్యాలు. ఆడబిడ్డలపై రేప్‌లు, అక్రమ మద్యం, బెల్టుషాపులు, డ్రగ్స్, గంజాయి ఉత్పత్తి, సరఫరా, ఈవ్‌ టీజింగ్, ర్యాగింగ్ నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. ముంబై హీరోయిన్ కోసం డీజీస్థాయి పోలీసు అధికారుల మీద కూడా కూటమి ప్రభుత్వం కేసులు పెట్టింది. పీఎస్సార్ ఆంజనేయులును జైలుకు పంపించారు. విజయవాడ సీపీ క్రాంతిరాణా, డీసీపీ విశాల్‌గున్నీ మీద కూడా అక్రమ కేసులు పెట్టారు. ప్రతిపక్షాలతో పాటు పోలీసులను కూడా కూటమి ప్రభుత్వం వేధిస్తోంది' అని వరుదు కల్యాణి మండిపడ్డారు.

# పీఎం, సీఎం పదవులు కూడా పీపీపీకి ఇచ్చేస్తారా?

**స్టీల్‌ప్లాంట్ కార్మికుల మీద చంద్రబాబు వ్యాఖ్యలపై అఖిలపక్షాల ఫైర్**


ఐక్యత చాటుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నేతలు

**డాబాగార్డెన్స్ (విశాఖపట్నం):** కేంద్రంలోనూ.. రాష్ట్రంలోనూ ప్రతీది ప్రైవేటీకరణకు పూనుకుంటున్న మోదీ.. చంద్రబాబులు.. పీఎం, సీఎం పదవులు కూడా పీపీపీకి ఇచ్చెయ్యొచ్చు కదా అంటూ విశాఖలోని అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నేతలు ఎద్దేవా చేశారు. చంద్రబాబు బాధ్యతలేని వ్యక్తిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా ఎస్సీ సెల్ కమిటీ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను నిరసిస్తూ శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ సెల్ నాయకుడు బోని శివరామకృష్ణ నేతృత్వంలో ఎస్సీ సెల్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది పాకా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం, సీపీఐ, ఐఎన్‌టీయూసీ, స్టీల్‌ప్లాంట్ యూనియన్, దళిత సంఘాలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అన్యాయంగా పాలన సాగిస్తోందన్నారు. పేదలు పెద్ద చదువులు చదవకూడదని, ఉన్నత లక్ష్యాలకు చేరుకోకూడదన్న అహంకారంతో చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఈ మెడికల్ కాలేజీలకు రూ.5 వేల కోట్లు ఇవ్వలేరా? అని వక్తలు ప్రశ్నించారు. ఇక మిట్టల్‌పై ఉన్న ప్రేమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకు లేదని నిలదీశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జేఏసీ చైర్మన్ డి. ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, వాసుపల్లి గణేష్‌కుమార్, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
ANDHRA PRADESH GRAMEENA BANK
Scheduled Bank Owned by Government

ఖాతాదారులకు, ప్రభుత్వ రంగ సంస్థలకు, విభాగములకు మరియు ఇతర సంస్థలకు ముఖ్య ప్రకటన

భారత ప్రభుత్వ ఆదేశానుసారం తేదీ. 01.05.2025 నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు విలీనమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ గా అవతరించాయి. తదనంతరం ఏర్పడిన బ్యాంకులో CBS సేవలు అనుసంధానంలో భాగంగా, ఖాతాదారుల సౌకర్యార్థం మరియు నిరాటంక సేవలకై బ్యాంకు మొత్తానికి సరికొత్త మరియు ఏకైక IFSC Code (UBIN0CG7999) ను ఏర్పాటు చేయటం జరిగింది.

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
సప్తగిరి గ్రామీణ బ్యాంక్
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్

APGB
UBIN0CG7999
(సున్న / ZERO)

పూర్వపు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఖాతాదారుల IFSC Code లలో ఎలాంటి మార్పులు లేవు.

ఈ IFSC Code (UBIN0CG7999) ని ఉపయోగించి మీరు మీ యొక్క డిజిటల్ లావాదేవీలు అనగా NEFT / RTGS / IMPS / UPI వంటి సేవలను నిరాటంకంగా జరుపుకొనవచ్చు. కావున ఈ ప్రకటన ద్వారా ఖాతాదారులకు, ప్రభుత్వ రంగ సంస్థలకు, విభాగములకు మరియు ఇతర సంస్థలకు ఈ మార్పుని గమనించవలసినదిగా మనవి చేయుచున్నాము.

మీ సహకారానికి ధన్యవాదములు

ఇట్లు
చైర్మన్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
ప్రధాన కార్యాలయము, గుంటూరు

తేది : 20.11.2025
ప్రదేశము : గుంటూరు

“ ఆయన న్యాయాన్ని గెలిపించే వరకు నలిగిన రెల్లును విరువడు, మకమకపడుతున్న ఒత్తిని ఆర్పడు.

– క్రైస్తవ ధర్మం



## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం,
**తిథి:** శు.తదియ సా.4.33 వరకు, తదుపరి చవితి,
**నక్షత్రం:** మూల సా.5.43 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.3.58 నుండి 5.43 వరకు, తదుపరి తె.4.03 నుండి 5.50 వరకు,
**దుర్ముహూర్తం:** సా.3.51 నుండి 4.34 వరకు,
**అమృత ఘడియలు:** ఉ.10.44 నుండి 12.30 వరకు.

సూర్యోదయం : 6.12
సూర్యాస్తమయం : 5.20
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నితీశ్ కుమార్ (బిహార్ సీఎం)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఈ ప్రాణబంధం ఏమిటో అర్థం కాకుండా ఉంది. 74 ఏళ్ల వయసులో 10వ సారి ప్రమాణ స్వీకారం చేస్తున్నా కూడా, నా 26వ ఏట తొలిసారి రాజకీయాల్లోకి వచ్చిన రోజు నాలో ఉన్నప్పటి ఆ కొత్త లోతైన ఆనందపు అనుభూతే నేటికీ పరవళ్లు తొక్కుతూ ఉంది!

ఆ మాటే విజయ్ చౌధరీతో అన్నాను.

“పరవళ్లు తొక్కటం మంచి విషయం నితీశ్‌జీ. అయితే, ఆ పరవళ్లు పక్కనున్న వాళ్ల కాళ్లను తొక్కేస్తున్నాయేమో కాస్త గమనించుకుంటూ ఉండాలి” అన్నారాయన, నవ్వుతూ.

“అయ్యో, సారీ విజయ్! మీ కాలును తొక్కేశానా?” అన్నాను నవ్వుతూ.

“లేదు నితీశ్‌జీ, మీరు నా కాలును తొక్కలేదు. గాంధీ మైదాన్ వేదిక పైన మీ పక్కనున్న మోదీజీ కాలును తొక్కినంత పని చేశారు! మీకై మీరు మీ చేత్తో ఆయన చేతిని గాల్లోకి లేపకుండా, ఆయనకై ఆయనే ఆయన చేత్తో మీ చేతిని గాల్లోకి లేపేవరకు మీరు ఆగవలసింది” అన్నారు విజయ్.

మోదీజీ చేతిని పట్టుకుని బలవంతంగా పైకెత్తటం అంటే మోదీజీ కాలును చూసుకోకుండా తొక్కేయటమేనని ఆయన బలంగా విశ్వసిస్తున్నట్లు నాకు అర్థమైంది.

వయసులో ఏడేళ్లు చిన్నవాడే అయినా, సూక్ష్మాన్ని పట్టుకోవటంలో నా కంటే పెద్దవాడు విజయ్ కుమార్ చౌధరీ.

పార్టీలో విజయ్ నా సన్నిహితుడు, మంత్రి వర్గ సహచరుడు. విజయ్‌లాగే రామచంద్ర ప్రసాద్ సింగ్ అనే మరొక సన్నిహితుడు కూడా ఉండేవారు. ఆయన నా ప్రిన్సిపల్ సెక్రెటరీ కూడా! ఇప్పుడు లేరు.

విజయ్ నాకు లెఫ్ట్‌లో ఉంటే, రామచంద్ర నాకు రైట్‌లో ఉండేవారు. రెండేళ్ల క్రితం కేంద్ర మంత్రి పదవి కోసం రామచంద్ర రైటిస్టుగా మారి, బీజేపీలోకి వెళ్లిపోయారు. అక్కడి నుంచి కూడా వెళ్లిపోయి సొంత పార్టీ పెట్టుకున్నారు. ఆ సొంత పార్టీని కూడా తీసుకెళ్లి ప్రశాంత్ కిశోర్ పార్టీలో కలిపేసుకున్నారు. చివరికి ఆయన ఏమయ్యారో తెలీదు!

లెఫ్ట్–వింగ్‌లోని వాళ్లు రైట్–వింగ్‌లోకి వెళ్లటంలో తప్పేమీ లేదు. కానీ, రైట్ టైమ్‌లో వెళ్లాలి. రైట్ టైమ్‌లో వెనక్కి వచ్చేయాలి. అది తెలుసుకున్నట్లు లేరు రామచంద్ర.

తొలిసారి నేను 2000లో ఎన్డీయేతో కలిశాను. మాటా మాటా వచ్చి, ఏడు రోజుల తర్వాత ఎన్డీయేలోంచి వచ్చేశాను. రెండోసారి 2005లో ఎన్డీయేలోకి వెళ్లాను. 2013లో ఎన్డీయే నుంచి బయటికి వచ్చాను. 2017లో మళ్లీ ఎన్డీయేలోకి వెళ్లాను. తిరిగి 2022లో ఎన్డీయేలోంచి వచ్చేశాను. 2024లో మళ్లీ ఎన్డీయేలోకి వెళ్లాను.

అవసరమైతే ఇప్పటికిప్పుడైనా, ఎన్డీయేలోంచి బయటికి వచ్చేయగలను నేను. ప్రజల కోసం ఎన్నిసార్లైనా వెళ్లి, ఎన్నిసార్లైనా వెనక్కు వచ్చేయాల్సిందే. ఎంత మందితో ఎన్ని మాటలైనా అనిపించుకోవలసిందే!

శరద్ యాదవ్ నన్ను ‘ఫాల్టూ’ మనిషి అనేవారు. లాలూజీ నన్ను ‘పల్టూ రామ్’ అని అంటుంటారు. మీడియా నన్ను ‘సుశాసన్ బాబు’ అంటుంది. ఈ పేర్లేవీ నన్ను పైనుంచి పడేసేవీ, రథమెక్కించి ఊరేగించేవీ కాదు. ప్రజా జీవితం ఒక పేరుతో ముగిసిపోయేదీ, ఒక టెర్మ్‌తో తీరిపోయేదీ కాదు.

“నితీశ్‌జీ... కేబినెట్‌లో ఉప ముఖ్యమంత్రులు ఇద్దరే ఎందుకు ఉండాలి? నలుగురు ఉండొచ్చు కదా అని మనవాళ్లు అడుగుతున్నారు” అన్నారు విజయ్.

ఇప్పుడున్న ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు బీజేపీ వాళ్లు. జేడీయు నుంచి కూడా ఇద్దరు ఉండాలని పట్టుబడితే... ‘మొత్తం నలుగురూ మీవాళ్లనే ఉప ముఖ్యమంత్రులుగా ఉండనివ్వండి. సీఎం పోస్టు ఒక్కటీ మాకు ఇవ్వండి’ అని మోదీజీ అనొచ్చు. బీజేపీకి వచ్చినవి 89. జేడీయూకు వచ్చినవి 85.

ఇరవై ఏళ్లుగా బిహార్‌లో బీజేపీ పవర్‌లో లేదు. ఇరవై ఏళ్లుగా బిహార్‌లో బీజేపీ లేకుండా పవరూ లేదు!

“ఇప్పుడు కాదులే విజయ్” అన్నాను.

‘మరెప్పుడు?’ అన్నట్లేం చూడలేదు విజయ్.

# అటు విధ్వంసం... ఇటు విషప్రచారం!

జనతంత్రం

వర్ధెల్లి మురళి

చంద్రబాబు పెంపుడు మీడియా అవాకుల గురించీ, ఆయన ఆస్థానంలోని పెయిడ్ చిలుకల చెవాకుల గురించీ తెలుగు నాట తెలియనివారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. ఏపీలోని కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాల పుట్ట పగులుతున్నకొద్దీ... యెల్లో మీడియా దురద రోగం మరింత ముదిరి వికృతరూపం దాలుస్తున్నది. రాజకీయ రంగుటద్దాలను తొలగించి నిష్పాక్షిక దృష్టితో ప్రస్తుత ఆంధ్ర రాష్ట్ర పరిస్థితులను గమనించండి. ఎటు చూస్తే అటు చీకటి. వికసిత జీవితాల విధ్వంసం. రాష్ట్రానికి జీవనాడి వంటి వ్యవసాయ రంగం కకావికలైన దృశ్యం కనిపిస్తుంది.

అపురూపంగా పెంచుకున్న అరటి తోటల్ని దున్నేస్తున్నారు రైతులు. ఏం చేస్తారు మరి? టన్నుకు పది పన్నెండు వేలన్నా వస్తేనే... పెట్టిన ఖర్చు గిట్టుబాటవుతుంది. వెయ్యి రూపాయల కంటే ధర పలకని దుర్మార్గ పరిస్థితి నేడు దాపురించింది. జగన్ హయాంలో ఇరవై నుంచి ముప్పై వేలు పలికిన స్వర్ణయుగాన్ని గుర్తుచేసుకుంటూ రైతులు కన్నీళ్లు పెడుతున్నారు. ఆ రోజుల్లో రాయలసీమ నుంచి ఢిల్లీ నగరం దాకా పరుగెత్తిన ప్రత్యేక అరటి రైళ్ల దృశ్యాలను జ్ఞాపకం చేసుకుంటున్నారు. విదేశాలకు కూడా ఎగుమతి చేసి లాభాలార్జించిన నాటి వైభవం ఇంకా వారి మనోఫలకాల్లో మెరుస్తూనే ఉన్నది. ఇప్పుడెందుకీ దుర్గతి?

పత్తి పంటనూ దున్నేస్తున్నారు. పలనాటి రైతు విలవిల్లాడుతున్నాడు. సర్కారు నిర్లక్ష్యం, ప్రకృతి వైపరీత్యాల జమిలి దాడితో పత్తి రైతులు చిత్తయిపోయారు. అధిక వర్షాలు, తుపాను దెబ్బకు తేమ శాతం పెరిగింది. కొనుగోలుదారులెవరూ ముందుకు రావడం లేదు. కాటన్ కార్పొరేషన్ కళ్లప్పగించి చూస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వానికి దూది పువ్వుల దుఃఖం చెవికెక్కడం లేదు. ఈ సీజన్‌లో అన్ని పంటల పరిస్థితీ అంతే. గిట్టుబాటు ధరల్లేక ఉల్లి పంటను దున్నేసిన వార్తలను చదవాల్సి వచ్చింది. గుండెజారిన ఉల్లి రైతుల ఆత్మహత్యలు కూడా రిపోర్టయ్యాయి. టమాటా రైతుల కన్నీటి పాట ఈ యేడు కూడా కర్నూలు జిల్లా నుంచి వినపడుతూనే ఉన్నది. ధరలు పతనమై మామిడి, చీనీ రైతులు కష్టాల పాలయ్యారు. జగన్ హయాంలో అమలు చేసిన పంటల బీమా పథకాన్ని కూటమి సర్కార్ ఎగరగొట్టింది. ప్రకృతి దయాదాక్షిణ్యాలకు వ్యవసాయరంగాన్ని వదిలేసింది. ధరల స్థిరీకరణ నిధి, మార్కెట్‌లో సర్కార్ జోక్యం వంటి మాటలే ఇప్పుడు వినిపించడం లేదు. తుపానుతో దెబ్బతిన్న వరి రైతుల బాధ అరణ్య రోదన. ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేది లేదు. రంగుమారిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇచ్చి కొన్నదీ లేదు. పెట్టుబడి సాయాన్ని ఒక సంవత్సరం ఎగవేసి రెండో సంవత్సరానికి అత్తెసరుతో సరిపెట్టారు.

వ్యవసాయ రంగం పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి గారు ఏం చేస్తున్నారయ్యా అనే అనుమానం రాకుండా ఉండదు. ఆయనేం ఖాళీగా లేరు. ఎన్ని పనులు ఉన్నప్పటికీ తాను వ్యవసాయరంగం గురించి ఆలోచనలు చేస్తూనే ఉన్నానని కడప జిల్లాలో రైతులతో జరిపిన ముఖాముఖిలో ఆయన చెప్పుకున్నారు. రాష్ట్రంలో వీస్తున్న గాలులు ఏ దిశలో ప్రయాణిస్తున్నాయో, ఆ గాలుల క్వాలిటీ ఏమిటో, అందులో ఏమేమి తెగుళ్లున్నాయో, అవి ఎంత దూరం ప్రయాణిస్తాయో, ఏ పంటల మీద దాడి చేస్తాయో అనే విషయాన్ని తాను ఎనలైజ్ చేస్తున్నట్టు రైతులకు అభయమిచ్చారు. ఆ తెగుళ్ల సంగతి, పురుగుల సంగతి తెలిస్తే రైతుకు ఏ భయం ఉండదని చెప్పారు. అంతేగాక భూమిలో తేమ ఎంత ఉంది, ఎండ ఎంత తగులుతుంది అనే విషయాలను కూడా ఆయన అధ్యయనం చేస్తున్నట్టు చెప్పారు. ఈ రకమైన టెక్నాలజీ డెవలప్‌మెంట్‌పై తాను దృష్టి పెట్టినందువల్ల పంటల బీమా గురించి, మార్కెట్ జోక్యం గురించి, పెట్టుబడి సాయం గురించి, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి చర్యల గురించి అడగొద్దనేది ఆయన ఉద్దేశం కాబోలు!

రాష్ట్ర రైతాంగంతోపాటు భూవసతి లేని వ్యవసాయ కూలీలను కూడా ప్రభుత్వం కష్టాల కొలిమిలోకి నెట్టింది. ఈ–కేవైసీలు లేవన్న నెపంతో దాదాపు 16 లక్షల మంది ఉపాధి కూలీల జాబ్ కార్డులను రద్దు చేసింది. ఇది ఆ పథకం నిబంధనలకు విరుద్ధం. గ్రామసభలో నిర్ధారణ చేసుకోకుండా జాబ్ కార్డులను రద్దు చేయడానికి వీల్లేదు. అయినా ఎడాపెడా రద్దు చేస్తున్నారు. అటు వ్యవసాయం గిట్టుబాటు కాకుండా, ఇటు ఉపాధి హామీ ఆసరా లభించకుండా ఉద్దేశపూర్వకంగా చేసి ఒక విస్తారమైన చీప్ లేబర్ మార్కెట్‌ను రైతు–కూలీల్లో సృష్టించే కుతంత్రంతో చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తున్నది.

ప్రైవేటీకరణ ఖడ్గాన్ని యథేచ్ఛగా ప్రయోగిస్తున్న బాబు సర్కార్ ఇప్పుడు పేదలకు అసైన్ చేసిన 34 లక్షల ఎకరాల భూములపై కూడా కన్నేసింది. పేదల దగ్గర నుంచి ఆ భూముల్ని లాక్కొని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం కోసం ఆదరాబాదరా ఆర్డినెన్స్‌ను జారీచేసే ప్రయత్నాల్లో ఉన్నట్టు సమాచారం. నిరుపేదలైన అసైనీలకు ఉపయోగపడే విధంగా ఇరవయ్యేళ్ల తర్వాత వారు ఆ భూముల్ని అవసరార్థం అమ్ముకునే విధంగా జగన్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ ఇచ్చింది. దీనివల్ల తొమ్మిదిన్నర లక్షలమంది అసైనీలకు లబ్ధి జరిగింది. పేద రైతులకు లబ్ధి జరిగితే పెత్తందారీ సర్కార్‌కు నిద్రపట్టదు కదా! కాకుల్ని కొట్టి గద్దల్ని మేపడం దాని పాలసీ. అందుకే అధికారంలోకి వచ్చీరావడంతోనే యెల్లో మీడియా బాకా ద్వారా ఫ్రీహోల్డ్ స్కీమ్‌పై దుష్ప్రచారాన్ని ఊదరగొట్టి, ఆ భూముల్ని నిషేధిత జాబితాలో పెట్టారు.

ప్రభుత్వ రంగంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన మెడికల్ కాలేజీలను ‘పీపీపీ’ ముసుగేసి ప్రైవేటీకరించడానికి ఇప్పటికే బాబు సర్కార్ తెగబడింది. దీనిపై జనంలో తీవ్ర వ్యతిరేకత మొదలయ్యాక మాట మార్చి ప్రైవేట్ వాళ్లకు అప్పగించినా నియంత్రణ మాత్రం సర్కారుకే అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు, అదెలా సాధ్యమో తెలియదు. ఇక ప్రభుత్వం ఉచితంగా అందించాల్సిన సేవలను కూడా ప్రైవేటీకరించే ప్రయత్నాల్లో ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వ సేవలు ఏవీ ఉచితం కాదని గతంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు చెప్పేవారు. ఇప్పుడు దాన్ని అమల్లోకి తెచ్చే సన్నాహాల్లో ఉన్నారు. ఇక విద్యా, వైద్య రంగాల్లో జగన్ సర్కార్ తెచ్చిన సంస్కరణలు, వెచ్చించిన నిధులు పేద, మధ్యతరగతి వర్గాల్లో ఎన్నో ఆశలు నింపాయి. వారి ఆశల్ని కూటమి సర్కార్ అడియాసలు చేసింది. అక్కడా ప్రైవేటీకరణ మంత్రాన్నే జపిస్తున్నది. నాణ్యమైన విద్యను ఎంత ఖరీదైనా సరే కొనుక్కోవాల్సిందే. అవసరమైన వైద్యం అంగడి సరుకు మాత్రమే! ఇదీ బాబు విధానం.

విశాఖ ఉక్కుపై ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలేమిటి? ఇప్పుడు బాబు మాట్లాడుతున్నదేమిటి? విశాఖ ఉక్కు తెల్ల ఏనుగుగా మారిందని ఆయనే మధ్యనే ఈసడించుకున్నారు. కార్మికులు పనిచేయట్లేదని అభాండాలు వేశారు. ఉక్కు ఫ్యాక్టరీ లాభాల్లోకి రావడానికి అవసరమైన సొంత గనుల కేటాయింపు విషయాన్ని దాటవేశారు. ఢిల్లీలో తెలుగుదేశం ఎంపీలు మాత్రం మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించేందుకు రాయబారాలు నడుపుతున్నారు. అంతేకాదు విశాఖ పోర్టును దెబ్బతీసే విధంగా ఆ స్టీల్ ఫ్యాక్టరీ సొంత రేవును కూడా నిర్మించుకుంటోంది. మిట్టల్ స్టీల్ కోసమే ఉద్దేశపూర్వకంగా ఆంధ్రుల సెంటిమెంట్‌తో ముడిపడిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని దెబ్బ తీస్తున్నారని వస్తున్న ఆరోపణలు నిజమేనని నమ్మవలసి వస్తున్నది.

ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కూడా ‘పీ–4’ అనే పేరుతో ప్రైవేటీకరించే విపరీత చర్యకు కూటమి సర్కార్ తెగబడింది. ఈ దేశ సంపదలో పేద ప్రజలు హక్కుదారులు కాదు, కేవలం యాచకులు మాత్రమేననేది ఈ ‘పీ–4’ పథకంలో అంతర్లీనంగా ప్రవహించే ఫిలాసఫీ. ఇది కచ్చితంగా రాజ్యాంగ వ్యతిరేక ఆలోచన. బలహీన వర్గాల మహిళల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టడం కోసం వారి పేర్లతో 30 లక్షల ఇళ్ల పట్టాలు కేటాయించింది జగన్ ప్రభుత్వం. అందులో తొమ్మిది లక్షల పైచిలుకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించింది. చివరి దశ నిర్మాణంలో ఉన్న 3 లక్షల ఇళ్లను పూర్తిచేసి చంద్రబాబు సర్కార్ తామే వాటిని నిర్మించినట్టు ప్రచారం చేసుకొని మొన్ననే లబ్ధిదారులకు అప్పగించింది. ఈ పదిహేడు మాసాల పాలనలో ఒక్క సెంటు భూమి కూడా పేదలకు ఇవ్వకుండా మూడు లక్షల ఇళ్లను పూర్తిచేయడం నిజంగా ప్రపంచ వింతే! అంతటితో ఆగలేదు. ఇరవై లక్షల ఇళ్లను ఇవ్వాలనుకుంటున్నామని, అందులో మూడు లక్షలు ఇప్పటికే అప్పగించామని కూడా చంద్రబాబు చెప్పారు. ఇవి ఎక్కడ నుంచి వచ్చాయి? జగన్ సర్కార్ భూమిని సేకరించి ప్లాట్లు వేసి, పట్టాలిచ్చి నిర్మాణాలను ప్రారంభించినవి కావా?

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నదని నిపుణులు చెబుతున్నారు. పదిహేడు మాసాల్లో రెండున్నర లక్షల కోట్ల అప్పులు చేశారు. ఇది జాతీయ రికార్డు. ఒకపక్క విద్యా, వైద్య రంగాలతో సహా సమస్తాన్ని ప్రైవేటీకరిస్తూ ప్రజలకిచ్చిన హామీలను ఎగవేస్తున్న సర్కార్ ఈ సొమ్మునంతా ఏం చేస్తున్నట్టు? రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు దిగజారాయి. అమ్మకం పన్ను వసూళ్లు తగ్గడమంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతున్నట్టు! ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నట్టు! పోలీసింగ్‌పై కేంద్రం విడుదల చేసిన జాబితాలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అట్టడుగున 36వ స్థానం ఏపీకి దక్కింది. కారణం తెలిసిందే. పొలిటికల్ గవర్నెన్స్ మన పోలీసింగ్‌ను పక్కదారి పట్టించింది. ఉద్యోగాల కల్పనలో కూడా ఏపీ అధమ స్థానంలోనే ఉన్నట్టు నివేదికలు వచ్చాయి. ఇవేమీ యెల్లో మీడియాకు కనిపించవు. ప్రభుత్వం మీద ప్రజా వ్యతిరేకత పెరుగుతున్నదని వారికి తెలుసు. దాని నుంచి చంద్రబాబును రక్షించడానికి ప్రతిపక్ష నేతపై దిగజారుడు విమర్శలకు ఈ మీడియా తెగబడుతున్నది. 2014–19 మధ్య కాలంలో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నదని నిపుణులు చెబుతున్నారు. పదిహేడు మాసాల్లో రెండున్నర లక్షల కోట్ల అప్పులు చేశారు. ఇది జాతీయ రికార్డు. ఒకపక్క విద్యా, వైద్య రంగాలతో సహా సమస్తాన్ని ప్రైవేటీకరిస్తూ ప్రజలకిచ్చిన హామీలను ఎగవేస్తున్న సర్కార్ ఈ సొమ్మునంతా ఏం చేస్తున్నట్టు? రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు దిగజారాయి. అమ్మకం పన్ను వసూళ్లు తగ్గడమంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతున్నట్టు! ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నట్టు! పోలీసింగ్‌పై కేంద్రం విడుదల చేసిన జాబితాలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అట్టడుగున 36వ స్థానం ఏపీకి దక్కింది. కారణం తెలిసిందే. పొలిటికల్ గవర్నెన్స్ మన పోలీసింగ్‌ను పక్కదారి పట్టించింది. ఉద్యోగాల కల్పనలో కూడా ఏపీ అధమ స్థానంలోనే ఉన్నట్టు నివేదికలు వచ్చాయి. ఇవేమీ యెల్లో మీడియాకు కనిపించవు. ప్రభుత్వం మీద ప్రజా వ్యతిరేకత పెరుగుతున్నదని వారికి తెలుసు. దాని నుంచి చంద్రబాబును రక్షించడానికి ప్రతిపక్ష నేతపై దిగజారుడు విమర్శలకు ఈ మీడియా తెగ బడుతున్నది. 2014–19 మధ్యకాలంలో అధికారంలో ఉండి చేసిన అవినీతిపై విచారణ జరిపి పలు ఛార్జిషీట్లు వేశారు. స్కిల్ కుంభకోణంలో జైలుకు కూడా ఆయన వెళ్లి వచ్చారు.

అధికారంలో ఉండి చేసిన అవినీతిపై విచారణ జరిపి పలు ఛార్జిషీట్లు వేశారు. స్కిల్ కుంభకోణంలో జైలుకు కూడా ఆయన వెళ్లి వచ్చారు.

ఇప్పుడా కేసుల నుంచి బయటపడేందుకు బాబు సర్కార్ ఏర్పాట్లు చేసుకుంటున్నది. ఈ వ్యవహారం నుంచి కూడా దృష్టి మళ్లించాలి. కనుక జగన్ ప్రభుత్వ హయాంలో అవినీతి పేరుతో, ‘సిట్’ చెప్పిందన్న సాకుతో యెల్లో మీడియా నిండా అవే వార్తలు. పెట్టుబడులు తరలివస్తున్నాయంటూ పోచికోలు ప్రచారం. అమరావతిలో అంతస్థులు లేస్తున్నాయనే ప్రచారం. ఈ ప్రచార ఆర్భాటాలతో ఎంతకాలం రాష్ట్ర దైన్యస్థితిని దాచిపెట్టగలరు! విశాఖ సదస్సు ద్వారా పది లక్షల కోట్లు వస్తున్నాయని క్రితంసారి ప్రకటించుకున్నారు. కానీ పది శాతం కూడా వాస్తవరూపం దాల్చలేదన్న నిజాన్ని దాచగలిగారా? ఇంకెంత కాలం జగన్ వ్యక్తిత్వ హననంతో సమాచార భ్రష్టత్వానికి పాల్పడగలరు! జగన్ హైదరాబాదు కోర్టుకు హాజరైనా తప్పేనా? చాలాకాలం తర్వాత హైదరాబాదుకు వచ్చారు కనుక పెద్దసంఖ్యలో అభిమానులు స్వాగతం పలికారు. యెల్లో మీడియాకు, కూటమి సర్కార్‌కు మింగుడుపడినా, పడకపోయినా జాతీయ స్థాయిలోనే జగన్ అతిపెద్ద పొలిటికల్ క్రౌడ్ పుల్లర్. కోర్టు హాజరుపై సైతం యెల్లో టీవీలు మరో వార్త లేకుండా రోజంతా విషాన్ని ఎగజిమ్మాయి. ఒక ఎల్లో విశ్లేషకుడైతే ఏకంగా హిడ్మా మాదిరిగా జగన్‌ను కూడా ఎన్‌కౌంటర్ చేయాలని ఊగిపోయాడు. కొత్తగా చేయడమేమిటి? పదహారేళ్లుగా ఆయన వ్యక్తిత్వంపై ఎన్‌కౌంటర్లు చేస్తూనే ఉన్నారు కదా! హిడ్మా ప్రజాస్వామ్యాన్ని పరిహసించాడట! రాజ్యాంగాన్ని వ్యతిరేకించాడట! జగన్ కూడా అదే పని చేశాడట. అదీ ఆ విశ్లేషకుని రీజనింగ్. సరే, హిడ్మా చనిపోతే వందలాది గిరిజన గూడేలు గుండె పగిలేలా ఎందుకు రోదించాయో, దండకారణ్యం కడుపు కోతతో ఎందుకు కుదేలైందో కాలమే సమాధానం చెబుతుంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున నిలబెట్టి, ఆయన రాజ్యాంగ స్ఫూర్తిని అణువణువునా నింపుకొని అడుగడుగునా అమలుచేసిన జగన్ రాజ్యాంగ వ్యతిరేకా? ఆ రాజ్యాంగ స్ఫూర్తికి నిలువెల్లా తూట్లు పొడుస్తున్న కూటమి సర్కార్ రాజ్యాంగ వ్యతిరేక శక్తా? తేల్చడానికి ఇదేమంత క్లిష్టమైన సమస్య కాదు.

vardhelli1959@gmail.com

# అదొక రాజకీయ అద్భుతం

అభిప్రాయం

డానీ

ప్రతీ చర్యకూ తత్సమానమైన, తద్వ్యతిరేకమైన ప్రతిచర్య ఉంటుందనేది భౌతిక శాస్త్రంలో న్యూటన్ కనుగొన్న చలన సూత్రం. అలాంటి ప్రతీ వ్యతిరేక చర్యకు కూడా తత్సమానమైన, తద్వ్యతిరేకమైన ప్రతిచర్యలు ఉంటాయన్నది సమాజ శాస్త్ర చలన సూత్రం.

భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పెట్టుబడిదారీ వ్యవస్థ వచ్చినట్టే, ఆ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సోషలిస్టు వ్యవస్థ కూడా వస్తుందనీ, అది ఆ తరువాత కమ్యూనిస్టు సమాజంగా మారుతుందనీ కార్ల్ మార్క్స్ ఓ సామాజిక చలన సూత్రాన్ని ఆవిష్కరించాడు. కుల వివక్ష సమాజానికి వ్యతిరేకంగా కుల సమానత్వ సమాజం ఒకటి ఏర్పడుతుందని అంబేడ్కర్ ఊహాగానం చేసింది కూడా ఈ సమాజ చలన సూత్రాన్ని అనుసరించే!

జొహ్రాన్ మమ్దానీ

2015 నాటి సంగతి. ఆ ఏడాది అక్టోబరు 13 రాత్రి లండన్ సిటీ బస్సులో ఒక దారుణ సంఘటన జరిగింది. బస్సులో ఇద్దరు ముస్లిం మహిళలు హిజాబ్‌తో ప్రయాణిస్తున్నారు. వారిలో ‘హనానే యాకూబీ’ అనే ఆమె నిండు గర్భిణి. లండన్ బస్సులో ముస్లిం మహిళల్ని చూసి సిమోనే జోసెఫ్ అనే ఓ తెల్ల మహిళకు ఇస్లామోఫోబియా ఆవహించింది. పూనకంతో ఊగిపోతూ ‘ఇక్కడెందుకున్నావు? నీ దేశం పోయి బాంబులు చేసుకుంటూ బతుకు’ అని తిడుతూ గర్భిణి కడుపు మీద తన్నింది. ఇస్లామోఫోబియా ఆవహించిన వాళ్ళను కొన్ని దేశాల్లో పూల మాలలతో సత్కరించి ఊరేగిస్తున్నారు. అది లండన్ కాబట్టి అక్కడి కోర్టు సిమోనేకు కఠిన కారాగార శిక్ష విధించింది.

ఈ సంఘటన జరిగిన ఐదారు నెలలకు లండన్‌లో మేయర్ ఎన్నికలు జరిగాయి. తరువాతి కాలంలో బ్రిటన్ ప్రధానిగా పని చేసిన బోరిస్ జాన్సన్ అప్పటికి రెండుసార్లు గెలిచి లండన్ మేయర్‌గా కొనసాగుతున్న కాలం అది. కన్జర్వేటివ్ పార్టీ దిగ్గజ నాయకునిగా కొనసాగుతున్న బోరిస్ జాన్సన్‌ను, 2016 మే ఆరంభంలో లేబర్ పార్టీకి చెందిన ఓ సామాన్యుడైన సాదిక్ ఖాన్ ఓడించి గ్రేటర్ లండన్ ఎగ్జిక్యూటివ్ మేయర్‌గా ఎన్నికయ్యాడు. విచిత్రం ఏమంటే మేయర్ పదవి ప్రమాణ స్వీకారానికి అతను హిజాబ్ వేసుకున్న మహిళలతో వేదిక మీదికి వచ్చాడు. 2020, 2024 ఎన్నికల్లో కూడా లండన్ ప్రజలు అతణ్ణే గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించారు. ప్రస్తుతం అతనే గ్రేటర్ లండన్ ఎగ్జిక్యూటివ్ మేయర్‌గా కొనసాగుతున్నాడు. సౌత్ లండన్‌లో పుట్టిన సాదిక్ ఖాన్ తల్లితండ్రులు పాకిస్తాన్ నుండి వలస వెళ్లిన ముస్లింలు. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకల్లో సాదిక్ ఖాన్‌కు ‘సర్’ బిరుదు ప్రదానం చేశారు.

న్యూయార్క్ నగరానికి కొత్త మేయర్‌గా ఎన్నికైన జొహ్రాన్ మమ్దానీ కథ కూడా దాదాపు ఇలాంటిదే. నగరంలో ముస్లిం జనాభా అంతగా లేదు. ఇస్లామోఫోబియాను చాలా విస్తృతంగా ప్రచారం చేసిన ప్రపంచ పెట్టుబడిదారుల రాజధాని నగరమైన న్యూయార్కులో మేయర్‌గా ఒక ముస్లిం ఎన్నికయ్యాడు! ఇదొక రాజకీయ విచిత్రం. సమాజ మార్పు కోరేవారికి ఇది నిజంగానే ఉత్తేజాన్ని ఇచ్చే సంఘటన. అమెరికా సమాజంలో అది గుణాత్మక మార్పు ఏమీ కాదుగానీ, అదొక పరిమాణాత్మక మార్పు.

జొహ్రాన్ మమ్దానీ మావోయిస్టు, నక్సలైటు, కమ్యూనిస్టు, సోషలిస్టు ఏమీ కాదు. అది అందరికీ తెలుసు. అతను అమెరికా డెమోక్రాట్ పార్టీలో వామపక్షం. అది అతని పరిధీ, పరిమితీ. అయితే, అమెరికా గడ్డ మీద కమ్యూనిస్టులు, సోషలిస్టులకు కాలు మోపేందుకు చోటు లేదు అని సాక్షాత్తు దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రంకెలేసిన చోట ‘అవును. నేను సోషలిస్టుని. అంతేకాదు; నేను ముస్లింని’ అని బాహాటంగా ప్రకటించి గెలిచినవాడిని అభినందించడం సంస్కారమా, కాదా?

ఇస్లామోఫోబియా ప్రబలిన దేశాల్లో ముస్లిమేతర ప్రజలు దాన్ని తిప్పికొడుతుంటే అది నిస్సందేహంగా భారత ముస్లింలకు ఒక ఓదార్పును ఇస్తుంది. ఇందులో తప్పుపట్టడానికి ఏముందీ? తాము తప్ప ఈ భూమ్మీద కమ్యూనిస్టులు ఎవరూ ఉండరు; ఉండటానికి వీల్లేదు అనుకునే మహానగర మావోయిస్టు వీర అభిమానులు మనకు కొందరున్నారు. ఒకవైపు వాళ్ళూ విమర్శించి, మరోవైపు పెట్టుబడిదారీ వర్గమూ విమర్శిస్తున్నదంటే జొహ్రాన్ మమ్దానీ నిజంగానే ఇప్పుడు చర్చనీయాంశం. ప్లటిపస్, ఆక్సోలోట్ల్, కకాపోల్లాగ అతనొక ప్రత్యేక జాతి జీవి. అలాంటి జీవుల్ని అధ్యయనం చేయడం ఇప్పుడు సమాజశాస్త్రంలో చాలా అవసరం.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు

# ఇదొక రాజకీయ వైఫల్యం

అభిప్రాయం



ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి

‘కాంగ్రెస్ గాంధీల ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ’ అని దివంగత బీజేపీ సీనియర్ నేత అరుణ్ జైట్లీ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్య అక్షరాలా నిజం అవుతోంది. రాహుల్ గాంధీని రాజకీయ నాయకుడిగా నిలబెట్టడానికి కరిగిపోతున్న ఆ పార్టీ ప్రస్తుత వ్యవహారమే అందుకు నిదర్శనం. ‘రాహుల్ గాంధీ 20 సంవత్సరాల్లో 95 ఎన్నికలు ఓడిపోయారు.’ ఆశ్చర్యకరంగా అనిపించినా ఇది నిజం. రాహుల్ 2004లో అమేథీ నుంచి ఎంపీగా రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత కాంగ్రెస్‌కు వచ్చిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటములు ఇవి. దాదాపు ప్రతి రాష్ట్రం – బిహార్, ఢిల్లీ, యూపీ, మహారాష్ట్ర, గుజరాత్ సహా 95 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. రాహుల్ గాంధీ గెలిచేందుకు చేసే ప్రతి పనీ ఆయన నిర్వాకం వల్ల ఓటమికి కారణం అవుతోంది. ఓ వైపు ప్రధాని మోదీ బాహుబలిలాగా ఉంటే ఆయనకు ప్రత్యర్థిగా రాహుల్ గాంధీ ఏ మాత్రం సరిపోవడం లేదు.

1885లో స్థాపితమైన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీని మహాత్మా గాంధీ రద్దు చేయాలని 1947–48లో ప్రతిపాదించారు. స్వాతంత్ర్యం తర్వాత పార్టీ రాజకీయ సంస్థగా కాకుండా, సేవా సంస్థగా మారాలనేది మహాత్ముడి ఆలోచన. కానీ, ఈ ప్రతిపాదన ఆచరణలోకి రాలేదు. పైగా పార్టీ నెహ్రూ కుటుంబం చేతుల్లోకి వెళ్లిపోయింది. ఫిరోజ్ గాంధీని పెళ్లి చేసుకున్న తర్వాత నెహ్రూ కుమార్తె ఇందిర పేరు ఇందిరా గాంధీగా మారింది. కానీ మహాత్మాగాంధీ వారసత్వం అన్నట్లుగా ప్రజల్లోకి పంపించారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కుటుంబ ఆస్తిలాగే ఉంది. 1966లో నెహ్రూ కుమార్తె ఇందిరా గాంధీని తెరపైకి తీసుకువచ్చారు. 1984లో ఇందిర హత్య జరిగే వరకూ ‘కాంగ్రెస్ అంటే ఇందిర... ఇందిర అంటే కాంగ్రెస్’ అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. తర్వాత ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారు. తర్వాత సోనియా గాంధీ కిందికి పార్టీ వచ్చింది. ఆ తర్వాత రాహుల్ గాంధీని నాయకుడిగా రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు.

క్లిష్ట పరిస్థితుల్లో కూడా విహార యాత్రలకు వెళ్లేవాడు ఎప్పుడూ నాయకత్వంలో విజయం సాధించలేడు. 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ పతనానికి కారణం రాహుల్ గాంధీ. 2014 తర్వాత... కాంగ్రెస్ 66 అసెంబ్లీ ఎన్నికల్లో 58 ఎన్నికల్లో ఓడిపోయింది, గెలుపులు కేవలం 8 సార్లు మాత్రమే వచ్చాయి. కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్, హిమాచల్, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనే కాంగ్రెస్ పార్టీ గెలిచింది. కానీ ఇప్పుడు తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌లలో మాత్రమే అధికారంలో ఉంది.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవకపోతే అది దేశానికి సమస్య అన్నట్లుగా రాహుల్ వ్యవహరించడం ఆయన పూర్తిగా దారి తప్పారనడానికి నిదర్శనం. ఓట్ల చోరీ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాస్త పరిశీలిస్తే ఆయన వ్యూహాత్మకంగా దేశ ప్రజాస్వామ్య పునాదులపై దాడి చేస్తున్నారు. గాంధీ కుటుంబం లేకపోతే కాంగ్రెస్ పార్టీ లేదని చెబుతూ ఉంటారు. కానీ ఆ గాంధీ కుటుంబమే ఇప్పుడు కాంగ్రెస్‌కు భారంగా మారింది.

కాంగ్రెస్ మీద ప్రజలకు ఆసక్తి పోయింది. కానీ ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం అవసరం. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ప్రతిపక్షంగా సరిపోవడం లేదు. బాహుబలిలాగా ఉన్న ప్రధాని మోదీని ఢీకొట్టడానికి వారి సామర్థ్యం చాలడం లేదు. అందుకే కాంగ్రెస్ క్యాడర్, లీడర్లు గట్టిగా ఆలోచించుకోవాలి. గాంధీల కుటుంబానికి బానిసత్వం చేయడం కన్నా తమలోనే ఓ మంచి లీడర్‌ని ఎంచుకుని కాంగ్రెస్ నాయకత్వాన్ని అందించాలి.

వ్యాసకర్త బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు

## నకిలీ డిపాజిట్ పత్రాలతో రూ.9కోట్లకు కుచ్చుటోపీ

కురగల్లు పీఏసీఎస్‌లో స్కాం

ఎస్‌ఐకు సమస్యను వివరిస్తున్న బాధితులు

**మంగళగిరి టౌన్:** గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లు గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో భారీ స్కాం వెలుగులోకి వచ్చింది. రాజధాని గ్రామమైన కురగల్లు పీఏసీఎస్‌లో రైతులు పెద్ద మొత్తంలో డిపాజిట్లు చేశారు. సొసైటీ సీఈవో రమేష్‌బాబు రైతులకు నకిలీ డిపాజిట్ పత్రాలు అందజేసినట్లు సమాచారం. ఇటీవల కురగల్లు సొసైటీకి కొత్త సీఈవో రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై కొంతకాలంగా రైతులు రమేష్‌బాబుతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆయనను కొన్ని నెలల క్రితం సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. గ్రామ పరిధిలోని 100మందికి పైగా రైతుల నుంచి అసలు డిపాజిట్ పత్రాల మాదిరిగానే నకిలీ డిపాజిట్ పత్రాలు సృష్టించిన రమేష్‌బాబు, సుమారు రూ.9 కోట్ల వరకు వసూలు చేశారని స్థానికులు చెబుతున్నారు. శనివారం రాత్రి పెద్ద సంఖ్యలో రైతులు, బాధితులు మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల ఎదుట మహిళలు, రైతులు విలపించారు. కష్టపడి సంపాదించిన సొమ్మంతా అక్కడే డిపాజిట్ చేశామని, ఆత్మహత్యలే శరణ్యమని, తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది రైతులకు మాత్రం ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిసింది.



### అలిపిరిలో ట్రాఫిక్ జాం..!

భక్తుల రద్దీతో తిరుమల కిటకిటలాడుతోంది. శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రం వద్ద భక్తుల వాహనాలు కిలోమీటర్ల మేరకు బారులు తీరాయి. రద్దీ నేపథ్యంలో ఉదయం అలిపిరి కాలినడక మార్గం వరకు వాహనాలు ఇలా నిలిచిపోయాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

### సీటు దొరుకుతుందా?

శనివారం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారి దర్శనం అనంతరం తమ గమ్యాలకు చేరేందుకు భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తిరుపతికి వెళ్లేందుకు రాంబగీచా బస్టాండ్ వద్ద బస్సుల కొరత కనిపించింది. బస్సులో సీటు కోసం నానా తిప్పలు పడ్డారు. నడుస్తున్న బస్సుల వద్దకు చేరుకొని కిటికీల సందుల్లో దూరుతూ సీట్లు దక్కించుకున్నారు. ఈ దృశ్యాలను శనివారం 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

## మహిళపై ప్రియుడు హత్యాయత్నం

**మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందంటూ చాకుతో దాడి**

**గుంటూరు జిల్లా తెనాలిలో ఘటన**

చికిత్స పొందుతున్న ఉష

**తెనాలి రూరల్:** మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందన్న కారణంతో సహ జీవనం చేస్తున్న మహిళపై ప్రియుడు హత్యాయత్నం చేశాడు. చాకుతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఈ ఘటన గుంటూరు జిల్లా తెనాలిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలికి చెందిన 45 ఏళ్ల కందుకూరు ఉష కొన్నేళ్ల కిందట విభేదాల వల్ల భర్త నుంచి విడిపోయింది. కూరగాయల వ్యాపారం చేస్తూ జీవిస్తోంది. తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన విజయ్ తెనాలిలోని హోటళ్లలో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అతనితో ఉషకు పరిచయమైంది. ఇద్దరూ కొన్నేళ్లుగా సహ జీవనం చేస్తున్నారు. ఇటీవల ఆమె మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందని విజయ్‌కు తెలిసింది. దీంతో కొద్ది రోజులుగా ఉషతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి చాకుతో ఉషపై విజయ్ విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ నేరాన్ని సన్నిహితంగా ఉంటున్న వ్యక్తే చేశాడని పోలీసులకు చెబితేనే.. ఆస్పత్రికి తీసుకెళ్తానని ఆమెను విజయ్ బెదిరించాడు. ఇందుకు ఆమె అంగీకరించడంతో.. వెంటనే తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు గుంటూరుకు పంపించారు. ఈ సమాచారం అందుకున్న డీఎస్పీ బి.జనార్ధనరావు, వన్ టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు శనివారం ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను విచారించగా అసలు విషయం బయటపడింది. వీరిద్దరూ గతంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఉండగా.. అక్కడ కూడా ఉషతో సన్నిహితంగా ఉంటున్నాడన్న కారణంతో ఓ వ్యక్తిని విజయ్ హత్య చేశాడని డీఎస్పీ తెలిపారు. ప్రస్తుతం ఉష పరిస్థితి నిలకడగా ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## మోస్ట్ వాంటెడ్ దున్న కృష్ణ అరెస్టు

**33 ఏళ్లుగా చోరీలు.. 60 సార్లు శిక్ష.. ఏడుసార్లు జైలుకు**

**శ్రీకాకుళం క్రైమ్:** రెండు తెలుగు రాష్ట్రాల్లో 218కి పైగా చోరీ కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న దున్న కృష్ణ అలియాస్ ప్రీతమ్ కిషన్ సింగ్ (55)ను శ్రీకాకుళం నేర విభాగం (సీసీఎస్), రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణ దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసే శ్రీకాకుళం నగరానికి చెందిన సయ్యద్ రఫీ (39)ని కూడా అరెస్టు చేశారు. అంతేకాక.. పశ్చిమ బెంగాల్ సోనాపూర్ ప్రాంతానికి చెందిన అనంత్సన్‌పుల్, తరుణ్‌మొండల్‌కు చోరీ సొత్తును అందజేసినట్లు విచారణలో వీరు చెప్పడంతో వారినీ అరెస్టుచేసినట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. మరికొంత సొత్తును రికవరీ చేయాల్సి ఉందన్నారు. 33 ఏళ్లుగా చోరీలు చేస్తున్న కృష్ణకు ఇప్పటివరకు 60 కేసుల్లో శిక్ష పడిందని, ఏడుసార్లు జైలుకు వెళ్లాడని, ఏడాది కాలంగా జిల్లాలో 18 చోరీలు చేశాడని ఎస్పీ చెప్పారు. సెల్ ఫోన్ వాడినా, ఆధార్, ఇతర ఐడెంటిటీ కార్డులు వాడినా పోలీసులకు ఈజీగా దొరికిపోతామని తెలిసిన కృష్ణ వాటిని వాడడని అన్నారు. కోల్‌కత బాటానగర్‌లో నివాసముంటూ శ్రీకాకుళం వచ్చి వరుసగా చోరీలు చేసి మళ్లీ కోల్‌కత వెళ్లిపోయేవాడని చెప్పారు. 18 కేసుల్లో ఫిర్యాదుదారులు మొత్తం చోరీ సొత్తు 476 గ్రాముల బంగారమని పేర్కొనగా.. వాస్తవంగా 362 గ్రాములే పోయిన సొత్తు అని, ఇందులో 237 గ్రాములు రికవరీ చేశామని ఎస్పీ తెలిపారు. వెండి, నగదు విషయంలోనూ ఇలానే జరిగిందని, ఫిర్యాదుదారులు బిల్లులు చూపించకపోవడం, ఇతర కారణాలు, నిందితుల నుంచి విచారణలో తప్పని తేలడంతో ఫిర్యాదుదారులపై సైతం న్యాయపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## సచివాలయ ఉద్యోగి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

**ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్**

**సాక్షి, అమరావతి:** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనకాపల్లి జోన్ కమిషనర్ కె.చక్రవర్తి వేధింపుల వల్లే అక్కడి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శి ఎం.నూకరాజు చనిపోయారని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కె.రాజేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూకరాజు మృతికి కారణమైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమయపాలన లేకుండా కాన్ఫరెన్సులు నిర్వహించడం, ఉద్యోగులను దుర్భాషలాడడం, మహిళా ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం వంటి లెక్కలేనన్ని ఫిర్యాదులు చక్రవర్తిపై ఉన్నాయన్నారు. ఆయన గతంలో కూడా ఇలాగే వ్యవహరించి ఒక ఉద్యోగి మరణానికి కారణమయ్యారని చెప్పారు. తక్షణమే సమగ్ర విచారణ జరిపి.. కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పీపీపీపై సీఎం వాదన సహేతుకం కాదు

**ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్లు**

మాట్లాడుతున్న ఆలా వెంకటేశ్వర్లు

**గుంటూరు (మెడికల్):** పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల ఏర్పాటు ద్వారా 70 శాతం పేదలకు వైద్యం అందుబాటులో ఉంటుందని సీఎం చంద్రబాబు చెప్పడం సహేతుకం కాదని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన శనివారం గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ.. 'సీఎం ప్రకటించినట్టు ప్రభుత్వ నియంత్రణలో కొనసాగనున్న పీపీపీ వైద్య కళాశాలల్లో ఉద్యోగ నియామకాలు ప్రభుత్వం చేపడుతుందా లేక ప్రైవేట్ యాజమాన్యమే చేపడుతుందా. ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు అమలవుతాయా లేదా అనే విషయాలను ప్రభుత్వం స్పష్టం చేయాలి. ఒకవేళ ఉద్యోగ నియామకాలు ప్రైవేట్ యాజమాన్యమే చేపడితే అప్పుడు ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు, పీపీపీ మెడికల్ కళాశాలకు ఉన్న వ్యత్యాసం ఏమిటో తెలపాలన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ఓ సమావేశంలో మాట్లాడుతూ వైద్యులను హాఫ్ నాలెడ్జ్ డాక్టర్లంటూ ఎద్దేవా చేశారనీ, ఇప్పుడు పీపీపీ విధానంలో ప్రతిభ లేకపోయినా కేవలం 15 శాతం మార్కులు మాత్రమే సాధించి రూ.కోట్లు వెచ్చించి మరీ వైద్య విద్యను అభ్యసించే వారినుంచి ఏ విధమైన సామర్థ్యం ఆశించవచ్చో చంద్రబాబు తెలపాలని కోరారు.

**ఆర్థిక లబ్ధి కోసమే..:** జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ కార్పొరేట్ వైద్య సంస్థలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కట్టబెట్టి రాజకీయ, ఆర్థిక లబ్ధి పొందాలని ప్రయత్నించడం తగదన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్వీర్యం చేస్తూ పీపీపీ పేరుతో కార్పొరేట్ వైద్య సంస్థలకు కట్టబెడితే పేదలు అప్పుల పాలవుతారన్నారు. కేవలం పది కార్పొరేట్ వైద్య సంస్థలకు మాత్రమే టెండర్లలో పాల్గొనే అవకాశం లభించే విధంగా నిబంధనలను రూపొందించి, ప్రభుత్వ వైద్య కళాశాలలను వాళ్లకు కట్టబెట్టే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. పీపీపీ విధానంలో ప్రభుత్వమే 50 ఎకరాల స్థలం కేటాయించి, అన్ని సదుపాయాలు కల్పిస్తామని చెబుతుండగా కేవలం 50 శాతం సీట్లు మాత్రమే కన్వీనర్ కోటా కింద తీసుకోవడం ఎవరికి మేలు చేస్తుందో తెలపాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను పేదలు, మధ్య తరగతి ప్రజలు వినియోగించుకుంటున్న తరుణంలో వాటిని మరింత బలోపేతం చేయకుండా ప్రైవేట్ పరం చేయాలని చూడటం సబబు కాదన్నారు. పీపీపీ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ఆలోచన విరమించుకునేంత వరకు భావసారూప్యత గల రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి ఐక్యంగా ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

## డోర్ లేని బస్సు.. గుంతల రోడ్డు.. 120 మంది జనం

**నడపడం నా వల్ల కాదన్న డ్రైవర్.. పోలీస్ స్టేషన్‌కు తరలింపు**

బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న జనం

**ఎమ్మిగనూరు టౌన్:** కర్నూలు జిల్లా కోసిగి, ఉరుకుంద రూట్‌లో వెళ్లాలంటేనే బస్సు డ్రైవర్లు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అసలే శిథిలమైన రోడ్డు, అడుగులోతు గుంతలతో బస్సును నడపడమంటే తలప్రాణం తోకకు వస్తుందంటూ డ్రైవర్లు వాపోతున్నారు. గురువారం ఉరుకుంద బస్సులో 120 మందికి పైగా ప్రయాణికులు ఎక్కడంతో వారిని దింపేందుకు డ్రైవర్ బస్సును ఏకంగా పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటన జరిగి రెండు రోజులు కూడా కాకుండానే, శనివారం మళ్లీ అదే సీన్ రిపీట్ అయింది. ఉదయం 9.30గంటలకు కోసిగికి వెళ్లే బస్సు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో వచ్చి ఆగిన వెంటనే 120 మందికి పైగా ప్రయాణికులు ఎగబడి ఎక్కారు. ఇంత మంది ఎక్కితే బస్సు ఎలా నడపాలని, అసలే బస్సుకు డోర్‌లేదని, శిథిలమైన రోడ్లలో ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని డ్రైవర్ ప్రాథేయ పడినా ఫలితం లేకపోయింది. దీంతో బస్సును నేరుగా పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లాడు. 'రోజూ స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రయాణికులను కిందకు దింపమంటే ఎలా.. మీరే బస్టాండ్‌లో పరిమితంగా ఎక్కించుకోవాలి' అని పోలీసులు చెప్పడంతో ఎలాగైనా సమస్య పరిష్కరించాలని డ్రైవర్ వారిని కోరారు. చివరకు పోలీసులు ప్రయాణికులకు విషయం అర్థమయ్యేలా చెప్పి కొందరిని కిందకు దించారు. వారంతా శాపనార్థాలు పెడుతూ తిరిగి బస్టాండ్‌కు వెళ్లిపోవడంతో బస్సు కోసిగి వైపునకు కదిలింది.

## శ్రీవారి అన్నప్రసాదంపై టీవీ నటి శివజ్యోతి వెటకారం

శివజ్యోతి

**తిరుమల:** ప్రముఖ టీవీ నటి శివజ్యోతి ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆ సమయంలో అదనపు ఈవో కార్యాలయం వద్ద గతంలో ఉన్న శ్రీవాణి టికెట్ల కౌంటర్‌కు వెళ్లే క్యూలో తన భర్త, స్నేహితులతో వెళుతున్న సమయంలో క్యూలోని భక్తులకు టీటీడీ అన్నప్రసాదాలు పంపిణీ చేసింది. అయితే ఆ ప్రసాదం తీసుకుంటున్న తన స్నేహితుడితో 'తిరుమలలో కాఫీ, ప్రసాదం అడుక్కుంటున్నాం. రిచ్చెస్ట్ బిచ్చగాళ్లం మేమే'' అంటూ కామెంట్ చేశారు. ఈ తతంగాన్ని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఇది వైరల్ కావడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు టీటీడీ భక్తులు రీల్స్ చేయవద్దని ఆదేశించినా, కొందరు మాత్రం తమ వెకిలి చేష్టలు, మాటలతో రీల్స్ చేయడం మాత్రం మానడం లేదు.

## ఆరు నెలల్లో రాజధాని రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

**రాజధాని అమరావతిలో త్రీమెన్ కమిటీ సమావేశం**

**తాడికొండ:** రాజధాని రైతుల సమస్యలను ఆరునెలల్లోగా పరిష్కరిస్తామని, స్వార్థం కోసం ఒకరిద్దరు చెప్పే మాటలు ఎవరూ నమ్మవద్దని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించిన కమిటీ రెండో సమావేశం అమరావతిలోని రాయపూడి వద్ద సీఆర్‌డీఏ భవనంలోని మున్సిపల్ శాఖ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కూడిన కమిటీ మాట్లాడుతూ రెండు వారాలకోసారి సమావేశమై రైతుల సమస్యలను పరిష్కరించేలా ముందుకెళ్తామని తెలిపారు. ఈనెల 10న జరిగిన మొదటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతితోపాటు మరికొన్ని సమస్యలపై కమిటీలో చర్చించారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవ్ తేజ, ఇతర అధికారులు,కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతుల ప్లాట్లకు సంబంధించి ఇంకా కేవలం 700 ఎకరాలలో కొన్ని సమస్యలున్నాయన్నారు. ఇప్పటికే 98 శాతం ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని, జరీబు, మెట్ట భూములకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత పరిష్కరిస్తామన్నారు. గ్రామకంఠాల విషయంలో సీఆర్‌డీఏ నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని, గ్రామ కంఠాలకు సంబంధించి 370 మంది రైతులకు ఇబ్బంది ఉందన్నారు. మరోవైపు లంక అసైన్డ్ భూములకు సంబంధించి ప్రస్తుతం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ లో ఉందని మంత్రి తెలిపారు. 90 రోజుల్లోగా ఈ సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో రైతులకు సంబంధించి అన్ని సమస్యలు ఆరు నెలల్లో పరిష్కరిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. భూములిచ్చిన రైతుల్లో ఇంకా కేవలం 719 మందికి మాత్రమే ప్లాట్లు కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు.


भारतीय कपास निगम लिमिटेड
THE COTTON CORPORATION OF INDIA LTD.
(A Government of India Undertaking)
Branch Office: Kapas Bhavan, 4/2, Ashok Nagar, P.B.227, Guntur-522002, AP
Tele.No.0863-2233472, Fax No.0863-2357472, E-mail:guntur@cotcorp.com
Website: www.cotcorp.org.in, Ministry Website: www.ministryoftextiles.gov.in

**పత్తి రైతులకు విజ్ఞప్తి**

2025–26 పత్తి సీజన్‌లో కాటన్ కార్పొరేషన్ లిమిటెడ్ (CCI) ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభించబడింది. పత్తి రైతుల హక్కులను రక్షించడానికి కార్పొరేషన్ తన పరిధిలోని జిల్లాల్లో మొత్తం 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసింది అని పత్తి రైతులకి తెలియజేయుచున్నాము. కాటన్ కార్పొరేషన్ లిమిటెడ్ పత్తి పంట సంవత్సరం 2025–26 కనీస మద్దతు ధర (MSP) పథకంతో పత్తి అమ్మడానికి Kapas Kisan App ని అభివృద్ధి చేసింది. Kapas Kisan App గూగుల్ ప్లే స్టోర్ మరియు ఆపిల్ iOS లో అందుబాటులో ఉంది. ప్రస్తుతం ముమ్మరంగా దేశవ్యాప్తంగా Kapas Kisan App ద్వారా సుమారు 5 లక్షల క్వింటాల పత్తి కొనుగోలు రోజువారీగా జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో Kapas Kisan App రాష్ట్ర ప్రభుత్వ CMAPP తో అనుసంధానం చేయబడింది.

అందువలన రాష్ట్రంలోని పత్తి రైతులకూ అభ్యర్ధన ఏంటంటే వారు Kapas Kisan App డౌన్‌లోడ్ చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యొక్క CMAPP పోర్టల్‌లో నమోదు చేసిన తమ మొబైల్ నంబర్ OTP ద్వారా లాగిన్ చేయగలరు. లాగిన్ అయిన తర్వాత భారతీయ పత్తి సంస్థకు (CCI) పత్తి అమ్మడానికి సమీప కేంద్రంలో తమ స్లాట్ బుక్ చేసుకుని కనీస మద్దతు ధర (MSP) లాభాన్ని పొందగలరు. నాణ్యత ప్రమాణాల ప్రకారం పత్తిలో తేమ 8% కంటే ఎక్కువ కాకపోతే రైతులకు MSP యొక్క మొత్తం చెల్లింపు ఇవ్వబడుతుంది. కానీ తేమ 8% కంటే ఎక్కువగా 12% వరకు ఉన్నచో, 8% మించిపోయిన తేమ ఉంటే సారూప్యంగా MSP చెల్లింపు తగ్గించబడుతుంది. అందువలన పత్తి రైతులు CCI కి మద్దతు ఇస్తూ ఆరబెట్టిన పత్తి మాత్రమే కేంద్రానికి తీసుకురావాలని సూచన ఇస్తోంది. తద్వారా అదనపు తేమ కారణంగా ఏమైనా తగ్గింపులు చేయకుండా ఉంటాయి. ఏ పరిస్థితులలోనైనా పత్తిలో తేమ 12% కంటే ఎక్కువ ఉండకూడదు. ఏ విధమైన సహాయం అవసరమైనా, రైతులు గుంటూరులోని శాఖ కార్యాలయానికి WhatsApp హెల్ప్‌లైన్ నంబర్ 7659954529 ద్వారా సంప్రదించవచ్చు.

శాఖాధికారి


## అరసవల్లి గోశాలలో దూడ మృతి

**అరసవల్లి:** శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయం గోశాలలో దూడ మృతి చెందింది. అనారోగ్య కారణాలతో శనివారం వేకువజామున దూడ మృతి చెందిందని ఆలయ అధికారులు ప్రకటించినప్పటికీ నిర్వహణ లోపాలే కారణమన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక ఆలయ గోశాలలో కొన్నాళ్ల నుంచి 13 ఆవులతో పాటు దూడ కూడా ఉండేది. అయితే ఇటీవల గోవుల సంరక్షణపై ఆలయ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే దూడ అనారోగ్యానికి గురై మరణించినట్లు భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఇదే వైఖరి కొనసాగితే మిగతా 13 ఆవుల పరిస్థితి ఏంటని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఘటన జరగ్గానే ఆలయ అధికారులు అప్రమత్తమై పశుసంరక్షణ వైద్యునికి సమాచారం ఇచ్చి నివేదిక సిద్ధం చేయించుకున్నారు.

## పిడుగు పడి యువకుడి మృతి

**భార్య నిండు గర్భవతి**

మహేష్ (ఫైల్)

చికిత్స పొందుతున్న సురేష్

**వెంకటగిరి రూరల్:** తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలో శనివారం వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా పిడుగు పడటంతో ఓ యువకుడు మృతి చెందాడు. యాతలూరు గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పనులు చేసేందుకు పంజాం గిరిజన కాలనీకి చెందిన రెడ్డిపల్లి మహేష్ (25), వల్లివేడు గిరిజన కాలనీకి చెందిన కళ్లగుండ సురేష్‌తోపాటు యాతలూరు గిరిజన ప్రాంతానికి చెందిన మరో 9 మంది కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లారు. శనివారం ఉదయం 11.00 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగు పడటంతో పొలంలో పనిచేస్తున్న మహేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా, పక్కనే ఉన్న సురేష్ గాయపడ్డాడు. తోటి కూలీలు వారిద్దరినీ చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మహేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మహేష్‌కు ఏడాది క్రితం అరుణతో వివాహమైంది. ఆమె 9 నెలల గర్భవతి.

## బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరు ఉపాధ్యాయుల దుర్మరణం

మృతుడు నర్సయ్య

శ్రీనివాసరావు (ఫైల్)

**అద్దంకి:** బైక్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు దుర్మరణం పాలైన ఘటన బాపట్ల జిల్లా చక్రాయపాలెం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోదేపల్లికి చెందిన దాసరి నర్సయ్య (54), వెంపరాలకు చెందిన గోసాల శ్రీనివాసరావు (55) ఉపాధ్యాయులు. నర్సయ్య వెంపరాల వెళ్లి శ్రీనివాసరావును బైక్ ఎక్కించుకుని అద్దంకి బయలుదేరారు. వారి బైక్ అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిలో శాంతినగర్ వద్దకు రాగానే కారు ఢీ కొట్టడంతో బైకుపై నుంచి ఇద్దరూ ఎగిరి కిందపడ్డారు. నర్సయ్య తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రగాయాల పాలైన శ్రీనివాసరావును ఒంగోలు వైద్యశాలకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. దాసరి నర్సయ్య తాళ్లూరు మండలం తురకపాలెంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. గోసాల శ్రీనివాసరావు ఇంకొల్లు పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. నర్సయ్యకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. శ్రీనివాసరావుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# జీ20 సౌభాగ్యానికి నాలుగు సూత్రాలు

## జీ20 దేశాల అధినేతల సదస్సులో ప్రధాని మోదీ ప్రతిపాదన

- ప్రపంచ సంప్రదాయ విజ్ఞానాన్ని భద్రపర్చుకోవాలి
- ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ కార్యక్రమం ప్రారంభిద్దాం
- గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసుకుందాం
- డ్రగ్స్–టెర్రర్ బంధాన్ని కలిసికట్టుగా ఎదుర్కొందామని పిలుపు

**జోహన్నెస్‌బర్గ్:** ప్రపంచ అభివృద్ధి ప్రాధాన్యతలపై పునరాలోచన చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రాధాన్యతల్లో మార్పులు చేర్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమగ్ర, సుస్థిరాభివృద్ధి నమూనాలను ఆచరించాలని పేర్కొన్నారు. నాగరికత అందించిన విజ్ఞానం నుంచి అభివృద్ధి నమూనాను స్వీకరించాలని అన్నారు. జీ20 సభ్యదేశాల సౌభాగ్యమే లక్ష్యంగా నాలుగు కీలక సూత్రాలను ప్రతిపాదించారు. ప్రపంచ సంప్రదాయ విజ్ఞానాన్ని ఒకచోట భద్రపర్చి, భవిష్యత్ తరాలకు అందించేలా చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. ఆఫ్రికా యువతలో నైపుణ్యాలు పెంచాలన్నారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, విపత్తుల సమయంలో సహకరించుకోవడానికి సభ్యదేశాలన్నీ కలిసి ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అలాగే మాదక ద్రవ్యాలు–ఉగ్రవాదుల భాగస్వామ్యాన్ని అంతం చేయడానికి సభ్యదేశాలు కలిసికట్టుగా పనిచేయాలని ఉద్ఘాటించారు. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో శనివారం జీ20 దేశాల అధినేతల సదస్సు ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రధానంగా నాలుగు అంశాలను ప్రస్తావించారు. ప్రపంచ అభివృద్ధి విధానాలపై పునరాలోచన చేయాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు. సరైన వనరులు, పర్యావరణ సమతుల్యత లేని ప్రాంతాలు అభివృద్ధిలో వెనుకంజలోనే ఉండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితిలో తప్పనిసరిగా మార్పు రావాలన్నారు. భారతీయ నాగరికత విలువల్లో అంతర్భాగమైన 'సమీకృత మానవతావాదం' ప్రపంచమంతటా అభివృద్ధి, పర్యావరణానికి మధ్య సమతూకం సాధించడానికి దోహదపడుతుందని వివరించారు.

**భవిష్యత్ తరాలకు సంప్రదాయ విజ్ఞానం**

''కాల పరీక్షకు నిలిచిన సుస్థిర జీవన విధానాలను పరిరక్షించుకోవాలి. ఇందుకోసం జీ20 ఆధ్వర్యంలో ప్రపంచ సంప్రదాయ విజ్ఞానాన్ని భద్రపర్చుకోవాలి. ఆరోగ్యం, పర్యావరణం, సామాజిక సంబంధాలు వంటి అంశాలపై ప్రాచీన విజ్ఞానాన్ని రికార్డు చేసి, భవిష్యత్ తరాలకు అందించాలి. వాతావరణంపై ప్రతికూల ప్రభావాలు పెరగడంతోపాటు ప్రజల జీవన విధానాలు అనూహ్యంగా మారిపోతున్న నేటి తరుణంలో ఇది చాలా అవసరం.

జీ20 శిఖరాగ్రంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

**సర్టిఫైడ్ ట్రైనర్లను తయారు చేద్దాం**

ప్రపంచ ప్రగతికి ఆఫ్రికా ప్రగతి అత్యంత కీలకం. ఆఫ్రికా యువత అభివృద్ధి, సాధికారత కోసం వారికి నైపుణ్యాలు నేర్పించాలి. ఇందులో భాగంగా జీ20 నేతృత్వంలో ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ కార్యక్రమాన్ని ప్రారంభించాలి. దీనికి జీ20 దేశాలన్నీ సహకరించాలి. తొలుత శిక్షకులకు శిక్షణ ఇవ్వాలి. వచ్చే పదేళ్లలో కనీసం 10 లక్షల మంది సర్టిఫైడ్ ట్రైనర్లను తయారు చేద్దాం. ఈ ట్రైనర్లు ఆఫ్రికా యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తారు. తద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**సంక్షోభ సమయాల్లో సహకారానికి..**

ఆరోగ్య సేవల కోసం జీ20 గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేద్దాం. జీ20 సభ్యదేశాల నుంచి సుశిక్షితులైన వైద్య నిపుణులు ఈ బృందంలో చేరాలి. సభ్యదేశాల్లో ఎక్కడైనా ఆరోగ్య అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు, ప్రకృతి విపత్తులు విరుచుకుపడినప్పుడు ఈ నిపుణులు తక్షణమే రంగంలోకి సేవలందిస్తారు.

**మాదక ద్రవ్యాలతో పెనుముప్పు**

ఫెంటానిల్ వంటి సింథటిక్ డ్రగ్స్ మానవాళికి పెనుముప్పుగా మారుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యాన్ని, సామాజిక స్థిరత్వాన్ని, భద్రతను దెబ్బతీస్తున్నాయి. ఉగ్రవాద ముఠాలు డ్రగ్స్ వ్యాపారంలోనూ ఆరితేరిపోతున్నాయి. డ్రగ్స్–టెర్రర్ బంధాన్ని దీటుగా ఎదుర్కోవాల్సిందే. మాదక ద్రవ్యాల వ్యవస్థలను నాశనం చేయాలి. అక్రమ నగదు ప్రవాహాన్ని అడ్డుకోవాలి. ఉగ్రవాదులకు నిధులందించే వనరులను బలహీనపర్చాలి. ఇవన్నీ జరగాలంటే ప్రపంచదేశాల ఐక్య కార్యాచరణ కావాలి. మాదక ద్రవ్యాలు–ఉగ్రవాదుల బంధాన్ని కూకటివేళ్లతో పెకిలించడానికి 'డెడికేటెడ్ జీ20 కార్యక్రమం' ప్రారంభిద్దాం'' అని మోదీ అన్నారు.

ప్రధాని మోదీ, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా నవ్వుల పువ్వులు

### అరుదైన మూలకాలపై దృష్టిపెడదాం

'అరుదైన మూలకాలు, సహజ భూఅయస్కాంత పదార్థాలపై దృష్టిపెట్టాలి. కొత్త బ్యాటరీలపైనే ఆధారపడకుండా రీసైక్లింగ్, పట్టణ ప్రాంతాల్లో వాడేసిన డిజిటల్ వస్తువులు, ఉపకరణాల నుంచి అరుదైన మూలకాల సేకరణతో అర్బన్ మైనింగ్ చేద్దాం. వాడేసిన బ్యాటరీలను గ్రిడ్ స్టెబిలైజర్, బ్యాకప్ పవర్ వంటి రంగాల్లో సద్వినియోగం చేయడంతోపాటు సంబంధిత రంగానికి అనువైన ఆవిష్కరణలపై దృష్టిసారిద్దాం' అని మోదీ అన్నారు.

### భారత్, ఆస్ట్రేలియా, కెనడా త్రైపాక్షిక భాగస్వామ్యం

సాంకేతిక పరిజ్ఞానంతోపాటు నూతన ఆవిష్కరణల విషయంలో పరస్పరం సహకరించుకోవడానికి భారత్, ఆస్ట్రేలియా, కెనడా జట్టుకట్టబోతున్నాయి. ఈ త్రైపాక్షిక భాగస్వామ్యాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రకటించారు. ఆయన శనివారం జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బానీస్, కెనడా ప్రధాని కార్నీతో సమావేశమయ్యారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లో కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నామన్నారు.

# ప్రాంతాల దురాక్రమణ తగదు

- బెదిరింపులు, బల ప్రయోగానికి దూరంగా ఉండాలి
- ఇతర దేశాల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని గౌరవించాలి
- జీ20 సదస్సు డిక్లరేషన్‌లో స్పష్టీకరణ

**జోహన్నెస్‌బర్గ్:** ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించుకోవాలన్న దురాలోచనకు ప్రపంచ దేశాలన్నీ దూరంగా ఉండాలని జీ20 దేశాల కూటమి తేల్చిచెప్పింది. ఈ మేరకు శనివారం జోహన్నెస్‌బర్గ్‌లో జీ20 దేశాల అధినేతల సదస్సులో 39 పేజీల డిక్లరేషన్ విడుదల చేశారు. పరాయి ప్రాంతాల ఆక్రమణ కోసం బెదిరింపులు గానీ, బల ప్రయోగం గానీ చేయడానికి వీల్లేదని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. ఏ దేశమైనా సరే ఇతర దేశాల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వం లేదా రాజకీయ స్వతంత్రతను గౌరవించాల్సిందేనని ఉద్ఘాటించారు. జీ20 సదస్సుకు హాజరైన సభ్యదేశాల నేతలు ఏకాభిప్రాయంతో డిక్లరేషన్‌ను ఆమోదించారు. ప్రపంచ దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు బలపడాలని ఆకాంక్షించారు. మానవ హక్కులను, ప్రజల స్వేచ్ఛను అందరూ గౌరవించాలని పిలుపునిచ్చారు. మతం, భాష, ప్రాంతం, జాతి, స్త్రీ–పురుష అనే వివక్ష లేకుండా అందరినీ సమానంగా పరిగణించాలని కోరారు. నేడు భౌగోళిక రాజకీయ, భౌగోళిక ఆర్థిక పోటీ పెరుగుతుండడంతో ప్రతికూల పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రపంచ దేశాల సమగ్ర అభివృద్ధికి పరస్పర సహకారం, సంఘీభావం, సమానత్వం, సుస్థిరతలే కీలక మూలస్తంభాలని వివరించారు. ఇంధన భద్రత, వాతావరణ మార్పుల నియంత్రణ, విపత్తుల నివారణ వంటి అంశాలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. రష్యా, ఇజ్రాయెల్, మయన్మార్ దుందుడుకు చర్యలను పరోక్షంగా తప్పుపట్టారు. ఈసారి జీ20 సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరుకాకపోవడం గమనార్హం. డిక్లరేషన్‌లోని కొన్ని అంశాలను ట్రంప్ వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా, జీ20 డిక్లరేషన్‌ను సాధారణంగా సదస్సు ముగింపు సమయంలో విడుదల చేస్తుంటారు. ఈసారి సదస్సు ప్రారంభంలోనే విడుదల చేయడం విశేషం.

**వ్యత్యాసాలు సమసిపోవాలి: రమఫోసా**

సంపద, అభివృద్ధి వంటి విషయాల్లో దేశాల మధ్య వ్యత్యాసాలు పూర్తిగా సమసిపోవాలని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా ఆకాంక్షించారు. ఇలాంటి వ్యత్యాసాలు అన్యాయం, అవాంఛనీయమని పేర్కొన్నారు. శనివారం జీ20 సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు.

# కేసుల కొండ కరిగిస్తా

## మధ్యవర్తిత్వానికి మద్దతిస్తా

- నా దృష్టంతా కీలక సమస్యలపైనే
- కాబోయే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా న్యాయస్థానాల నెత్తిన గుదిబండగా తయారైన కేసుల సత్వర పరిష్కారంపై దృష్టిసారిస్తానని కాబోయే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టీకరించారు. నవంబర్ 24వ తేదీన సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేయనున్న జస్టిస్ సూర్యకాంత్ శనివారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు పిచ్చాపాటీ మాట్లాడారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన ప్రాధాన్యాలకు సంబంధించిన ఆయన తన మనసులోని మాటలను బయటపెట్టారు. ''నా ముందున్న తొలి, అత్యంత ముఖ్యమైన సవాల్ ఏదైనా ఉందంటే అది పేరుకుపోయిన కేసుల కొండ. దేశవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో కుప్పలుతెప్పలుగా పడి ఉన్న పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించడంపై దృష్టిసారిస్తా. ఒక్క సుప్రీంకోర్టులోనే ఏకంగా 90,000 కేసులు పరిష్కారం కోసం ఫైళ్లలో మూలుగుతున్నాయి. అసలు ఇన్ని కేసులు పెరిగేదాకా ఏం చేస్తున్నట్లు? అపరిష్కృతంగా పడి ఉండటానికి కారకులు ఎవరు? బాధ్యతారహితంగా వ్యవహరించింది ఎవరు? అనే అంశాల జోలికి వెళ్లదల్చుకోలేదు. కానీ వీటిని సత్వరం పరిష్కరించాల్సిందే. పేరుకుపోయిన పెండింగ్ కేసుల సంగతేంటి? అని హైకోర్టులు, ట్రయల్ కోర్టుల నుంచి నివేదికలు తెప్పిస్తా''అని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు.

**కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఉత్తమం**

''కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వ బాటలో పయనించడం చాలా మంచిది. వాస్తవానికి మధ్యవర్తిత్వం అనేది సమస్యలు, కేసులు పరిష్కృతం కావడానికి అత్యంత చక్కటి మార్గం. కేసుల కొండ కరగాలంటే మధ్యవర్తిత్వ అస్త్రాన్ని ప్రయోగించక తప్పదు. ఇది కేసుల పరిష్కార వ్యవస్థలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. ఈమధ్యే సుప్రీంకోర్టుకు సంబంధించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ సైతం మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను ప్రస్తావించారు. ఇప్పుడు దేశం మొత్తం ఈ అంశంపైనే చర్చ జరుగుతోంది. భారత్‌లోని బహుళజాతి సంస్థలు, బ్యాంక్‌లు, బీమా సంస్థలు సైతం ఇదే బాటలో పయనించేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి''అని అన్నారు.

**నా ఒక్క తీర్పుతో 1,200 కేసులు పరిష్కారం**

''ఢిల్లీలో భూ సమీకరణకు సంబంధించి ఒకే తరహా కేసులు చాలా ఉండిపోయాయి. నేనిచ్చిన ఒక్క తీర్పుతో ఏకంగా 1,200 కేసులు ఒకేసారి పరిష్కారమయ్యాయి. కీలకమైన చట్టపర, రాజ్యాంగ అంశాలతో ముడిపడిన చాలా కేసులు హైకోర్టుల వద్ద పేరుకుపోయాయి. వీటికి నేను సుప్రీంకోర్టులో విస్తృతస్థాయిలో రాజ్యాంగ ధర్మాసనాలను ఏర్పాటుచేసి పరిష్కారం చూపుతా''అని అన్నారు.

**ఈస్థాయికి వచ్చాక అవి ఏపాటి?**

తమకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పులపై రాజకీయనేతలు లేదా కొన్ని వర్గాల వాళ్లు చేసే విమర్శలపై జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. ''ఇటీవలికాలంలో న్యాయమూర్తులపైనా నిందలు వేస్తున్నారు. కోర్టుల తీర్పులను సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుబడుతున్నారు. జడ్జీలను ఎగతాళి చేస్తూ ట్రోలింగ్ పెరిగింది. అయినాసరే వృత్తి ధర్మం పాటిస్తూ న్యాయమూర్తులు ముందుకు సాగిపోతారు. సుప్రీంకోర్టు జడ్జి లేదా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థాయికి ఎదిగిన మేం ఇలాంటి చవకబారు అంశాలను అస్సలు పట్టించుకోము. నా దృష్టిలో సామాజికమాధ్యమం అనేది అసమాజ మాధ్యమంగా తయారైంది. ఆన్‌లైన్ వేధింపులు, వ్యాఖ్యానాలను పట్టించుకోను. ఇవి నాపై ప్రభావం చూపబోవు. వీటి వల్ల అస్సలు ఒత్తిడికి గురికాను. జడ్జీలు, తీర్పులపై సద్విమర్శను మాత్రమే నేను లెక్కలోకి తీసుకుంటా''అని అన్నారు.

జస్టిస్ సూర్యకాంత్

**కాలుష్యమున్నా కాలు బయటపెడతా**

''దేశరాజధానిలో వాయు కాలుష్యం విపరీతంగా ఉంది. పొగచూరినా సరే పాదం కదపాల్సిందే. వాతావరణం ఎలాగున్నా సరే రోజు ఉదయం మార్నింగ్‌వాక్ చేస్తా. ఖచ్చితంగా దాదాపు గంటసేపు బయట నడుస్తా''అని అన్నారు.

### 26న సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ దినోత్సవం

**న్యూఢిల్లీ:** పాత పార్లమెంట్ భవన సముదాయంలోని చారిత్రక సెంట్రల్ హాల్‌లో బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాలు జరగనున్నాయి. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. లోక్‌సభ సెక్రటేరియట్ శనివారం ఈ విషయం తెలిపింది. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ సభ ఆమోదించిన రోజును పురస్కరించుకుని ఏటా ఈ కార్యక్రమం జరుగుతోంది. రాజ్యాంగంలోని కొన్ని అంశాలు తక్షణమే అమల్లోకి రాగా, మిగతావి 1950 జనవరి 26వ భారత్ రిపబ్లిక్‌గా అవతరించిన తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. 2015కు ముందు ఈ రోజును లా డేగా జరుపుకునేవారు.

### జన్ సురాజ్ పార్టీ సంస్థాగత విభాగాలు రద్దు

**పట్నా:** ఇటీవలి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సురాజ్ ఆ రాష్ట్రంలోని అన్ని సంస్థాగత విభాగాలను రద్దు చేస్తున్నట్లు శనివారం ప్రకటించింది. రానున్న నెల, నెలన్నర లోపు అన్ని సంస్థాగత విభాగాలను కొత్తగా ఏర్పాటు చేస్తామని పార్టీ ప్రతినిధి సయ్యద్ మసీహుద్దీన్ తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణం మరింత ప్రభావవంతంగా మార్చడమే లక్ష్యమన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతి సారథ్యంలో శనివారం పట్నాలో జరిగిన జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్, నాయకులు ఎస్‌కే సింగ్, రాంచంద్ర ప్రసాద్ సింగ్, వైవీ గిరి పాల్గొన్నారని వెల్లడించారు.

### సరిహద్దుల్లో పాక్ డ్రోన్ సంచారం

**జమ్మూ:** జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి సాంబా సెక్టార్‌లోని ఓ గ్రామంపై పాకిస్తాన్‌కు చెందిన డ్రోన్ సంచరించింది. శుక్రవారం సాయంత్రం పాకిస్తాన్‌లోని చక్ భురా చెక్‌పోస్ట్ వైపు నుంచి ఇది వచ్చినట్లు గుర్తించారు. గఘ్వాల్ ప్రాంతంలోని రెగాల్ గ్రామంపై కొద్ది నిమిషాలపాటు ఎగిరి అనంతరం సరిహద్దు ఆవలి వైపునకు వెళ్లిపోయిందని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో అణువణువూ శోధించిన భద్రతా బలగాలు డ్రగ్స్ లేదా ఆయుధాలను డ్రోన్ జారవిడిచినట్లు ఎలాంటి ఆధారాలు దొరకలేదని ధ్రువీకరించారన్నారు.

# ట్రంప్, మమ్దానీ స్నేహగీతం

## వైట్‌హౌస్‌లో సమావేశమైన ఇరువురు నేతలు

- న్యూయార్క్ అభివృద్ధిపై చర్చ
- మమ్దానీకి సహకరిస్తానన్న ట్రంప్
- తాము కలిసికట్టుగా పనిచేస్తామన్న మమ్దానీ

వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో మమ్దానీ

**న్యూయార్క్:** భిన్న ధ్రువాలైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, న్యూయార్క్ సిటీ మేయర్‌గా ఎన్నికైన భారత సంతతి అమెరికన్ జొహ్రాన్ మమ్దానీ శుక్రవారం వైట్‌హౌస్ ఓవర్ ఆఫీసులో సమావేశమయ్యారు. ఇన్నాళ్లూ పరస్పరం విమర్శలు గుప్పించుకున్న ఇరువురు నేతలు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఇరువురూ కలిసి స్నేహగీతం ఆలపించడం చర్చనీయాంశంగా మారింది. న్యూయార్క్ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై వారిద్దరూ అభిప్రాయాలు పంచుకున్నారు. మేయర్‌గా ఎన్నికైన తర్వాత మమ్దానీ.. ట్రంప్‌ను కలవడం ఇదే మొదటిసారి. భేటీ అనంతరం మమ్దానీతో కలిసి ట్రంప్ మీడియాతో మాట్లాడారు. కొత్త మేయర్‌తో అద్భుతమైన, ఫలవంతమైన సమావేశం జరిగిందని చెప్పారు. ఈ భేటీని చాలా ఆనందించానని అన్నారు. న్యూయార్క్ విషయంలో తమ ఇద్దరి ఆలోచనలు ఒక్కటేనని తెలిపారు. నగరాన్ని మరింత గొప్పగా మార్చాలన్నదే తమ ధ్యేయమని ఉద్ఘాటించారు. మమ్దానీకి అభినందనలు తెలియజేశారు. మేయర్ ఎన్నికల్లో ఎంతోమంది తెలివైన వాళ్లను వెనక్కి నెట్టేసి విజయం సాధించాడని ప్రశంసించారు. మమ్దానీ పాలనలోని న్యూయార్క్‌లో నివసించడానికి ఇష్టపడతారా? అని ప్రశ్నించారు. కచ్చితంగా ఇష్టపడతానని ట్రంప్ బదులిచ్చారు. మేయర్‌గా మమ్దానీని చక్కటి పాలన అందించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఆయనకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. తమ ఇద్దరి అభిప్రాయాలు వేర్వేరు అయినప్పటికీ కలిసి పని చేస్తామన్నారు. ఈ సమావేశం తర్వాత మమ్దానీపై విశ్వాసం పెరిగిందన్నారు. నిజానికి మమ్దానీని కలుసుకోవడం తనకు మొదట ఆశ్చర్యం కలిగించిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. న్యూయార్క్ ప్రజల పట్ల ఆయన తపన తనను ఆకట్టుకుందని తెలిపారు. మేయర్‌గా మమ్దానీ అద్భుతమైన పాలన అందిస్తారన్న నమ్మకం ఉందని స్పష్టంచేశారు. ఆయన అమెరికాలోనే గొప్ప మేయర్‌గా పేరు తెచ్చుకుంటారనడంలో సందేహం లేదని ట్రంప్ వెల్లడించారు. న్యూయార్క్ ప్రజల కలలు సాకారం కావడానికి మమ్దానీకి అన్ని విధాలుగా సహకరిస్తానని తేల్చిచెప్పారు.

**భారత్–పాక్ యుద్ధంపై మళ్లీ అదే మాట**

భారత్–పాకిస్తాన్ యుద్ధంపై ట్రంప్ తన ధోరణి ఎంతమాత్రం మార్చుకోవడం లేదు. ఈ యుద్ధాన్ని తానే ఆపేశానని మరోసారి చెప్పారు. మమ్దానీతో భేటీ అనంతరం మాట్లాడుతూ భారత్–పాక్ ఘర్షణ సంగతిని ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య ఎనిమిది శాంతి ఒప్పందాలు కుదిర్చానని, అందులో భారత్–పాక్ ఒప్పందం కూడా ఉందని స్పష్టంచేశారు.

### ప్రజలకు సౌకర్యవంతమైన జీవితం అందిస్తాం: మమ్దానీ

ట్రంప్‌తో భేటీ కావడం పట్ల మమ్దానీ ఆనందం వ్యక్తంచేశారు. ఫలవంతమైన సమావేశం జరిగిందని తెలిపారు. స్నేహ సంబంధాలతోపాటు పరిపాలనపరమైన అంశాలపై మాట్లాడుకున్నామని చెప్పారు. న్యూయార్క్‌లో నివసించే 80.50 లక్షల మందికి మరింత సౌకర్యవంతమైన జీవితాన్ని అందించడమే తమ ఇద్దరి ఆశయమని ఉద్ఘాటించారు. అత్యంత ఖరీదైన నగరమైన న్యూయార్క్‌లో జీవన వ్యయం పెరిగిపోతోందని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. న్యూయార్క్ ప్రజల బాగు కోసం తాము కలిసికట్టుగా పనిచేస్తామని మమ్దానీ స్పష్టంచేశారు.

# ఈసారి పార్లమెంట్ ముందుకు కీలక బిల్లులు

**న్యూఢిల్లీ:** మరో వారం రోజుల్లో ప్రారంభంకానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టబోయే కీలక బిల్లుల జాబితా సిద్ధమైంది. పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేట్ రంగానికి స్వాగతం పలికేందుకు ఉద్దేశించిన బిల్లుతోపాటు 10 బిల్లులను ఈసారి పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం విడుదలైన 'లోక్‌సభ, రాజ్యసభ బులెటెన్'లో కేంద్రం పలు అంశాలను వెల్లడించింది. అణు ఇంధన బిల్లు, 2025తోపాటు కార్పొరేట్ చట్టాల(సవరణ) బిల్లు–2025, సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు–2025, జాతీయ రహదారుల(సవరణ) బిల్లులను ఉభయసభల ముందుకు తీసుకురానున్నారు. జాతీయ రహదారుల విస్తరణ, పొడగింపు కోసం భూసేకరణ ప్రక్రియ అత్యత అత్యంత పారదర్శకంగా, వేగంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్(సవరణ) బిల్లు తీసుకొస్తున్నారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం–1992, డిపాజిటరీస్ చట్టం–1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్(నియంత్రణ)చట్టం–1956 లను విలీనంచేసేందుకు ఉద్దేశించిన సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు–2025ను తీసుకొస్తున్నారు. ఆర్బిట్రేషన్, కాన్సిలియేషన్ చట్టంలోని 34వ సెక్షన్‌కు సవరణలు తేవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. చేయని తప్పులకు కంపెనీల డైరెక్టర్లు బాధ్యులవుతున్న నేపథ్యంలో అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి డైరెక్టర్లకు రక్షణ కల్పించే ఉద్దేశంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలియేషన్ చట్ట సంబంధ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, సూచనల కోసం కమిటీకి సిఫార్సుచేయాలని కేంద్రం భావిస్తోంది. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణం పరిధిలోకి తెచ్చేందుకు ఉద్దేశించిన బిల్లును సైతం ప్రవేశపెట్టనున్నారు. ఇది చట్టంగా మారితే ఇకపై రాష్ట్రపతి నేరుగా చండీగఢ్‌పై విధానపర నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇక్కడ స్వతంత్ర ప్రధాన కార్యదర్శి బదులు ఇకపై స్వతంత్ర అడ్మినిస్ట్రేటర్ ఉంటారు. తమ ఉమ్మడి రాజధాని చండీగఢ్‌పై సర్వహక్కులు తమకే దక్కుతాయని భగవంత్ మాన్(ఆప్) సారథ్యంలోని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం వాదించడంతో కేంద్రం హుటాహుటిన ఈ చట్టం తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి సెషన్ డిసెంబర్ ఒకటో తేదీన మొదలై 15 సిట్టింగ్‌ల తర్వాత డిసెంబర్ 19న ముగియనుంది.

**ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ లక్ష్యంగా..**

దేశంలో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లును తీసుకురానుంది. దీనికి 'ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(హెచ్‌ఈసీఐ)'బిల్లు అని పేరు పెట్టారు. విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలు ఇకపై స్వయంప్రతిపత్తితో అత్యంత పారదర్శకతతో అత్యున్నత విద్యాప్రమాణాలను పాటించేలా చేయడమే ఈ బిల్లు లక్ష్యమని న్యాయశాఖ వర్గాలు తెలిపాయి. హెచ్‌ఈసీఐను ఏర్పాటుచేయాలని నూతన విద్యావిధానం(ఎన్‌ఈపీ)లో ప్రతిపాదించడం తెల్సిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బోధనేతర ఉన్నత విద్యా అంశాలను చూసే విశ్వవిద్యాలయాల నిధులసంఘం(యూజీసీ), సాంకేతిక విద్యాంశాలను చూసే అఖిలభారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ), ఉపాధ్యాయుల విద్యాంశాలను చూసే జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలిలను విలీనంచేస్తూ హెచ్‌ఈసీఐ తేవాలని బిల్లులో ప్రతిపాదించనున్నారు.

# పాక్ నుంచి డ్రోన్లతో ఆయుధాలు

## అక్రమ ఆయుధాల ముఠా గుట్టురట్టు

- ఢిల్లీలో నలుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ:** సరిహద్దు వెంట భూమార్గంలో నిఘా కట్టుదిట్టంగా ఉండటంతో గగనతలంలో డ్రోన్ల ద్వారా పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి ఆయుధాలను తరలిస్తున్న భారీ ముఠా గుట్టు రట్టయింది. చైనా తయారీ అత్యాధునిక ఆయుధాలను డ్రోన్లతో భారతగడ్డ మీదకు తీసుకొస్తున్న అంతర్జాతీయ ముఠా సభ్యులను శనివారం ఢిల్లీ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ సభ్యులకు పాకిస్తాన్‌లోని ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ)తో సంబంధాలున్న ఆయుధ సరఫరాదారులతో సంబంధాలున్నట్లు సమాచారం. తుర్కియేలో తయారైన పీఎక్స్ 5.7 మోడల్ పిస్టళ్లు, చైనా తయారీ పీఎక్స్3 పిస్టళ్లు ఐదు సహా 10 అత్యాధునిక పిస్టల్స్, 92 బుల్లెట్లను తాజాగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీఎక్స్ పిస్టల్‌లను సాధారణంగా ప్రత్యేక దళాలు మాత్రమే వినియోగిస్తాయి. పంజాబ్‌కు చెందిన మణ్‌దీప్ సింగ్, దల్వీందర్, యూపీలోని బాఘ్‌పత్‌కు చెందిన రోహన్ తోమర్, అజయ్ అలియాస్ మోనులనూ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఐఎస్ఐతో సంబంధం ఉన్న, అమెరికాకు పారిపోయిన పంజాబ్ గ్యాంగ్‌స్టర్ సోనూ ఖత్రి అలియాస్ రాజేశ్ కోసం భారత్‌కు ఆయుధాలు తెప్పిస్తున్నారని నవంబర్ 19న పోలీసులకు సమాచారం అందింది. దీంతో రోహిణి పట్టణంలోని ఖాతూ శ్యామ్ ఆలయం వద్ద చాకచక్యంగా ముఠాసభ్యులను పోలీసులు అరెస్ట్‌చేసి వాళ్ల నుంచి పిస్టళ్లు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఫిలౌర్‌కు చెందిన మణ్‌దీప్, లూథియానాకు చెందిన దల్వీందర్ చిన్ననాటి స్నేహితులు. గ్యాంగ్‌స్టర్ ఖత్రి సహాయకుడు జస్ప్రీత్‌తో వీళ్లకు సంబంధం ఉంది. జస్ప్రీత్ పాక్‌లోని ఐఎస్ఐ అనుబంధ సరఫరాదారుల ద్వారా ఈ ఆయుధాలను భారత్‌లోకి తెప్పిస్తున్నట్లు సమాచారం. రోహన్, అజయ్‌లు ఢిల్లీ–ఎన్సీఆర్ ప్రాంతంలోని గోగి గ్యాంగ్, భువూ గ్యాంగ్, కపిల్ సంగ్వాన్ అలియాస్ నందు గ్యాంగ్‌లకు ఆయుధాలను సరఫరాచేస్తున్నారు. ఈ గ్యాంగ్‌లు సుపారీ తీసుకుని హత్యలు, బెదిరింపులకు పాల్పడుతున్నాయి.

# బొల్సనారో ముందే అరెస్ట్

## జైలు శిక్షను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు

**సావో పౌలో:** దేశంలో తిరుగుబాటు లేవదీసేందుకు ప్రయత్నించిన ఆరోపణలపై గృహ నిర్బంధంలో ఉన్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జయిర్ బొల్సనారోను అధికారులు ముందుగానే అరెస్ట్ చేశారు. మరో రెండు వారాల్లో ఆయనపై విధించిన 27 ఏళ్ల కారాగార శిక్ష అమల్లోకి రానుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. 2019–2022 సంవత్సరాల మధ్య దేశాధ్యక్షుడిగా ఉన్న బొల్సనారో.. 2022 ఎన్నికల్లో లులా డసిల్వా చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం, 2023లో దేశంలో తిరుగుబాటుకు, అధ్యక్షుడు లులా డ సిల్వా హత్యకు కుట్రపన్నారంటూ వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. బొల్సనారోకు 27 ఏళ్ల కారాగారంతోపాటు 2030 వరకు అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనరాదంటూ నిషేధం విధించింది. ప్రస్తుతం ఆయన విలాసవంతమైన జర్డిప్ బొటనాకో ప్రాంతంలోని సొంతింట్లో గృహ నిర్బంధంలో ఉన్నారు. కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా వేసి ఉంచేందుకు ఎలక్ట్రానిక్ మానిటర్‌ను జూలై 18వ తేదీన ఆయన కాలికి అమర్చారు. శనివారం వేకువజామున ఆ పరికరాన్ని పగులగొట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందని ప్రకటించిన సుప్రీంకోర్టు జడ్జి అలెగ్జాండర్ డి మోరెస్..బొల్సనారోను వెంటనే గృహ నిర్బంధం నుంచి రాజధాని బ్రెసిలియాలో ఫెడరల్ పోలీసు ప్రధాన కార్యాలయానికి తరలించాల్సిందిగా ఆదేశాలివ్వడం కలకలం రేపింది. బొల్సనారో దేశాన్ని విడిచి దొంగచాటుగా పరారయ్యే ప్రమాదముందని, నివాసం పొరుగునున్న రాయబార కార్యాలయాల్లో ఆశ్రయం కోరే అవకాశముందని అధికారులను ఆయన అప్రమత్తం చేశారు. ఇదంతా ముందు జాగ్రత్త మాత్రమేనని, మాజీ అధ్యక్షుడిని అవమానించే ఉద్దేశం తమకు లేదన్నారు. ఆయనకు బేడీలు వేయడం, బహిరంగంగా జైలుకు తరలించడం వంటివి చేపట్టబోమన్నారు.

# ప్రభావిత దేశాలకు మరిన్ని నిధులు

## ముగిసిన ఐరాస వాతావరణ సదస్సు

**బెలెమ్:** బ్రెజిల్‌లోని బెలెమ్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి కాప్ 30 సదస్సు శనివారం ముగిసింది. వాతావరణ మార్పులతో తీవ్రంగా ప్రభావితమైన దేశాలకు మరిన్ని నిధులను కేటాయించేందుకు ఈ సదస్సులో దేశాల మధ్య అంగీకారం కుదిరింది. నష్టపోయిన దేశాలను ఆదుకోవాలని పిలుపునిచ్చింది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించేందుకు ఉద్దేశించిన ప్రణాళికపై నిర్ణీత కాలావధిపై దేశాలమధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అదేవిధంగా, ఉద్గారాలను కట్టడి చేసేందుకు ఉద్దేశించిన చర్యలపైనా అంగీకారానికి రాలేకపోయాయి. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించుకునేందుకు కొలంబియాతో కలిసి రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తామని బ్రెజిల్ అధ్యక్ష కార్యాలయం తెలిపింది. కాప్ 30 ఆమోదించిన తీర్మానం మాత్రమే ప్రభావవంతమైందిగా ఉంటుందని పేర్కొంది.

సాక్షి
గుంటూరు
ఆదివారం ׀ 23 ׀ నవంబర్ ׀ 2025

## పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 4,227 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉంది.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 584.20 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 36,765 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



## పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 600 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 42.1600 టీఎంసీలు.

# పత్తి రైతు మెడపై తేమ కత్తి

ఈ రైతు పేరు గుంటుపల్లి ఉపేంద్రరావు. ప్రత్తిపాడు మండలం గొట్టిపాడుకు చెందిన ఆయన ఈ ఏడాది 65 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరాకు రూ. 45 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పత్తి తీతలకు అదనంగా మరో రూ. 10 వేలు ఖర్చు అయింది. తుపానుకు ముందు వరకూ ఎకరాకు 15 క్వింటాలు వస్తుందని భావించారు. తుపాను దెబ్బకు దిగుబడి నాలుగు, ఐదు క్వింటాళ్లకు పడిపోయింది. పెట్టుబడిలో సగం అయినా వస్తుందో రాదో తెలియని పరిస్థితి. నాలుగు రోజుల కిందట 170 క్వింటాల పత్తిని కోయవారిపాలెంలోని ఒక సీసీఐ కేంద్రానికి తీసుకెళ్లారు. పత్తిలో కాయ ఉంది కొనబోమని చెప్పారు. అక్కడే బ్లోయర్ వేసి గ్రేడింగ్ చేశారు. తరుగు పోయి 160 క్వింటాళ్లకు చేరింది. అమ్మగా వచ్చిన నగదును కూలీల ఖర్చుల కింద చెల్లించారు.

ఈయన పేరు బట్టిపాటి శ్రీనివాసరావు. ప్రత్తిపాడుకు చెందిన రైతు. ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ. 50 వేల వరకు ఖర్చు అయింది. ఇప్పటి వరకు ఒక తీత తీశారు. రెండవ తీతకు సిద్ధంగా ఉంది. మొదటి తీతకు వచ్చిన దిగుబడిని విక్రయిస్తే కనీసం కూలీ ఖర్చులకు కూడా చెల్లించే పరిస్థితి లేదు. తుపానుకు ముందు పది క్వింటాళ్లు ఎకరాకు వస్తుందని భావించారు. తరువాత దిగుబడి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లకు పడిపోయింది. మామూలుగా మూడు, నాలుగు తీతలు రావలసిన పత్తి రెండు తీతలతోనే ముగిసేలా ఉంది. వచ్చిన పత్తిని సీసీఐకి తీసుకెళ్లారు. కానీ అక్కడకు వెళ్లిన వారంతా వెనక్కు వస్తుండటంతో ఆందోళన చెందారు. కనీస మద్దతు ధర దక్కక, దళారులకు తెగనమ్ముకోలేక ఆవేదన చెందుతున్నారు.

పత్తి రైతు తెల్లబోతున్నాడు. పదిహేను క్వింటాళ్లు రావలసిన దిగుబడి మొంథా తుపాను దెబ్బకు నాలుగు క్వింటాళ్లకు పడిపోయింది. ధర రాక దిగాలు చెందుతున్న రైతుల కష్టాన్ని దళారులు మింగేస్తున్నారు. తేమ శాతం నిబంధనతో సీసీఐ కర్కశంగా తిరస్కరిస్తుండటం, బయట మార్కెట్‌లో రూ.మూడు, నాలుగు వేలకు క్వింటా అడుగుతుండటంతో అవుతున్నాడు. తెచ్చిన అప్పులు పెట్టుబడులకే అయిపోగా, కూలీలకు ఇచ్చేందుకు కూడా డబ్బుల్లేక అయినకాడికి తెగనమ్ముకుంటున్నాడు.

- కనీస మద్దతు ధర కల్పించడంలో దారుణంగా విఫలం
- దిగుబడిపై ఇటీవల తుపాను, వర్షాల ప్రభావంతో రైతులు కుదేలు
- వాస్తవానికి క్వింటా పత్తికి కనీస మద్దతు ధర రూ.8,110
- మార్కెట్లో గరిష్ఠంగా రూ. 5 వేల నుంచి రూ.6 వేలూ రాని దుస్థితి
- రైతులను ఆదుకునే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో ప్రారంభం కాని పలు కేంద్రాలు

**ఎక్కువ తేమ శాతం, రంగు మారిన పత్తి కొనుగోలుపై చంద్రబాబు సర్కారు మీనమేషాలు**

సాక్షి ప్రతినిధి, గుంటూరు, ప్రత్తిపాడు: జిల్లాలో ఈ ఏడాది 54 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. మొంథా తుపానుకు ముందు పత్తి పైర్లు కళకళలాడాయి. ఎకరానికి 15–17 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులు ఊహించారు. తుపాను దెబ్బకు పత్తి రైతు పతనమయ్యాడు. పంటలు రోజుల తరబడి నీటనాని, నేలవాలి, కాయరాలి పోవడంతో ఆశలన్నీ నీటిపాలు అయ్యాయి. ఆ ప్రభావం దిగుబడులపై పడి ప్రస్తుతం ఎకరాకు 3–5 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తోంది.

ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలోని సీసీఐ కేంద్రంలో బయ్యర్లు తిరస్కరించడంతో వెనక్కు వెళుతున్న పత్తి లోడు ట్రాక్టర్లు (ఫైల్)

### సీసీఐలో నిబంధనల 'కత్తి'..

సీసీఐలో పత్తి రైతుల మెడపై నిబంధనల కత్తి వేలాడుతోంది. కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించినా ఒక్కరంటే ఒక్కరికీ ఆ ధరకు పత్తిని కొనుగోలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. గుంటూరు జిల్లాలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మరికొన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు రైతులు వ్యయ ప్రయాసలకోర్చి తాము పండించిన తెల్ల బంగారాన్ని తీసుకువెళుతున్నారు. తీరా అక్కడకు వెళ్లిన తరువాత తేమ శాతం అధికంగా ఉందని, కాయ వస్తోందని.. రకరకాల కారణాలను చూపుతూ తిరస్కరిస్తున్నారు. సీసీఐలో నిబంధనల మెలికలు పెడుతుండటంతో రైతులు పత్తిని ఇళ్ల వద్దనే ఎండబెట్టి, గదుల్లో నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి చోటుచేసుకుంది. కర్నూలు జిల్లాలో తేమ శాతం 12 కంటే ఒక శాతం ఎక్కువ ఉన్నా కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నల్లరేగడి ప్రాంతం కావడం వలన తేమ శాతాన్ని 12 నుంచి 18 శాతానికి పెంచాలని రైతులు కోరుతున్నారు.

### సర్వర్ కష్టాలు కూడా..

కపాస్ కిసాన్ యాప్ సర్వర్ స్లోగా ఉండటం వల్ల స్లాట్ బుకింగ్‌లో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. స్లాట్ బుక్ చేసుకున్న తేదీ రోజు కొనుగోలు కేంద్రం వద్ద రద్దీ కారణంగా సరుకు అన్లోడ్ చేయలేకపోతే తదుపరి రోజు స్లాట్ బుకింగ్ ఇబ్బంది అవుతోంది. దీనివల్ల వాహనాల కిరాయి, వెయిటింగ్ చార్జీ పెరిగిపోతోంది.

### దళారుల చేతివాటం

సీసీఐ కేంద్రాల బయటే రాబందుల్లా వేచి ఉండే దళారులు.. సీసీఐ బయ్యర్లు రిజెక్ట్ చేసిన వెంటనే పత్తి రైతుల ఎదుట వాలిపోతున్నారు. ఎలాగూ సుదూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన పత్తిని రైతులు వెనక్కు తీసుకువెళ్లాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ట్రాక్టర్ బాడుగ, వెయిటింగ్ చార్జీ, లోడింగ్, అన్‌లోడింగ్, గ్రేడింగ్, కూలి ఖర్చులు.. ఇలా పెను భారం అయ్యే పరిస్థితి ఉంది. ఇదే అదనుగా అక్కడే మాటు వేసే దళారులు క్వింటా రూ.మూడు, రూ. నాలుగు వేలకు అడుగుతున్నారు. కొందరు గత్యంతరం లేని పరిస్థితుల్లో దిగుబడిని దళారుల చేతుల్లో పెట్టేసి బిక్కమొఖంతో ఇళ్లకు వెళుతున్నారు. మరికొందరు మళ్లీ వస్తే ఏమైనా ధర వేస్తారేమోనని ఆశగా వెనుదిరుగుతున్నారు. ఇప్పటి వరకు సీసీఐలో నామమాత్రంగా మాత్రమే కొన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

## పంటను చేజేతులా కాల్చి వేస్తూ ...

పెదనందిపాడు మండలం నాగులపాడులో పత్తి పంటను పీకేసి నిప్పు పెట్టిన రైతు

పత్తి రైతుల కడుపు రగిలిపోతోంది. సాగు చేసిన పత్తి తుపాను దెబ్బకు దెబ్బతినడంతో పాటు కనీస మద్దతు ధర లేకపోవడం, ప్రభుత్వం ప్రకటించిన ధరకు సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేయకుండా కొర్రీలు పెడుతూ తిరస్కరిస్తుండటంతో పత్తి రైతు గుండె తరుక్కుపోతుంది. పత్తితీతలు కూడా కాకముందే పంటను దున్నేస్తున్నారు. అక్కడికక్కడే కూలీలతో పంటను పీకి వేయించి, గుట్టలుగా పోగేసి నిప్పు పెడుతున్నారు. ఇటీవల పెదనందిపాడు మండలం నాగులపాడు, పెదనందిపాడు గ్రామాల్లో రైతులు తాము సాగు చేసిన పంటకు ఇలాగే నిప్పు పెట్టారు. చంద్రబాబు సర్కారు మాత్రం రైతులను ఆదుకునేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదు.

## న్యూస్‌రీల్

### ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

నకరికల్లు: స్థానిక శ్రీలక్ష్మీనర్సింహస్వామి కొండ వద్ద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టామహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. భక్తుల సహకారంతో కొండ ప్రారంభంలో స్వామివారి భారీ విగ్రహాన్ని ప్రతిష్టించారు. అర్చకుడు కొడవటికంటి మధుసూధనాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. భక్తుల సహకారంలో భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

### ప్రతి సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: గుంటూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శనివారం తెలిపారు. గుంటూరు సుదర్శిని నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో మొబైల్ ఐ క్లినిక్ ద్వారా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా కంటి పరీక్షలు, ఉచిత ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

### అమరేశ్వరునికి కార్తికమాస ఆదాయం

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తికమాసం అనంతరం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.చంద్రశేఖరరావు సమక్షంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి రేఖ మాట్లాడుతూ అమరేశ్వరునికి ఈ కార్తిక మాసంలో రూ.1,57,82,956 ఆదాయం వచ్చిందన్నారు. ఈ నగదు మొత్తాన్ని దేవాలయ బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తున్నామని తెలిపారు.

### ఏబీవీపీ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈనెల 28, 29 ,30వ తేదీల్లో జరగనున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 71వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లవరపు పవన్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్ద జాతీయ మహాసభల ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. పవన్‌కుమార్ మాట్లాడుతూ ఏబీవీపీ దేశవ్యాప్తంగా విద్య, యువత, జాతీయత ఆధారంగా విద్యార్థి ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ఏబీవీపీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ గంగాధర్, ఏఎన్‌యూ విభాగ ఉపాధ్యక్షుడు రామ్, కార్యదర్శి వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి న్యాయమూర్తిగా శ్యాంబాబు బాధ్యతల స్వీకారం

నరసరావుపేట టౌన్: నరసరావుపేట 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తిగా బాపట్ల 6వ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి శ్యాంబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించిన డాక్టర్ ఎన్.సత్యశ్రీ అనంతపురం జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో ఎవ్వరినీ నియమించక పోవడంతో బాపట్ల ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తిని ఇన్‌చార్జిగా నియమించారు.

# రసవత్తరంగా కోడిపోరు

- వీరుల ఆయుధాలకు గ్రామోత్సవం
- వీరులకు నీరాజనాలు పలికిన ప్రజలు



కోడిపోరు ఉత్సవంలో ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి తదితరులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో జరుగుతున్న పల్నాటి వీరారాధన ఉత్సవాలలో భాగంగా శనివారం వీరుల గుడి ఆవరణలో కోడిపోరు నిర్వహించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సినీ నిర్మాత బండ్ల గణేష్ పాల్గొన్నారు. ముందుగా వీర విద్యావంతులు కోడిపోరు కథాగానం చేశారు. తర్వాత బండ్ల గణేష్ ఒక పుంజును మరొకరు మరో పుంజును బరిలోకి వదిలారు. ఒకటి బ్రహ్మనాయుడు పుంజు చిట్టిమల్లుగా, మరొకటి నాగమ్మ పుంజు శివంగిడేగగా వీర విద్యావంతులు అభివర్ణించారు. రెండు పందేలలో బ్రహ్మనాయుడు పుంజు గెలిచిందని మూడో పందెంలో బ్రహ్మనాయుడు పుంజు ఓడిందని ప్రకటించారు. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ బ్రహ్మనాయుడు పాత్రలో మరో ఆచారవంతుడు నాయకురాలు నాగమ్మ పాత్రను పోషించారు.

**రణక్షేత్రంలో గ్రామోత్సవాల సందడి**

వీరుల ఆయుధాలతో వీరాచారులు పౌరుషంతో ఊగిపోయారు. అలనాటి వీరుల ఆయుధాలతో వీరంగమాడారు. కత్తులతో విన్యాసాలు చేశారు. కత్తులతో గుండెలపై బాదుకుంటూ రగిలిపోయారు. మహిళలు పూనకాలతో ఊగిపోయారు. వీరుల ఆయుధాలను వారిపై వాల్చి వారి ఆవేశాన్ని తగ్గించారు. పాత కారెంపూడి బజార్లన్నింటిలో గ్రామోత్సవాలు కొనసాగాయి. గ్రామస్తులంతా ప్రతి ఇంటి వద్ద వారు పోసి కొబ్బరికాయలు కొట్టి పూల దండలు వేసి వీరులకు నీరాజనాలు పలికారు. వీరాచారులు ఆయుధాలను వారిపై వాల్చి ఆశీర్వాదం అందించారు. ఉదయాన్నే వీరుల గుడి నుంచి గ్రామోత్సవాలు ప్రారంభమయ్యాయి. చెన్నకేశవస్వామిని దర్శించుకుని అనంతరం ఆలయం బయట ఉన్న బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద కత్తి సేవలు చేసుకున్నారు. తర్వాత వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకుని అక్కడ కూడా కత్తి సేవలు కొనసాగించారు. తర్వాత నుంచి గ్రామోత్సవానికి వీరుల ఆయుధాలు బయలుదేరాయి. మొదట తోట బజారులో ఉన్న బ్రహ్మనాయుడు మేడ వద్దకు ఆయుధాలన్నీ తరలి వెళ్లాయి. అక్కడ కూడా సంప్రదాయ కత్తి విన్యాసాలు చేశారు. ఆ ప్రాంత వాసులంతా పల్నాటి వీరులకు నీరాజనాలు పట్టారు. రాత్రి వరకు ఆ బజారులోనే వీరుల ఆయుధాలు ప్రతి గడప నుంచి పూజలందుకున్నాయి. గ్రామోత్సవం పూర్తయ్యే సరికి అర్ధ రాత్రి దాటే అవకాశం కన్పిస్తోంది. కోట బురుజు సమీపంలో ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి హారతులిచ్చారు. ఉదయాన్నే వీరాచారులు పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆశీర్వాదం తీసుకుని ఆ తర్వాత నుంచి గ్రామోత్సవాలు నిర్వహించారు. ఇదిలా ఉంటే మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు చేసుకుని అంకాలమ్మ తల్లి చెన్నకేశవస్వామిలకు నైవేద్యం అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వీరాచారులతో పాటు ప్రజలు కూడా వేలాదిగా ఉత్సవానికి తరలివచ్చారు.

**ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ**

పల్నాటి ఉత్సవాలలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు. వారు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలసి వీరుల గుడిలో ఆయుధాలకు పూజలు చేశారు. కోడిపోరు ప్రదర్శన ముగిసిన తర్వాత కొద్దిసేపు సందడి చేశారు. అనంతరం ఎడ్ల పోటీలను వారు ప్రారంభించారు.

**నేటితో ముగియనున్న ఉత్సవాలు**

ఐదు రోజులుగా జరుగుతున్న పల్నాటి వీరారాధన ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. కళ్లిపాడు నాడు వీరుల ఆయుధాలు కళ్లి పోతురాజు మండపం వద్ద కళ్లికి ఒరగడంతో ఉత్సవాలను ముగించి వీరాచారులు స్వగ్రామాలకు పయనం కానున్నారు.

# యంత్రాలతో కోతవైపే రైతుల మొగ్గు

- సమయం ఆదా, తక్కువ ఖర్చు అంటున్న అన్నదాతలు
- యంత్రాలతో కోస్తే పశుగ్రాసానికి ముప్పు

ట్రాక్టర్లతో ధాన్యం తరలింపు

చెరుకుపల్లి: ఈ ఏడాది ఖరీఫ్ వరి సేద్యం చివరి అంకానికి చేరుకుంది. దీంతో పలు గ్రామాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. కొద్ది రోజులుగా రైతులు హార్వెస్టర్, యంత్రాలతో కోతలు కోస్తున్నారు. వరి కోత పనులు యంత్రాలతో చేయటం ద్వారా సమయంతోపాటు కూలీల ఖర్చు కూడా తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. కూలీలతో కోతకు ఎకరాకు రూ.4 వేలు, ఓదెలకు రూ.800, కుప్ప వేసేందుకు రూ.4 వేలు, నూర్పిడికి రూ. 6 వేలు వంతున ఖర్చు అవుతుంది. అదే యంత్రంతో కోతకు సుమారు రూ. 4 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ధాన్యం వెంటనే విక్రయించే వీలుంటుందని, అందుకే ఎక్కువ శాతం మంది ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

**హెచ్చరికతో ముమ్మరం**

గతంలో ఎన్నడు లేని విధంగా రైతులు ఎక్కువ శాతం వరి కోత యంత్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. పంట చేతికందే ప్రస్తుత దశలో వరుస వాయుగుండ హెచ్చరికలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అందుకే వెంటనే యంత్రాలతో కోసి ధాన్యాన్ని విక్రయించేస్తున్నారు.

**పశుగ్రాసానికి కొరత**

యంత్రాలతో కోత వల్ల రానున్న రోజుల్లో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతుందని పశు పోషకులు అంటున్నారు. వరి దుబ్బులను సగానికి పైగా వదిలేసి యంత్రాలు కోస్తాయి. దీంతో ఎండు గడ్డి పరిమాణం బాగా తగ్గుతుంది. దీనికి తోడు ధాన్యం నూర్చటం వల్ల గడ్డి పూర్తిగా నలిగి బయటకు వస్తుంది. కోసిన గడ్డి యంత్రాల చక్రాల కింద నలిగిపోయి బురద అంటుకుంటుంది. ఈ గడ్డిని తినటానికి పశువులు ఆసక్తి చూపవు.

# మాతృత్వం ఓ వరం.. దత్తత మరో మార్గం!

- అనధికార దత్తత చట్టరీత్యా నేరం
- అర్హతగల వారికి అండగా శిశు గృహ
- జాతీయ దత్తత మాసోత్సవాలు

నరసరావుపేట ఏరియా వైద్యశాలలో దత్తతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సత్తెనపల్లి: వివాహమై ఎన్నో ఏళ్లు గడిచినా సంతాన సాఫల్యానికి నోచని దంపతులకు దత్తత ఓ వరం. దత్తత తీసుకోవడంలోనూ కొన్ని నిబంధనలు ఉన్నాయి. అనధికార దత్తత చట్టరీత్యా నేరం. కొంతమంది ఈ విషయం తెలియక దళారుల చేతిలో మోసపోతున్నారు. జాతీయ దత్తత మాసోత్సవం సందర్భంగా నెలరోజుల పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటిన ప్రారంభమైన జాతీయ దత్తత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు, సదస్సులు ఈ నెల 30 వరకు నిర్వహించనున్నారు. దత్తత తీసుకునేందుకు ఉండాల్సిన అర్హతల గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

**అర్హతలు ..**

- దంపతుల వయస్సు, వైవాహిక బంధం ఆధారంగా చిన్నారులను దత్తత ఇస్తారు.
- కనీసం రెండేళ్ల పాటు గొడవలు లేకుండా సాఫీగా జీవిస్తున్న దంపతులు అర్హులు.
- రెండేళ్లలోపు పిల్లలను దత్తత తీసుకోవాలంటే దంపతుల్లో మగవారి వయసు 45, ఆడవారి వయసు 40కి మించకూడదు.
- ఒంటరి మహిళ వయసు 40కి మించకూడదు.
- దత్తత కోరే వారు భౌతికంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండి, ఆర్థికంగా బాగుండాలి.
- ఒంటరి మగవారు, మగ బిడ్డను మాత్రమే దత్తత పొందుటకు అర్హులు.
- దత్తత పొందాలనుకుంటున్న భార్యాభర్తలు ఇద్దరి అంగీకారం తప్పనిసరి.
- బంధువుల, తెలిసిన వారి పిల్లలను అనధికారికంగా దత్తత తీసుకుంటున్నా.. మున్ముందు ఇబ్బందులే.

శ్రద్ధాంజలి

కీ॥శే॥ బందలపాటి సామ్రాజ్యం గారు
మాజీ సర్పంచ్ : చిన్నపలకలూరు
మరణం : 09-11-2025
మంచికి మారుపేరుగా నిలిచి, చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ...
కుటుంబ అభివృద్ధికై అహర్నిశలు శ్రమించిన మీరు మా నుండి దూరమవడం మాకు తీరనిలోటు...
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
భర్త : బందలపాటి శివశంకరరావు
ఇంద్ర బ్రదర్స్ మరియు కుటుంబ సభ్యులు
సంస్మరణ సభ : ది. 23-11-2025 ఆదివారం గుంటూరు రూరల్, చిన్న పలకలూరులోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.
సమయాభావం వల్ల ఆహ్వానం అందని బంధుమిత్రులు ఈ ప్రకటననే ఆహ్వానంగా భావించగలరు.

## క్లుప్తంగా

### సెలవుపై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**పల్నాడు జిల్లా ఎస్పీకి ఇన్‌చార్జి బాధ్యతలు**

**నగరంపాలెం(గుంటూరు వెస్ట్) :** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఆయన పంజాబ్‌లోని తన స్వస్థలానికి బయలుదేరి వెళ్లారు. తిరిగి ఈనెల 26వ తేదీ సాయంత్రం జిల్లాకు రానున్నారు. ఈ క్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆయన ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు.

### నేటి నుంచి సీఐటీయూ జిల్లా మహాసభలు

**తాడేపల్లి రూరల్ :** సీఐటీయు గుంటూరు జిల్లా 11వ మహాసభలు ఆది, సోమ వారాల్లో తాడేపల్లి పట్టణ పరిధిలో నిర్వహించనున్నారు. మహాసభల నిర్వహణకు సన్నాహాలు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు శనివారం మాట్లాడుతూ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. తొలి రోజు మేకా అమరారెడ్డి భవన్‌లో ప్రతినిధుల సభ, బోసు బొమ్మ సెంటర్ నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, రాష్ట్ర నాయకులు రమాదేవి, గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. లక్ష్మణరావు, దండ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు. కార్మిక వర్గం ఎదుర్కొంటు సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళికను ఈ మహాసభల్లో రూపొందిస్తారని తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు మహాసభలు ప్రారంభం కానున్నాయని, కార్మికులందరూ ఈ మహాసభలకు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

### నేడు పికిల్ బాల్ వర్క్‌షాప్

**గుంటూరు వెస్ట్ (క్రీడలు) :** రోటరీ క్లబ్ ఆదర్శ్, జిల్లా పికిల్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్‌నగర్ ఒకటో లైన్‌లోని వీవీవీ హెల్త్ హబ్‌లో పికిల్ బాల్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆదర్శ్ అధ్యక్షురాలు ఎం. అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. గుంటూరులో పికిల్ బాల్ క్రీడ అభివృద్ధి కోసం ఈ వర్క్‌షాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పికిల్ బాల్ ఆడే విధానం, స్కోర్‌కు సంబంధించిన రూల్స్‌పై ఈ వర్క్‌షాప్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు హెల్త్ హబ్ లో రిపోర్ట్ చేయాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 95533 35375లో ఆనంద్ కుమార్‌ను సంప్రదించాలన్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం

- గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి
- విజ్ఞాన్‌లో న్యాయ సేవలపై అవగాహన శిబిరం

విజ్ఞాన్ యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి

**చేబ్రోలు:** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని, దేశానికి బలమైన స్తంభాలుగా ఎదగాలని గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. సంవిధాన దివాస్ సందర్భంగా 'కాన్‌స్టిట్యూషన్ వీక్ సెలబ్రేషన్స్–2025'లో భాగంగా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా, గుంటూరులోని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీల సంయుక్త ఆధ్వర్యంలో నల్సా నూతన మాడ్యూల్ – అవగాహన శిబిరంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసంఘటిత రంగ కార్మికుల హక్కులు, డ్రగ్ దుర్వినియోగ నివారణ, మోటార్ వాహనాల చట్టం–1988, యాంటీ ర్యాగింగ్ వంటి సామాజిక మరియు న్యాయ సంబంధిత కీలక అంశాలపై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ చట్టాల మీద ప్రతి పౌరుడికి అవగాహన ఉండటం అత్యంత ముఖ్యమన్నారు. చట్టాలను తెలుసుకోవడం వల్లే తమ హక్కులు, బాధ్యతలు ఏంటో ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకోగలరని చెప్పారు. ప్రతి భారతీయుడికి భారత రాజ్యాంగం మన హక్కులు, స్వేచ్ఛలు, విలువలను కాపాడే జీవనశైలిని నేర్పుతుందని వివరించారు.

■ గుంటూరు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కమ్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ జనసామాన్యానికి ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఏయిడ్ క్లినిక్స్, మహిళల–పిల్లల రక్షణ పథకాలపై సమగ్రంగా వివరించారు. సామాన్య ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండేందుకు న్యాయ సేవల అథారిటీ చేపడుతున్న సేవలను వివరించారు. న్యాయ అవగాహన, యువత న్యాయపరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు.

ఈ-శ్రమ కార్డులను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

■ గుంటూరు మొదటి అడిషినల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వై.గోపాల కృష్ణ మాట్లాడుతూ డ్రగ్ దుర్వినియోగం ప్రభావంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువతలో డ్రగ్ అబ్యూస్ తీవ్రమైన సమస్యగా మారుతోందన్నారు. చిన్న వయసులోనే చాలా మంది డ్రగ్ అడిక్ట్స్‌గా మారుతున్నారు. గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి నిషేధిత మాదక ద్రవ్యాలను వాడటం వలన యువత డిప్రెషన్‌లో పడిపోతున్నారన్నారు. ఒంటరిగా ఉండటం, సామాజిక భావన కోల్పోతున్నారన్నారు. కుటుంబాలు, సమాజం, భవిష్యత్తు అన్నీ దెబ్బతింటాయి అని వివరించారు.

■ గుంటూరు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రి సంఘటిత రంగ కార్మికుల సంక్షేమం, కార్మిక చట్టాలపై స్పష్టతనిచ్చారు. వివిధ రంగాల కార్మికులకు అందుబాటులో ఉన్న పథకాల గురించి వివరించారు. అనంతరం మహిళా కార్మికులకు ఈ–శ్రమ్ కార్డులను, పురుషులకు హెల్మెట్లను అందజేశారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటోలను అందజేసారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు పళ్ల విభాగం విజేత కేసానుపల్లి ఎడ్ల జత

**కారెంపూడి:** పల్నాటి ఉత్సవాల సందర్భంగా కారెంపూడిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలలో భాగంగా శనివారం రెండు పళ్ల విభాగంలో పోటీలు నిర్వహించారు. పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు ప్రారంభించారు. ప్రథమ బహుమతిని దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత కైవసం చేసుకుంది. ద్వితీయ బహుమతిని పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలకు చెందిన పొన్నబోయిన విష్ణుభరత్ యాదవ్ జత, తృతీయ బహుమతిని బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజశ్రీరెడ్డి, ప్రకాశం జిల్లా కంభం మండలం యర్రబాలెంకు చెందిన వెంకటగిరి హేమలతా నాయుడు కంబైన్డ్ జత గెలుచుకున్నాయి. నాల్గవ బహుమతిని నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ ఎడ్ల జత, ఐదో బహుమతిని బెల్లంకొండ మండలం మాచాయపాలెంకు చెందిన గౌరు కార్తికేయ, అమరావతి మండలం గిడుగుకు చెందిన భూపతి శ్రీనివాసరావు కంబైన్డ్ జత కైవసం చేసుకున్నాయి. ఆరో బహుమతిని పల్నాడు జిల్లా మాచవరం మండలం మల్లవోలుకు చెందిన ఘంటా రమ్య నాయుడు ఎడ్ల జత గెలుచుకున్నాయి.

బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఈ ఆరు బహుమతులను కారెంపూడికి చెందిన టీడీపీ నాయకుడు సంగినేడి ధనుంజయ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సంగినేడి బాలకృష్ణ ప్రదానం చేశారు. పోటీలలో పాల్గొన్న మిగిలిన రెండు జతలకు కూడా నగదు బహుమతులను ప్రదానం చేశారు. బహుమతి ప్రదానంలో పంగులూరి అంజయ్య, చప్పిడి రాము కారెంపూడి రైతు సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగినులకు తగిన భద్రత కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన

**నెహ్రూనగర్:** గుంటూరు జిల్లాలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలలో పనిచేసే మహిళా ఉద్యోగినులకు చట్ట ప్రకారం భద్రతతో పాటు మంచి వాతావరణం కల్పించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి పీపీజీ ప్రసూన తెలియజేశారు. శనివారం జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో జిల్లాలోని పరిశ్రమల నిర్వహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశాల్లో సోదరభావంతో ఉంటూ, కుటుంబ వాతావరణం ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వన్ స్టాప్ సెంటర్ లాయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం 2013పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు, పక్కన సీఐ ప్రభాకర్

**నరసరావుపేట టౌన్:** స్వల్ప వివాద నేపథ్యంలో ఓ వ్యక్తిని కాళ్లతో, చేతులతో విచక్షణరహితంగా దాడి చేసి హతమార్చిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నరసరావుపేట ఇన్‌చార్జి డిఎస్పీ ఎం. హనుమంతరావు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈపూరు మండలం అంగుళూరు గ్రామానికి చెందిన అచ్చు కట్ల రాంబాబు ఈనెల 10వ తేదీ సాయంత్రం వినుకొండ పట్టణంలో నిందితులు ఓ మద్యం షాపు వద్ద ఉండగా దారిన పోతూ ఉమ్మి వేశాడని దాంతో తమను చూసి ఉమ్మి వేసినట్లుగా వాళ్లు భావించి వివాదానికి దిగారన్నారు. ఈ నేపథ్యంలో రాంబాబు నిందితులలో ఒకరిపై చేయి చేసుకోవడంతో నలుగురు కలిసి రాంబాబుపై విచక్షణరహితంగా కాళ్లు చేతులతో దాడి చేశారన్నారు. తీవ్ర గాయాలపాలైన రాంబాబు చికిత్స పొందుతూ 13వ తేదీ వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లో మృతి చెందాడన్నారు. గుండె, లివర్‌లపై తగిలిన బలమైన దెబ్బలతోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. ఈ ఘటనకు సంబంధించి లభ్యమైన సీసీ ఫుటేజ్ ఆధారంగా వినుకొండ పట్టణానికి చెందిన పల్లె మరియబాబు, పల్లె వినయ్‌లతో పాటు మరో ఇద్దరు మైనర్ యువకులు దాడిలో పాల్గొన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో వినుకొండ పట్టణ సీఐ బలగాని ప్రభాకర్ పాల్గొన్నారు.

## శ్రీసత్యసాయి అన్నప్రసాద వితరణ

**నరసరావుపేట ఈస్ట్:** శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్, సత్తెనపల్లిరోడ్డు మహాలక్ష్మమ్మ చెట్టు, పల్నాడు బస్టాండ్ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కేంద్రాలలో దాదాపు 8వేల మందికి ప్రసాదం అందించారు. భజన మండలి కన్వీనర్ కూనిశెట్టి సత్యసాయి పర్యవేక్షించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

**ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు**

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

**మంగళగిరి టౌన్:** ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ ముఠా గుట్టురట్టయింది. మంగళగిరిలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఐదుగురు ముఠా సభ్యులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 ల్యాప్‌టాప్‌లు, 32 సెల్‌ఫోన్లు, 22 బ్యాంక్ ఖాతా పుస్తకాలు, 11 చెక్ బుక్కులు, 30 ఏటీఎం కార్డులతో పాటు కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ శనివారం వెల్లడించారు. మంగళగిరి మండల పరిధిలోని చినకాకాని గ్రామం ఎన్ఆర్ఐ ఆసుపత్రి వెనుక ఉన్న ఎస్‌వీఎన్ రెసిడెన్సీలోని ఓ ఫ్లాట్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోందంటూ సమాచారం రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకట్ తన సిబ్బందితో 17వ తేదీ సాయంత్రం దాడిచేశారు. ఫ్లాట్‌లో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న కొక్కిలిగడ్డ యేసన్నను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అక్కడేఉన్న బాలు, ప్రవీణ్, సూర్య అనే ముగ్గురు పారిపోయారు. ఈ ముగ్గురితో పాటు మనో (మనోహర్)ను మంగళగిరి ఎన్ఆర్ఐ వై.జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. భారీగా ఫేక్ బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేస్తూ బెట్టింగ్ వెబ్‌సైట్‌కు లింక్ చేసి క్రికెట్ బెట్టింగ్‌ద్వారా ఆర్థిక నేరాలకు బెట్టింగ్ ముఠా సభ్యులు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కేసులో మనో (మనోహర్)ను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. అతడు పలువురి ఆధార్ కార్డులు సేకరించి, వారి పేరుపై సిమ్ కార్డులు తీసుకుని, పలు బ్యాంకుల్లో సుమారు 30 ఖాతాలు ఓపెన్ చేశాడు. ఈ పని చేయడం కోసం ఎన్ఆర్ఐ వెనుక ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని సూర్యప్రకాష్, ప్రవీణ్, బాలు, యేసన్నలను తన దగ్గర జాబ్ ఉందంటూ పెట్టుకున్నాడు. ఈ వ్యవహారాన్ని నడిపే క్రమంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు నిఘా పెట్టి చాకచక్యంగా తొలుత ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించి మిగిలిన వారిని అరెస్ట్ చేశారు. వారి బ్యాంకులావాదేవీల నుంచి రూ.6.30లక్షలను బ్లాక్ చేశారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్ఐ వెంకట్, పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, ఎస్ఐ సిహెచ్ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

## 29, 30 తేదీల్లో 'స్వరలయ తెనాలి ఉత్సవ్'

ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన సాయి లక్కరాజు

**తెనాలి:** పట్టణ సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక 27వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 29, 30 తేదీల్లో తెనాలిలో జరగనున్నాయి. స్వరలయ తెనాలి ఉత్సవ్ పేరుతో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. మారిసుపేటలోని స్వరలయ వేదిక కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. స్వరలయ తెనాలి ఉత్సవ్ పేరుతో ఈనెల 29, 30 తేదీల్లో తమ సంస్థ 27వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 29వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఏర్పాటయ్యే సభలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రంగాల్లోని ప్రముఖులు 60 మందికి పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు. 30వ తేదీ ఉదయం సాహిత్య సభ, సాహితీ మూర్తులకు సత్కారాలు, కత్తిసాము, కర్రసాము గౌరవ ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. సాయంత్రం తెనాలికి చెందిన సినీ కవులైన మోదుకూరి జాన్సన్, బొల్లిమంత శివరామకృష్ణ, వేటూరి సుందరరామ్మూర్తి రచించిన గీతాలతో సంగీత విభావరి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రచయిత పొన్నపల్లి గోపాలకృష్ణ, రావిపాటి ప్రేమ్, నటుడు మల్లేశ్వరరావు, రఘునాథరావు, అయినాల మల్లేశ్వరరావు, తిరుమలరావు, జాలాది ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## భార్యను హత్యచేసిన భర్త అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

**మంగళగిరి టౌన్:** వివాహేతర సంబంధం నేపథ్యంలో భార్యను హతమార్చిన భర్తను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్‌చేశారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. పిఠాపురానికి చెందిన శివశంకర్‌రెడ్డి విజయవాడ పెనమలూరుకు చెందిన శివపార్వతి (29)ని ఐదు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుని కొద్దికాలం విజయవాడలో కాపురం ఉన్నారు. అప్పటికే వ్యాపారంలో నష్టం రావడంతో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈక్రమంలో శివపార్వతికి మంగళగిరి చినకాకాని గ్రామానికి చెందిన ఓ ఎలక్ట్రీషియన్‌తో పరిచయం ఏర్పడింది. భార్యభర్తలు విడిపోగా ఐదు నెలల క్రితం ఎలక్ట్రీషియన్‌తో కలసి మంగళగిరి మండల పరిధిలోని యర్రబాలెంలో ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తోంది. భార్యకోసం వెతికే క్రమంలో యర్రబాలెంలో ఉంటోందన్న సమాచారం తెలుసుకున్న శివశంకర్‌రెడ్డి ఎవరూ లేని సమయంలో నేరుగా ఇంట్లోకి వెళ్లి శివపార్వతి గొంతు నులిపి హత్యచేసి పరారయ్యాడు. ఈ ఘటనపై మృతురాలి బంధువులు ఫిర్యాదుచేయగా రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం దర్యాప్తు ప్రారంభించి శనివారం నిందితుడు శివ శంకర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐఏఎల్ మోడల్ పరీక్ష విజయవంతం

మోడల్ పేపర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

**గుంటూరు లీగల్:** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) గుంటూరు జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో గుంటూరు బార్ అసోసియేషన్‌లోని జస్టిస్ లావు నాగేశ్వరరావు మీటింగ్ హాల్‌లో ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ మోడల్ పరీక్ష శనివారం నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం1.30 గంటల వరకు జరిగింది. మోడల్ పరీక్ష పత్రాలను గుంటూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మోతుకూరి శ్రీనివాసరావు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారావు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పర్చూరు కుమారి నంద, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధ సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు కొండవీటి శ్రీనివాసరావు, మంత్రి బాలకృష్ణ, న్యాయవాది కె.శ్రీలక్ష్మి తిరుపతమ్మల చేతుల మీదుగా అభ్యర్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఐ.ఏ.ఎల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారావు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో మోడల్ పరీక్షను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నెల 30న జరగనున్న ఏఐబీఈ పరీక్ష రాయడానికి ఇది ఉపయోగపడుతుందని వెల్లడించారు. న్యాయవాదులు కె.నరసింహం, హేమ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీల కరపత్రం విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ నాతాని, పీడీ ఆదిబాబు

**నరసరావుపేట ఈస్ట్:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు చెప్పారు. పోటీల కరపత్రాలను శనివారం వారు విడుదల చేశారు. పోటీలలో భాగంగా వర్సిటీ టీమ్‌ను ఎంపిక చేస్తారని వివరించారు. పోటీలు నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీలను ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట), డాక్టర్ చదలవాడ అరవింద బాబు (నరసరావుపేట), వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ రామినేని శివరామప్రసాద్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల జట్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**నలుగురికి తీవ్రగాయాలు**

**రెంటచింతల:** గోలి గ్రామ శివారులో ఉన్న నాగమయ్యస్వామి దేవస్థానం సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం హాలియాకు చెందిన కంటోజు పరిపూర్ణాచారి(42) తన అన్న శ్రీనివాసచారితో కలిసి గురజాల మండలం గొట్టిముక్కల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న చెల్లెలు భర్త గోవిందాచారిని పరామర్శించారు. వారు తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామం హాలియా వెళ్తున్న సమయంలో నాగమయ్య దేవస్థానం సమీపంలో సమాధానపేటకు చెందిన వేల్పుల నరేంద్ర, జొన్నలగడ్డ సంతోష్, గుంజరి వెంకటేష్ ముగ్గురు మరో ద్విచక్రవాహనంపై వేగంగా వస్తూ బలంగా ఢీకొనడంతో రెండు వాహనాలపై నున్న ఐదుగురు కిందపడ్డారు. ప్రమాదంలో పరిపూర్ణాచారి తల బలంగా రోడ్డుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని ఏపీ జన్‌కో అంబులెన్స్ వాహనంలో మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని నరసరావుపేటకు తరలించారు. పరిపూర్ణాచారికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ సీహెచ్ నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


## సాక్షి సండే క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

■ గుంటూరుసిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ. సంప్ర: జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. 9492770739

**FLAT FOR SALE**

■ Sathya Classic Apartment, Flat No: 101, East Facing, 3 BHK (1345SF), 6/19 Brodipeta, Guntur ✆ 9742258945, 9440434223

**OLD BUILDINGS**

■ పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగలగొట్టబడును. పాత కలప, కిటికీలు పాత ఐరన్ కొనబడును. సంప్ర।। 97032 90782, 9700442419

**TOLET**

■ గుంటూరు సిద్ధార్థ నగర్ 2వలైన్ నందు ఉత్తరం ఫేసింగ్ డూప్లెక్స్ 4BHK Fully Furniture, 3 కార్ పార్కింగ్ ఇల్లు అద్దెకు కలదు. అద్దె నెలకు రూ.60,000/- సంప్ర।। 9849719999

**SERVICES**

**BOREWELLS**

■ విజయ బోర్‌వెల్స్: 4-1/2, 6-1/2, 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. గుంటూరు. సంప్ర।। 9866222717, 9848183887

**WANTED**

■ వాంటెడ్ పురుషులు కావలెను. వయస్సు 20-44 సం।।లు, గుడ్ శాలరీ / 8hr డ్యూటీ + ESIC + PF + 4 W/O's ఫ్రీ జాబ్స్, నో ఫీజ్, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్. B.వరప్రసాద్ EG Dist. 9100028528

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్, వార్డెన్స్‌గా పని చేయుటకు స్త్రీలు కావలెను. జీతము ।10,000/- నుండి 13,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనం, వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్. 9100024059

■ ప్రముఖ ఎక్స్‌పోర్ట్ కంపెని నందు పనిచేయుటకు అనుభవం కలిగిన స్త్రీ/పురుష ఫుల్‌టైం అకౌంటెంట్ కావలెను. సంప్ర।। ఎస్.కోటేశ్వరరావు. 9642340054

■ Wanted.. Wanted primary lady Prinicpal / Vice Principal/ AO/ incharge and Lady English, Maths, EVS and Mother teachers, Apple Techno School, Krishna Babu Nagar, Gujjanagundla, Guntur. Contact: 6301036083

■ గుంటూరు అమ్మ ప్రాణదానం గ్యాస్ట్రో అండ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో పని చేయుటకు ఆయాలు,ఏఎన్ఎం,జీఎన్ఎంనర్సులు,కాంపౌండర్లు, బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఫార్మ్-డి, న్యూట్రీషన్ చదివిన వారు కావలెను. సం।। 9573399265

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు సీనియర్ అకౌంటెంట్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 30,000/- నుండి 35,000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: B.Com / M.Com, M.S Office, వయస్సు: 30-45 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్. 8978480429

■ ఆఫీసు మేనేజర్ కావలెను. పిజి, అడ్మినిస్ట్రేషన్‌లో 8సం।।ల అనుభవం, కంప్యూటర్ డ్రాఫ్టింగ్ స్కిల్స్, 40సం।।ల లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ ప్రముఖ మార్కెటింగ్ సంస్థ వెంకటేశ్వర ఎస్టేట్ నందు నరసరావుపేటలో మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు కావలెను. మంచి జీతం+ఇన్సెంటీవ్స్.8978057827, 8106264847

■ Wanted MBA Marketing / Business Development / supply chain management to work a reputed company at Guntur. mini 2 years experience. Contact: 91333 99257

■ Paparao High School, K.Uppalapadu, Prakasam(dt). Wanted High School telugu Teacher & Primary Hindi Teacher & PET (Male & Female), Female Wardens. Free Boarding & Lodging. Salary Negotiable. Cont.7019326579,9392182210

■ రామకృష్ణ గ్రూప్ (AP No-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ16-18వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 9603203355, 8247500574.

■ రామకృష్ణ గ్రూప్ (AP No-1), HYD, VJA, Delhiకు టెలికాలర్లు, కస్టమర్‌కేర్, అన్ని రకాల ఆఫీస్ స్టాఫ్ (స్త్రీ/పు) కావలెను. భో+వ+జీతం. ఇంటర్వ్యూ: VJA. ✆ 9502501122, 9676901122

■ కేర్ టేకర్స్ (జీతం: మగ 20 వేలు; ఆడ 18 వేలు), నర్సులు (25 వేలు). పేషంట్ ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కావలెను. Eminence హోమ్ కేర్ విజయవాడ. ✆ 97018 57559, 78158 35561

■ 10th చదివిన షాప్‌లో డెలివరీ బాయ్స్ మరియు Tally అనుభవం కలిగి సేల్ డేటా ఎంట్రీతో పాటు గుమస్తా వర్క్ చేయుటకు కావలెను. 8142842888, 8639348560

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం:20-25,000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671

■ గుంటూరు సిటీలోని సత్యదయ అసోసియేట్స్ నందు జాబ్ చేయుటకు మండలాల వారీగా స్త్రీ/ పు కావలెను. 9912059165

■ సివిల్ కాంట్రాక్ట్ కంపెనీ నందు పని చేయుటకు సివిల్ ఇంజనీర్ మరియు సైట్ లో పనిచేయుటకు ఐటిఐ ఇంజనీర్ కావలెను. 9951052345

■ కావలెను. గుంటూరు సిటీ, కొత్తపేట, మెడికల్ ఏజెన్సీ నందు 10th / Intermediate అర్హత కలిగిన ఆఫీస్ బాయ్స్ కావలెను. సంప్ర: 99499 44577

■ గుంటూరు అంకిరెడ్డిపాలెంలో రోడ్డు ప్రక్కనే 150 గజాల స్థలం అమ్మకమునకు కలదు. తక్షణమే ఇల్లు నిర్మించుకోవచ్చు. 9390011971, 9396242802

■ నరసరావుపేట లోని ప్రముఖ అడ్వకేట్ ఆఫీస్ నందు Field work మరియు Legal Opinions టైప్ చేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ 9398335959

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్, క్లాసు ఇన్‌ఛార్జ్‌స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14వేలు నుండి 21వేలు వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు : ఇంటర్ నుండి పిజి వరకు వయస్సు 22 సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480429

■ సోలార్ టెక్నాలజీ గుంటూరులో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ టెలికాలర్స్ 3సం।। అనుభవం గలవారు కావలెను. అర్హత: ఐటిఐ, డిగ్రీ. 7981187970

■ Dabbawalaaలో సేల్స్ మేనేజర్స్/ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Salary : 24,000-36,000 (ఫీల్డ్ వర్క్) Ph : 9494324112

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమం హైదరాబాదులో లేడీ వంట మనుషులు,లేడీసూపర్ వైజర్స్, లేడీకేర్ టేకర్స్, నర్సులు,కాంపౌండర్స్, ఆయాలు, వాచ్‌మేన్స్ భార్యాభర్తలు కావలెను. 8985114453, 9391038931

■ విలేకర్లు కావలెను. ఆంధ్ర డైరీ దినపత్రికకు గుంటూరు ప్రకాశం జిల్లాలకు స్టాఫ్, డివిజన్ రిపోర్టర్లు, ఆఫీస్ నిర్వాహకులు, యాడ్ స్టాఫ్ కు 20k+ జీతం+ అక్రిడేషన్ అనుభవజ్ఞులు సంప్రదించండి: సబ్‌ఎడిటర్ ధన్‌రాజ్. సెల్: 94919 57882.

■ చీరాల పట్టణములో నూతనంగా ప్రారంభం కానున్న వజ్రపూర్ణ ఆర్గానిక్ స్టోర్ నందు పనిచేయుటకు మహిళలు కావలెను ఆసక్తి కల మహిళలు సంప్రదించండి. Ph:98668 99390.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్స్)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటి విశ్వసనీయతను పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## క్లుప్తంగా

### ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపును ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన శనివారం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు నూతన ఆధార్, కార్డులో తప్పొప్పుల సవరణకు అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటివరకు నూతన ఆధార్ కోసం తొమ్మిది మంది నమోదు చేసుకున్నట్లు చెప్పారు. 122 మంది బయోమెట్రిక్, 57మంది డెమోగ్రాఫిక్, 19 మంది ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ డీఏ రాంబాబు, మహిళా పోలీసు సౌజన్య పాల్గొన్నారు.

### సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

మంత్రి నారాయణ

తాడికొండ/ తాడేపల్లి రూరల్ : సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం సీడ్ యాక్సిస్ రోడ్డులో కొండవీటి వాగు, గుంటూరు చానెల్ ,బకింగ్ హాం కెనాల్స్‌పై నిర్మిస్తున్న బ్రిడ్జిలను పరిశీలించారు. 16 వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానం చేయడంలో కీలకమైన సీడ్ యాక్సిస్ రోడ్డుకు పెనుమాక, ఉండవల్లిలో ల్యాండ్ పూలింగ్‌కు రైతులు భూమి ఇవ్వకపోవడంతో పనులు నిలిచాయి. ఆటంకంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. విజయవాడ నుంచి రాజధానికి కరకట్ట మీదుగా వెళ్లే అవసరం లేకుండా త్వరితగతిన సీడ్ యాక్సిస్ రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కొండవీటి వాగు ఎత్తిపోతల వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. రాజధాని పరిధిలోని రహదారులను అభివృద్ధి చేసి కనెక్టివిటీని మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్టీల్ బ్రిడ్జి నిర్మాణం సందర్భంగా తాడేపల్లి కేవీల్ రావు కాలనీలో ఇళ్లు కోల్పోయే పేదలకు స్థలాలు కేటాయించడంతో పాటు నష్టపరిహారాన్ని అందించినట్లు తెలిపారు.

### ముస్లింల పైనే అక్రమ కేసులు ఎందుకు ?

అధికారులను ప్రశ్నించిన మత పెద్దలు

తాడికొండ: పంచాయతీ చెరువు కట్టపై రెండు వర్గాల ఆలయాలు నిర్మిస్తుంటే కూల్చివేసిన అధికారులు, 15 మంది ముస్లింల పైనే అక్రమ కేసులు ఎందుకు బనాయించారని నాయకుడు జఫ్ఫర్దీన్, పలువురు మత పెద్దలు ప్రశ్నించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల తాడికొండ చెరువు కట్టపై పోటీపోటీగా నిర్మించిన భజన మందిరం, మసీదు నిర్మాణాలను అధికారులు కూల్చివేసిన ఘటనలో తమపై అక్రమంగా కేసులు బనాయించారని ఆరోపించారు. మసీదుకు స్థలం కేటాయించినట్లు పంచాయతీ పాలకవర్గం వేసిన శిలాఫలకం కూడా తొలగించడం దుర్మార్గమని ఖండించారు. భవనం మొదలు పెట్టినపుడే నిలిపివేసి ఉంటే ఇబ్బందులు ఉండేవి కాదని వాపోయారు. సాయిబాబా మందిరానికి రెండు సెంట్లకు అనుమతులు తీసుకొని, 72 సెంట్లలో నిర్మించారన్నారు. అయినా తాము వ్యతిరేకించలేదని, మసీదు నిర్మాణానికి కొద్ది స్థలం ఇవ్వడానికి ఇంత రాద్ధాంతం ఎందుకని ప్రశ్నించారు. అధికారులు స్పందించి మసీదుకు స్థలం కేటాయించాలని ముస్లిం మత పెద్దలు కోరారు.

### ట్యాంక్‌బండ్‌పై గౌతు లచ్చన్న విగ్రహం ప్రతిష్టించాలి

తెనాలిటౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు, రైతు బాంధవుడు సర్దార్ గౌతు లచ్చన్న నిలువెత్తు విగ్రహాన్ని తెనాలి ట్యాంకు బండ్‌పై ప్రతిష్టించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. స్థానిక బోసురోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను బీసీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. శంకరరావు మాట్లాడుతూ ఉద్యమకారుడు, రైతుల పెన్నిధి గౌతులచ్చన విగ్రహాన్ని బండ్‌పై ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కుర్రా శ్రీను, తుళ్లూరు శ్రీనివాసరావు, కేసన స్వాములు, సి.హెచ్.సురేష్, పి.అయ్యప్ప, బి.సురేష్, సీహెచ్.వసి, మన్యం సాయి తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు వైద్య విద్య మిథ్య

- ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త డీవీఆర్
- పేదలను కొట్టి పెద్దలకు పెడుతున్న చంద్రబాబు
- ప్రైవేటీకరణను అడ్డుకునేందుకే కోటి సంతకాల ఉద్యమం

సంతకాల సేకరణలో ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త డీవీఆర్, నాయకులు

మంగళగిరి టౌన్: చంద్రబాబునాయుడు ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ పేద వైద్యవిద్యార్థులకు అన్యాయం చేస్తోందని, అదే జరిగితే వైద్య విద్య మిథ్య అని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళగిరి పట్టణ పరిధిలోని 26వ వార్డులో తమ్మిశెట్టి రామకృష్ణ బజార్‌లో వార్డు అధ్యక్షులు పఠాన్ బాజీ ఆధ్వర్యంలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త డీవీఆర్‌లు పాల్గొని వార్డులో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల జరిగే నష్టాలను, జరుగబోయే మోసం గురించి వివరిస్తూ సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా మురుగుడు, డీవీఆర్‌లు మాట్లాడుతూ పేదలను కొట్టి పెద్దలకు పెట్టే నైజం చంద్రబాబుదని విమర్శించారు. ప్రైవేటు వైద్యానికి పేదవాడు వెళితే ఎలా పీడిస్తారో అందరికీ తెలుసన్నారు. అందుకే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను, ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. పేదవాడు ఎదగడం ఇష్టంలేని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే కుట్రపూరితంగా పీపీపీ పద్ధతిని ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. ప్రజా వ్యతిరేక విధానాలకు చంద్రబాబు సర్కార్ పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల హక్కు అయిన ప్రభుత్వ వైద్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆకురాతి రాజేష్, మొహమ్మద్ ఫిరోజ్, మాతంగి బాబు, తమ్మిశెట్టి గౌతమి, సంకె సునీత, సుధారాణి, సుబ్బారావు, షేక్ మహబూ, చక్రవర్తి, రవి, నాగరాజు, సురేష్, ఉదయ్‌కుమార్, నాగుల్‌మీరా, రాంబాబు, శ్వేత పూర్ణిమతో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### సంతకాల సేకరణ విజయవంతం

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మంగళగిరి మండల పరిధిలోని యర్రబాలెంలో శుక్రవారంతో విజయవంతమైంది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో యర్రబాలెం గ్రామ అధ్యక్షులు లేళ్ల శివ, నాయకులతో కలసి నియోజకవర్గ కార్యాలయంలో శనివారం సంతకాల సేకరణ పత్రాలను సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డికి అందజేశారు. యర్రబాలెంలో మూడు వేల సంతకాలు సేకరించారని, సహకరించిన ప్రతి ఒక్కరిని వేమారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ–2 అధ్యక్షులు షేక్ బడే మియా, నాయకులు షేక్ గౌస్, షఫీ, నాగేశ్వరరావు, శంకర్, ఇందిరాదేవి, అనిత, జిలానీ బాషా, నాగయ్య, ఆసిఫ్, శ్రీరాములు, జాన్, ప్రియానంద, సయ్యద్ బాషా, అబ్దుల్ కలాం, సాంబశివరావు, బంగారయ్య, పూలు రాజు పాల్గొన్నారు.

## కార్మికుల కష్టార్జితాన్ని దోచుకోవడం అన్యాయం

శిబిరం వద్ద కార్మికులతో మాట్లాడుతున్న స్టీవెన్

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాన్ని యాజమాన్యం దోచుకోవడం అన్యాయమని యూనియన్ నాయకులు కె. స్టీవెన్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 సంవత్సరాల కిందట సిమెంట్ ఫ్యాక్టరీకి యాజమాన్యం అక్రమంగా లాకౌట్ ప్రకటించిందని, ఆనాటి నుంచి కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్మికులు దీక్షలు ప్రారంభించి 354 రోజులు అయ్యిందని, కానీ ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులకు రావాల్సిన బకాయిలు మాత్రం యాజమాన్యంతో చర్చలు జరిపి ఇప్పించలేకపోతున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేష్ స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. దీక్షల్లో మహిళలు శారమ్మ, రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి, హగ్గయ్య, నాయకులు సుభాని, సాంబశివరావు, ఆశీర్వాదం, అంకయ్య, గురవయ్య, ఏసోబు పాల్గొన్నారు.

## స్వమిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

సర్వేను పరిశీలిస్తున్న డెప్యూటీ ఎంపీడీఓ కె.జె.నెప్రూా

దుగ్గిరాల: గ్రామ కంతాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలను గుర్తించేందుకు చేపట్టిన స్వమిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డెప్యూటీ ఎంపీడీఓ కె.జె.నెప్రూా సిబ్బందికి సూచించారు. మండలంలోని ఈమని గ్రామ సచివాలయంలో శనివారం సర్వే పురోగతిని ఆయన మండల సర్వేయర్ గోపాలరావుతో కలసి పరిశీలించారు. సర్వే చేస్తున్న విధానం, ఎంత మేర గ్రామంలో నిర్వహించారు అనే అంశాలను తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి సచివాలయ సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. నిర్ణయించి సమయానికి విధిగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

## పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నగర ప్రజలకు పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని, యాప్‌ను మొబైల్ ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి నుంచే మున్సిపల్ సేవలను పొందవచ్చని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా శనివారం పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా ప్రజలకు పారదర్శకమైన సేవలు అందుతాయని తెలియజేశారు. సమస్యలను ఫొటో లేదా వాయిస్ ద్వారా పంపించే అవకాశం ఉంటుందని, రియల్‌టైమ్ ఫిర్యాదు, తక్షణ స్పందన, ఫిర్యాదు పురోగతిని ట్రాక్ చేయవచ్చని తెలిపారు. అప్‌లోడ్ చేసిన ప్రతి సమస్య పరిష్కారానికి నిర్దిష్టమైన గడువు ఉంటుందన్నారు. యాప్‌లో మొత్తం ఎనిమిది విభాగాలు ఉండగా, 119 రకాల సేవలను ప్రజలు ఉపయోగించుకునే విధంగా రూపొందించబడిందని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే అవసరం లేకుండా ఇంట్లోంచి సమస్యలకు త్వరగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## రేపు సఖీ సురక్ష హెల్త్ క్యాంప్

మంగళగిరి టౌన్: పట్టణ పరిధిలోని వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కళావేదికలో సోమవారం నగర పాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సఖీ సురక్ష హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాంప్ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, నగరపాలక సంస్థ పరిధిలోని మహిళలంతా హాజరై అన్ని వైద్య పరీక్షలను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## లేబర్ కోడ్‌లపై కార్మికుల ఆగ్రహం

ఫిరంగిపురంలో ఉత్తర్వుల కాపీలను దహనం చేస్తున్న కార్మికులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సొలస బస్టాండు సెంటర్లో కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తు సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు శనివారం ఉత్తర్వుల కాపీలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్‌వలి మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ల ప్రయోజనాలకు నాలుగు లేబర్ కోడులను అమలు చేస్తోందని తెలిపారు. భవిష్యత్తు పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఇబ్రహీం, శ్రవణ్‌కుమార్, సతీష్, ఏసు పాల్గొన్నారు.

### కార్మికులు సంఘటితమై ఉద్యమించాలి

మంగళగిరి టౌన్: లేబర్ కోడ్లపై కార్మికులు సంఘటితమై ఉద్యమించాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని పాత బస్టాండ్ వద్ద సీఐటీయూ, మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం కాపీలను దహనం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడడానికి మాత్రమే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. మోదీ కార్మిక వ్యతిరేక విధానాలపై, లేబర్ కోడ్‌లను రద్దుచేసే వరకు కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సీఐటీయూ నాయకులు జె.వి. రాఘవులు, కమలాకర్, మున్సిపల్ యూనియన్ నాయకులు వెంకటేశ్వరమ్మ, శివనాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు శ్రీనివాసరావు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

### లేబర్ కోడ్‌లను తక్షణం ఉపసంహరించుకోవాలి

తాడికొండ: బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తక్షణం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో శనివారం నిరసన అనంతరం లేబర్ కోడ్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాజధాని డివిజన్ నేతలు ఎం. భాగ్యరాజు, ఎం. రవి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శుక్రవారం నోటిఫై చేసిన లేబర్ కోడ్స్ కార్మికులకు ఉరితాళ్లుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ వల్ల కార్పొరేట్లకు, కంపెనీల యజమానులకు కార్మికులు కట్టు బానిసలుగా మారతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే కార్మిక వర్గం నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పేరం బాబూరావు, ఎన్. లక్ష్మణ్, జె. నరేష్, షేక్ జానీ నాగూర్ పాల్గొన్నారు.

## ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

తాడికొండ: తుళ్లూరు మండల రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సమావేశాన్ని శనివారం రాయపూడిలోని ఎస్‌కేడీ జడ్పీహెచ్ స్కూల్‌లో నిర్వహించారు. ఎస్టీయూ నాయకులు పి. దిబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నిక పరిశీలకులుగా దేవరాజు, రాష్ట్ర కౌన్సిలర్ రాజు హాజరయ్యారు. సంఘ నిర్మాణం, ఉపాధ్యాయుల సమస్యలు, సభ్యత్వ నమోదు పెంపుదల, పలు అంశాలపై సుదీర్ఘ చర్చ నిర్వహించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి నివేదిక , ఆర్థిక నివేదికను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షులుగా పి. దిబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా బి. కృష్ణారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా వి. సురేష్, గౌరవాధ్యక్షులుగా పద్మావతి, మహిళా కన్వీనర్‌గా భవానీలను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు డి. పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా డి. సుబ్బారెడ్డి, రాష్ట్ర అదనపు కార్యదర్శిగా కె. జోజప్ప, రాష్ట్ర కౌన్సిలర్ కె. శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్లు ఎ జగన్. బాలకిశోర్ పాల్గొన్నారు.

## మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి నారాయణ

తాడికొండ: సీఆర్డీఏ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం ప్రధాన కార్యాలయంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. బ్యాచ్‌కు 55 మంది మహిళలు చొప్పున ఉండవల్లిలో రెండు, మందడంలో ఒకటి, అనంతవరంలో ఒకటి, శాఖమూరులో ఒక బ్యాచ్‌కు మిల్లెట్స్‌తో తినుబండారాలు, జావ, వివిధ రకాల పొడులు, ఇతర పౌష్టికాహారం తయారీపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా సీఆర్డీఏ కార్యాలయంలో 'అమరావతి అమ్మ వంట' పేరుతో శనివారం తినుబండారాల స్టాల్‌ను శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అడిషనల్ కమిషనర్ ఏ. భార్గవతేజ స్టాళ్లను సందర్శించారు. తినుబండారాల రుచి బాగుందని అభినందించారు. రానున్న కాలంలో అమరావతిని ప్రపంచస్థాయి మౌలిక వసతులతో నిర్మిస్తున్నామని అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవతేజ తెలిపారు. స్థానిక మహిళలు, యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సీఆర్డీఏ ఆధ్వర్యంలో మరిన్ని శిక్షణ, స్వయం ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

## నేడు పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ వార్షికోత్సవం

తెనాలి టౌన్: స్థానిక ముత్తెంశెట్టిపాలెంలోని ది పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ 30వ వార్షికోత్సవం, జనరల్ బాడీ సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు సొసైటీలో గల కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షులు జొన్నాదుల నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వి.బాలస్వామి విచ్చేయనున్నట్లు వివరించారు. కార్యవర్గసభ్యులు, సంఘీయులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## విశ్రాంత స్టాఫ్ నర్సు ఇంట్లో చోరీ

తెనాలి రూరల్: విశ్రాంత స్టాఫ్ నర్సు ఇంట్లో చోరీపై కేసు నమోదైంది. వివరాలు..... పట్టణ హయ్యరుపేటకు చెందిన మంచు విమలమ్మ స్టాఫ్‌నర్సుగా చేసి రిటైరయ్యారు. అక్టోబర్ 26న చర్చికి వెళ్లి వచ్చి ఆభరణాలను తీసి ఇంట్లో పెట్టారు. తిరిగి ఈ నెల 2న చర్చికి వెళ్లేందుకు చూడగా కనబడలేదు. శనివారం రాత్రి టూ టౌన్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

# మనోవికాసానికి ఆటలు దోహదం

విద్యార్థులతో హెచ్‌ఎం,ఉపాధ్యాయులు

ఫిరంగిపురం: విద్యార్థుల మనోవికాసానికి ఆటలు దోహదం చేస్తాయని సెయింట్ ఆన్స్ తెలుగు మీడియం పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ వొట్టి థెరసమ్మ అన్నారు. మండల కేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, జానపద పాటలు, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల, మెహిందీ పోటీల్లో సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు 16మంది ఉత్తమ ప్రతిభ చూపి బహుమతులు, సర్టిఫికెట్లను శుక్రవారం అందుకున్నారు. పాఠశాలలో శనివారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సిస్టర్ షీలా, ఉపాధ్యాయులు జి. ఇన్నారెడ్డి, కార్మెల్, నిర్మలామేరి, సుందరి పాల్గొన్నారు.

## ఇప్పటంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులతో మాట్లాడున్న తాడేపల్లి ఏవో శిరీష

తాడేపల్లి రూరల్: మండలంలోని ఇప్పటం రైతు సేవా కేంద్రంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి శిరీష మాట్లాడుతూ తాడేపల్లి రూరల్ పరిధిలో రైతులు 1,540 ఎకరాలలో వరి సాగు చేశారని తెలిపారు. ప్రభుత్వం గ్రేడ్ ఎ రకం 75 కేజీల బస్తాకు మద్దతు ధర రూ. 1,792, సాధారణ రకానికి రూ. 1,779గా నిర్ణయించిందని పేర్కొన్నారు. ధాన్యం అమ్మదలచని రైతులు రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏను సంప్రదించాలని, కొనుగోలుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. మట్టి,రాళ్లు ఉంటే 1శాతం, చెడిపోయిన లేదా రంగుమారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యానికి 1 శాతం, పరిపక్వం కాని, వంకర తిరిగిన ధాన్యానికి 3 శాతం, తేమ లేక నెమ్ము ఉన్న ధాన్యానికి 17 శాతం తరుగు ఉంటుందని ఆమె వివరించారు. రైతులంతా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

# రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

సంఘటనా స్థలంలో వాహనాలు

ఫిరంగిపురం: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఫిరంగిపురానికి చెందిన సాయి స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో అప్రైజర్‌గా పని చేస్తుంటాడు. పని మీద స్కూటీపై వేములూరిపాడు వైపునకు వెళుతున్నాడు. అదే మార్గంలో యడ్లపాడు మండలం పుట్టకోటకు చెందిన కల్యాణ్ ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపునకు వెళుతున్నాడు. వేములూరిపాడు గ్రామ శివారులో రెండు ద్విచక్రవాహనాలు ఒకదానికొకటి ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈసంఘటనలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు స్పందించి కల్యాణ్‌ను గుంటూరుకు 108 వాహనంలో తరలించారు. మరో యువకుడు సాయిని నరసరావుపేటకు చికిత్స కోసం తీసుకు వెళ్లారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం

ఇరుక్కుపోయిన లారీ, కారు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని 16 నంబర్ జాతీయ రహదారిపై కొలనుకొండ వద్ద శనివారం సాయంత్రం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి గుంటూరు వెళుతున్న ఓ కారును కొలనుకొండ రైల్వే బ్రిడ్జి వద్ద అతి వేగంగా వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఆ వేగానికి గుంటూరు వెళుతున్న కారు విజయవాడ వైపునకు తిరిగింది. ముందు భాగాన్ని లారీ ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఒక టైర్ ఊడి పోయింది. కారులోని నలుగురు ప్రయాణికుల్లో ఒక్కరికి మాత్రమే స్వల్పంగా గాయాలయ్యాయి. 108కు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేశారు. ప్రమాదంతో విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే రహదారిలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. అప్రమత్తమైన ట్రాఫిక్ సీఐ, తాడేపల్లి పోలీసులు, జాతీయ రహదారి సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న కారును, లారీని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సుమారు గంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి పెద్దగా గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## అసైన్డ్ భూములు అన్యాక్రాంతం చేస్తే ఊరుకోం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

దుగ్గిరాల: దళితులు, పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి చంద్రబాబు ప్రయత్నిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. పేదల భూములను కార్పొరేట్లకు అప్పగించే 90/77 అసైన్‌మెంట్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్ షాదీఖానాలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏపీ రైతు సంఘం 3వ మహాసభలో మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 26 లక్షల పేద కుటుంబాలకు గానూ 38 లక్షల ఎకరాలను అసైన్డ్ చేసినట్లుగా ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. చట్ట సవరణ ద్వారా పేదలు భూములను అమ్ముకొనే హక్కును పూర్తిగా కోల్పోతారని చెప్పారు. లంక భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చెత్తకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు

లక్ష్మీపురంలో చెత్తా చెదారంతో ఓ ఖాళీ స్థలం

ఫిరంగిపురం: మండల కేంద్రంలో పలుచోట్ల ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు చెత్తకు నిలయంగా మారాయి. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. నివాసితులు అవస్థలు పడుతున్నారు. యజమానులు కూడా పట్టించుకోకపోవడంతో డంపింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. కొత్తపేట, రైలుపేట, రాజాపేట, లక్ష్మీపురం, తూర్పుబజారు, రసూలుపేట, వసంతనగర్, శాంతిపేట వంటి ప్రాంతాల్లో అనేక స్థలాలు ఇళ్ల మధ్య ఖాళీగా ఉన్నాయి. వాటిలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరిగి, చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. జన సంచారం అంతగా లేకపోవడంతో విషసర్పాలు, తేళ్లు సంచరిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఖాళీ స్థలాల మీదుగా ఇళ్లకు వెళ్లాలంటే భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, మందుబాబులు అక్కడనే కూర్చుని తాగి సీసాలు అక్కడే పడివేస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

## క్లుప్తంగా...

### శ్రీధర్‌రెడ్డి పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయండి

**సీఐడీ సిట్‌కి హైకోర్టు ఆదేశం.. విచారణ 28కి వాయిదా**

**సాక్షి, అమరావతి:** మద్యం అక్రమ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సజ్జల శ్రీధర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు శనివారం విచారణ జరిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీ సిట్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం అక్రమ కేసులో తాను 7 నెలలుగా జుడీషియల్ రిమాండ్‌లో ఉన్నానని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మద్యం విధానంలో తనకు ఎలాంటి పాత్ర లేదన్నారు. తన పాత్రపై ఎలాంటి ఆధారాలు కూడా లేవని తెలిపారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో కోర్టును కోరారు.

### ఉద్యోగులంతా సమష్టిగా హక్కులు సాధించుకోవాలి

**విశాఖ రెవెన్యూ క్రీడాకారులను అభినందించిన బొప్పరాజు**

**మహారాణిపేట (విశాఖ):** హక్కుల సాధనకు ఉద్యోగులంతా సమష్టిగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. శనివారం విశాఖలోని రెవెన్యూ భవనంలో ఏపీ జేఏసీ అమరావతి, రెవెన్యూ అసోసియేషన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 5న ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు.

## శివాలయ భూమిపై సోమిరెడ్డి రియల్టీ రూట్

- దేవాలయ భూమిని అమ్మేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే
- చర్యలకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్
- భక్తులతో కలిసి దేవదాయ కార్యాలయం వద్ద ధర్నా
- పాటలు, భజనలతో భక్తుల వినూత్న నిరసన

వివరాలు వెల్లడిస్తున్న కాకాణి

**నెల్లూరు (బృందావనం):** ముల్లోకాలను పాలించే పరమేశ్వరుడినే మోసం చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. వెంకటాచలం మండలం కాకుటూరులోని శివాలయం భూముల అన్యాక్రాంతంపై నెల్లూరు రంగనాయకులపేటలోని జిల్లా దేవదాయశాఖ కార్యాలయం ఎదుట శనివారం భక్తులు కాకాణి నేతృత్వంలో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. సోమిరెడ్డి చెర నుంచి భూమిని కాపాడమంటూ పాటలు, భజనలతో వినూత్న నిరసన తెలిపారు. అనంతరం జిల్లా దేవదాయశాఖ కార్యాలయానికి భక్తులతో వెళ్లి అసిస్టెంట్ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాకాణి విలేకరులతో మాట్లాడుతూ, 'కాకుటూరులో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రసిద్ధ శివాలయానికి అల్లూరు హరిప్రసాద్‌రెడ్డి 1980లో కాకుటూరులోని సర్వే నంబరు 63/1ఎలో 48 సెంట్ల భూమిని రాసిచ్చారు. ఈ భూమి రికార్డుల్లో ఆలయానికి చెందిన భూమిగానే ఉంది. ఈ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సోమిరెడ్డి కోటి రూపాయలకు దర్జాగా అమ్మేశారు. దీంతో వారు రోడ్డు నిర్మించుకొన్నారు. దీనిని ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అయితే సదరు భూమికి దేవుడు యజమాని కాదని, అది పట్టా భూమి అని తహసీల్దార్‌తో సోమిరెడ్డి స్టేట్‌మెంట్ ఇప్పించారు. టీడీపీ ప్రభుత్వానికి దేవుడిపై నమ్మకం ఉంటే, భక్తుల మనోభావాలు కాపాడాలనుకొంటే సోమిరెడ్డి కాజేసిన దేవుడి భూమిపై విచారణ జరిపించాలి. పైగా సోమిరెడ్డి, ఆయన కుమారుడు శివాలయం భూమిలో లే అవుట్ యజమాని ద్వారా రోడ్డు నిర్మించి, పంచాయతీ నిధులతో నిర్మించినట్లు చూపించి.. పంచాయతీ నిధులు కాజేసేందుకు సైతం సిద్ధపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయించడానికి సిద్ధం. దేవుడి భూమి కాపాడేందుకు భక్తులతో కలిసి వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుంది' అని చెప్పారు. సంబంధిత భూమి ఆలయానికి చెందినది కాదని నిరూపిస్తే తనపై మరో కేసు పెట్టించుకోవడానికి సైతం సిద్ధమంటూ కాకాణి సవాలు విసిరారు.

### సోమిరెడ్డికి తీరని ధనదాహం

'సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి ధన దాహం తీరడం లేదు. ఇసుక, గ్రావెల్, మట్టి, బూడిద దేన్నీ వదలకుండా దోపిడీ పర్వం కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తుల భూమిలో టేకు చెట్లను నరికించడం, దేవాలయాల భూమిని అమ్మేయడం, బూడిద ట్యాంకర్లను దారిదోపిడీ చేయడం, ఆయిల్ అసోసియేషన్‌ను ఆదాయ వనరుగా చేసుకొని వ్యాపారులను బెదిరించడం వంటి ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇరిగేషన్ సబ్జెక్ట్‌లో ఏ మాత్రం అవగాహన లేకున్నా తానేదో నీటిరంగ నిపుణుడిలా మాట్లాడుతూ పబ్బం గడుపుతున్నారు. చందాలు వేసుకొని రైతులు చేసుకొన్న పనులకు సైతం ఇరిగేషన్‌లో దొంగ బిల్లులు చేయించుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రజల ఆస్తులను దోచుకొంటున్న సోమిరెడ్డిని ప్రజలు సమాజం నుంచి బహిష్కరించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి' అని కాకాణి హెచ్చరించారు.

# ఖర్గే ఓటు ఎవరికో!

## బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడి మంతనాలు

- మల్లికార్జున ఖర్గే నివాసానికి క్యూ కట్టిన నేతలు
- ఐదేళ్లూ తానే సీఎం అంటున్న సిద్ధరామయ్య
- ఒప్పందం మేరకు తనను సీఎం చేయాలంటున్న డీకే
- ఏ నిర్ణయం తీసుకుంటే ఏమవుతుందోనని అధిష్టానం తర్జనభర్జన

మత్స్య దినోత్సవం వేదికపై సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మాటామంతీ

**సాక్షి బెంగళూరు/శివాజీనగర/బనశంకరి:** కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య పోటీ తీవ్ర స్థాయికి చేరింది. ఒప్పందం మేరకు తనను సీఎం చేయాల్సిందేనని డీకే గట్టిగా పట్టుబట్టారు. మరోవైపు పూర్తిగా ఐదేళ్లూ తననే సీఎంగా కొనసాగించాలని, అత్యధికంగా ఎమ్మెల్యేల మద్దతు తనకే ఉందని సిద్ధరామయ్య చెబుతున్నారు. శుక్రవారం దాకా ఢిల్లీ కేంద్రంగా ఇరు వర్గాల నేతలు కాంగ్రెస్ అధిష్టానంపై ఈ మేరకు ఒత్తిడి తెచ్చారు. ఈ సమస్యకు త్వరగా పరిష్కారం చూపకపోతే చాలా నష్టపోవాల్సి వస్తుందని గ్రహించిన అధిష్టానం వెంటనే రంగంలోకి దిగింది. ఈ క్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బెంగళూరుకు వచ్చారు. స్వతహాగా కర్ణాటకకు చెందిన మల్లికార్జున ఖర్గేకు ఇక్కడి రాజకీయాలపై పూర్తిగా అవగాహన ఉండడంతో సమస్య పరిష్కారానికి బరిలోకి దిగారు. శుక్రవారం రాత్రి కూడా డీకే శివకుమార్ బెంగళూరులో ఖర్గేతో సమావేశమై చర్చించారు. అధికార మార్పిడికి అంగీకరించాలని డీకే శివకుమార్ ఒత్తిడి చేశారు. డీకే సోదరుడు సురేశ్, డీకే వర్గం ఎమ్మెల్యేలు కూడా శివకుమార్ వెంట ఉన్నారు. వారి డిమాండ్లు, విజ్ఞప్తులను ఖర్గే సావధానంగా విన్నారు. డీకే శివకుమార్ అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రస్తుత రాజకీయ సంక్షోభంపై సుదీర్ఘంగా డీకే శివకుమార్‌తో చర్చించారు.

### సీఎం తాజా ప్రతిపాదన!

సిద్ధరామయ్య శనివారం ఖర్గేతో కలిసి మాట్లాడారు. తననే సీఎంగా కొనసాగించాలని కోరారు. తనకే ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని చెప్పినట్లు సమాచారం. డీకే శివకుమార్ వంటి ప్రభావవంతమైన నాయకుడిని దీటుగా ఎదుర్కొనేందుకు.. ఆయన మద్దతుదారు ఎమ్మెల్యేలు, ఆశావహులను నియంత్రించేందుకు తన వర్గం నుంచి మరో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఉండాలని సిద్ధరామయ్య ప్రతిపాదించినట్లు తెలిసింది. ప్రస్తుతానికి హైకమాండ్ నేరుగా చర్యలు తీసుకోనప్పటికీ బెంగళూరు, ఢిల్లీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. సిద్ధరామయ్య కూడా వరుస భేటీలతో తన వర్గాన్ని బలోపేతం చేసుకుంటుండటం కనిపిస్తోంది.

### ఆచితూచి అడుగులు వేస్తున్న అధిష్టానం

రానున్న రెండున్నరేళ్లు కూడా తానే సీఎం అంటూ సిద్ధరామయ్య వ్యాఖ్యలు చేయడం, ఇందుకు ప్రతిగా 'విష్ యు ఆల్ ది బెస్ట్. సిద్ధరామయ్యకు మంచి జరగాలి' అంటూ డీకే శివకుమార్ కౌంటర్ ఇవ్వడంతో ఈ వివాదం మరింత రాజుకుంది. ఈ నేపథ్యంలో ఎవరికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే ఏ ముప్పు వస్తుందోనన్న తలనొప్పి ప్రస్తుతం హైకమాండ్‌కు ఏర్పడింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఇరు వర్గాలకు అంగీకారయోగ్యమైన నిర్ణయాన్ని తీసుకోవాలని, తద్వారా పార్టీని, ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని ఆచితూచి అడుగులు వేస్తోంది. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఆ తర్వాత ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్ణయాన్ని వెల్లడించాలని చూస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నుంచి బెంగళూరు సదాశివనగరలోని మల్లికార్జున ఖర్గే నివాసం బిజీబిజీగా మారింది. వరుసగా నేతలు భేటీ అయ్యేందుకు తరలివస్తున్నారు. ఖర్గేతో సమాలోచనలు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

### ఒకే వేదికపై సిద్ధరామయ్య, శివకుమార్

కర్ణాటక సీఎం మార్పుపై చర్చ జోరందుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే.శివకుమార్ ఒకే వేదికపై ఆత్మీయంగా మాట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది. బెంగళూరు హెబ్బాళలోని పశు వైద్య మహా విద్యాలయం ఆవరణంలో జరిగిన ప్రపంచ మత్స్య దినాచరణలో వారిద్దరూ కలిసి పాల్గొన్నారు. చేపల పెంపకం, తదితర విషయాలపై శివకుమార్ ముఖ్యమంత్రికి వివరించారు. సిద్ధరామయ్య కూడా ప్రతిస్పందిస్తూ తల ఊపారు.

### కర్ణాటక రాజకీయాల్లో పెను మార్పులు: కుమారస్వామి

రానున్న రోజుల్లో కర్ణాటక రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకుంటాయని కేంద్ర మంత్రి హెచ్‌డీ.కుమారస్వామి జోస్యం చెప్పారు. శనివారం బెంగళూరులో జేడీఎస్ పార్టీ రజతోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం మార్పు అంటూ రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను గమనిస్తుంటే రానున్న రోజుల్లో ఎవరూ ఊహించని రాజకీయ మార్పులు ఖాయం అన్నారు. ఎవరు ఏ నిర్ణయం తీసుకుంటారో చెప్పడానికి వీలులేని పరిస్థితి నెలకొందన్నారు.

# ఇక అన్నింటికీ పీపీపీ మంత్రమే

## సామాజిక మౌలిక సదుపాయాలన్నీ పీపీపీలోనే

**సామాజిక సదుపాయాలను కూడా ప్రభుత్వం చేపట్టదు**

- ఆసుపత్రి, తాగునీరు, రోడ్లు, బస్ స్టాండ్లు, పార్కులు అన్నీ పీపీపీలోనే
- 302 ప్రాజెక్టులను పీపీపీలో చేపట్టేందుకు రంగం సిద్ధం
- నియోజకవర్గాల్లో ఆస్పత్రుల నిర్మాణం ప్రైవేట్‌కు
- సేవా రుసుము ఆధారిత మౌలిక సదుపాయాల కల్పన
- రాష్ట్రంలో వివిధ ఆస్తుల తనఖా ద్వారా పీపీపీలో ప్రాజెక్టులు
- ఇప్పటికే తిరుపతి బస్ టెర్మినల్‌కు రూ.495 కోట్లతో డీపీఆర్ సిద్ధం
- విజయవాడ ఆటోనగర్ బస్ టెర్మినల్‌కు రూ.154 కోట్లతో డీపీఆర్ సిద్ధం
- ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి వినియోగదారుల నుంచి చార్జీలు వసూళ్లు
- ఇదే పీపీపీ విధానం ప్రధాన లక్ష్యం

**సాక్షి, అమరావతి:** ఇక అన్నింటికీ కూటమి ప్రభుత్వం పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం) మంత్రమే జపిస్తోంది. సామాజిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులన్నింటినీ పీపీపీలోనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సామాజిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రభుత్వ రంగంలో చేపట్టకూడదని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఇక ఆసుపత్రులైనా తాగునీరు ప్రాజెక్టులైనా, గ్రామీణ రహదారులైనా, ప్రభుత్వ పార్కులైనా, ఆర్టీసీ బస్ స్టాండ్‌ల అభివృద్ధి వరకూ పీపీపీ విధానంలోనే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రైవేట్ రంగంలో ఆస్పత్రుల నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిన్నా పెద్దా అన్నీ కలిపి పీపీపీలో 302 ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే కొన్నింటికీ డీపీఆర్‌లను సిద్ధం చేయగా మరి కొన్ని ప్రాజెక్టులకు డీపీఆర్‌లు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. సేవా రుసుము ఆధారిత మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగాలని స్వయంగా సీఎం చంద్రబాబు అధికారులకు ఇటీవల జరిగిన పీపీపీ ప్రాజెక్టుల సమావేశంలో స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే వాటి కన్నా సేవా రుసుము ఆధారిత మౌలిక సదుపాయాల సేవలను అందించడం పట్ల పౌరుల ఆలోచనా దృక్పథంలో మార్పు వచ్చిందని, అందుకు అనుగుణంగా సామాజిక మౌలిక సదుపాయాలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు నిర్దేశించారు. అంటే పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టులకు అయ్యే వ్యయాన్ని సేవా రుసుముల ద్వారా రాబట్టుకోనున్నారు. ఇక ప్రభుత్వ రంగంలో ఏ ఆస్పత్రిని చేపట్టరు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో సహా, ఎక్కడైనా ఆస్పత్రులు కావాలంటే పీపీపీ విధానంలోనే చేపడతారు. ఆ నిర్మాణాలకయ్యే వ్యయాన్ని రోగుల నుంచి చార్జీల రూపంలో రాబట్టుకుంటారు. రాష్ట్రంలో 500 కిలో మీటర్ల గ్రామీణ రహదారులను కూడా పీపీపీ విధానంలో చేపట్టనున్నారు. గ్రామీణ రహదారులతో పాటు మిగతా రహదారులన్నీ కూడా పీపీపీ విధానంలో చేపట్టనున్నారు. నిర్మాణ వ్యయాన్ని రుసుముల ద్వారా రాబట్టనున్నారు. ఇక రాష్ట్రంలోని తిరుపతి, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ ఆటోనగర్ వంటి పెద్ద పెద్ద బస్‌స్టాండ్లను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో కొన్నింటికీ ఇప్పటికీ డీపీఆర్‌లను సిద్ధం చేయగా మరి కొన్నింటికీ డీపీఆర్‌లను తయారు చేస్తున్నారు. తిరుపతి ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్‌ను అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.495 కోట్లలో డీపీఆర్‌ను సిద్ధం చేసింది. పీపీపీ విధానంలో తిరుపతి బస్ టెర్మినల్ అభివృద్ధిని ప్రైవేట్ సంస్థకు అప్పగించనున్నారు. అభివృద్ధి చేసిన తరువాత ప్రైవేట్ సంస్థ వినియోగదారుల నుంచి చార్జీలను వసూలు చేయనుంది. అలాగే విజయవాడలోని ఆటోనగర్ ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ అభివృద్ధికి రూ.154 కోట్లతో డీపీఆర్‌ను సిద్ధం చేసింది. దీన్ని కూడా పీపీపీలో ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టనున్నారు. ఆ ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసి వ్యయాన్ని వినియోగదారుల నుంచి చార్జీల రూపంలో రాబట్టుకోనుంది. చిత్తూరులో ఆధునిక బస్‌స్టాండ్‌తో పాటు బహుళ వాణిజ్య కాంప్లెక్స్‌ను పీపీపీ విధానంలో చేపట్టనున్నారు. వివిధ స్థానిక సంస్థల ఆధ్వర్యంలోని పార్కులను పీపీపీలో అభివృద్ధి చేయనున్నారు. అలాగే పర్యాటక ప్రాజెక్టులతో పాటు వ్యవసాయ రంగంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, కోల్డ్ స్టోరేజీలను పీపీపీ విధానంలో చేపట్టనున్నారు. పారిశ్రామిక పార్కులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. సెమీ కండక్టర్లు, ఈ-మొబిలిటీ, ఎలక్ట్రానిక్స్, డ్రోన్లతో సహా ఏరోస్పేస్ రంగాల్లో ప్రాజెక్టులను పీపీపీ విధానంలో చేపట్టనున్నారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులను పీపీపీ విధానంలో త్వరగా చేపట్టి పూర్తి చేసేందుకు అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం చంద్రబాబు నిర్దేశించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పీపీపీ ప్రాజెక్టులకు వయబులిటీ గ్యాప్ నిధులను కేంద్ర ప్రభుత్వం అందించాలని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం అధికారులకు సూచించారు.

### పీపీపీ ప్రాజెక్టులకు ఇబ్బడి ముబ్బడిగా అప్పులు

పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో చేపట్టే ప్రాజెక్టులకు ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం ఆర్థిక శాఖలో పీపీపీ విభాగాన్ని బలోపేతం చేసింది. ఇందుకోసం ఆర్థిక శాఖలో పీపీపీ బృందాన్ని ఏర్పాటు చేసింది. అలాగే సంస్థాగత ఆర్థిక బృందాన్ని ఏర్పాటు చేస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పీపీపీ విధానంలో చేపట్టే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం సాధ్యమైనంత వరకు వినూత్న సంస్థాగత ఆర్థిక విధానాలను పొందేందుకు ఈక్విటీ ఫైనాన్స్‌తో సహా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో బాండ్ల జారీ ద్వారా రుణాలను సమీకరించేందుకు పీపీపీ బృందం పనిచేస్తుంది. అలాగే దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుండి రుణాలను సేకరించడానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు చేస్తారు. ఆర్ఈసీ, హడ్కో,, పీఎఫ్‌సీ తదితర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందేందుకు పీపీపీ బృందం చర్యలను తీసుకుంటుంది. గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రుణాల మంజూరు చేయించేందుకు ఆర్థిక సంస్థల భాగస్వామ్యాన్ని పీపీపీ సంస్థాగత ఆర్థిక బృందం పనిచేస్తుంది. ప్రైవేట్ ఫైనాన్సింగ్‌ను సులభతరం చేయడానికి ప్రతి ప్రాజెక్టుకు తగిన ఆర్థిక సంస్థల భాగస్వామ్యం ఉండేలా పీపీపీ బృందం పనిచేస్తుంది. స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్పీవీ)లను ఏర్పాటు చేసి ఆస్తులు తనఖా పెట్టి రుణాలను తీసుకుంటారు. ఈ ఆర్థిక ఏడాది నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరం వరకు చేపట్టే పీపీపీ ప్రాజెక్టులను రూపకల్పన చేశారు. రాయితీ ఒప్పందాలు వంటి ప్రాజెక్టు పత్రాలను అభివృద్ధి చేయడంతో పాటు వివిధ పథకాల కింద కేంద్రం నుంచి వయబులిటీ గ్యాప్ ఫండింగ్ పొందేందుకు వివిధ శాఖలు ప్రతిపాదనలను కేంద్రానికి పంపించడంలో ఆర్థిక శాఖలోని పీపీపీ బృందం చర్యలు తీసుకుంటుంది.

# హైకమాండ్ నిర్ణయమే అంతిమం

## ఖర్గేతో భేటీ అనంతరం సీఎం సిద్ధరామయ్య

- సీఎం మార్పు అంశంలో ఏం జరిగినా బాధ పడనని స్పష్టీకరణ
- అంతకు ముందు తన వర్గం వారితో సమావేశమైన సీఎం
- తననే ముఖ్యమంత్రిగా కొనసాగించేలా వ్యూహరచన

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటకలో అధికార, నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయమే అంతిమమని సీఎం సిద్ధరామయ్య తేల్చి చెప్పారు. శనివారం రాత్రి ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సుమారు గంటకు పైగా సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. చాలా రోజుల తర్వాత మల్లికార్జున ఖర్గే బెంగళూరుకు రావడంతో కలిశానన్నారు. ఇదొక మర్యాద పూర్వక భేటీ మాత్రమేనని, ఇందులో ప్రత్యేకత ఏమీ లేదని చెప్పుకొచ్చారు. పార్టీ బలోపేతంపై, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించినట్లు తెలిపారు. నాయకత్వ మార్పు అంశంపై చర్చించలేదన్నారు. డీకే వర్గం ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లి అధిష్టానంతో చర్చలు జరపడంపై స్పందిస్తూ ఎవరైనా ఢిల్లీకి వెళ్లి హైకమాండ్‌తో మాట్లాడొచ్చని, అందులో ప్రత్యేకత ఏముందని ప్రశ్నించారు. సీఎం మార్పు అంశంలో ఏమి జరిగినా తాను బాధపడనని, అలాగే సంతోషపడనని కూడా చెప్పారు. ఏ విషయమైనా పార్టీ అధిష్టానం నిర్ణయమే అంతిమమని, అది తానైనా, డీకే శివకుమార్ అయినా, పార్టీ నేతలెవరైనా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

### మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై చర్చ!

ఖర్గేతో భేటీలో సిద్ధరామయ్య తననే సీఎంగా కొనసాగించాలని కోరినట్లు తెలిసింది. శనివారం బెంగళూరు నగరంలోని సదాశివనగరలో ఉన్న ఖర్గే నివాసానికి తన వర్గం, నేతలు లేకుండా సీఎం సిద్ధరామయ్య ఒక్కరే వెళ్లడం గమనార్హం. ఇద్దరు నేతలు కలిసి సుదీర్ఘంగా పలు తాజా రాజకీయ అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగిందని సమాచారం. అంతకు ముందు సీఎం తన అనుచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర మంత్రులతో సమావేశమై చర్చించారు. సీఎం నివాసం కావేరికి మంత్రులు జమీర్ అహ్మద్‌ఖాన్, ఈశ్వర్ ఖండ్రే, కొంతమంది ఎమ్మెల్యేలు వెళ్లారు. ప్రస్తుత రాజకీయ సంక్షోభ సమయంలో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎంతో వారు చర్చించినట్లు సమాచారం. భేటీ అనంతరం బెంగళూరు ప్యాలెస్ మైదానంలో మంత్రి డి.సుధాకర్ కుమారుడి పెళ్లికి సీఎం హాజరై అక్కడి నుంచి నేరుగా ఖర్గే నివాసానికి చేరుకున్నారు. తనకు ఎమ్మెల్యేల పూర్తి మద్దతు ఉందని ఖర్గే చెప్పినట్లు సమాచారం. అలాగే ప్రభుత్వ పాలనకు ఎలాంటి ఆటంకం లేకుండా, సుపరిపాలన కొనసాగాలంటే తానే సీఎంగా కొనసాగాల్సిన ఆవశ్యకతను వివరించినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలంటే కూడా తానే సీఎంగా కొనసాగాలని చెప్పినట్లు సమాచారం. కాగా, సీఎం సిద్ధరామయ్య, ఖర్గే భేటీపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ.. వారి భేటీకి ప్రత్యేకత ఏమీ లేదన్నారు. తాను ఉంటున్న ఇంటి నుంచి కేవలం 100 మీటర్ల దూరంలోనే ఖర్గే నివాసం ఉందని తెలిపారు.

### బీజేపీలో రాజకీయ వేడి

**సీనియర్ నేత సంతోష్‌తో విజయేంద్ర భేటీ**

**శివాజీనగర:** కన్నడనాట కాంగ్రెస్‌లో అధికార పంపకాల వివాదం తారస్థాయికి చేరుకోగా, బీజేపీలో కూడా రాష్ట్రాధ్యక్షుని నియామకం తెరపైకి వచ్చింది. ఢిల్లీ పర్యటన చేపట్టిన బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర శనివారం బీజేపీ జాతీయ సంఘటన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో భేటీ అయ్యారు. బిహార్ అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాల తరువాత బీజేపీ హైకమాండ్ నూతన జాతీయ అధ్యక్షుని నియామకానికి సిద్ధం కాగా, అంతకు ముందు కర్ణాటకతో పాటుగా కొన్ని రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకానికి తీర్మానం చేసింది. రెండు రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లిన బి.వై. విజయేంద్ర హైకమాండ్ నాయకులను కలుస్తూ తననే కొనసాగించాలని కోరుతున్నారు. తాజాగా కర్ణాటకకే చెందిన సంతోష్‌తో మంతనాలు జరిపారు. త్వరలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షా, కర్ణాటక ఇన్‌చార్జి రాధా మోహన్‌దాస్‌ను కలవనున్నారు. పార్టీ సీనియర్, మార్గదర్శకులు సంతోష్‌తో సమావేశమై పార్టీ నిర్మాణం, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటంతో పాటు పలు విషయాల గురించి చర్చించినట్లు విజయేంద్ర ఎక్స్‌లో తెలిపారు. కాగా, సిద్ధరామయ్య సర్కారులోని లుకలుకల గురించి కూడా చర్చ సాగినట్లు తెలుస్తోంది.

## భక్తుల మనోభావాలతో రాజకీయాలొద్దు

- టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి మండిపాటు
- రాజకీయ ప్రయోజనాల కోసం శ్రీవారి లడ్డూపై దుష్ప్రచారం అపరాధం
- లడ్డూల తయారీలో నకిలీ నెయ్యి వాడారన్నది తప్పుడు ప్రచారమే
- జంతువుల కొవ్వు వాడారని ల్యాబ్ నివేదిక ఉందా?
- సిట్ అధికారికంగా ప్రకటించిందా? లీకుల పేరిట విష ప్రచారం ఎందుకు?

**సాక్షి, అమరావతి:** తిరుమల పవిత్రతకు భంగం కలిగించే విధంగా రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేయడం అపరాధమని, భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే కుట్ర అని టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి అన్నారు. తిరుమల లడ్డూల తయారీలో 2019 నుండి 2024 వరకు నకిలీ నెయ్యి వాడారన్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. దాదాపు 20 కోట్ల లడ్డూలు నాణ్యత లేని నెయ్యితో తయారయ్యాయన్న వార్తలు దుష్ప్రచారమే తప్ప నిజం కావన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. లడ్డూ విషయంపై జరుగుతున్న సిట్ విచారణకు పూర్తిగా సహకరించామని, తిరిగి విచారణకు ఎప్పుడైనా హాజరు కావడానికి సిద్ధమని తెలిపారు. శాస్త్రీయ ఆధారాలతో విచారణ జరగాలన్నారు. మీడియా లీకులు, రాజకీయ ప్రచారాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేయొద్దని, మీడియా బాధ్యతగా వ్యవహరించాలని హితవు పలికారు.

**అసత్యాలతో భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీయొద్దు**

'చంద్రబాబు మొదటగా శ్రీవారి లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు వాడారంటూ నిరాధార ఆరోపణలు చేశారు. అప్పుడు మేం సుప్రీంకోర్టును ఆశ్రయించాం. కోర్టు సీబీఐ పర్యవేక్షణలో సిట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఏ ఆధారంతో వెజిటబుల్ ఫ్యాట్ కలిపారని, జంతువుల కొవ్వు వాడారని దుష్ప్రచారం చేశారు? ఎక్కడైనా ల్యాబ్ నివేదిక ఉందా? సిట్ అధికారికంగా ప్రకటించిందా? లీకుల పేరిట విష ప్రచారం ఎందుకు? తొలుత అనుమానాస్పదంగా గుర్తించిన నాలుగు నెయ్యి ట్యాంకర్లను తిరిగి పంపించామని అధికారులు స్పష్టం చేశారు. అయినా దుష్ప్రచారం ఆగలేదు. ఆ నెయ్యి మళ్లీ ఏ రకంగా తిరిగి వచ్చిందో చెప్పాలి. నేను టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో కిలో నెయ్యి రూ.326తో కొనుగోలు చేసినందున, అది నకిలీదని చెప్పడం హాస్యాస్పదం. అలాగైతే 2017-18లో చంద్రబాబు హయాంలో కిలో రూ.276, రూ.279తో కొనుగోలు చేసిన నెయ్యి కూడా నకిలీ అవుతుందా? అప్పటి లడ్డూలు కూడా అపవిత్రమైనవా? తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేయడం అపరాధం. భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే కుట్ర' అని వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు.

## మార్కాపురంలో కోర్టులు ప్రారంభం

కోర్టులను ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

**మార్కాపురం:** ప్రకాశం జిల్లా మార్కాపురం కోర్టు భవనాల సముదాయంలో శనివారం 6వ అదనపు జిల్లా న్యాయస్థాన భవనం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టును రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు జడ్జిలు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్, జస్టిస్ లక్ష్మణ రావు హాజరయ్యారు.

## రహస్య ఓటింగ్ నిర్వహించాలి

**డీకే వర్గం ఎమ్మెల్యేల డిమాండ్**

**సాక్షి, బెంగళూరు:** డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు సీఎం పదవి ఇవ్వాలని ఆయన వర్గం ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే శాసనసభ పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఎమ్మెల్యేల అభిప్రాయం సేకరించాలని, రహస్య ఓటింగ్ కూడా నిర్వహించాలని కూడా కోరుతున్నారు. ఈ మేరకు వారంతా ఢిల్లీ యాత్ర చేపట్టారు. అధిష్టానం పెద్దల వద్దకు వెళ్లి ఈ మేరకు తమ డిమాండ్‌ను వినిపిస్తున్నారు. మరోవైపు బెంగళూరులోని కొందరు ఎమ్మెల్యేలు డీకే శివకుమార్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇళ్లకు క్యూలు కడుతున్నారు. ఇద్దరితో మాట్లాడి రాజీ కుదిర్చే ప్రయత్నాలు సాగిస్తున్నారు. డీకే శివకుమార్ మాత్రం ఎవరి మాట వినేందుకు సిద్ధంగా లేన్నట్లు సమాచారం. 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తామని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కొందరు నేతల ద్వారా డీకే శివకుమార్‌ను బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. అయితే అందుకు కూడా ఆయన అంగీకరించలేదని, భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఎవరికి తెలుసంటూ ప్రశ్నించినట్లు సమాచారం. గతంలో హైకమాండ్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని డీకే శివకుమార్ తేల్చి చెప్పారని తెలుస్తోంది. రెండున్నరేళ్ల వరకు సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా, తాను ఉప ముఖ్యమంత్రిగా.. లోక్‌సభ ఎన్నికల వరకు కేపీసీసీ అధ్యక్షుడిగా కొనసాగాలని హైకమాండ్ నిర్దేశించిందని డీకే శివకుమార్ గుర్తు చేసినట్టు సమాచారం. ఇచ్చిన మాట ప్రకారం నడుచుకోవాలని, తనను ముఖ్యమంత్రి చేయాలని డీకే కోరుతున్నట్టు తెలుస్తోంది.

## తెరపైకి 'ఉత్తర కర్ణాటక' వివాదం

**యశవంతపుర:** కర్ణాటకలో సీఎం సీటుపై కర్ణాటక రాజకీయాల్లో చర్చ జోరందుకోగా.. తాజాగా మరో అంశం తెరపైకి వచ్చింది. ఉత్తర కర్ణాటకను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలనే నినాదంపై మరోమారు దుమారం రేగింది. బెళగావిలో జరిగే శాసనసభా సమావేశాల్లో ఎమ్మెల్యే రాజుకాగెతో పాటు, ఉత్తర కర్ణాటకకు చెందిన 26 మంది ఎమ్మెల్యేలు ప్రత్యేక రాష్ట్రం కోసం నినదించాలని నిర్ణయించినట్లు ఉత్తర కర్ణాటక పోరాట సమితి ప్రధాన కార్యదర్శి నాగేశ్ గోలశెట్టి చెప్పడంతో మళ్లీ చర్చ మొదలైంది. బెళగావిలో నాగేశ్ గోలశెట్టి విలేకరులతో మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉత్తర కర్ణాటకకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, గవర్నర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజు కాగె లేఖ రాసినట్టు చెప్పారు. ఇప్పటికే ఉత్తర కర్ణాటకకు చెందిన 1,48,91,346 మంది ప్రత్యేక రాష్ట్రం కోసం మద్దతు ఇచ్చినట్లు వెల్లడించారు. డిసెంబర్ 8న బెళగావిలో 26 మంది ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి డిసెంబర్ 11 నుంచి జరిగే శీతాకాల శాసనసభా సమావేశాల్లో ప్రత్యేక రాష్ట్రంపై గొంతు వినిపిస్తామని చెప్పారు. రాజుకాగె పోరాటానికి బెళగావి, విజయపుర, బాగలకోట, ధారవాడ, గదగ, ఉత్తర కన్నడలోని 15 జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు సిద్దు సవది, విజయానంద కాశప్పనవర, బసనగౌడ పాటిల్‌యత్నాల్, శరణు సలగర, శరణ ప్రకాశ పాటిల్, వినయ కులకర్ణి, అరవింద బెల్లద, జనార్దన్ రెడ్డి, నారా భరత్‌రెడ్డి, నిఖిల్‌కత్తి మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఉత్తర కర్ణాటక ప్రజలు తమ డిమాండ్లు సాధించుకోవాలంటే తెలంగాణ తరహా పోరాటం చేసేందుకు సిద్ధమవ్వాలని నాగేశ్ గోలశెట్టి తెలిపారు.

అదర్‌సైడ్

మిస్ యూనివర్స్ ఫాతిమా బాష్ (మెక్సికో)

# అవమానాల నుంచి అందాల కిరీటం వరకు...

**ప్రపంచానికి మాత్రం ధగధగలాడుతూ వెలిగిపోతున్న ఆమె కిరీటం కనిపించవచ్చు. అయితే ఆ వెలుగుల వెనుక కనిపించని చీకట్లు ఎన్నో ఉన్నాయి. ‘డిస్లెక్సియా’ వల్ల ఆమె బాల్యం అవమానాలు, అవహేళనలతో నిండిపోయింది. అయితే ఆ అవమానాలను గుర్తు తెచ్చుకుంటూ కుమిలిపోలేదు ఈ మెక్సికో సుందరి. ‘ఆ అవమానాలే లేకపోతే నేను ఇక్కడి వరకు వచ్చేదాన్ని కాదు’ అంటుంది 74వ మిస్ యూనివర్స్ పోటీలో విశ్వసుందరి కిరీటాన్ని గెల్చుకున్న ఫాతిమా బాష్. ఆమె ఇంటి పేరు ‘బాష్’కు అడవి అని అర్థం. అడవిలో ‘పచ్చదనం’ అనే సానుకూల శక్తి ఉంటుంది. ఆ శక్తితోనే ప్రతికూలతలను అధిగమించి అందాల కిరీటాన్ని గెలుచుకుంది.**

ఫాతిమా బాష్ బాల్యం అందరిలా ఉండేది కాదు. ‘మాట్లాడినా వెటకారాలే... మాట్లాడకపోయినా వెటకారాలే’ అన్నట్లుగా ఉండేది. డిస్లెక్సియా, అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ)తో బాధ పడుతున్నట్లు ఆరేళ్ల వయసులో నిర్ధారణ అయింది. తోటి పిల్లలు ఎప్పుడూ ఫాతిమాను అవమానిస్తుండే వారు. ఉపాధ్యాయులు కూడా ఏదో రకంగా తిడుతూనే ఉండేవారు.

**అమ్మో... అల్లరి పిల్ల!**

ఫాతిమా ఇంటికి వస్తుందంటే చుట్టాలు,పక్కాలు భయపడి పోయేవాళ్లు, ఎందుకంటే ‘ఏడీహెచ్‌డీ’ వల్ల ఆమె తెగ ఆల్లరి చేస్తుండేది. అది భరించడం ఇతరులకు కష్టంగా ఉండేది. ఆమె అతి చురుకుదనం అందరికీ సమస్యగానే ఉండేది. స్కూలుకు వెళుతున్న మాటే గానే...‘డిస్లెక్సియా’ అనే అభ్యాస వైకల్యం వల్ల చదవడం, రాయడం, పాఠాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు పడేది.

**కాలమే దారి చూపింది**

‘ఎందుకు ఇలా?’ అని సీరియస్‌గా విశ్లేషించుకునే వయసు కాదు. వయసు పెరుగుతున్న క్రమంలో తన గురించి తనకు అర్థం అవుతూ వచ్చింది. అయితే ఫాతిమా ఎప్పుడూ నిరాశకు గురి కాలేదు. సానుకూల ఆలోచనలు ఆమెకు బలాన్ని ఇచ్చాయి. ‘ఏదో ఒకటి సాధించాలి. అప్పుడు నాతో అందరూ చక్కగా మాట్లాడతారు’ అని తెలిసీ తెలియని వయసులోనే అనుకుంది. ఏం సాధించాలో తెలియదు. ఎలా సాధించాలో తెలియదు. అయితే కాలమే ఆమె ముందు దారులు పరుస్తూ వెళ్లింది.

**సామాజిక సేవలో...**

ఎంత ఇబ్బందిగా ఉన్నా చదువుకు మాత్రం దూరం కాలేదు. మెక్సికోలో ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. క్యాన్సర్ బాధితులైన పిల్లలకు అండగా నిలవడానికి స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేసింది.

**ఆ రోజు రానే వచ్చింది!**

మెక్సికన్ రాష్ట్రం టబాస్కోలోని టీపా అనే చిన్న పట్టణంలో జన్మించింది ఫాతిమా. టబాస్కో రాష్ట్రంలో జరిగే అందాల పోటి ‘ఫ్లోర్ టబాస్కో’ (2018) టైటిల్ గెలుచుకొని అందరి దృష్టినీ ఆకర్షించింది. పరిచితులు, అపరిచితులు, ఆత్మీయుల అభినందనలతో ఫాతిమా మనసు నిండిపోయింది.

‘ఈరోజు కోసమే కదా నేను వేచి చూసింది’ అనుకుంది. అయితే ఇంకో రోజు కూడా ఆమె కోసమే ఓపికగా ఎదురు చూస్తూనే ఉంది. అది ఆమె మిస్ యూనివర్స్ కిరీటం గెలుచుకున్న రోజు. అది ఆమెకే పరిమితమైన విజయం కాదు. అవమానాలు ఎదురైతే ‘నా జీవితం ఇంతేనా’ అని కుంగుబాటు చీకట్లోకి వెళ్లిపోయే వారికి ధైర్యాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చే విజయం. ‘పట్టుదలగా ప్రయత్నించు. నువ్వు సాధించడానికి ఎంతో ఉంది’ అని గుర్తు తెచ్చే విజయం.

### క్షమాపణ చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నాడు!

ఫాతిమా బాష్‌కు అవమానాలు, ఈసడింపులు కొత్తేమీ కానప్పటికీ తాజా అవమానం ఆమెను తీవ్రంగా బాధ పెట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది షాక్ అయ్యేలా చేసింది. ‘సోషల్ మీడియాలో తన ప్రమోషన్ కంటెంట్‌ను పోస్ట్ చేయడంలో ఫాతిమా విఫలమవుతుంది’ అని ఆరోపిస్తూ మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ నేషనల్ డైరెక్టర్ నవత్ ఇట్సారగ్రిసిల్ బహిరంగంగా ఆమెను ‘తెలివి తక్కువ’ అని అర్థం వచ్చేలా అవమానించారు.

నవత్ మాటలను నిరసిస్తూ ఫాతిమా వాకౌట్ చేసింది. గత సంవత్సరం మిస్ యూనివర్స్‌తో సహా అనేక మంది పోటీదారులు ఫాతిమాకు సంఘీభావంగా వాకౌట్ చేశారు. ‘సాధికారత ఉన్న మహిళలం మనం. మన గళాన్ని వినిపించే వేదిక ఇది’ అని తన గళాన్ని వినిపించింది ఫాతిమా. మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ నవత్ నోటి దురుసుతనాన్ని ఖండించింది. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా ఫాతిమాకు మద్దతుగా మాట్లాడింది. వాకౌట్ తరువాత తిరిగి పోటీలో పాల్గొన్న ఫాతిమా బాష్ అందాల కిరీటాన్ని గెలుచుకుంది.

‘నవత్‌లాంటి వ్యక్తుల అహంకారానికి చెంపపెట్టు లాంటి అద్భుత విజయం ఇది’ అంటూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు వెల్లువెత్తాయి. సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్న నవత్ ఫాతిమాకు బహిరంగ క్షమాపణ చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నాడు.

కొత్త దారి

కొల్ల తులసి, సుధాకర్

# మారథాన్... ఏడు ఖండాలలో... ఎంతో ఎనర్జీతో!

**కాస్త సరదాగా... తొలిసారిగా మారథాన్‌లో పాల్గొన్న ఈ డాక్టర్ దంపతులు ఆ తరువాత మాత్రం ‘మారథాన్’ను సీరియస్‌గా తీసుకున్నారు. ఏడు ఖండాలలో జరిగిన మారథాన్‌లలో పాల్గొని ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్నారు కొల్ల సుధాకర్, తులసి దంపతులు. వారి మారథాన్ అనుభవాలు వారి మాటల్లోనే...**

‘‘మా బాబు అద్వైత్ హైదరాబాద్‌లో చదువుకునే రోజుల్లో మేము వెళ్లి వస్తూ ఉండేవాళ్ళము. ఆ సమయంలో హైదరాబాద్‌లో జరిగిన హాఫ్‌మారథాన్‌లో పాల్గొనడానికి ఢిల్లీ నుంచి ఒక మహిళ రావడం మాకు ఆశ్చర్యంగా అనిపించింది. ఆమెతో మాట్లాడిన తరువాత ఇక రెగ్యులర్‌గా మారథాన్‌లలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాం.

**సిక్స్ స్టార్స్ ఫినిషర్స్**

బెర్లిన్‌లో 2018లో జరిగిన మారథాన్‌లో మేము ఇద్దరం మొదటిసారిగా పాల్గొన్నాము. మూడు సంవత్సరాల మా సాధన అక్కడ బాగా పనిచేసింది. 42.2 కిలోమీటర్లు నిర్వహించే మారథాన్‌లో పాల్గొన్నప్పుడు అక్కడి ప్రజలు దారి పొడవునా నిల్చుని చప్పట్లతో ప్రోత్సహించడం సంతోషాన్ని ఇచ్చింది.

ఆ తర్వాత 2019 న్యూయార్క్‌లో, 2022లో బోస్టన్‌లో, చికాగోలో, 2023లో లండన్‌లో, 2024లో టోక్యోలో జరిగిన మారథాన్‌లలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేశాము. ఆరు మారథాన్‌లను పూర్తి చేసుకున్న మాకు టోక్యోలో 6స్టార్స్ ఫినిషర్స్ పతకాలను అందజేశారు.

**అంటార్కిటికాలో... అంత ఈజీ కాదు!**

అంటార్కిటికా ఖండంలో నిర్వహించిన మారథాన్‌లో పాల్గొన్నప్పుడు ఇబ్బందులు ఎదుర్కొన్నాము. అక్కడి చలి తీవ్రతను తట్టుకోవడానికి నాలుగు లేయర్ల దుస్తులు వేసుకోవాల్సి వచ్చింది. ప్రత్యేక షూస్ వేసుకుని వాకింగ్ చేయడం ఇబ్బందిగా అనిపించింది. ఇప్పటివరకు ఏడు ఖండాలలో మారథాన్‌లను పూర్తి చేశాం, అందులో యూరప్‌లోని బెర్లిన్, ఉత్తర అమెరికాలోని న్యూయార్క్, చికాగో, బోస్టన్ ఆసియాలో టోక్యో, ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, అంటార్కిటికా ఖండం, దక్షిణ అమెరికాలోని పెటగోనియా, దక్షిణ ఆఫ్రికాలోని కేప్‌టౌన్‌లలో జరిగిన మారథాన్‌లలో పాల్గొన్నాము.

**నిత్య సాధనతో...**

మారథాన్‌లో పాల్గొనడానికి నాలుగు నెలల ముందు నుంచే ప్రత్యేక సాధన చేస్తాము. ఆహార నియమాలను ఖచ్చితంగా పాటిస్తాం. స్వీట్లు, జంక్ ఫుడ్ మా దరిదాపుల్లోకి రానివ్వము. పూర్తి కార్బోహైడ్రేట్లు ఉండే ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకుంటాము. ప్రతిరోజు 8 నుంచి 10 కిలో మీటర్లు నడుస్తాం. మారథాన్ కు ముందు రోజు 20 కిలోమీటర్లు పరుగెత్తుతాము. నిత్యసాధన చేసినప్పుడే మారథాన్‌లో పూర్తి లక్ష్యాన్ని చేరుకోగలుగుతాము’’ అని వివరించారు డాక్టర్ దంపతులు.

మారథాన్‌ను నేడు మూడు కేటగిరీలుగా నిర్వహిస్తున్నారు. 1. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం వద్ద ఉదయం 5.30 గంటలకు హాఫ్ మారథాన్ రన్ ప్రారంభం అవుతుంది. అలాగే ఆరు గంటలకు 10 కి.మీ., 7 గంటలకు 5 కి.మీ. మారథాన్‌లు జరగనున్నట్లు, మూడు బ్యాచీలు కాళోజీ కళాక్షేత్రం నుంచి ప్రారంభమై తిరిగి కళాక్షేత్రం వద్దకు చేరుకుంటాయని నిర్వాహకులు తెలియజేశారు.

– గజ్జి రమేష్, సాక్షి, వరంగల్,
ఫోటోలు: పెద్దపల్లి వరప్రసాద్

### వారి కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం

ఏమాత్రం వాకింగ్ చేయకుండా గంటల తరబడి టీవీ, ఫోన్లతో కాలక్షేపం చేస్తుంటారు కొద్దిమంది. అలాంటి వారిని కౌచ్ అంటారు. వారిని మారథాన్‌లో పాల్గొనేలా చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. 45 రోజుల్లో 5 కిలోమీటర్ల దూరం స్పీడ్ వాక్ చేసేలా వారికి శిక్షణ ఇస్తాం. మరో పది రోజుల్లో శిక్షణ ప్రారంభిస్తాం.

– కొల్ల సుధాకర్, తులసి

● బ్యూటిప్

### కాళ్ల పగుళ్ల నివారణకి...

అర కప్పు కొబ్బరినూనెలో కొద్దిగా వేపాకు, పావు టీ స్పూన్ పసుపు, కొద్దిగా కర్పూరం వేసి కాచి, చల్లారిన తరవాత వడకట్టాలి. ఆ నూనెను రాత్రి పడుకునే ముందు కాళ్ల పగుళ్ల మీద అప్లై చేసి రెండు నిమిషాలు మర్దనా చేస్తే ఉపశమనం ఉంటుంది.

## హెల్త్

# ● ఎకాంథోసిస్ నైగ్రికాన్స్! చక్కెర చారలు!

**కొంతమంది నుదుటి మీద, మరికొందరి మెడ మీద చర్మం కాస్తంత ఉబ్బినట్టుగా, దళసరిగా మారినట్టుగా కనిపించడం మామూలే. ఆ నల్లబారిన ఉబ్బు మధ్య మధ్యన ప్యాచ్‌లు ప్యాచ్‌లుగా కొద్దిగా ముడుతలు ముడుతలుగా కనిపిస్తుండటమూ సాధారణమే. పైకి కనిపించే ప్రదేశాల్లో మాత్రమే కాదు... కొందరికి దుస్తులు కప్పి ఉంచే ప్రదేశాలైన బాహుమూలాల్లో కూడా ఇలా కనిపిస్తుంది. ఇలా చర్మం నల్లగా, ఉబ్బుగా, దళసరిగా ఓ పొరలాగా కనిపించే కండిషన్‌ను వైద్యపరిభాషలో ‘ఎకాంథోసిస్ నైగ్రికాన్స్’ అంటారు. సాధారణంగా ఇలా రావడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ దీన్ని ప్రీ-డయాబెటిస్‌కు సూచనగా భావించి ముందస్తుగానే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, కొన్ని సూచనలు పాటిస్తూ చాలాకాలం పాటు డయాబెటిస్ దరిచేరకుండా చూసుకోవాలంటూ వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ అంశంపై అవగాహన కోసమే ఈ కథనం.**

ఎకాంథోసిస్ నైగ్రికాన్స్ ఎందుకు వస్తుందన్నది ఇంకా తెలియదు. అది రావడానికి నిర్దిష్టంగా ఫలానా అంశమే కారణం అని చెప్పడానికి లేదు. అయితే ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉన్నవాళ్లకు అది వస్తుందన్నది పరిశోధకుల మాట. ఇన్సులిన్ అనే హార్మోన్ చక్కెరను కణం లోకి సాఫీగా వెళ్లేలా చేయడం ద్వారా రక్తంలో చక్కెరను రెగ్యులేట్ చేస్తుంది. అంటే కణంతాలూకు జీవక్రియలకు అవసరమయ్యేలా చక్కెరను కణంలోకి ప్రవేశించేలా చేయడం వల్ల రక్తంలో తగినంత చక్కెర కనిపించదు. ఏదైనా కారణాల వల్ల కణంలోకి చక్కెర ప్రవేశించకపోతే అది రక్తంలోనే ఉండిపోతుంది. అంటే కణం ఇన్సులిన్‌ను రెసిస్ట్ చేయడం వల్ల ఇలా జరుగుతుంది. కాబట్టి ఇలా జరిగే కండిషన్‌ను ఇన్సులిన్ రెసిస్టెన్స్ అంటారు. దాంతో రక్తంలో చక్కెర ఎక్కువగా ఉండటం వల్ల ప్యాంక్రియాస్ ఎక్కువ మొత్తంలో ఇన్సులిన్ ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. దీనివల్ల ప్యాంక్రియాస్‌పై ఎక్కువ భారం పడటంతో తొలుత ప్రీ-డయాబెటిస్‌కీ, తర్వాత డయాబెటిస్‌కూ దారితీయవచ్చు. ప్రీ-డయాబెటిక్ కండిషన్ అనేది చక్కెర వ్యాధికి (డయాబెటిస్‌కి) తొలి దశ లేదా తొలి సూచనగా భావిస్తారు.

**లక్షణాలు...**

నుదుటి మీద, మెడ వెనక భాగంలో అలాగే చంకల్లో చర్మం దళసరిగా మారడంతో పాటు చర్మం ముడతలు పడుతూ ఉండే భాగాల్లో అంటే ప్రైవేటుపార్ట్స్ దగ్గర, మోకాళ్ల వెనక కూడా చర్మం దళసరిగా మారడం; ● మందంగా మారిన చోట కాస్తంత దురదగా అనిపించడం ● కొందరిలో అక్కడ పులిపిరులు (స్కిన్ ట్యాగ్స్) రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**ఎకాంథోసిస్ నైగ్రికాన్స్‌కు కారణాలు...**

ఇన్సులిన్ రెసిస్టెన్స్‌తో పాటు ఎకాంథోసిస్ నైగ్రికాన్స్‌కు మరికొన్ని అంశాలూ కారణమవుతాయని నిపుణులు చెబుతుంటారు. అవి...

● కొందరిలో టైప్-2 డయాబెటిస్‌కు ముందర (సాధారణంగా స్థూలకాయం ఉన్నవారిలో ఇలా నల్లబారి, దళసరిగా మారడం కాస్తంత ఎక్కువ)

**చాలా అరుదుగా వచ్చే ఈ కండిషన్స్ ఉన్నవారిలో...**

● చాలా అరుదుగా చర్మ క్యాన్సర్ ఉన్నవారిలో. (దీన్ని మెలిగ్నెంట్ ఎకాంథోసిస్ నైగ్రికాన్స్ అంటారు గానీ ఇది చాలా చాలా అరుదు).
● కొందరిలో కొన్ని మందులు వాడటం వల్ల. ● కొందరిలో లూపస్ (ఎస్ఎల్ఈ) అనే ఆటోఇమ్యూన్ వ్యాధి కారణంగా.
● కొందరిలో జోగ్రెన్స్ సిండ్రోమ్, స్క్లీరో డెర్మా, హాషిమోటో థైరాయిడైటిస్ అనే కారణాల వల్ల.

**ఇతరత్రా పరిణామాలు**

● చూడటానికి ఇబ్బందిగా ఉండి అంత బాగా కనిపించకపోవడం. ● ఈ నలుపు కారణంగా నలుగురిలోకి రాలేక మానసికంగా ఇబ్బందిపడటం.

**నిర్ధారణ...**

● బయటకు చూడటానికి నల్లగా, దళసరిగా కనిపించే చర్మంతో దీన్ని క్లినికల్‌గా గుర్తించవచ్చు. అవసరాన్ని బట్టి కొందరిలో బయాప్సీ చేయాల్సి రావచ్చు. అవసరాన్ని బట్టి (లేదా కారణాలను తెలుసుకునేందుకు) రక్తంలో చక్కెర మోతాదులూ, ఇన్సులిన్ స్థాయులు, లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలూ చేయించే అవకాశాలుంటాయి.

**చికిత్స...**

ఎకాంథోసిస్ నైగ్రికాన్స్‌లో చర్మం నలుపునూ, దళసరిగా/మందంగా మారడాన్ని తగ్గించడానికి డాక్టర్లు కొన్ని రకాల క్రీములు, జెంటిల్ క్లెన్సర్స్, యాంటీబ్యాక్టీరియల్ సబ్బులు సూచించవచ్చు. దాంతోపాటు కొన్ని సందర్భాల్లో లేజర్ థెరపీ వంటి చికిత్సలు అవసరం కావచ్చు. కొందరికి కెమికల్ పీల్స్ చికిత్సలు కూడా బాగానే ఉపయోగపడతాయి.

అయితే మరీ ముఖ్యంగా చెప్పాల్సిందేమిటంటే... ఇలా చర్మం దళసరిగా మారి, నలుపు రంగులోకి తిరుగుతుంటే... ఎకాంథోసిస్ నైగ్రికాన్స్‌కు కాకుండా లోపల మరేదైనా ఆరోగ్య సమస్య (అండర్ లైయింగ్ డిసీజ్) కారణంగా ఇలా జరుగుతుందేమో పరిశీలించడం అవసరం. అంటే స్థూలకాయం (ఒబెసిటీ), ప్రీ డయాబెటిస్ లేదా డయాబెటిస్ వంటివి కారణాలు కావచ్చని అనుమానించాలి. ఇలా అనుమానించడం ద్వారా కారణాలను విశ్లేషించి వాటికి అవసరమైన చికిత్స తీసుకోవడం మరీ ముఖ్యం. తద్వారా ప్రీ-డయాబెటిస్ కండిషన్ గనక బయటపడితే డాక్టర్‌లు పాటించమని చెప్పే కొన్ని ఆరోగ్య సూచనలతో డయాబెటిస్‌ను చాలాకాలం పాటు నివారించవచ్చు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే వాటికి చికిత్స అందించడం ద్వారా సమస్య మరింత ముదరకుండా జాగ్రత్తపడటంతో పాటు అండర్‌లైయింగ్ డిసీజ్ తగ్గిపోవడం వల్ల ఎకాంథోసిస్ నైగ్రికాన్స్ కూడా నయమవుతుంది.

డా॥ బి. విజయశ్రీ
సీనియర్ కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, కాస్మటాలజిస్ట్.

# పీరియడ్స్ సమయంలో వ్యాయామం చెయ్యొచ్చా?

స్త్రీలు తమ పీరియడ్స్ సమయంలో వ్యాయామాలు చేయకూడదని కొందరు అభిప్రాయపడుతుంటారుగానీ... నిజానికి మహిళలు తమ రుతు సమయంలో ఎలాంటి సంకోచాలూ లేకుండా వ్యాయామాలు చేయవచ్చు. ఆ టైమ్‌లో చేయకూడదన్నది కేవలం అపోహ మాత్రమే. చాలామంది క్రీడాకారిణులు తమ రెగ్యులర్ ప్రాక్టీస్‌లో భాగంగా రుతుసమయంలోనూ వ్యాయామం చేస్తుంటారు. దాంతో ఎలాంటి నష్టమూ జరగదు.

అయితే మహిళలు తమ రుతు సమయంలో ఒక విషయంలో కొంత అప్రమత్తతతో ఉండాలి. అదేమిటంటే... రుతు సమయంలో వాళ్ల రక్తం కోల్పోతూ ఉండటం వల్ల వాళ్ల దేహంలో ఐరన్ మోతాదులు తగ్గే అవకాశం ఉన్నందున... ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటూ ఉండటం చాలా మేలు చేస్తుంది.

**ఐరన్ మోతాదులు ఎక్కువగా ఉండే ఆహారాలు...**

మాంసాహారాల్లో వేటమాంసం, చికెన్, చేపలు, లివర్, శాకాహారులైతే తాజా ఆకుకూరలు (పాలకూర వంటివి), ఎండుఖర్జూరం, గసగసాలు, చిక్కీ వంటి పదార్థాల్లో ఐరన్ మోతాదులు ఎక్కువ. ఇవి కేవలం పీరియడ్స్ సమయంలోనే కాకుండా మామూలు టైమ్‌లోనూ తీసుకుంటుంటే వారిలో ఐరన్ ఎప్పటికప్పుడు భర్తీ అవుతుంది.

**దూరంగా ఉండాల్సిన పదార్థాలివే...**

రుతు సమయంలో వారు నువ్వులు, ఉప్పు, కొవ్వులు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే దేహం కాస్తంత మందకొడిగా మారడంతో వ్యాయామాలు చురుగ్గా చేయలేకపోవచ్చు. కేవలం రుతు సమయంలోనే కాకుండా మిగతా టైమ్‌లో కూడా వీటితో చురుకుదనం తగ్గవచ్చు. కాబట్టి చురుగ్గా ఉండాలంటే... మహిళలు తమ ఆహారంలో ఉప్పు, కొవ్వులు తగ్గించాలి. రుతు సమయంలో సాధారణ రోజుల కంటే నీళ్లు, పండ్లరసాల వంటి ద్రవాహారాలు ఎక్కువగా తీసుకోవడం మేలు చేస్తుంది. అంతే కాదు... వేళకు పడుకుని, కంటినిండా నిద్రపోవడం వల్ల పూర్తి ఆరోగ్యమూ బాగుంటుంది. వ్యాధినిరోధక వ్యవస్థ (ఇమ్యూనిటీ) మెరుగుపడుతుంది.

# పిల్లల్లోనూ డిప్రెషన్?

‘పిల్లలకు ఎలాంటి కష్టాలు ఉంటాయి? వారు రోజంతా ఆడుకుంటూ సంతోషంగా ఉంటారు’’ అని చాలామంది అనుకుంటారు. కానీ ఇది సరైన అభిప్రాయం కాదు. డిప్రెషన్ అనేది పెద్దవారికే కాదు... అది చిన్న పిల్లల్లో కూడా కనిపించే ఓ భావోద్వేగ సమస్య. అనేక పరిశోధనలు క్లినికల్ అనుభవాలు చిన్న పిల్లల్లో కూడా డిప్రెషన్ కనిపిస్తుందని నిర్ధారణ చేస్తున్నాయి.

చిన్నపిల్లల్లో డిప్రెషన్ రావడానికి అనేక అంశాలు కారణమవుతాయి. అవి...

**పిల్లల్లో డిప్రెషన్ ఎందుకు వస్తుందంటే...**

**1. బయోలాజికల్ / శారీరక కారణాలు**

● కుటుంబంలో డిప్రెషన్ లేదా యాంగ్జైటీలతో కూడిన మెడికల్ హిస్టరీ ఉండటం ● మెదడులోని రసాయనాల (కెమికల్స్) అసమతుల్యత కారణంగా ●నిద్ర-ఆహార శైలిలో గందరగోళం 2. సైకాలజికల్ / భావోద్వేగ కారణాలు ● పిల్లల సున్నితమైన స్వభావం ● భయం, ఆత్మవిశ్వాసం లేకపోవడం ● చదువులో ఒత్తిడి 3. సామాజిక కారణాలు ● ఇంట్లో కలహాలు ● స్కూల్‌లో బుల్లీయింగ్‌కు గురికావడం ● స్నేహితుల లేమి, ఒంటరితనం ● ఎక్కువ సమయం టీవీ లేదా మొబైల్ స్క్రీన్‌కు అంటిపెట్టుకుని ఉండటం

**డిప్రెషన్ పిల్లల్లో ఎలా బయటపడుతుందంటే...**

● చిరాకు, చిన్న విషయానికే ఏడవడం ● ఒంటరిగా ఉండాలనిపించడం ● స్కూల్‌కు వెళ్లడంలో నిరాసక్తత ● ఆటల్లో ఆసక్తి తగ్గిపోవడం ●ఆకలి తగ్గడం లేదా ఎక్కువగా తినడం ● నిద్రలో మార్పులు (ఎక్కువ నిద్ర / నిద్రలేమి) ● అలసట, నీరసం, నిస్సత్తువ ● ఆత్మవిశ్వాసం తగ్గుదల ● తరచూ ‘‘పొత్తికడుపు నొప్పి, తలనొప్పి’’ వంటి ఫిర్యాదులు

**ఈ లక్షణాలు 2-3 వారాలు కొనసాగితే నిపుణుడిని సంప్రదించడం మంచిది.**

ప్రతి బాధ డిప్రెషన్ కాకపోవచ్చు కానీ పిల్లల విషయంలో జాగ్రత్త అవసరం. ఎందుకంటే చిన్న పిల్లలు తమ భావాలను మాటల్లో చెప్పలేరు. వారు తమ ప్రవర్తన ద్వారానే తమ బాధల్ని వ్యక్తం చేస్తారు. అందుకే పిల్లల్లో ఆకస్మికంగా వచ్చిన మార్పులను తల్లిదండ్రులు, టీచర్లు గమనించాలి.

**తల్లిదండ్రులకు కొన్ని ముఖ్యమైన సూచనలు**

**1. పెద్దలు తీర్పులు ఇవ్వకుండా పిల్లల మాట వినాలి (నాన్ జడ్జిమెంటల్ ఆటిట్యూడ్)**

● ‘‘ఇంత చిన్న విషయానికే ఎందుకు బాధపడుతున్నావు?’’ వంటి మాటలను అనకూడదు. ● పిల్లల అభిప్రాయాలనూ, భావాలనూ తగ్గించే మాటలు అనకుండా, ఠక్కున ఓ అభిప్రాయానికి వచ్చి దాన్ని వెల్లడించకుండా వారు చెప్పే మాటల్ని శ్రద్ధగా వినాలి. ఇది పిల్లల్లో భద్రతా భావాన్ని, నమ్మకాన్ని పెంచుతుంది.

**2. పిల్లలతో ఎక్కువ సమయం గడపడం (స్పెండింగ్ మోర్ అండ్ క్వాలిటీ టైమ్)**

● ప్రతిరోజూ కొంత సమయం పూర్తిగా పిల్లలకోసమే కేటాయించాలి.● కథలు చెప్పడం, బయట ఆటలు, కలిసి చేసే చిన్న పనులే అయినప్పటికీ ఇవన్నీ పిల్లల్లో వాళ్ల భావోద్వేగ బలాన్ని పెంచుతాయి. ● నాణ్యమైన సమయం ఇవ్వడమన్నది పిల్లలను డిప్రెషన్‌కు గురికాకుండా చేసే ఒక సహజ రక్షణలాంటిది.

**చికిత్స ఇలా...**

● కౌన్సిలింగ్ / ప్లే థెరపీ ● బిహేవియర్ థెరపీ ● అవసరమైనప్పుడు మాత్రమే అది కూడా సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలోనే మందులు వాడటం. ● ఎంత త్వరగా చికిత్స చేస్తే ఫలితాలు అంతగా బాగుంటాయి.

**చివరగా...**

డిప్రెషన్ చిన్న పిల్లల్లోనూ కనిపించేందుకు అవకాశమున్న ఒక భావోద్వేగ సమస్య. దీన్ని వైద్య నిపుణుల సహాయంతో నయం చేయవచ్చు. సమయానికి గుర్తించడం, వారి ప్రవర్తనపై తీర్పులు ఇవ్వకుండా ప్రేమ, ఆప్యాయతలతో వారితో పెద్దలు ఎక్కువ సమయం గడపడం ద్వారా, అలాగే నిపుణుల సహాయం తీసుకుంటే వారిని డిప్రెషన్‌ను నుంచి దూరం చేయగలిగితే చిన్నారులు పూర్తిగా ఆరోగ్యంగా కోలుకుని, ఆనందంగా ఎదుగుతారు.



డా॥ గౌతమి నాగభైరవ
సీనియర్ సైకియాట్రిస్ట్

## ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ పోరుకు లక్ష్యసేన్

సిడ్నీ: భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో తుదిపోరుకు అర్హత సంపాదించాడు. ర్యాంకింగ్స్‌లో తనకంటే ఎంతో మెరుగైన స్థానంలో ఉన్న ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)ను లక్ష్యసేన్ కంగు తినిపించాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అతను 17-21, 24-22, 21-16తో రెండో సీడ్ తైవాన్ ప్రత్యర్థిపై చెమటోడ్చి నెగ్గాడు. 86 నిమిషాల పాటు హోరాహోరీగా ఈ పోరు సాగడం విశేషం. ఆదివారం జరిగే ఫైనల్లో జపాన్‌కు చెందిన యుషి తనకతో భారత ఆటగాడు తలపడతాడు. మరో సెమీస్‌లో తనక 21-18, 21-15తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు. 24 ఏళ్ల భారత ప్లేయర్ హాంకాంగ్ ఓపెన్‌లోనూ టైటిల్ బరిలో నిలిచినప్పటికీ ఈ సీజన్‌లో ఇప్పటివరకు టైటిలే సాధించలేకపోయాడు. అన్నీ అనుకూలిస్తే... అదృష్టం కలిసొస్తే సీజన్ ముగిసే ఈ దశలో లక్ష్యసేన్ తొలి టైటిల్‌ను ఇక్కడ గెలుచుకునే అవకాశం ఉంది.

## అనాహత్‌కు టైటిల్

### ఇండియన్ ఓపెన్ స్క్వాష్ టోర్నీ



జోష్నా పైచేయి సాధించేందుకు ప్రయత్నించినా... పట్టువిడవని అనాహత్ కెరీర్‌లో 13వ పీఎస్‌ఏ టైటిల్ ఖాతాలో వేసుకుంది.

**ఇండోర్:** భారత నంబర్‌వన్, రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ ఇండియన్ ఓపెన్ అంతర్జాతీయ స్క్వాష్ టోర్నమెంట్ టైటిల్ కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో భారత్‌కే చెందిన వెటరన్ స్టార్ జోష్నా చినప్పపై అనాహత్ విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ప్రపంచ 33వ ర్యాంకర్ అనాహత్ సింగ్ 3-2 (11-8, 11-13, 11-9, 6-11, 11-9)తో ఒకప్పటి ప్రపంచ టాప్-10 ప్లేయర్ జోష్నా చినప్పపై గెలిచింది. 55 నిమిషాల పాటు సాగిన పోరులో టీనేజ్ స్టార్ అనాహత్ అదరగొట్టింది. ఎదురుగా ఉన్నది సీనియర్ ప్లేయర్ అయినా ఏమాత్రం ఒత్తిడికి గురికాని అనాహత్ చక్కటి స్ట్రోక్ ప్లేతో ఆకట్టుకుంది. ఐదో గేమ్‌లో 6-6తో స్కోర్లు సమమైన దశలో 39 ఏళ్ల

## మహిత్‌కు మరో స్వర్ణం

**న్యూఢిల్లీ:** బధిరుల ఒలింపిక్స్ క్రీడల్లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. ఈ మెగా టోర్నీలో ఇప్పటికే మూడు పతకాలు నెగ్గిన భారత షూటర్ మహిత్ సంధు తాజాగా నాలుగో పతకం ఖాతాలో వేసుకుంది. శనివారం మహిళల 50 మీటర్ల రైఫిల్ 'త్రి' పొజిషన్‌లో మహిత్ స్వర్ణ పతకంతో మెరిసింది. ఫైనల్లో మహిత్ 456 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో మహిత్‌కు ఇది రెండో స్వర్ణం కావడం విశేషం. దక్షిణ కొరియాకు చెందిన డైన్ జెంగ్ 453.5 పాయింట్లతో రజతం దక్కించుకోగా... హంగేరి షూటర్ మిరా జుసన్నా బియాటోజ్‌కీ (438.6 పాయింట్లు) కాంస్యం నెగ్గింది. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో మహిత్ 585 పాయింట్లు సాధించి ప్రపంచ రికార్డుతో ఫైనల్లో అడుగుపెట్టింది. ఆమె నీలింగ్ పొజిషన్‌లో 194 పాయింట్లు, ప్రోన్‌లో 198 పాయింట్లు, స్టాండింగ్‌లో 193 పాయింట్లతో అదరగొట్టింది. గతంలో 576 పాయింట్లతో తన పేరిట ఉన్న వరల్డ్ రికార్డును మహిత్ తిరగరాసింది. ఇదే విభాగంలో పోటీపడిన భారత మరో షూటర్ నటాషా జోషీ 417.1 పాయింట్లతో ఐదో స్థానానికి పరిమితమైంది. ఈ పోటీల్లో భారత షూటర్లు ఇప్పటి వరకు 14 పతకాలు (5 స్వర్ణాలు, 6 రజతాలు, 3 కాంస్యాలు) గెలుచుకున్నారు.

## రెండో గేమ్‌లూ 'డ్రా'

**పనాజీ:** 'ఫిడే' ప్రపంచ కప్ చెస్ టోర్నీ తుది మజిలీకి చేరుతున్న తరుణంలో వరుస 'డ్రా'ల పరంపరతో గేమ్‌లు టైబ్రేక్‌కు వెళుతున్నాయి. రెండు సెమీఫైనల్ పోటీల రెండో గేమ్‌లలో కూడా ఆటగాళ్లు డిఫెన్స్‌కు ప్రాధాన్యత నివ్వడంతో అవి 'డ్రా'గానే ముగిశాయి. వె యి (చైనా)తో జరిగిన గేమ్‌ను ఆండ్రీ ఎసిపెంకో (రష్యా) డ్రా చేసుకోగా... ఉజ్బెకిస్తాన్ సహచరులు జావొఖిర్ సిందరోవ్, నొదిర్బెక్ యకుబొవ్‌ల మధ్య గేమ్ కూడా 'డ్రా'నే అయ్యింది. ఆశ్చర్యకరంగా సెమీస్ పోరులో ఏ ఒక్క గ్రాండ్‌మాస్టర్ రిస్క్ తీసుకోలేదు. నలుగురు కూడా సేఫ్ గేమ్ ఆడటంతో వరుసగా రెండో రోజు శనివారం గేమ్‌లు కూడా డ్రా అయ్యాయి. శుక్రవారం ఇరు జోడీల మధ్య జరిగిన తొలి గేమ్‌లు కూడా డ్రా కావడంతో ఇప్పుడు ఫైనలిస్టులెవరో టైబ్రేక్ తేల్చనుంది. ఆదివారం టైబ్రేక్ పోటీలు నిర్వహిస్తారు.

యాషెస్ తొలి టెస్టులో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా ఘనవిజయం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# భారత బౌలర్ల పైచేయి

- తొలి రోజు దక్షిణాఫ్రికా 247/6
- కుల్దీప్‌కు 3 వికెట్లు

బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్... టాస్ గెలిచిన తర్వాత తొలి వికెట్‌కు 82 పరుగుల శుభారంభం... ఆ తర్వాతా బవుమా, స్టబ్స్ కీలక భాగస్వామ్యం... అయినా సరే దక్షిణాఫ్రికా తొలి రోజును సంతృప్తికరంగా ముగించలేకపోయింది. మెరుగ్గానే మొదలు పెట్టినా ఒక్కరూ కనీసం అర్ధ సెంచరీ కూడా సాధించలేకపోయారు. భారత బౌలర్లు సరైన సమయంలో కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని నిలువరించారు. ముఖ్యంగా కుల్దీప్ యాదవ్ పదునైన బౌలింగ్‌తో తొలి రోజు టీమిండియా పైచేయి సాధించింది. నేడు మిగిలిన నాలుగు వికెట్లను భారత్ ఎంత తొందరగా పడగొడుతుందో చూడాలి.

కుల్దీప్‌కు సహచరుల అభినందన

**గువహటి:** భారత్‌తో మొదలైన రెండో టెస్టులో తొలి రోజు దక్షిణాఫ్రికా బ్యాటింగ్ తడబడింది. శనివారం ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (112 బంతుల్లో 49; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా, కెప్టెన్ తెంబా బవుమా (92 బంతుల్లో 41; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 84 పరుగులు జోడించారు. ప్రస్తుతం సెనూరన్ ముత్తుసామి (25 బ్యాటింగ్), కైల్ వెరీన్ (1 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ (3/48) రాణించగా, బుమ్రా పొదుపుగా బౌలింగ్ చేశాడు. కోల్‌కతా టెస్టులో ఆడిన భారత జట్టులో రెండు మార్పులు జరిగాయి. గిల్, అక్షర్ స్థానాల్లో సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ రెడ్డి టీమ్‌లోకి వచ్చారు. దక్షిణాఫ్రికా కార్బిన్ బాష్ స్థానంలో ముత్తుసామికి అవకాశం కల్పించింది.

**శుభారంభం...**

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ఎయిడెన్ మార్క్‌రమ్ (81 బంతుల్లో 38; 5 ఫోర్లు), ర్యాన్ రికెల్టన్ (82 బంతుల్లో 35; 5 ఫోర్లు) జాగ్రత్తగా మొదలు పెట్టారు. మార్క్‌రమ్ ఖాతా తెరిచేందుకు 17 బంతులు తీసుకున్నాడు. అయితే బుమ్రా బౌలింగ్‌లో 4 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద మార్క్‌రమ్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను స్లిప్‌లో రాహుల్ వదిలేశాడు. నితీశ్ కుమార్‌తో 4 ఓవర్లు వేయించగా అతను 21 పరుగులు ఇచ్చాడు. తొలి సెషన్‌లో ఈ భాగస్వామ్యం మరింత బలపడుతున్న దశలో బుమ్రా బ్రేక్ ఇచ్చాడు. చక్కటి బంతితో మార్క్‌రమ్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో టీ విరామం లభించింది. రెండో సెషన్‌లో రెండో బంతికే రికెల్టన్‌ను అవుట్ చేసి కుల్దీప్ తన విలువను ప్రదర్శించాడు.

**కీలక భాగస్వామ్యం...**

రెండో సెషన్‌లో స్టబ్స్, బవుమా పార్ట్‌నర్‌షిప్ దక్షిణాఫ్రికాను ఆదుకుంది. వీరిద్దరు ఓపిగ్గా చక్కటి డిఫెన్స్‌తో ఆడుతూ స్కోరు బోర్డును నడిపించారు. 27 పరుగుల వద్ద జడేజా బౌలింగ్‌లో బవుమా అదృష్టవశాత్తూ అంపైర్ రివ్యూలో త్రుటిలో ఎల్బీగా అవుట్ కాకుండా బతికిపోయాడు. స్పిన్నర్లు ప్రభావం చూపడంతో పరుగులు రావడం కష్టంగా మారిపోయింది. లంచ్ తర్వాత పూర్తిగా భారత బౌలర్ల ఆధిపత్యం కొనసాగి దక్షిణాఫ్రికా వరుసగా వికెట్లు చేజార్చుకుంది. జడేజా బౌలింగ్‌లో పేలవ షాట్‌తో బవుమా వెనుదిరిగాడు. ఆ తర్వాత తక్కువ వ్యవధిలో స్టబ్స్, ముల్డర్ (13)లను అవుట్ చేసి కుల్దీప్ దెబ్బ తీశాడు. అయితే టోనీ జోర్జీ (59 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్), ముత్తుసామి కలిసి మళ్లీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేస్తూ 45 పరుగులు జోడించారు. అయితే కొత్త బంతితో తన తొలి ఓవర్లోనే జోర్జీని సిరాజ్ పెవిలియన్ పంపించాడు. అదే ఓవర్లో మరో నాలుగు బంతుల తర్వాత వెలుతురు మందగించడంతో నిర్ణీత ఓవర్లలో మరో 8.1 ఓవర్లు ఉండగానే అంపైర్లు ఆటను నిలిపివేశారు. దక్షిణాఫ్రికా టాప్-5 బ్యాటర్లంతా 25-49 మధ్యలోనే పరుగులు చేశారు. టెస్టు క్రికెట్‌లో ఇలా జరగడం ఇది మూడో సారి మాత్రమే.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (బి) బుమ్రా 38; రికెల్టన్ (సి) పంత్ (బి) కుల్దీప్ 35; స్టబ్స్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 49; బవుమా (సి) జైస్వాల్ (బి) జడేజా 41; జోర్జి (సి) పంత్ (బి) సిరాజ్ 28; ముల్డర్ (సి) జైస్వాల్ (బి) కుల్దీప్ 13; ముత్తుసామి (బ్యాటింగ్) 25; వెరీన్ (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (81.5 ఓవర్లలో 6 వికెట్లకు) 247. **వికెట్ల పతనం:** 1-82, 2-82, 3-166, 4-187, 5-201, 6-246. **బౌలింగ్:** బుమ్రా 17-6-38-1, సిరాజ్ 17.5-3-59-1, నితీశ్ రెడ్డి 4-0-21-0, సుందర్ 14-3-36-0, కుల్దీప్ 17-3-48-3, జడేజా 12-1-30-1.

### కెప్టెన్‌లకు జ్ఞాపిక

గువహటిలో తొలి టెస్టు కావడంతో మ్యాచ్ ఆరంభానికి ముందు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్టేడియం బొమ్మ ముద్రించిన చిత్రపటంపై ఇరు జట్ల కెప్టెన్లు తమ ఆటోగ్రాఫ్‌లు చేసి అస్సాం క్రికెట్ అసోసియేషన్‌కు అందించారు. అనంతరం బీసీసీఐ కార్యదర్శి, అస్సాంకే చెందిన దేవజిత్ సైకియా తమ తరపున పంత్, బవుమాలకు ప్రత్యేక జ్ఞాపికలు అందజేశారు. అధికారిక లెక్కల ప్రకారం బర్సపర మైదానంలో తొలి రోజు 15,448 మంది ప్రేక్షకులు హాజరయ్యారు.

# సాక్షి సినిమా

## మోహన రాగ...

మంచు మనోజ్

మంచు మనోజ్ కొత్త ప్రయాణం ప్రారంభించారు. 'మోహన రాగ' పేరుతో ఓ మ్యూజిక్ సంస్థని ఆరంభించారాయన. 'లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్' అనే క్యాప్షన్‌తో మన సంగీతాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసేందుకు ఈ మ్యూజిక్ లేబుల్‌తో తనదైన ప్రయత్నం చేయనున్నారాయన. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ''సంగీతం మీద నాకు ఉన్న ప్రేమే 'మోహన రాగ' మ్యూజిక్ లేబుల్ స్థాపించే స్ఫూర్తిని ఇచ్చింది. ఫ్రెష్ సౌండ్స్, బోల్డ్ టాలెంట్, ఫియర్‌లెస్ క్రియేటివిటీని మా మ్యూజిక్ లేబుల్ ద్వారా సంగీత ప్రపంచానికి పరిచయం చేస్తాం'' అన్నారు మనోజ్.

## మ్యూజిక్ జాతరకి రెడీ

సతీష్ వర్మ, రమణ గోగుల, రామ్ కట్టాల

ప్రముఖ సంగీత దర్శకుడు రమణ గోగుల 'ఆస్ట్రేలియా టు అమెరికా' పేరుతో గ్లోబల్ కాన్సర్ట్ టూర్ నిర్వహించనున్నారు. మామా క్రియేటివ్ స్పేస్, టాప్ నాచ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆస్ట్రేలియా సంయుక్తంగా 'ఇన్ కాన్వర్జేషన్స్ విత్ ది ట్రావెలింగ్ సోల్జర్-రమణ గోగుల ఆస్ట్రేలియా టూర్ ఫిబ్రవరి 2026' పేరిట ఈ కాన్సర్ట్ చేపట్టనున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మెల్‌బోర్న్ మామా క్రియేటివ్ స్పేస్ వ్యవస్థాపకుడు సతీష్ వర్మ మాట్లాడుతూ- ''2026 ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా పర్యటనతో ఈ ప్రపంచ యాత్ర ప్రారంభమవుతుంది. యూకే, అమెరికా పర్యటనలూ ఉంటాయి. ఈ టూర్ కోసం టీమ్ అందరికీ ఎక్సెల్ గ్లోబల్ సర్వీసెస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామ్ కట్టాల వీసాలు అందించారు'' అని చెప్పారు

## సపోర్ట్ లేకుండా నిరూపించుకోవాలనుకున్నాను

చైతన్య జొన్నలగడ్డ

అఖిల్ రాజ్, తేజస్విని జంటగా, చైతన్య జొన్నలగడ్డ కీ రోల్ చేసిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈటీవీ విన్ ప్రొడక్షన్స్‌లో సాయిలు కంపాటి దర్శకత్వంలో డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదలైంది. బన్నీ వాసు, వంశీ నందిపాటి రిలీజ్ చేశారు. శనివారం చైతన్య జొన్నలగడ్డ విలేకరులతో మాట్లాడుతూ- ''బబుల్‌గమ్, హిట్ 3' వంటి చిత్రాల్లో నటించాను కానీ చాలామందికి తెలియదు. ఇప్పుడు 'రాజు వెడ్స్ రాంబాయి'లో నేను చేసిన వెంకన్న పాత్రకు, సినిమాకూ మంచి స్పందన లభిస్తుండటం హ్యాపీ. నేను లీడ్ రోల్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో ఓ సినిమా రావాల్సింది. ఆ సినిమా పనుల్లో ఉన్న నాకు దివ్యాంగుడు వెంకన్న రోల్ చేసే చాన్స్ వచ్చింది. ఈ పాత్ర కోసం చీకట్లో కుంటడం ప్రాక్టీస్ చేశాను. హీరో సిద్ధు జొన్నలగడ్డ నా బ్రదర్ అని చెప్పి, తన పేరు ఉపయోగించుకోవాలనుకోలేదు. ఏ సపోర్ట్ లేకుండా నిరూపించుకోవాలనుకున్నాను. 'రాజు వెడ్స్ రాంబాయి'లో నా నటనను మెచ్చుకుంటూ సిద్ధు మెసేజ్ చేశాడు. ప్రస్తుతం పవన్ సాధినేని దర్శకత్వంలో 'ఆకాశంలో ఒక తార' సినిమా చేస్తున్నాను. పవన్ డైరెక్షన్‌లోనే రాజశేఖర్‌గారు హీరోగా చేస్తున్న 'మగాడు' సినిమాలో నటించాను'' అన్నారు.

## అదృష్టం కాదు... అంకితభావం ఉండాలి

**- యువతరం నటీనటులకు సుహాసిని, ఖుష్బూ సలహా**

వేదికపై అభినయిస్తున్న సుహాసిని, ఖుష్బూ

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఓ వర్క్ షాప్ సందేశాత్మక సంభాషణకు వేదికైంది. ప్రముఖ తారలు సుహాసిని-ఖుష్బూ ఈ వర్క్‌షాప్‌లో తమ అనుభవాలు, అభిప్రాయాలు, నటనలో మెళకువలను పంచుకున్నారు. తన ప్రశ్నలు తానే వేసుకుని తానే సమాధానాలు చెప్పడం ద్వారా సుహాసిని ఆసక్తిని పెంచగా, ఖుష్బూ తన అనుభవాలను పంచుతూ, హాజరైనవారిని అలరించారు.

**సంపూర్ణంగా అంకితం కావాలి...** నటన అంటే ఏ కేటగిరీ అయినా సంపూర్ణ అంకితభావం తప్పనిసరి అని వీరిద్దరూ స్పష్టం చేశారు. ''పారలల్ సినిమా-కమర్షియల్ సినిమా అని తేడా లేదు. ఏ సినిమా కైనా పని తీరు మాత్రం ఒకటే'' అని ఖుష్బూ స్పష్టం చేశారు.

చిత్రకళ, కెమెరా టెక్నిక్‌లలో శిక్షణ పొందిన సుహాసిని సాంకేతిక అంశాలపై సూచనలు ఇచ్చారు. ''ఐ లైన్స్, టైమింగ్, కెమెరా ఎలా పని చేస్తాయో తెలుసుకోండి. కెమెరాను ఎలా డీల్ చేయాలో నేర్చుకోండి. రియలిజయ్ కూడా ఓ స్థాయి దాటకూడదు'' అని సూచనలు చేశారు. నటీనటులు సంభాషణలను ఎప్పుడూ తమ స్వభాషలో నేర్చుకోవాల్సిందేనని ఆమె పేర్కొన్నారు. ఇద్దరూ తమ తరానికి చెందిన క్రమశిక్షణను నేటి యువతకు చెప్పారు. ''15 నిమిషాల్లో మేకప్ పూర్తి చేయడం, సమయాన్ని గౌరవించడం వంటి విషయాల్లో బాధ్యతగా ఉండాలి'' అని ఖుష్బూ తెలిపారు. సుహాసిని తనకు ఎదురైన తొలి వైఫల్యం గురించి చెప్పిన విషయం ప్రేక్షకుల నుంచి చప్పట్లను అందుకుంది. ''నా తొలి తెలుగు సినిమా (కొత్త జీవితాలు) సూపర్ ఫ్లాప్. కానీ 100 తెలుగు సినిమాలు చేశాను. అదృష్టాన్ని కాదు... నిరంతర కృషినే నమ్మాలి... విజయానికి మూలం అదే అన్నారు. ''యాక్షన్-కట్ మధ్యలోనే జననం-మరణం అన్నట్టు ఉంటుంది'' అన్నారు సుహాసిని.

'మీలోని చిన్నప్పటి నటి ఇప్పుడు మీకు ఎదురైతే మీరు ఏం చెప్పాలనుకుంటారు?' అన్న ప్రేక్షకుల ప్రశ్నకు ''ఇంకా కొంచెం బాగా చేయమని చెబుతాను'' అని ఖుష్బూ చెప్పగా, ''నేను కొన్ని అర్థం చేసుకోవడంలో నా చిన్నప్పటి స్థితి చూసి సిగ్గుపడతాను. స్వేచ్ఛగా ఉండమని చెబుతాను'' అన్నారు సుహాసిని. ఇక ఓ పాటకు ఖుష్బూ పెదాలు కదపగా, శాస్త్రీయ అభినయంతో సుహాసిని ఆకట్టుకున్నారు.

**- గోవా నుంచి 'సాక్షి' ప్రతినిధి**

## నవ్వుకోవాలంటే మా సినిమాకి వెళ్లండి

గోవిందరాజు, రాజ్ తరుణ్, రాశీ, రామ్, మాధవి

''పాంచ్ మినార్' సినిమా ఆడుతున్న థియేటర్స్‌కి వెళ్లాం... నా సినిమాని జనాలంతా ఎంజాయ్ చేయడం చూసి చాలా రోజులైంది. 'పాంచ్ మినార్' చూస్తూ ప్రేక్షకులందరూ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. చాలా హ్యాపీగా ఉంది'' అని రాజ్ తరుణ్ చెప్పారు. రాజ్ తరుణ్, రాశీ సింగ్ జోడీగా రామ్ కడుముల దర్శకత్వంలో నటించిన చిత్రం 'పాంచ్ మినార్'. గోవింద రాజు సమర్పణలో మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. శనివారం జరిగిన సక్సెస్ మీట్‌లో- ''మా సినిమా చూసి బయటికొస్తున్న ప్రేక్షకుల ముఖాల్లో ఆనందం కనిపించింది. అది మాకు గొప్ప సక్సెస్'' అని గోవిందరాజు, మాధవి చెప్పారు. ''పాంచ్ మినార్' రాజ్ తరుణ్ కమ్ బ్యాక్ మూవీ అని చెప్పాను. ఇప్పుడూ అదే చెబుతున్నా'' అన్నారు రామ్ కుడుముల.

## సమజైందా...

హరీష్ కల్యాణ్

హరీష్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా సినిమాకు 'దాషమక్కాన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో ప్రీతీ ముకుందన్ హీరోయిన్. వినీత్ వరప్రసాద్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ చిత్రం టైటిల్ ప్రోమో శనివారం విడుదలైంది. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. 'అన్నా కోడి దొరికింది.. అట్లనే తెమ్మంటవా.. పీసులు తెమ్మంటవా.., గుర్తుపట్టద్దు చూడు... ఏం చేసినా మంచిదే... గింత పీస్ కూడా మిస్ కావొద్దు... సమజైందా' వంటి డైలాగ్స్‌తో పాటు ఓ ర్యాప్ సాంగ్ బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపిస్తుంది. ఈ చిత్రానికి సంగీతం: బ్రిట్టో మైఖేల్.

## మహిళ పోరాటం

రాయ్ లక్ష్మీ

రాయ్ లక్ష్మీ లీడ్ రోల్‌లో నటించిన లేడీ ఓరియంటెడ్ మూవీ 'జనతా బార్'. అమన్ ప్రీత్‌సింగ్, దీక్షా పంత్, శక్తి కపూర్, అనూప్ సోని, సురేష్ భూపాల్ ఇతర పాత్రలు పోషించారు. అశ్వర్థ నారాయణ సమర్పణలో రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. ''స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకున్న మహిళలపై ఆ విభాగంలోని ఉన్నతాధికారులు చేస్తున్న లైంగిక వేధింపులకు చరమగీతం పాడటానికి ఓ మహిళ ఎలాంటి పోరాటం చేసింది? అన్నదే 'జనతాబార్' కథ. మహిళల్లో చైతన్యం నింపే చిత్రమిది'' అని రమణ మొగిలి అన్నారు.

## ఓటీటీ ఇది చూడొచ్చు

## ఇది హాస్యప్రియమ్

**ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం అవిహితమ్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.**

కల్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగదంటారు అన్నది నాటి నానుడైతే అనుమానమొచ్చినా ఆనందమొచ్చినా ఆపుకోలేరన్నది నేటి మాట. అనుమానమొస్తే మాత్రం అది తెలుసుకునేంతవరకు నిద్రపట్టదు కొందరికి. తమకు సగమే తెలిసిన గోరంత విషయాన్ని కొండంత చేసి, అవతలి వాళ్ళలో అనుమానపు బీజాలు నాటే బడా బాబులు చాలామందే ఉంటారు. మరీ ముఖ్యంగా ఇలాంటివాళ్ళ వల్లే పల్లెటూళ్ళలో కొన్ని చోట్ల గాలివార్తలకు కొదవ లేకుండా పోతుంది. వాళ్ళను దృష్టిలో ఉంచుకుని రాసిన కథే ఈ 'అవిహితమ్'. వైవిధ్యానికి పెద్ద పీట వేసుకుంటూ తమ ప్రేక్షక పరిధిని ఈ ఓటీటీ కాలంలో పెంచుకుంటూ పోతున్న మలయాళ సినీ పరిశ్రమ నుండి వచ్చిన మరో మణిమాణిక్యమే ఈ 'అవిహితమ్'.

ఇది నిజంగా హాస్యప్రియమ్ అని చెప్పాలి. చిన్న పాయింట్‌తో దాదాపు రెండు గంటలపాటు ప్రేక్షకుడిని కదలకుండా కట్టిపడేశారు ఈ సినిమా దర్శకుడు సెన్నా హెగ్డే. ఈ 'అవిహితమ్'లో అంతలా ఏముందో ఓసారి చూద్దాం. అది ఓ మారుమూల పల్లెటూరు. ప్రకాశన్ అనే వ్యక్తి ఓ రోజు రాత్రి ఫ్రెండ్స్‌తో మందు పార్టీ ముగించుకుని తన ఇంటికి వెళ్ళబోతుండగా దొంగతనంగా సన్నిహితంగా ఉన్న ఓ జంటను వడ్రంగి మాధవన్ ఇంటి పరిసరాల్లో చూసి అవాక్కవుతాడు. ఆ జంట ప్రతి రోజూ ఓ సమయంలో కలవడంతో పాటు ఆ జంటలో మాధవన్ వదిన నిర్మల ఉందన్న విషయాన్ని గుర్తుపట్టి, ఇదే విషయాన్ని ఊళ్ళో కాస్త పెద్ద తరహాగా వ్యవహరించే టైలర్ వేణన్నకు చెబుతాడు ప్రకాశన్. మాధవన్‌కు ఈ విషయాన్ని ఆ వేణన్న చేరవేస్తాడు. మాధవన్ ఈ విషయాన్ని తన తండ్రికి, అలాగే తన సోదరుడు ముకుందన్‌కు చెబుతాడు. అలా మెల్ల మెల్లగా ఊరంతా ఈ విషయం పాకి పోతుంది. ఆ జంటను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడానికి ఊరంతా ఏకమై ఓ పెద్ద ఆపరేషనే చేపడతారు. మరి... ఈ ఆపరేషన్‌లో ఆ జంట దొరికిపోతుందా? దొరికిన తరువాత మాధవన్ కుటుంబంతో పాటు ఊరి ప్రతిస్పందన ఎలా ఉంటుందనే విషయాన్ని 'అవిహితమ్'లోనే చూడాలి. ఈ సినిమా మొత్తం ఓ అనుమానంతో ప్రారంభమైతే చూసే ప్రేక్షకులకు కూడా ఆ అనుమానం నివృత్తి చేసుకోవాలనే తపన అంతకంతకూ పెరుగుతుంది. హాట్ స్టార్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా లభ్యమవుతోంది. ఈ 'అవిహితమ్' హాస్యప్రియమ్ కాబట్టి ఇది ప్రేక్షకప్రియమ్. మస్ట్ వాచ్ ఫర్ ది వీకెండ్.

**– హరికృష్ణ ఇంటూరు**

## వధువు కావలెను



SC మాల & క్రిస్టియన్/ కట్నం ప్రసక్తి లేదు / M.Tech, IIT / Govt.A.E.E / ట్రాన్స్‌కో/ 18 Lakhs PA / 5'8"ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-16152]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు / B.Tech / C. Govt. బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM/ 5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16152]

రెడ్డి, 35 సం॥, డిగ్రీ. ఎలాంటి చెడు వ్యసనాలు, ఏ బాదరబందీ లేని యువకుడికి తగిన వధువు కావలెను. ఇల్లరికం/విడో OK. నో బ్రోకర్స్. డైరెక్ట్ వాట్సప్ ✆ 83674 47955 [B-1275527]

★★

డైరెక్ట్ కాంటాక్ట్: (నో బ్రోకర్స్) ఆర్యవైశ్య 43 Yrs 5'.5", బిజినెస్, జాబ్, 30 కోట్ల స్థిరాస్తి గల అబ్బాయికి అందమైన 1వ, 2వ అమ్మాయి కావలెను 7995585722, 7680872085 [T-2622]

## వరుడు కావలెను

రెడ్డి/విడో/కుల, ఆస్తి పట్టింపు లేదు/అన్ని వయస్సుల వారికి 1st&2nd మ్యారేజ్‌లు మా వద్ద కలవు/ 43yrs/Govt.Job/సొంత ఇల్లు, స్థిర ఆస్తి గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఓకే) Ph: 9063623252 [H-801303]

రెడ్డి/2nd (కుల,ఆస్తి) పట్టింపు లేదు, Age: 32 Q: MBA/ సొంత వ్యాపారం, ఇల్లు, మంచి ప్రాపర్టీస్ గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st& 2nd సంబంధాలు కలవు. Ph: 9573002847 [H-801303]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 35/ Q: Degree. Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK). Ph: 8074131208 [H-801303]

## అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills ( TV - 9, Opp: Colony ) ( Near The Leela Hotel ) Hyderabad. ( Tuesday & Wednesday Holiday ) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

### వధువు కావలెను

రెడ్డి Business, BE, 29, 6', 200 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), 27, 6', Product Engineer, 24 L P/A, 20 Crores. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, MBA (ISB), 32, 5' 11", Manager, 36 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

### వరుడు కావలెను

రెడ్డి Business, B Pharma (BITS), MBA, 26, 5' 4", Hyd, Very Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 4", Accenture, 6 Crores, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 8", Sr. SWE, 25 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, ME, MS, 27, 5' 10", SWE, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS, 29, 5' 6", Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, Residency Doctor, 31, 5' 7", USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 33, 5' 8", Engineer, 6 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 24, 5' 3", 40 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 3", Engineer, 250 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 25, 5' 8", Doctor, 20 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE (IIT), 28, 5' 3", 53 L P/A, Hyderabad, Rich, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

వెలమ/48y/ Govt.Job/VRS/90pm/ Bar & Restaurant/30ఎ 6 Lax PM కోట్ల ప్రాపర్టీ గల పూర్తి ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు FC/ BC ఇల్లరికం, పిల్లలు ఉన్నా ఓకే. 6309480414 [H-801303]

కమ్మ/50Y/ విడో/ Postal Job / Own డెయిరీ ఫామ్/79 ఏకర్స్ ల్యాండ్/ Granite Showroom / 35 Lakhs Income, 52 Cr ప్రాపర్టీ వధువుకి వరుడు కావలెను. 6304494883 [H-801303]

క్రిస్టియన్ మాల / 27 / 5'4"/M.Tech/ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్/1 Lakh. PM/చాలా అందమైన వధువుకు క్రిస్టియన్/ హిందూ వరుడు కావలెను. Ph: 8919759359 [HA-16152]

రజక/B.Tech / C.Govt. క్లర్క్ & క్యాషియర్/SBI/45000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16152]

45 సం॥లు వధువుకు పెన్షనర్ వరుడు కావలెను. ఆల్‌టైప్స్, 1వ, 2వ, Govt. పెన్షనర్, ఇల్లరికం మ్యాచెస్ కలవు. లేడీస్‌కి ఫ్రీ సర్వీసెస్, ఫాస్ట్ సెటిల్‌మెంట్. Ph: 6281147818 [HA-16152]

★★

రెడ్డి/ విడో / 50y / 5'5" / మార్బుల్ & గ్రానైట్ బిజినెస్ / 1 LPM / సొంత ఇల్లు / ఆంధ్రాలో పొలాలు / పిల్లలు లేని వధువుకి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. Ph: 9100867741 [H-821220]

## వేదికలు

కాకతీయ మ్యారేజస్ వారి అన్ని బ్రాంచెస్‌లో పేదలకు ఫీజు లేకుండా అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. Ph: 9391 999 999 / 917 789 7788 [H-821108]

★★

క్రైస్తవ వివాహ పరిచయ వేదిక. నవంబర్ 29, శనివారం 10am-4pm @ విజయవాడ , న్యూ అయోధ్యనగర్, గాస్పెల్ హాల్ క్రిస్టియన్ అసెంబ్లీలో, వాట్సాప్ 7075917771 www.christianholymatrimony.com [HA-2136]

## గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహవేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు
3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

| | | |
|---|---|---|
| AP+TS+Metros: (Chennai + Bengaluru + Delhi + Mumbai) | 1800/- for 4 Lines | 485/- Extra Line |
| Telangana: (Incl. Hyd) | 1100/- for 4 lines | 300/- Extra Line |
| Andhra Pradesh: (Incl. Hyd) | 1350/- for 4 Lines | 375/- Extra Line |

* Color 25% Extra | గమనిక: ప్రకటనలపై 5% GST అదనం

అనంతపూర్ - 9912220718 | గుంటూరు - 9912220356 | కర్నూలు - 9010825556 | విజయవాడ - 7995554534 | YSR కడప - 9951602932 | తాడేపల్లిగూడెం - 9912220558 | తిరుపతి - 9912220586 | రాజమండ్రి - 9912220358 | నెల్లూరు - 9951602861 | విశాఖపట్నం - 9912220550 | ఒంగోలు - 9912225431 | శ్రీకాకుళం - 9912220343

సాక్షి కార్యాలయంలో లేదా ఫోన్ ద్వారా సంప్రదించగలరు, 9912225442, sakshivjc@gmail.com

# అండమాన్‌లో అల్పపీడనం

**24న వాయుగుండం, 26న తుపానుగా మారే అవకాశం**

**28 నుంచి రాష్ట్రంలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు**

**సాక్షి, అమరావతి:** మలక్కా జలసంధిపై ఉన్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో అండమాన్ సముద్రంలో శనివారం అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది పశ్చిమ, వాయవ్య దిశగా కదులుతూ ఈ నెల 24 నాటికి వాయుగుండంగా బలపడుతుందని పేర్కొంది. 26 నాటికి మరింత బలపడి తుపానుగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో రైతులు వెంటనే కుప్పలు వేసుకోవాలని.. ధాన్యం వర్షంలో తడవకుండా సురక్షితంగా భద్రపరచుకోవాలని కోరారు.

# ఈనాడుకు, లూథ్రాకు ఇచ్చేందుకు డబ్బులుంటాయా?

## రైతులకు ఇచ్చేందుకు మనసు రాదా?

- లోకల్‌గా ధాన్యం కొనే దిక్కులేదు కానీ అంతర్జాతీయ మార్కెటింగా..
- సీఎం చంద్రబాబును సూటిగా ప్రశ్నించిన మాజీ మంత్రి పేర్ని నాని

**సాక్షి,అమరావతి:** ప్రకటనలు, ఉత్సవాల పేరుతో ఈనాడు పేపర్‌కి, వైఎస్సార్‌సీపీ నాయకుల మీద పెట్టిన తప్పుడు కేసులు వాదించే సిద్ధార్థ లూథ్రాకి ఇవ్వడానికి చంద్రబాబు సర్కారు వద్ద డబ్బులుంటాయి కానీ పంట నష్టపరిహారం ఇవ్వడానికి, గిట్టుబాటు ధర కల్పించడానికి మాత్రం డబ్బులుండవా అని కృష్ణా జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) సీఎం చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం పేర్ని మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 30 ఏళ్లుగా అమలవుతున్న వ్యవసాయ విధానాలనే పంచసూత్రాల పేరుతో చంద్రబాబు మార్కెటింగ్ చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచి కర్ణాటక రాష్ట్రం కృష్ణా జలాలు తరలించుకుపోతుంటే చంద్రబాబు ప్రభుత్వం నీటి భద్రత పేరుతో రైతులకు కాకమ్మ కథలు చెబుతోందని మండిపడ్డారు. చంద్రబాబు సీఎం అయ్యాక వాస్తవం చూస్తే కెనాల్స్ కింద లాకు గుమాస్తాలు, సూపర్‌వైజర్లే సరిగా లేరని స్పష్టం చేశారు. వరి కోత మెషీన్లకు గతంలో వైఎస్సార్‌సీపీ పాలనలో గంటకు రూ.2,500 తీసుకుంటే ఇప్పుడు రూ.4,500 తీసుకుంటున్నారని, అగ్రిటెక్ గురించి మాట్లాడే చంద్రబాబుకు ఈ విషయం తెలుసా అని ప్రశ్నించారు. రైతులకు కనీసం గన్నీ బ్యాగులే ఇవ్వలేని చంద్రబాబు పంచ సూత్రాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పంట నష్టపరిహారం కింద ఎకరాకు రూ.20 వేలు ఇవ్వాలని, రబీ కోసం ఉచిత పంటల బీమాను అమలు చేయాలని, డెల్టాలో రబీ సాగుకు అనుమతివ్వాలని వైఎస్సార్‌సీపీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### రైతాంగ సమస్యలపై మోదీని ఒక్కసారైనా అడిగారా?

''గత రెండు రోజులుగా రైతులకు పంచ సూత్రాలు అంటూ చంద్రబాబు పాత పాటనే కొత్త రాగంలో పాడుతున్నారు. కింగ్ మేకర్‌ని, డబుల్ ఇంజిన్ సర్కార్ అని బాబు గొప్పలు చెప్పుకుంటారు. కేంద్రం ఆయన చెప్పుచేతల్లో ఉందంటారు. ఆయన చెప్పేది నిజమైతే ఏపీకి నష్టం చేస్తూ కర్ణాటక ఆల్మట్టి ఎత్తు పెంచి కృష్ణా జలాలను ఎలా తరలించుకుపోతోంది? దోచుకున్నది దాచుకోవడానికి తండ్రీ కొడుకులు నెలకోసారి దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా వెళ్లడం తప్పించి వీరి వల్ల రాష్ట్రానికి జరిగిన మేలు ఒక్కటైనా ఉందా? 18 నెలల్లో పదుల సార్లు ప్రధాని మోదీని కలిసిన చంద్రబాబు, రైతుల సమస్యలపై ఎందుకు చర్చించడం లేదు? ప్రధానికి రాసిన లేఖలు ఏమయ్యాయని ఒక్కసారైనా అడిగారా? చంద్రబాబు పాలనలో ఏపీలో పండించిన ధాన్యాన్ని తెలంగాణలో అమ్ముకోవడానికి దిక్కులేకపోతే ప్రపంచ మార్కెటింగ్ అంటున్నారు. రైతన్న మీకోసం.. అంటూ నవంబర్ 24 నుంచి కొత్త కార్యక్రమం అంటున్నారు. ఎమ్మెల్యేలు, అధికారులు ఇంటికొస్తే చొక్కా పట్టుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. పోలీసు భద్రత లేకుండా కూటమి ఎమ్మెల్యేలకు ప్రజల్లోకి వచ్చే దమ్ముందా?'' అని పేర్ని నాని సవాల్ చేశారు.

''18 నెలల చంద్రబాబు పాలనలో అతివృష్టి అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోతుంటే నష్టపరిహారం ఇవ్వకపోగా, దాన్ని ఎగ్గొట్టేందుకు సర్కారు యత్నిస్తోంది. పంట నష్టం తుది నివేదికలో తక్కువ చేసి చూపించిన దుర్మార్గ ప్రభుత్వం ఏపీలో పాలన సాగిస్తోంది. ఏ పంట వేసినా రైతు కంట కన్నీరే. ఒక్క రూపాయి చెల్లించి సర్కారు ఆదుకున్న దాఖలాలు లేవు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు తీసుకున్నాక జగన్ హయాంలో కన్నా ఒక్క పంటకైనా ఎక్కువ ధర పలికితే చూపించాలని సవాల్ విసురుతున్నా. అగ్రిటెక్ కనిపెట్టానని చంద్రబాబు చెబుతున్నారు. ఆయన రాకముందే రైతులు వ్యవసాయంలో డ్రోన్లు వాడుతున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ గురించి మాట్లాడే చంద్రబాబు కొత్తగా ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మొదలు పెట్టి ఉంటే చూపించాలి. మామిడి, టమాట రైతులను ఆదుకున్నారా? ప్రకటనల పేరుతో ఈనాడుకు, కేసుల పేరుతో లూథ్రాకు, తండ్రీకొడుకుల షికార్లకు విమానాలు, హెలికాప్టర్లకు డబ్బులుంటాయిగానీ రైతులకు ఇవ్వడానికి ఉండవా?'' పేర్ని ప్రశ్నించారు.

**18 నెలలుగా అతివృష్టి లేదా అనావృష్టి..**

## బాబు పాలన రాంగ్ ట్రాక్

**సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ**

**సాక్షి, అమరావతి:** అనంతపురం అర్బన్: సీఎం చంద్రబాబు పాలన పక్కా రాంగ్ రూట్‌లో సాగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాసంక్షేమం లేదన్నారు. రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయని చెప్పారు. శనివారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. బాబు ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల సంక్షేమమే ఎజెండాగా పనిచేస్తోందని దుయ్యబట్టారు. వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తే ఏం ప్రయోజనం అని, అన్నీ ప్రైవేటుపరం చేస్తే ప్రభుత్వం చేసేది ఏముంటుందని ప్రశ్నించారు. పాలన కూడా ప్రైవేటుకు అప్పగిస్తే సరిపోతుందంటూ ఎద్దేవా చేశారు. రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. మామిడి, ఉల్లి, టమాట, అరటి, ఇలా అన్ని పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నా చంద్రబాబు ప్రభుత్వం ఆదుకోకపోవడం శోచనీయమన్నారు.

## 571 ఎకరాల్లో స్పేస్ సిటీ

**సాక్షి, అమరావతి :** తిరుపతి జిల్లా రౌతుసురమాల వద్ద 571 ఎకరాల్లో స్పేస్ సిటీ, కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద 300 ఎకరాల్లో డ్రోన్ సిటీకి ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. సూళ్లూరుపేట ఇస్రో శాటిలైట్ లాంచింగ్ స్టేషన్‌కు 50కి.మీ దూరంలో రౌతుసురమాల వద్ద సుమారు రూ.140.58 కోట్లతో ఈ స్పేస్ సిటీని నిర్మిస్తారు. దీనికి కండలేరు రిజర్వాయర్ నుంచి నీటి వసతితో పాటు ఇతర సదుపాయాలను కల్పించనున్నారు. హైదరాబాద్–బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లు వద్ద 300 ఎకరాల్లో రూ.89.4 కోట్లతో డ్రోన్ సిటీని నిర్మించనుంది. టెండర్ల ప్రక్రియ ముగిసిన తర్వాత 9 నెలల్లో ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొస్తారు.

# మంత్రి ఒం'టెట్టు' పోకడ

## మాటిచ్చి మం'టెట్టే'!

“ఎమ్మెల్సీల విజ్ఞప్తి మేరకు ఇన్ సర్వీస్ టెట్ (టీచర్ఎలిజిబులిటీ టెస్ట్)పై సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తాం. రద్దుకు కృషి చేస్తామని హామీ ఇస్తున్నాను” గత నెల 28న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటన ఇది. ఈ హామీ ఇచ్చి రెండు నెలలు గడుస్తోంది. టెట్ దరఖాస్తు గడువు నేటితో ముగుస్తోంది. మంత్రి హామీతో పరీక్షకు అర్హులైన టీచర్లు దరఖాస్తు చేసుకోలేదు. ఇప్పుడు అప్పీల్ కాదుగదా.. కనీసం ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించే నిర్ణయం కూడా తీసుకోలేదు. ఫలితంగా ఉపాధ్యాయులు ఇరకాటంలో పడ్డారు.

- ఇప్పటివరకు 'సుప్రీం'లో అప్పీలుకు వెళ్లని బాబు సర్కారు
- చినబాబు హామీతో టెట్‌కు దరఖాస్తు చేయని ఉపాధ్యాయులు
- ఇన్‌సర్వీస్ అర్హులు 1.62 లక్షల మంది.. దరఖాస్తు చేసింది 25 వేల మందే
- రెగ్యులర్ దరఖాస్తులు 2.34 లక్షలు
- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు
- ఆర్టీఈ-2009 చట్టం సవరణ లేకుండా ఇన్‌సర్వీసు టెట్ రద్దు అసాధ్యమంటున్న నిపుణులు
- చట్ట సవరణ కోసం కేంద్రంపై ఒత్తిడి చేయని కూటమి సర్కారు

## ఇన్ సర్వీస్ టెట్ రద్దు హామీ అమలుపై గందరగోళం

**సాక్షి, అమరావతి:** ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్)కు ఇన్‌సర్వీస్ టీచర్ల నుంచి స్పందన అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. గతనెల 23న విద్యాశాఖ టెట్ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆదివారం (నేటి)తో దరఖాస్తు గడువు ముగియనుంది. అయినా ఇన్ సర్వీస్ టీచర్ల టెట్ దరఖాస్తులు 26 వేలు దాటలేదు. వాస్తవానికి 2011కి ముందు టెట్ లేకుండా డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు 1.62 లక్షల మంది ఉన్నారు. ఇప్పుడు వీరిలో కేవలం 25 వేల మంది మాత్రమే అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. రెగ్యులర్ టెట్ దరఖాస్తులు 2.34 లక్షలు రాగా, ఇన్ సర్వీస్ దరఖాస్తులు మాత్రం 25 వేలు మాత్రమే వచ్చాయి.

### ఉపాధ్యాయుల్లో ఆందోళన

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరి చేస్తూ సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అప్పటి నుంచి ఇది సరైన విధానం కాదని, దీనిపై రివ్యూ పిటిషన్ వేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. రెండు మూడు దశాబ్దాలుగా వృత్తిలో ఉన్నవారికి ఇప్పుడు పరీక్ష నిర్వహించడం సరికాదని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రికి ఉపాధ్యాయ సంఘాలు విన్నపాలు చేశాయి. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీలూ స్వయంగా మంత్రిని కలిసి టెట్ నిలిపివేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయితే, వాటిని పట్టించుకోని మంత్రి లోకేశ్ గతనెల 28న తమ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు కోరిక మేరకు ఇన్ సర్వీస్ టెట్‌పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయనున్నట్టు ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయులు తాజా టెట్‌కు దరఖాస్తు చేయలేదు. ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాలు ఇన్ సర్వీస్ టెట్‌పై 'సుప్రీం'ను ఆశ్రయించాయి. అటు తమిళనాడు, కర్ణాటకతోపాటు పలు ఉత్తరాది రాష్ట్రాలు సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్లు వేయడంతోపాటు ఆర్టీఈ–2009 చట్ట సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సుప్రీంకోర్టుకు అప్పీల్ చేయలేదు. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పరీక్షపై ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది.

### 1.30 లక్షల మంది టీచర్లపై తీవ్ర ప్రభావం

రాష్ట్రంలో అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల్లోనూ దాదాపు 3 లక్షల మంది ఉపాధ్యాయులు సేవలు అందిస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో 2.09 లక్షల మంది ఉన్నారు. రాష్ట్రంలో 2008 వరకు జరిగిన డీఎస్సీలకు టెట్ లేదు. అంతకు ముందు విధుల్లో చేరిన 1.62 లక్షల మంది ప్రభుత్వ టీచర్లకు టెట్ లేకుండానే సేవలందిస్తున్నారు. పిల్లల ఉచిత నిర్బంధ విద్యా హక్కు (ఆర్టీఈ)చట్టం -2009, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష తప్పనిసరి అని సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. రాష్ట్రంలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు తప్పనిసరిగా టెట్ ఉండాలని ఆదేశించింది. నాటి నుంచి ఉపాధ్యాయులు దీనిపై రివ్యూ పిటిషన్ వేయాలని విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా గతనెలలో టెట్‌కు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈమేరకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (ఏపీటెట్) నిర్వహణకు విధివిధానాలు, సిలబస్, పరీక్ష తీరు తెన్నులతో కూడిన మార్గదర్శకాలను విడుదల చేసి నవంబర్ 23 చివరి తేదీగా నిర్దేశించింది. ఈ క్రమంలో మంత్రి లోకేశ్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామని చెప్పడంతో ఇన్ సర్వీస్ టీచర్లకు పరీక్ష ఉండదని అంతా భావించారు. కానీ సుప్రీంలో పిటిషన్ వేయకపోవడంతో ఇప్పుడు 1.62 లక్షల మందిలో ఐదేళ్లలో రిటైరయ్యే 32 వేల మంది ఉపాధ్యాయులు మినహా మిగిలిన 1.30 లక్షల మంది పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరుగాకుండా ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్న మరో 50 వేల మందీ పరీక్ష రాయాల్సి వస్తుందని అంచనా.

### చట్ట సవరణపై స్పందించని ప్రభుత్వం

దేశంలో 2011కి ముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులు టెట్ పూర్తిచేయాలా వద్దా, మైనార్టీ స్కూళ్లలోని టీచర్లకు ఈ నిబంధన వర్తిస్తుందా లేదా అనే అంశంపై వివిధ రాష్ట్రాల హైకోర్టులు భిన్నమైన తీర్పునిచ్చినట్టు నిపుణులు చెబుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో వాటన్నింటికీ తెరపడింది. అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేయడంతోపాటు 2011కి ముందు సర్వీసులో చేరిన వారికీ ఈ నిబంధన వర్తిస్తుందని సుప్రీం పేర్కొంది. ఈ తీర్పును పదోన్నతులు, నియామకాలకు ముడిపెట్టింది. ఈ తీర్పుపై పలు రాష్ట్రాలు రివ్యూ పిటిషన్లు వేయడంతోపాటు ఆర్టీఈ–2009 చట్ట సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయి. చట్ట సవరణతోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని, దీనిపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ అంశాలను పూర్తిగా విస్మరించి టెట్ నిర్వహణకు సిద్ధమైంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. సుప్రీం తీర్పుపై కేంద్ర ప్రభుత్వ ఆలోచన ఏంటో సమీక్షించకుండా సుప్రీంకోర్టు ఉత్తర్వు ఇచ్చిన వెంటనే టెట్ నిర్వహణకు పూనుకోవడం ఏమిటని నిలదీస్తున్నాయి.

# కుట్రతోనే కోర్టు ప్రొసీడింగ్స్ చిత్రీకరణ

- ఈ పనిచేసినవారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ తరపున జడ్జికి విజ్ఞప్తి చేసిన టీజేఆర్ సుధాకర్‌బాబు

**సాక్షి, అమరావతి :** హైదరాబాద్‌లో సీబీఐ కోర్టు హాల్‌లో జడ్జి ఎదుట వైఎస్సార్‌సీపీ అధినేత హాజరైన వీడియోను రహస్యంగా చిత్రీకరించి రాజకీయ కుట్రతో వైరల్ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. ఇది నిబంధనల ఉల్లంఘనే అని, కోర్టు ధిక్కరణగా పరిగణించాలని కోర్టును విజ్ఞప్తి చేశారు. వ్యక్తి స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించినందుకు బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద... ఆ వీడియో తీసినవారిపై, ప్రసారం చేసిన టీవీ5, ఏబీఎన్ చానెళ్లు, యూట్యూబ్ చానెళ్లు, సోషల్ మీడియా ఖాతాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''ప్రజల తరపున పోరాడుతున్నందుకు వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా ఏ స్థాయిలో కుట్ర జరుగుతుందో చెప్పేందుకు ఈ సంఘటనే తాజా ఉదాహరణ. మన రాష్ట్రంలోనే కాదు పొరుగు రాష్ట్రంలోనూ ఆయనకు ఉన్న అమిత ప్రజాదరణను చూసి ఓర్వలేక టీడీపీ కుయుక్తులకు తెరలేపింది. ఎలాంటి పిలుపివ్వకుండానే భారీగా వచ్చిన అభిమానులను చూసి తట్టుకోలేక ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియా విషం చిమ్మాయి. చంద్రబాబు, లోకేశ్‌లను ప్రజలు పట్టించుకోవడం లేదనే అక్కసుతో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయి. జెడ్ ప్లస్ భద్రత ఉన్న మాజీ సీఎంగా, భద్రతా కారణాల దృష్ట్యా ఏ సమయానికి హాజరవుతారో చెబుతూ షెడ్యూల్ ఇస్తే దానిలోకి కోర్టులను లాగి న్యాయ వ్యవస్థను అవహేళన చేసేలా ట్రోలింగ్ సాగిస్తున్నారంటే వైఎస్ జగన్‌ను చూసి వారు ఎంత భయపడుతున్నారో తెలుస్తోంది. అవినీతి కేసులో చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఫొటోలు, వీడియోలు బయటకు రాకుండా ఆయన గౌరవాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాపాడింది. నేడు వైఎస్ జగన్‌ను అగౌరవపరిచేలా బాబు సర్కారు వ్యవహరించడం సిగ్గుచేటు.'' అని సుధాకర్‌బాబు చెప్పారు.

### చంద్రబాబు జైలుకెళ్తే హైదరాబాద్‌లో సమావేశాలా?

''చంద్రబాబు ఏడాదిన్నర నుంచి ప్రజాధనం విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. వారం వారం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్ ప్రజల సొమ్ముతో ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళ్తున్నా ఎల్లో మీడియాకు కనపడదు. కోర్టుకు సమయానికి వెళ్లడానికి వైఎస్ జగన్ సొంత డబ్బుతో ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటే తట్టుకోలేకపోతున్నారు. రాష్ట్రంలో వెళ్లిన ప్రతిచోట జనం నీరాజనం పడుతుంటే ఆయనకు హైదరాబాద్‌లో బలప్రదర్శన చేసే అవసరం ఏముంది? తెలంగాణ రాజకీయాల్లో ఉండాల్సి వస్తే వైఎస్ జగన్ నేరుగా తలపడతారని, చంద్రబాబులా ఎన్డీఏలో ఉంటూ జూబ్లీహిల్స్‌లో బీజేపీ అభ్యర్థికి ప్రచారం చేయకుండా తప్పించుకునే చౌకబారు రాజకీయం చేయరు'' అని సుధాకర్‌బాబు తేల్చిచెప్పారు.

# కమీషన్ల కోసమే బాబు పీపీపీ పాట

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం
- తన వారికి కట్టబెట్టేందుకే చంద్రబాబు కుట్ర
- దీంతో పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్య దూరం.. దోపిడీ ఖాయం
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మా పోరాటం ఆగదు
- మాజీమంత్రి విడదల రజిని

**సాక్షి, అమరావతి :** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ద్వారా రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగాన్ని చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీమంత్రి విడదల రజిని మండిపడ్డారు. పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్య అందించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్ తలపెట్టిన కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభం కాకుండా నిర్మాణంలో ఉన్న వాటిని పీపీపీ పేరుతో చంద్రబాబు తన వారికి కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారని ఆమె మండిపడ్డారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కేవలం కమీషన్ల కోసమే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేస్తున్న కోటి సంతకాల ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. రజినీ ఇంకా ఏమన్నారంటే..

### మా పోరాటం ఆగదు..

ప్రభుత్వ పీపీపీ నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నా చంద్రబాబు ఉపసంహరించుకోవడంలేదు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరమైతే ప్రజలు దోపిడీకి గురికావడం ఖాయం. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు మా పోరాటం ఆగదు. ఇటీవల తరచూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటూ పదేపదే మాట్లాడుతున్న చంద్రబాబు మాటల వెనుక అసలు ఉద్దేశం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణే. సాధ్యమైనంత త్వరగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించి, ఆరోగ్యశ్రీ పథకాన్ని కార్పొరేట్ బీమా కంపెనీలకు అప్పగించాలన్న తపన కనిపిస్తోంది. పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్యను అందించే బాధ్యత నుంచి తప్పుకుని ఆ రంగాలను సొమ్ము చేసుకోవాలనుకుంటున్నారు. నిజానికి.. చంద్రబాబు ప్రభుత్వం మరో రూ.5 వేల కోట్లు ఖర్చుచేస్తే నిర్మాణంలో ఉన్న కాలేజీలన్నీ పూర్తవుతాయి. కానీ వైద్యవిద్యను పేదలకు దూరం చేస్తున్నారు.

### మెడికల్ సీట్లు ఇక రూ.కోట్లకు అమ్ముకోవడమే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 50 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు మిగిలిన 50 శాతం సీట్లను కాలేజీ నిర్వహణ, స్వయం సమృద్ధి కోసం సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించాం. కానీ, పీపీపీ విధానంలో.. 70 శాతం సీట్లు ఉచితంగా ఇస్తారని చంద్రబాబు చెబుతూనే మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసి.. వారు రూ.కోట్లకు సీట్లు అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. ఆరోగ్యశ్రీని సైతం ఉగాది నుంచి నిలిపివేసి ప్రైవేట్ బీమా సంస్థలకు అప్పగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది అని రజిని విమర్శించారు.

## క్లుప్తంగా...

### 'ఐ బొమ్మ' పైరసీ కేసులో సీఐడీ ఎంట్రీ

సాక్షి, హైదరాబాద్: 'ఐబొమ్మ' పైరసీ కేసుపై తెలంగాణ సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. ఐబొమ్మ నిర్వాహకుడు రవి తన వెబ్‌సైట్‌తో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన అంశాలపై సీఐడీ సిట్ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల వద్ద ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్ట్ సహా నిందితుని బ్యాంక్ అకౌంట్లను సేకరించినట్టు తెలిసింది. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ సైట్లను ప్రమోట్ చేసిన వ్యవహారంలో పలువురు సినీ రంగానికి చెందిన వారిని సీఐడీ సిట్ అధికారులు ఇప్పటికే విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ సహా టాలీవుడ్ నటులు, యాంకర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల విచారణ కొనసాగుతోంది. ఐబొమ్మ నిర్వాహకుడు రవి సైతం నాలుగు బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో రవిని కూడా ప్రశ్నించేందుకు సీఐడీ అధికారులు నిర్ణయించారు. రవి ప్రస్తుతం సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో ఉన్నందున కస్టడీ ముగిసిన అనంతరం.. ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయని ఒక అధికారి తెలిపారు.

### అంతరిక్ష ప్రయాణమే సులభం

బెంగళూరు ట్రాఫిక్‌పై శుభాంశు శుక్లా జోక్

శివాజీనగర: భారత రోదసీ యాత్రికుడు శుభాంశు శుక్లా బెంగళూరు ట్రాఫిక్ గురించి మాట్లాడటం చర్చకు దారి తీసింది. బెంగళూరులో జరుగుతున్న టెక్ సమ్మిట్‌కు హాజరైన ఆయన.. 'అంతరిక్షం నుంచి బెంగళూరుకు రావటం సులభం. నగరంలోని మారతహళ్లి నుంచి మాదావరకి వెళ్లడం చాలా కష్టం' అని వ్యాఖ్యానించారు. శుక్లా మాటలపై ఐటీ బీటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందిస్తూ ప్రభుత్వం పరిష్కార చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రోదసీ యాత్రికుణ్ని కూడా ఈ ట్రాఫిక్ పీడిస్తుందనే విషయం తెలియకపోయిందని చమత్కరించారు. వీరిద్దరి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

### మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు బూటకం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

మార్కాపురం: ఇటీవల జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు బూటకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. శనివారం ప్రకాశం జిల్లా మార్కాపురంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్లు నిజంగా జరిగాయా లేదా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే తీసుకెళ్లి కాల్చి చంపారా అన్నది తేల్చాలన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్‌ను తక్షణమే పూర్తి చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బొప్పాయి, అరటి రైతులు తీవ్రంగా నష్టపోతే ప్రభుత్వానికి కనిపించటం లేదా అని ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పండ్ల రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### కార్పొరేట్ల కోసమే ఆపరేషన్ కగార్

వామపక్ష, ప్రజా సంఘాల నేతల విమర్శ

తిరుపతి కల్చరల్: కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను చేపట్టిందని వామపక్ష, ప్రజా సంఘాల నేతలు విమర్శించారు. నక్సలైట్లను పట్టుకున్న తర్వాత బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపుతున్నారని పేర్కొన్నారు. వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, పౌర హక్కుల సంఘం నేత క్రాంతి చైతన్య, సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, ఆర్‌పీఐ అధ్యక్షుడు పి.అంజయ్య, సీపీఐ ఎంఎల్ నగర కార్యదర్శి వెంకటరత్నం తదితరులు ప్రసంగించారు. మావోయిస్టు నేత హిడ్మాను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హతమార్చారని విమర్శించారు. ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నారు.

### నిర్లక్ష్య వైద్యం కారకులపై చర్యలు తీసుకోండి

సాక్షి, అమరావతి: ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రెండు వరుస సంఘటనలు చోటుచేసుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో తాళ్లరేవు మండలం గడిమొగ గ్రామానికి చెందిన 8 నెలల గర్భిణి మల్లేశ్వరి వైద్యుల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయారు. అలాగే రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో 55 ఏళ్ల రోగికి కాలం తీరిన మందులు ఇవ్వడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఈ రెండు ఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి.. పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. డిసెంబర్ ఆఖరుకు రాష్ట్రంలో రహదారులన్నింటినీ గుంతల రహితంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. శనివారం ఆర్ అండ్ బీ శాఖపై సమీక్షించారు.

# డీల్ కుదిరితేనే కాంట్రాక్టు

## నేతలకు ఆదాయ వనరుగా పెద్దాస్పత్రులు

- స్థానిక మందుల కొనుగోళ్లలో పారదర్శకతకు పాతర
- గోప్యంగా ఆఫ్‌లైన్‌లో టెండర్‌లు
- ఎక్కువ మంది టెండర్‌లలో పాల్గొనకుండా గూడుపుఠాణి

సాక్షి, అమరావతి: పేదల ఆరోగ్యానికి భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వాస్పత్రులనూ అధికార పార్టీ నేతలు ఆదాయ వనరులుగా మార్చేసుకున్నారు. బైక్ పార్కింగ్, క్యాంటీన్, మందుల దుకాణాలు, సెక్యూరిటీ, శానిటేషన్ ఇలా ఏ ఒక్కటి వదలకుండా దోపిడీకి తెగబడుతున్నారు. ఈ క్రమంలో 'స్థానిక మందులు, సర్జికల్స్, ఇంప్లాంట్స్ కొనుగోళ్ల కాంట్రాక్ట్‌లు' తామనుకున్న వారికే కట్టబెట్టి పెద్దాస్పత్రుల నిధులను కొల్లగొట్టేస్తున్నారు.

#### దోపిడీ దారిది..

బోధనాస్పత్రులకు మందులు, సర్జికల్స్ సరఫరా కోసం కేటాయించే బడ్జెట్‌లో 20 శాతం నిధులను స్థానిక కొనుగోళ్లకు కేటాయిస్తారు. వీటితో పాటు ఆరోగ్యశ్రీ, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) ఫండ్స్ నుంచి ఏటా రాష్ట్రవ్యాప్త డీఎంఈ ఆస్పత్రుల్లో రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల విలువైన సర్జికల్స్, మందులు స్థానికంగా కొనుగోలు చేస్తుంటారు. ఈ మందులను గత ప్రభుత్వంలో ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా కేంద్రీకృత టెండర్‌లు పిలిచి సరఫరా చేశారు. అంతేకాకుండా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల మేరకు గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్(జీఎంపీ) ద్వారా నాణ్యమైన మందులు సరఫరా చేశారు. ఈ విధానాన్ని బాబు గద్దెనెక్కిన వెంటనే గతేడాది రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించారు. దీంతో అధికార పార్టీ నేతలు, వారితో చేతులు కలిపిన ఆస్పత్రి అధికారులు నచ్చిన సంస్థలకు సరఫరా కాంట్రాక్ట్‌లు కట్టబెట్టడం కోసం టెండర్‌లలో గూడుపుఠాణి చేస్తున్నారు.

#### అడ్డదారుల కోసం ఆఫ్‌లైన్

లక్షల రూపాయల విలువగల పనులకు సైతం ఈ–ప్రొక్యూర్‌మెంట్‌లో జిల్లా స్థాయిలో టెండర్లు పిలుస్తారు. కానీ బోధనాస్పత్రులకు రూ. కోట్ల విలువైన మందుల సరఫరాకు సంబంధించిన స్థానిక టెండర్‌లను ఆఫ్‌లైన్‌లో చేపడుతున్నారు. పారదర్శకంగా ఆన్‌లైన్‌లో టెండర్‌లు పిలిస్తే తమ ఆటలు సాగవని, ఆఫ్‌లైన్ టెండర్‌ల రూపంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల విస్తృత స్థాయిలో సంస్థలు బరిలో నిలవడం కుదరదు. ఇక ఒక్కో ఆస్పత్రిలో 1,500 నుంచి 2 వేలు రకాలకు పైగా మందులు, సర్జికల్స్‌కు ఆఫ్‌లైన్‌లో టెండర్‌లు పిలుస్తున్నారు.

#### బిడ్‌లకు స్వల్ప సమయం

ఎంఎస్ఐడీసీలో రాష్ట్ర వ్యాప్త టెండర్‌లలో పాల్గొనే సంస్థలు బిడ్‌లు వేయడానికి రెండు వారాల పైబడి సమయం ఇస్తుంటే బోధనాస్పత్రుల్లో మాత్రం 10 రోజుల సమయం ఇస్తున్నారు. టెండర్‌లలో ఎక్కువ సంస్థలు పాల్గొనడానికి వీల్లేకుండా ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ)లు రూ.5లక్షలు.. రూ.మూడు లక్షలు.. ఇలా ఇష్టారాజ్యంగా పెట్టేస్తున్నారు. పెద్ద మొత్తంలో మందుల సరఫరా కోసం ఎంఎస్ఐడీసీ పిలిచే టెండర్‌లలోనే ఈఎండీ రూ.3 లక్షలు ఉంటుండగా, కేవలం ఆస్పత్రి స్థాయిలో సరఫరా కోసం పిలుస్తున్న టెండర్లలోనూ భారీ మొత్తంలో ఈఎండీలు పెట్టడం గమనార్హం.

#### ఇక్కడ 'ఈ-గవర్నెన్స్' ఏమైంది బాబూ

ఉదయం లేచినప్పటి నుంచి ఏఐ, సాంకేతిక పరిజ్ఞానం, ఈ–గవర్నెన్స్ అంటూ సీఎం చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారు. అయితే పెద్దాస్పత్రుల విషయంలో ఆఫ్‌లైన్ టెండర్‌ల రూపంలో దోపిడీ జరుగుతుంటే మాత్రం మిన్నకుండిపోతున్నారు. వైద్య శాఖ ఉన్నతాధికారులు సైతం స్థానిక టెండర్‌లపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. స్థానిక కొనుగోళ్లలో పారదర్శకత ఉండేలా ఆన్‌లైన్ విధానంలో టెండర్‌లు పిలవడం.. నాణ్యత లేని మందులు, సర్జికల్స్ సరఫరా చేసిన సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం.. సకాలంలో సరఫరా చేయని వారిపై పెనాల్టీలు విధింపు వంటి అంశాల విషయంలో ఏకీకృత విధానం తీసుకొచ్చేలా కనీసం ఆలోచన చేయడం లేదు. పై స్థాయిలో కనీస పర్యవేక్షణ, సమీక్ష కూడా లేకపోవడంతో మందుల మాటున దోపిడీకి పట్టపగ్గాలు లేకుండా పోతోంది.

#### కొటేషన్‌ల దోపిడీ సరేసరి..

శ్రీకాకుళం, కేజీహెచ్, కాకినాడల్లో ఇప్పటికే స్థానిక టెండర్ ప్రక్రియ ముగియగా, గుంటూరులో కొనసాగుతోంది. కర్నూల్‌లో స్థానిక మందుల కొనుగోళ్లకు ఇంకా టెండర్‌లే పిలవలేదు. ప్రస్తుతం కొనసాగుతున్నా, ముగిసిన టెండర్‌ల ప్రక్రియపై పలు ఆరోపణలున్నాయి. ఇలా మరికొన్ని ఆస్పత్రుల్లో టెండర్‌లు పిలవకుండా కొటేషన్ మీద మందులు కొనుగోళ్ల రూపంలో ప్రజాధనం లూటీ జరుగుతోంది. సాధారణంగా ఎమర్జెన్సీ పరిస్థితుల్లో మాత్రమే కొటేషన్ విధానంలో కొనుగోళ్లు చేస్తుంటారు. తాజాగా కొటేషన్‌ల దోపిడీ సాగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

### అబాకస్ అంతర్జాతీయ పోటీల్లో తాడేపల్లి విద్యార్థుల ప్రతిభ

బహుమతులు అందుకున్న విద్యార్థులు

సాక్షి, అమరావతి: చెన్నై ట్రేడ్ సెంటర్‌లో జరిగిన ఎస్ఐపీ అబాకస్ ఇంటర్నేషనల్ కాంపిటీషన్–2025 పోటీల్లో తాడేపల్లి విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ సంస్థ తాడేపల్లి బ్రాంచ్ చైర్మన్ జాహ్నవి ఓ ప్రకటనలో తెలిపారు. 11 దేశాల నుంచి 5,800 మంది విద్యార్థులు పాల్గొనగా, తాడేపల్లి బ్రాంచ్ నుంచి 17 మంది పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారని చెప్పారు. వీరిలో ఆరుగురు విద్యార్థులు రన్నరప్‌గా నిలిచినట్టు పేర్కొన్నారు.

# హామీలిచ్చి నెరవేర్చబోమంటే కుదరదు..

- ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత
- వాటిని నిర్దిష్ట కాల వ్యవధిలోపే నెరవేర్చి తీరాలి
- అర్థం లేని కారణాలను సాకుగా చూపడం సరికాదు
- తెలుగు గంగ భూ నిర్వాసితుల వ్యాజ్యంలో హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరణ

సాక్షి, అమరావతి: హామీలిచ్చి నెరవేర్చబోమంటే కుదరదని, ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత అని తెలుగు గంగ భూ నిర్వాసితుల వ్యాజ్యంలో న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మలతో కూడిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. హామీలను నెరవేర్చడానికి ఒక విధానాన్ని రూపొందించినప్పుడు దానికి అనుగుణంగా నిర్దిష్ట కాల వ్యవధిలోపే ఆ హామీలను నెరవేర్చి తీరాలని పేర్కొంది. సాంకేతిక అంశాలతోసహా అర్థం లేని కారణాలను సాకుగా చూపడం సరికాదని చెప్పింది. మనదేశంలో ప్రజలకు భూమితో వీడదీయలేని సంబంధం ఉంటుందని, భూమిని మనం అమ్మలా ప్రేమించడమే దీనికి కారణమని తెలిపింది. భూమి తీసుకున్నప్పుడు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని, లేదంటే ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోతారని పేర్కొంది. అంతిమంగా ఇది సమాజంలో అశాంతికి దారి తీస్తుందని హెచ్చరించింది. ఈ వ్యాజ్యం విషయంలో నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. ప్రభుత్వ అప్పీల్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. తెలుగు గంగ ప్రాజెక్టు కోసం 40 ఏళ్ల క్రితం భూములు కోల్పోయిన భూ నిర్వాసిత కుటుంబాలకు ఈ తీర్పు పెద్ద ఊరటనిచ్చింది.

#### కేసు నేపథ్యం ఇదీ...

తెలుగు గంగ ప్రాజెక్టు కోసం 1984 నుంచి చేస్తున్న భూ సేకరణలో భాగంగా అధికారులు కడప జిల్లాలో పెద్ద మొత్తంలో భూములు సేకరించారు. భూ నిర్వాసితులు, వారి కుటుంబ సభ్యులు, వారిపై ఆధారపడి జీవిస్తున్న వారికి పునరావాసం కల్పించే నిమిత్తం ప్రభుత్వం 1986లో జీవో నెంబర్ 98ని జారీ చేసింది. పునరావాసం నిమిత్తం అర్హులైన వారు ఏడాదిలోపు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలంటూ ఆ జీవోలో పేర్కొన్నారు. అటు తరువాత 1987లో ప్రభుత్వం ఈ షరతును తొలగించింది. భారీ, మధ్యతరహా సాగునీరు, విద్యుత్ ప్రాజెక్టుల్లో జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్‌లకు సమానమైన పోస్టుల్లో 50 శాతం పోస్టులను భూ నిర్వాసితులు,



వారి కుటుంబ సభ్యులు, వారిపై ఆధారపడ్డ వారితో భర్తీ చేస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అర్హతలు ఉన్న పలువురు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే హామీ ఇచ్చిన మేర ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వకపోవడంతో కొందరు ఏపీ పరిపాలనా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్ వారికి ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం వారికి ఉద్యోగాలిచ్చింది. ఇదే రీతిలో అర్హులైన మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. దశాబ్దాల క్రితం తమ భూములు తీసుకున్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యోగాలు ఇవ్వలేదని, అర్హులైన తమకు కూడా ఉద్యోగాలు ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కడప జిల్లాకు చెందిన రాజోల జగన్నాథరెడ్డి, మరో 46 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి పిటిషనర్లకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ని ఆశ్రయించింది. విచారణ జరిపిన డివిజన్ బెంచ్ ప్రభుత్వ అప్పీల్‌ను కొట్టేసింది.

# 'కగార్' నుంచి పార్టీని కాపాడుకుందాం

- తొలుత నాయకత్వ, బలగాల రక్షణ బలగాల వికేంద్రీకరణపై దృష్టి
- డిసెంబర్ 2 నుంచి పీఎల్‌జీఏ 25వ వార్షికోత్సవాలు
- మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ లేఖ

చర్ల: ఆపరేషన్ కగార్ నుంచి మావోయిస్టు పార్టీ, విప్లవోద్యమాన్ని కాపాడుకుంటూనే... కగార్‌తో వాటిల్లిన నష్టాన్ని భర్తీ చేసుకుందామని మావోయిస్టు పార్టీ సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ) పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా డిసెంబర్ 2 నుంచి 8 వ తేదీ వరకు పీఎల్‌జీఏ 25వ వార్షికోత్సవాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తామని వెల్లడించింది. ఈ మేరకు సీఎంసీ నుంచి శనివారం లేఖ విడుదలైంది. అందులోని ముఖ్యాంశాలు...

#### నష్టమైనా అంతం కాదు

కగార్‌తో మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టం జరుగుతున్నా.. విప్లవోద్యమం అంతం కాదని కమిషన్ వెల్లడించింది. పార్టీ నాయకత్వం ముందున్న ప్రధాన లక్ష్యాలను లేఖలో స్పష్టంగా ప్రస్తావించింది. తొలుత నాయకత్వ, బలగాల రక్షణకు ప్రాధాన్యం ఇచ్చి.. గెరిల్లా యుద్ధ నియమాలను కచ్చితంగా అమలు చేయడం, కేంద్రీకృత బలగాల వికేంద్రీకరణ చేయాలని నిర్ణయించినట్టుగా వెల్లడించింది. అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో రాజకీయ, సైనిక, సామూహిక కార్యకలాపాలను విస్తరించడంపై దృష్టి సారించనున్నట్టు ప్రకటించింది.

#### 11 నెలల్లో 320 మంది అమరులు

2024 డిసెంబర్ నుంచి ఈ ఏడాది నవంబర్ వరకు 11 నెలల కాలంలో దేశవ్యాప్తంగా 320 మంది అమరులయ్యారని, అందులో 117 మంది మహిళలు ఉన్నారని లేఖలో సీఎంసీ వివరించింది. ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే 243 మంది అమరులు కాగా, తెలంగాణలో ఎనిమిది మంది, ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో ఆరుగురు అమరులయ్యారని వెల్లడించింది. ఇందులో పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, ఎనిమిది మంది సెంట్రల్ కమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్ర కమిటీ స్థాయి నేతలు ఉన్నారని వివరించింది.

#### అటు కూడా నష్టం

గడిచిన ఏడాది కాలంలో 72 ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 116 మంది జవాన్లను మట్టుబెట్టడంతోపాటు 208 మందిని గాయపరిచామని సీఎంసీ పేర్కొంది. పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన చారు మజుందార్ అమరుడైన 53 ఏళ్ల తర్వాత, పార్టీ ప్రధాన కార్యదర్శి బసవరాజు అమరుడు కావడంతో పార్టీ, విప్లవోద్యమానికి తీరని నష్టం కలిగిందని సీఎంసీ వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో రూపొందించిన రాజకీయ, సైనిక ఎత్తుగడలను సక్రమంగా అమలు చేస్తూ నష్టాలను నివారించుకుందామని.. తద్వారా పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజా సంఘాలు, విప్లవోద్యమాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చింది. ప్రస్తుతం విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోయిన స్థితిలో ఉన్నందున గతంలోలా పీఎల్‌జీఏ వార్షికోత్సవాలను జరుపుకోలేని పరిస్థితి ఉందని వెల్లడించింది. ఈ మేరకు ఉద్యమ ప్రాంతాల్లో పార్టీ, పీఎల్‌జీఏ బలగాల రక్షణకు ప్రాధాన్యం ఇస్తూనే వార్షికోత్సవాలను జరుపుకోవాలని సీఎంసీ పిలుపునిచ్చింది.

#### హిడ్మా ఫ్లెక్సీల కలకలం

ఏర్పాటు చేసిన వారిపై కేసు నమోదు

షోడాషపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హిడ్మా ఫ్లెక్సీ

వేలేరు: హనుమకొండ జిల్లా వేలేరు మండలం షోడాషపల్లి గ్రామంలో మావోయిస్టు పార్టీ అగ్రనేత మడ్వి హిడ్మా ఫ్లెక్సీలు కలకలం రేపాయి. గ్రామానికి చెందిన కొయ్యడ సురేశ్, మ్యాక బుచ్చయ్య స్థానిక ప్రధాన రహదారి వెంట శుక్రవారం అర్ధరాత్రి దాటాకా హిడ్మా ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలో 'ఓ వీరుడా.. నువ్వు కన్న కల దోపిడీలేని స్వేచ్ఛా దేశం. నీ సిందూరం పీడిత జనానికి కొత్త పొద్దు. ప్రజల గుండెల్లో నీ చరిత్ర సజీవం. పీడిత జనాల స్వేచ్ఛా పోరాటానికి నీవు నిత్యం రణభేరి నినాదం. జనతన సర్కార్ ఆశయం చిరస్థాయి వీరుడా హిడ్మా.. నీ పోరాటం అమరం. లాల్ సలాం కామ్రేడ్ అని రాయించి ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు గ్రామానికి వెళ్లి ఫ్లెక్సీని తొలగించారు. ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

# రూ.7 కోట్ల చోరీ కేసు పోలీసు, సీఎంఎస్ ఉద్యోగి అరెస్టు

- రూ.5.76 కోట్లు స్వాధీనం
- ఏపీ వ్యక్తులూ దోపిడీలో భాగస్వాములు

స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసు కమిషనర్ తదితరులు

బనశంకరి/చిత్తూరు అర్బన్: ఏటీఎంలలోకి నగదు నింపే సీఎంఎస్ వాహనాన్ని ఆర్‌బీఐ, ఐటీ అధికారుల్లా వచ్చి పట్టపగలు సిసిపళ్యలో అడ్డుకుని వాహనంలోని రూ.7.11 కోట్ల నగదు చోరీ కేసును బెంగళూరు సిటీ పోలీసులు 60 గంటల్లో ఛేదించారు. ఈ కేసులో పోలీస్ కానిస్టేబుల్ అణ్ణప్పనాయక్, సీఎంఎస్ సంస్థ ఉద్యోగి గోపి, మాజీ ఉద్యోగి జేవియర్‌ను అరెస్ట్ చేసి, రూ.5.76 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామని పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్‌సింగ్ శనివారం తెలిపారు. పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. దోపిడీలో ఎనిమిది మంది పాల్గొన్నారని, దోపిడీకి సూత్రధారులు కానిస్టేబుల్, సీఎంఎస్ మాజీ ఉద్యోగులేనన్నారు. దోపిడీ జరిగిన గంటన్నర తరువాత సీఎంఎస్ వాహన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారన్నారు. కాగా ఈ కేసులో చిత్తూరు జిల్లా చిత్తపారకు చెందిన అన్నదమ్ములు రవి, రాకేష్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక గుడిపాలకు చెందిన అన్నదమ్ములను హైదరాబాద్‌లోని ఓ లాడ్జిలో శనివారం అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

# అజ్ఞాతం వీడి లొంగిపోండి

- ఏ పద్ధతిలో లొంగుబాటు అన్నది మీ ఇష్టమే
- మావోయిస్టులకు తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి పిలుపు
- డీజీపీ సమక్షంలో లొంగిపోయిన 37 మంది మావోయిస్టులు.. 8 తుపాకుల అప్పగింత
- లొంగిపోయిన వారిలో సాంబయ్య, అప్పాసి నారాయణ, ఎర్ర
- వారిపై ఉన్న రూ.1.41 కోట్ల రివార్డును లొంగిపోయిన మావోయిస్టులకు ఇచ్చిన డీజీపీ

ఆజాద్‌ను అభినందిస్తున్న డీజీపీ శివధర్ రెడ్డి. చిత్రంలో ఎస్ఐబీ చీఫ్ సుమతి, మావోయిస్టు ముచ్చకి సోమడా

సాక్షి, హైదరాబాద్: 'అజ్ఞాతం వీడి బయటకు రండి. మీకు ఎలాంటి సమస్యలు ఉండవు. మీపై ఎలాంటి వేధింపులు లేకుండా చూస్తాం' అని డీజీపీ బి.శివధర్‌రెడ్డి మావోయిస్టులకు పిలుపునిచ్చారు. మావోయిస్టుల లొంగుబాటు విషయంలో తెలంగాణ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని చెప్పారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, భద్రాచలం–కొత్తగూడెం–అల్లూరి సీతారామ జిల్లా డివిజనల్ కమిటీ కార్యదర్శి కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ సహా 37 మంది మావోయిస్టులు డీజీపీ ఎదుట శనివారం లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళలు, 12 మంది పురుషులు ఉన్నారు. తమ వద్ద ఉన్న ఒక ఏకే–47, రెండు ఎస్ఎల్ఆర్‌లు, నాలుగు 303 రైఫిళ్లు, ఒక జీ3 తుపాకీతోపాటు వివిధ కాలిబర్లకు చెందిన 346 తూటాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్, ఐజీ సుమతితో కలిసి డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడారు. అంతర్గత విభేదాలు, కూంబింగ్‌లతో పెరిగిన ఒత్తిడి, అనారోగ్య కారణాలతో మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ వివరించారు. లొంగిపోయిన మావోయిస్టులపై ఉన్న రివార్డు మొత్తం రూ. 1.41 కోట్లను డీడీల రూపంలో వారికి అందజేశారు. రాష్ట్రానికి చెందిన మావోయిస్టులకు ప్రభుత్వపరంగా సదుపాయాలు కల్పిస్తామని హామీఇచ్చారు. వారికి తక్షణ సాయం కింద రూ. 25 వేల చొప్పున అందించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు మొత్తం 465 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారని డీజీపీ తెలిపారు.

#### మీరు కూడా లొంగిపోండి..

ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో తెలంగాణ ప్రాంతానికి చెందిన 59 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ తెలిపారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణేశ్, పసునూరి నరహరి ఉన్నారన్నారు. వీరూ పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. ఇదిలా ఉంటే ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీలో పనిచేయడం కష్టంగా మారడంతోపాటు అనారోగ్య సమస్యలతోనే బయటకు వచ్చామని కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్, ముచ్చకి సోమడా మీడియాకు తెలిపారు.

#### లొంగిపోయింది వీరే..

- కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ (తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, భద్రాచలం–కొత్తగూడెం–అల్లూరి సీతారామ జిల్లా డివిజనల్ కమిటీ కార్యదర్శి)
- అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్ (రాష్ట్ర కమిటీ సభ్యుడు)
- ముచ్చకి సోమడా అలియాస్ ఎర్ర (దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు)
- తెలంగాణ రాష్ట్ర కమిటీ ఖమ్మం డివిజనల్ కమిటీ సభ్యులు 9 మంది
- సౌత్–బస్తర్ డివిజనల్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఒకరు,
- డివిజనల్ కమిటీ సభ్యులు ఇద్దరు
- ఏరియా కమిటీ సభ్యులు ఏడుగురు
- దళ సభ్యులు 13 మంది
- పీఎల్‌జీఏ బెటాలియన్‌కు చెందిన డివిజనల్ కమిటీ సభ్యుడు ఒకరు
- ఏరియా కమిటీ సభ్యుడు ఒకరు

తెలంగాణ

# పెళ్లింట విషాదం

- తెల్లారితే కుమార్తె వివాహం.. అంతలోనే తండ్రి మృతి
- పెళ్లి కోసం వేసిన టెంట్ కిందే.. అంతిమ సంస్కారాలు
- వికారాబాద్ జిల్లా సంగెంకుర్దులో ఘటన

యాలాల: తెల్లారితే కూతురు పెళ్లి.. బంధువులంతా ఇంటికి చేరుకున్నారు. వివాహ ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. సున్నం వేసి, రంగులు అద్దిన ఇంటి ఎదుట టెంట్ వేశారు. బంధువులతో ఇల్లంతా సందడిగా ఉంది. అంతలోనే అందిన ఓ విషాద వార్త అందరినీ కన్నీటి సంద్రంలో ముంచింది. వికారాబాద్ జిల్లా యాలాల మండలం సంగెంకుర్దులో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. గ్రామానికి చెందిన అండాల అనంతప్ప(46)కు వ్యవసాయమే జీవనాధారం. ఇతని మొదటి భార్య శాకమ్మకు ఓ కూతురు, కొడుకు సంతానం. పదిహేనేళ్ల క్రితం శాకమ్మ చనిపోవడంతో లక్ష్మిని రెండో పెళ్లి చేసుకోగా, ఆమెకు ఓ కొడుకు ఉన్నాడు. ఇదిలా ఉండగా మొదటి భార్య కూతురు అవంతిని సొంతూరుకే చెందిన భరత్‌కు ఇచ్చి పెళ్లి చేసేందుకు నిశ్చయించాడు. ఆదివారం(నేడు) వివాహం జరిపించేందుకు అనంతప్ప అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాడు. చిన్నచిన్న పనుల నిమిత్తం శుక్రవారం సాయంత్రం యాలాల మండల కేంద్రానికి వెళ్లి, తిరిగి వస్తుండగా గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి, కిందపడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని తాండూరులోని జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూనే శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. ఈ విషయం తెలియడంతో గ్రామమంతా విషాదం అలుముకుంది. బంధువులతో కళకళలాడిన ఇంట్లో విషాదం ఆవరించింది. ఆదివారం ఉదయం జరగాల్సిన పెళ్లికి వచ్చిన తాము.. శనివారం అంత్యక్రియల్లో పాల్గొనాల్సి వచ్చిందంటూ బంధువులు రోదించారు. కూతురు పెళ్లి కోసం వేసిన టెంట్ కింద, తండ్రి అంతిమ సంస్కారాలు చేయడం అందరినీ బాధించింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# అడుగడుగునా ఉచ్చులు.. ఉసురు తీసే ప్రమాదాలు!

నల్లమల అటవీ ప్రాంతంలో పులలకు రక్షణ కరువైంది. ఒక వైపు వేటగాళ్ల ఉచ్చులు.. మరో వైపు ఆహారం, నీటి కోసం జనారణ్యం వైపు వస్తూ పులులు ప్రమాదాలకు గురువుతున్నాయి. కొన్ని సందర్భాల్లో అవి మృత్యువాత పడుతున్నాయి. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నామన్నా నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. నల్లమలలో పులి గాండ్రిపులు వినిపించాలంటే వాటి సంరక్షణను అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. అవి ఎక్కువగా సంచరించే రహదారుల సమీపంలో అండర్, అప్పర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చనిపోతున్న పులులు, చిరుతలు

- జనారణ్యంలోకి వస్తున్న పులులు, చిరుతలు మృత్యువాత పడుతున్నాయి.
- 2024లో అర్ధవీడు మండలం వెలగలపాయ సమీపంలో విద్యుత్ కంచె తగిలి చిరుత మృతి చెందింది.
- 2023 నవంబర్ 10న శ్రీశైలం ఘాట్‌లో గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మృతి చెందింది.
- 2023 సంవత్సరం నవంబర్ 6వ తేదీన మండల పరిధిలోని రోళ్లపెంట వద్ద కోతిని వేటాడబోయిన చిరుతపులి కోతితో సహా నీళ్లలో పడి మృత్యవాత పడింది.
- 2022 జనవరి 22వ తేదీన ఆర్ చెలమ బావి వద్ద కోతులను వేటాడుతూ రోడ్డును దాటుతున్న ఓ చిరుతను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే చిరుత మృతి చెందింది.
- 2022 జనవరి 13వ తేదీన శ్రీశైలం రహదారిలోని జంగిల్ సఫారీ వద్ద రోడ్డును దాటుతున్న చిరుతపిల్లను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో చిరుత మృత్యువాత పడింది.
- 2021 నవంబర్ 12న గిద్దలూరు–నంద్యాల మధ్య చలమ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తు రైలుకిందపడి పెద్దపులి మృతి చెందింది.
- 2020 ఏప్రిల్‌లో యర్రగొండపాలెం సమీపంలోని గాలికొండ అటవీ ప్రాంతంలో వృద్ధాప్యంతో తీవ్రమైన ఎండ వేడిమి తట్టుకోలేక పెద్దపులి మృతి చెందింది. వీటితో పాటు మండల పరిధిలోని చెంచుకుంట వద్ద రైతులు పెట్టిన విషాహారం తిని చిరుతపిల్ల మృత్యువాత పడింది. దేవలూడు ప్రాంతంలో చిరుతను చంపి గుర్తులు లేకుండా కొందరు దుండగులు తగలబెట్టారు. దీంతో పాటు గతంలో తుమ్మల బైలు, శ్రీశైలం ముఖద్వారం వద్ద చిరుత పులులు రోడ్డును దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మృత్యువాత పడిన సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి.

శ్రీశైలం ఘాట్‌లో మృత్యువాత పడిన చిరుత (ఫైల్)

- నల్లమలలో పులులకు కరువైన రక్షణ
- వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని మృత్యువాత
- ఆహారం, నీళ్ల కోసం జనారణ్యంలోకి వస్తూ ప్రమాదాలకు గురవుతున్న వైనం
- పులుల రాకపోకలకు అండర్, అప్పర్ పాస్‌లు అవసరమంటున్న వన్యప్రాణి ప్రేమికులు
- నల్లమలలో 87 పెద్ద పులులు, సుమారు 200 చిరుతలు

పెద్దదోర్నాల:

నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వుడు నల్లమల ప్రాజెక్టులో మొత్తం 87 పెద్ద పులులున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. చిరుత పులులు మరో 200 నుంచి 205 వరకు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. నల్లమల పరిధిలోని మార్కాపురం, నెక్కంటి, గంజివారిపల్లి, కొర్రపోలు, దోర్నాల, విజయపురిసౌత్, యర్రగొండపాలెం అటవీ రేంజీ పరిధిలో ఇవి ఎక్కువగా సంచరిస్తుంటాయి. అయితే వేటగాళ్ల ఉచ్చులు, రోడ్డు ప్రమాదాలతో పాటు అనారోగ్య సమస్యలతో నల్లమలలోని కొన్ని వన్యప్రాణుల మునుగడ ప్రమాదంలో పడుతోంది. ఇప్పటికే కొన్ని రకాల చిరుతలు అంతరించి పోగా, నమీబియా లాంటి దేశాల నుంచి వాటిని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నల్లమలలో అత్యంత ప్రాధాన్యత కలిగిన జీవుల్లో రెండో స్థానం చిరుత పులులది. వీటి జీవిత కాలం 12 నుంచి 15 ఏళ్లు మాత్రమే. పెద్ద పులులు, చిరుతపులులు ఆహారం, నీళ్ల కోసం రోడ్ల పైకి వచ్చి ప్రమాదాల బారినపడి మృత్యువాత పడుతున్నాయి. అటవీశాఖాధికారులు వన్య ప్రాణుల సంరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.పెద్దపులులు, చిరుతలకు అడవిలోనే నీటి సమస్య లేకుండా సోలార్ సాసర్‌పిట్‌లు ఏర్పాటు చేసి నీటి సమస్య తీర్చారు. ఆహారం కోసం అవి సమీప గిరిజన ప్రాంతాల వైపు వస్తూనే ఉన్నాయి.

### బేస్ క్యాంపుల ఏర్పాటు..

నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు తెలుసుకునేందుకు బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. వాటి కదలికల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్, ఇష్ట కామేశ్వరి ఆలయం, దొరబైలు, నారుతడికల, పాలుట్ల, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, కొర్రపోలు, చినమంతనాల, రోళ్లపెంట తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇందులో ఐదుగురు అటవీ అధికారులు ఉంటారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం మీద 120 మంది ప్రొటెక్షన్ వాచర్లు పులుల సంరక్షణలో ఉన్నారు.

### అభయారణ్యాలలో అండర్, ఓవర్ పాసులు ఏర్పాటు చేయాలి..

శ్రీశైలం వెళ్లే భక్తులు, నల్లమల అటవీ అందాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటక ప్రేమికులు సౌకర్యవంతమైన ప్రయాణాలతో పాటు, నల్లమల అభయారణ్యంలో వణ్యప్రాణులు సురక్షితంగా సంచరించేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. వేగంగా ప్రయాణించే వాహనాలతో అవి ప్రమాదాలకు గురి కాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలంటున్నారు. రోడ్డుకు ఓ వైపు నుంచి మరో వైపుకు వెళ్లే విధంగా అండర్ పాస్‌లు, ఓవర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రహదారికి పై భాగంలో ఏర్పాటు చేసే వంతెన( ఓవర్ పాస్)లు, మరికొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు కింది భాగాన ఏర్పాటు చేసే బ్రిడ్జి (అండర్‌పాస్)ల ద్వారా వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించే వీలుంటుందని వారు సూచిస్తున్నారు. వీటి ఏర్పాటుపై అటవీశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మాతృత్వం ఓ వరం.. దత్తత మరో మార్గం!

అనధికార దత్తత చట్టరీత్యా నేరం • అర్హత గల వారికి అండగా శిశుగృహ

వైఎస్సార్ కడప జిల్లాలో కొనసాగుతున్న జాతీయ దత్తత మాసోత్సవాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: వివాహమై ఎన్నో ఏళ్లు గడిచినా సంతాన సాఫల్యానికి నోచని దంపతులకు దత్తత ఓ వరం. దత్తత తీసుకోవడంలోనూ కొన్ని నిబంధనలు ఉన్నాయి. అనధికార దత్తత చట్టరీత్యా నేరం కూడా అవుతుంది. కొంత మంది ఈ విషయం తెలియక దళారుల చేతిలో మోసపోతున్నారు. అక్రమ మార్గాలను ఎంచుకుని చిక్కుల్లో పడుతున్నారు. జాతీయ దత్తత మాసోత్సవం సందర్భంగా నెలరోజులపాటు స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దత్తతపై అవగాహన కార్య క్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కడపలో శిశు గృహ కేంద్ర అధికారులు దత్తత ఏ విధంగా పొందాలి? దత్తత తీసుకునేందుకు ఉండాల్సిన అర్హతల గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించనున్నారు. అర్హత కలిగిన వారికి చిన్నారులను దత్తత ఇస్తూ అందిస్తున్నారు.

### అర్హతలు

- దంపతుల వయస్సు, వైవాహిక బంధం ఆధారంగా చిన్నారులను దత్తత ఇస్తారు.
- కనీసం రెండేళ్లపాటుఎలాంటి గొడవలు లేకుండా సాఫీగా జీవిస్తున్న దంపతులు అర్హులు.
- రెండేళ్లలోపు పిల్లలను దత్తత తీసుకోవాలంటే దంపతుల్లో మగవారి వయస్సు 45, ఆడవారి వయస్సు 40కి మించకూడదు.
- ఒంటరి మహిళల వయస్సు 40కి మించకూడదు.
- దత్తత కోరే తల్లిదండ్రులు భౌతికంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండి, ఆర్థికంగా బాగుండాలి.
- ఒంటరి మగ వారు– మగ బిడ్డను మాత్రమే దత్తత పొందుటకు అర్హులు.
- దత్తత పొందాలనుకుంటున్న భార్యా భర్తలు ఇద్దరి అంగీకారం తప్పనిసరిగా ఉండాలి.

### అనధికార దత్తత చెల్లదు

కొందరు బంధువులకు చెందిన పిల్లలను, తెలిసిన వారి పిల్లలను అనధికారికంగా దత్తత తీసుకుంటున్నారు. ఇలా అనధికార దత్తత చెల్లదు. పైగా అనధికార దత్తత తీసుకున్న వారికి జేజే యాక్టు సెక్షన్ 81 ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది.

కడపలోని శిశు గృహ

### దరఖాస్తు చేసుకొనే విధానం

దత్తత కోరే తల్లిదండ్రులు తొలుత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కారా.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నింపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు

- భార్యాభర్తల ఫ్యామిలీ ఫొటోగ్రాఫ్
- పాన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు
- నివాస ధ్రువపత్రం (ఆధార్ కార్డు/ఓటర్ కార్డు / పాస్ పోర్ట్ )
- సంవత్సరం ఆదాయ ధ్రువీకరణ పత్రం (సాలరి సర్టిఫికేట్/ ప్రభుత్వం జారీ చేసినటువంటి ఇన్‌కమ్ సర్టిఫికేట్/ఇన్ కమ్ టాక్స్ రిటర్న్, ఎంప్లాయ్మెంట్ సర్టి ఫికేట్/ఇతర ప్రాపర్టీ డాక్యుమెంట్స్)
- దీర్ఘకాలిక, అంటువ్యాధి లేదా ప్రాణాంతక వ్యాధితో బాధపడలేదని, దత్తత తీసుకోవడానికి అర్హులని ధ్రువీకరిస్తూ వైద్య ప్రాక్టీషనర్ నుంచి మెడికల్ సర్టిఫికేట్ సమర్పించాలి.

### అవగాహన కల్పిస్తున్నాం

అంతర్జాతీయ దత్తత మాసోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను కల్పిస్తున్నాం. 0–18 ఏళ్లలోపు పిల్లలను ఎవరైనా అనధికారిక దత్తత తీసుకున్నట్లయితే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరుకు సమాచారం ఇవ్వాలి.

– కుమారి, మేనేజర్, శిశుగృహ, కడప

### నెలరోజుల పాటు సదస్సులు, సమావేశాలు

పిల్లలను అధికారికంగా దత్తత తీసుకోవడంపై నెల రోజులపాటు సదస్సులు, సమావేశాలను నిర్వహిస్తున్నాం. పిల్లలు లేని దంపతులు చట్టప్రకారం దత్తత తీసుకోవడం మంచిది. ఇతర వివరాలకు కడపలోని స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యాలయంలోగానీ, కొండాయపల్లెలోని శిశు గృహలోగానీ సంప్రదించాలి.

– రమాదేవి, పీడీ, ఐసీడీఎస్, కడప

# ఆస్ట్రేలియాలో ఎన్నారైల సహకారం మరువలేనిది

- రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారింది
- ప్రజలంతా మళ్లీ వైఎస్ జగన్ పాలనను గుర్తుచేసుకుంటున్నారు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి

ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో మీట్ అండ్ గ్రీట్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

సాక్షి,అమరావతి: కొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తున్న ఆస్ట్రేలియా వైఎస్సార్‌సీపీ ఎన్నారైలకి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి అభినందనలు తెలిపారు. ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ పర్యటనలో ఉన్న ఆమె శనివారం 23 సిన్నోట్ స్ట్రీట్, వెర్రిబీ విక్ 3030, ఆస్ట్రేలియా, దోసా హట్‌లో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మాజీ సీఎం జగన్ పట్ల మీరు చూపిస్తున్న ఆధారాభిమానాలను పార్టీ ఎల్లప్పుడూ గుర్తుంచుకొంటుందని ప్రవాసాంధ్రులను ఉద్దేశించి ఆమె అన్నారు. 'చంద్రబాబు ఏడాదిన్నర పాలన చూసిన తర్వాత రాష్ట్ర ప్రజలందరూ ముక్తకంఠంతో చెబుతున్న ఒకే మాట ఇంత చెత్త ప్రభుత్వం, ఇంత దుష్టప్రభుత్వం దేశంలోనే లేదని. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రలు, రాజ్యాంగ పరిరక్షణ.. ఏదీ సక్రమంగా జరగడం లేదు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారింది. ప్రజలంతా మళ్లీ వైఎస్ జగన్ పాలనను గుర్తుచేసుకుంటున్నారు' అని పేర్కొన్నారు.

### వైఎస్ జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే..

మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో వస్తున్న మంచిపేరు, పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఎలాగైనా అడ్డుకోవాలనే కుట్రతో అనుక్షణం తప్పుడు ఆరోపణలు, పార్టీ నాయకులపై అక్రమ కేసుల పెట్టి, వేధిస్తున్నారని లక్ష్మీపార్వతి దుయ్యబట్టారు. 'కూటమి ఏడుపులే ఆయనకు దీవెనలుగా మారుతున్నాయి. చేతనైతే ప్రజలకిచ్చిన హామీలు చంద్రబాబు నెరవేర్చాలి. బాబు ప్రభుత్వాన్ని దించేసే సమయం కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారు. రాబోయే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్యకర్తలకు అన్ని విధాలా భరోసా ఉంటుంది. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలి' అని ఆమె కోరారు. ఈ సందర్భంగా పలువురు ఎన్నారైలు మాట్లాడుతూ.. వైఎస్ జగన్ తన పరిపాలనలో ప్రజలకు ఎంతో మేలు చేశారని, తమలో చాలామంది మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకాల ద్వారా విదేశాల్లో స్థిరపడ్డామని తెలిపారు. వైఎస్ జగన్‌కు ఎల్లప్పుడూ మద్దతుగా ఉండి, ఆయన రుణం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా సీనియర్ వైఎస్సార్‌సీపీ లీడర్ చింతలచెరువు సూర్యనారాయణ రెడ్డి, మెల్బోర్న్ టీం వైఎస్సార్‌సీపీ సభ్యులు, ఆస్ట్రేలియా వైఎస్సార్‌సీపీ నాయకులు నాగార్జున యలగాల, అనిల్ పెదగాడ, హరి చెన్నుపల్లి, శరత్ కుమార్ రెడ్డి తోట్లీ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ పనులకు టెండర్లు

ఆరు నెలల్లో పూర్తి చేయాలని సీఆర్‌డీఏ నిబంధన

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణ పనులకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ) శనివారం టెండర్లు పిలిచింది. రెండు ఎకరాల్లో 4,201 చదరపు మీటర్ల(45,220 చదరపు అడుగులు) నిర్మిత ప్రాంతంతో జీ+1 విధానంలో నిర్మించే ఈ పనులకు టెండర్లు పిలిచింది. ఓపెన్ కాంపిటీటివ్ బిడ్డింగ్ పద్ధతిలో లీస్ట్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్(తక్కువ ధరకు కోట్ చేయడం ఆధారంగా కాంట్రాక్టర్ ఎంపిక) విధానంలో ఈ పనులకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఆరు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి.. 24 నెలల పాటు నిర్వహించాలని నిబంధన పెట్టింది. బిడ్ దాఖలుకు డిసెంబర్ 6 వరకు గడువు ఇచ్చింది. డిసెంబర్ 8న ఆర్థిక బిడ్ తెరిచి.. తక్కువ ధరకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు నిర్మాణ పనులు అప్పగించనున్నట్లు తెలిపింది. ప్రీ బిడ్ సమావేశాన్ని ఈ నెల 26న నిర్వహించనున్నట్లు పేర్కొంది.

# ఆ జిల్లాల్లో నాయకత్వం పటిష్టంగా లేదు: పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పార్టీ నాయకత్వాన్ని పటిష్టం చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. ఆ జిల్లాల్లో జనసేనకు బలమైన శ్రేణులు ఉన్నా, సమర్థ నాయకత్వం లేదన్నారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీల వరకూ పార్టీ కమిటీల నిర్మాణంపై పవన్ శనివారం ఉదయం జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యులతో చర్చించారు.

# వంజంగి అందాలకు ఫిదా

వంజంగి గిరిశిఖరాల్లో ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా అవుతున్నారు.పర్యాటక సీజన్ కావడంతో వంజంగి హిల్స్‌కు పర్యాటకుల తాకిడి అధికమైంది. దేశంలోని అనేక ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వంజంగి హిల్స్‌లో మేఘాలు, పొగమంచు, మేఘాల అందాలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతర్జాలంలో కూడా వంజంగి హిల్స్ అందాలకు ప్రముఖ స్థానం ఏర్పడింది. ప్రస్తుతం వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలు అబ్బురపరుస్తున్నాయి. తెల్లవారు 4గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు వంజంగి కొండలపై పర్యాటకులు సందడి చేస్తున్నారు.

- సాక్షి, పాడేరు

# వినోదాల కనువిందు

## డిసెంబరు నెలలో సినీ జాతర

## క్రిస్మస్ పండక్కి థియేటర్స్‌లో ఐదారు సినిమాలు

**ఈ ఏడాది వెండితెర సినిమా క్లైమాక్స్‌కు వచ్చేసింది. ఈ నెల చివర్లో అంటే... నవంబరు 28న రామ్ 'ఆంధ్ర కింగ్ తాలూకా', కీర్తీ సురేష్ 'రివాల్వర్ రీటా' చిత్రాలు రిలీజ్‌కు రెడీగా ఉన్నాయి. ఇక డిసెంబరు నెలలో వెండితెరపై సినిమాల జాతర అని చెప్పవచ్చు. ఈ నెలలో వారానికి కనీసం ఒక సినిమా చొప్పున రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా క్రిస్మస్ పండక్కి అయితే ఐదారు సినిమాలు రిలీజ్ కానున్నాయి. ఏ సినిమాలు ఏయే తేదీల్లో విడుదలవుతున్నాయి? స్ట్రయిట్ చిత్రాలతో పాటు ఏయే అనువాద చిత్రాలు ఈ డిసెంబరు నెలలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయో మీరూ ఓ లుక్ వేయండి.**

### ఈ ప్రపంచమే నిశ్శబ్దం

డిసెంబరు తొలి వారంలో ముందుగా 'అఖండ 2: తాండవం' సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ కూడా విడుదలైంది. ''కష్టం వస్తే దేవుడు వస్తాడు అని నమ్మే జనానికి కష్టం వచ్చినా దేవుడు రాడు అని నమ్మించాలి..' అనే డైలాగ్‌తో మొదలైంది 'అఖండ 2: తాండవం' సినిమా ట్రైలర్. హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ'కు సీక్వెల్‌గా 'అఖండ 2: తాండవం' చిత్రం రూపొందింది. సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా ఈ చిత్రంలోని ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 5న విడుదల కానుంది. తాజాగా విడుదలైన ఈ చిత్రం ట్రైలర్‌లో ''ఎనిమిది కంతాలు తెగాలి... రక్తం చిందాలి, నేను చనిపోయిన రోజున వాడొచ్చి కొరివి పెడితేనే ఈ కట్టె మట్టిలో కలిసేది..., ఈ ప్రపంచంలో ఏ దేశం వెళ్లినా మీకు అక్కడ కనిపించేది ఒక మతం... ఈ దేశంలో మీరు ఎటు చూసినా కనిపించేది ఒక ధర్మం... సనాతన హైంధవ ధర్మం..., దేశం జోలికి వస్తే మీరు దండిస్తారు... దేవం జోలికి వస్తే మేం ఖండిస్తాం... మీ భాషలో చెప్పాలంటే సర్జికల్ స్ట్రైక్.., ఇప్పటివరకు ప్రపంచపటంలో నా దేశం రూపాన్ని చూసి ఉంటావ్... ఎప్పుడూ మా దేశ విశ్వ రూపాన్ని చూసి ఉండవ్... మేం ఓసారి లేచి శబ్దం చేస్తే... ఈ ప్రపంచమే నిశ్శబ్దం' అన్న డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి.

### సమయంతో పోరాడే కథ

శర్వానంద్ హీరోగా నటించిన మల్టీ జనరేషనల్ ఫ్యామిలీ డ్రామా సినిమా 'బైకర్'. 1990-2000 మధ్య కాలంలో సాగే ఈ చిత్రం మూడు తరాల నేపథ్యంలో ఉంటుంది. ఈ మోటోక్రాస్ రేసింగ్ ఫిల్మ్‌లో శర్వానంద్ బైకర్‌గా నటించారు. ఈ సినిమాలోని లుక్ కోసం శర్వానంద్ ప్రత్యేకమైన శిక్షణ తీసుకుని సన్నబడ్డారు. స్పోర్ట్స్ అంశానికి కుటుంబ భావోద్వేగాలు మిళితమైన ఈ సినిమా డిసెంబరు 6న విడుదల కానుంది. మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాజశేఖర్, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. విక్రమ్ సమర్పణలో అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ-ప్రమోద్ నిర్మించిన చిత్రం ఇది. 'బైకర్' ఫస్ట్‌ల్యాప్ పేరిట ఈ సినిమా గ్లింప్స్‌ను ఇటీవల విడుదల చేశారు మేకర్స్. ''ఇక్కడ ప్రతి బైకర్‌కి ఒక కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ. చావుకి ఎదురెళ్ళే కథ. ఏం జరిగినా పట్టు వదలని మొండివాళ్ళ కథ, ఇక్కడ గెలవడం గొప్పకాదు. చివరి దాకా పోరాడటం గొప్ప' అనే డైలాగ్స్ ఈ గ్లింప్స్‌లో ఉన్నాయి.

### ఫారెస్ట్ లవ్‌స్టోరీ

రోషన్ కనకాల, సాక్షీ మడోల్కర్ హీరో హీరోయిన్లుగా నటించిన ప్రేమకథా చిత్రం 'మోగ్లీ 2025'. ఫారెస్ట్ నేపథ్యంలో సాగే ఈ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాకు సందీప్ రాజ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో బండి సరోజ్ కుమార్ విలన్‌గా నటించగా, వైవా హర్ష ఓ కీలక పాత్రలో నటించారు. ఓ అమ్మాయి ప్రేమ కోసం ఓ అబ్బాయి ఫారెస్ట్‌లో ఎలాంటి సాహసాలు చేశాడు? తన ప్రేయసి కోసం ఎలాంటి త్యాగాలు చేశాడు? అన్నది 'మోగ్లీ 2025' సినిమాలో చూడొచ్చు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 12న రిలీజ్ కానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి 'మోగ్లీ 2025 వరల్డ్, మోగ్లీ 2025 టీజర్'లను రిలీజ్ చేశారు మేకర్స్.

### శంబాల ప్రపంచం

క్రిస్మస్ ఫెస్టివల్‌కి 'శంబాల' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు ఆది సాయికుమార్. ఈ మిస్టికల్ థ్రిల్లర్ సినిమాను యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రంలో అర్చన అయ్యర్ హీరోయిన్‌గా నటించగా స్వాశిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా డిసెంబరు 25న రిలీజ్ కానుంది. ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'కొన్ని వేల సంవత్సరాల క్రితం పరమశివుడికి, అసురుడికి మధ్య జరిగిన ఓ భీకర యుద్ధం ఈ కథకి మూలం, అగ్ని పురాణం ప్రకారం ఆకాశంలో సంగ్రామం జరిగినప్పుడు దుష్టశక్తులు జంతువుల్ని సైతం ఆవహిస్తాయి, వాళ్లేమో చీమ కుట్టినా శివుడి ఆజ్ఞ అని నమ్ముతారు... విక్రమ్ ఏమో చావులో సైతం సైన్స్ ఉందనే రకం'..., 'మీరు చెబుతున్న శాస్త్రం మితం... మీరు తెలుసుకోవాల్సిన మా శాస్త్రం అనంతం'... వంటి డైలాగ్స్ ఈ సినిమా ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రకథ ప్రధానంగా ఓ గ్రామం నేపథ్యంలో సాగుతుందని, దుష్టశక్తులు, దైవం, సైన్స్ వంటి అంశాల మేళవింపుతో కథనం సాగుతుందని తెలుస్తోంది. అలాగే ఈ సినిమా కథనం విభిన్న కాలమానాల్లో సాగుతుందని తెలిసింది.



### చాంపియన్ ప్రేమకథ

రోషన్ మేకా (ప్రముఖ హీరో శ్రీకాంత్ తనయుడు) హీరోగా నటించిన తాజా చిత్రం 'చాంపియన్'. ఈ చిత్రంతో అనస్వర రాజన్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలో స్వాతంత్ర్యానికి ముందు హైదరాబాద్‌లో నివసించే ఆర్మీ మ్యాన్, ఫుట్‌బాలర్ మైఖేల్ సి. విలియమ్స్‌గా రోషన్ కనకాల నటించారు. మైఖేల్ ఎంతటి ప్రతిభావంతుడైన ఫుట్‌బాల్ ప్లేయర్ అంటే అప్పట్లో ఇంగ్లండ్‌లో రాణి ఎలిజబెత్‌ను కలుసుకునే అవకాశం అతనికి లభిస్తుంది. కానీ అతని ధ్యాస అంతా తన ప్రేయసి చంద్రకళ (అనస్వర రాజన్ పాత్ర పేరు) పైనే. మరి... చంద్రకళతో మైఖేల్ ప్రేమకథ ఏమైంది? అన్నది క్రిస్మస్ ఫెస్టివల్ సందర్భంగా డిసెంబరు 25న థియేటర్స్‌లో చూడాల్సిందే. జీ స్టూడియోస్ సమర్పణలో ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మించాయి. ''హిస్టరీ, స్పోర్ట్స్ డ్రామా, లవ్ స్టోరీ, భావోద్వేగాలు, యుద్ధం వంటి అంశాలతో 'చాంపియన్' సినిమా ఆడియన్స్‌ను ఆకట్టుకుంటుంది'' అని ఇటీవల ఈ సినిమా గురించి యూనిట్ పేర్కొంది.

### యూత్‌ఫుల్ యుఫోరియా

యూత్‌ఫుల్ 'యుఫోరియా' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధం అయ్యారు ప్రముఖ దర్శకుడు గుణశేఖర్. భూమిక చావ్లా, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి, అడ్డాల పృథ్వీరాజ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన సినిమా 'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో గుణశేఖర్ దర్శకత్వంలో నీలిమ గుణ, యుక్తా గుణ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 25న రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రయూనిట్ ఇటీవల ప్రకటించింది. నేటి యువతకి, ఫ్యామిలీ ఆడియన్స్‌కి కనెక్ట్ అయ్యేలా వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ 'యుఫోరియా' సినిమాను తెరకెక్కించామని, ఈ సినిమాలో మంచి సందేశం కూడా ఉందని యూనిట్ పేర్కొంది. కల్పలత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాధ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాశ్, నవీనా రెడ్డి, లికిత్ నాయుడు ఈ చిత్రంలోని ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఇక 'ఒక్కడు' (2003 – ఈ చిత్రంలో మహేశ్ బాబు హీరో) చిత్రం తర్వాత భూమిక చావ్లాతో కలిసి దర్శకుడు గుణశేఖర్ రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ఈ 'యుఫోరియా' సినిమాకు కలిసి పని చేయడం విశేషం.

### పతంగుల పోటీ

పతంగుల పోటీ నేపథ్యంలో రూపొందిన కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. వంశీ పూజిత్, ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, 'జీ సరిగమప' రన్నరప్ ప్రణవ్ కౌశిక్ ప్రధాన తారలుగా ప్రముఖ సింగర్ ఎస్పీ చరణ్ మరో కీలక పాత్రలో నటించిన చిత్రం ఇది. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం కూడా క్రిస్మస్ సందర్భంగానే డిసెంబరు 25 రిలీజ్ కానుంది. ఈ సినిమా కథే మెయిన్ హీరో అని, థియేటర్స్‌లో ఈ 'పతంగ్' సినిమా యూత్‌కి ఓ యూత్ ఫెస్టివల్‌గా ఉంటుందని చిత్రయూనిట్ పేర్కొంది.

### కులవ్యవస్థపై దండోరా

అగ్రవర్ణాలకు చెందిన అమ్మాయిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్రవర్ణాలకు ఎవరైనా ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండలు జరుగుతాయనే అంశాల నేపథ్యంలో రూపొందిన సినిమా 'దండోరా'. శివాజీ, నవదీప్, బిందు మాధవి, రవికృష్ణ, మోనికా రెడ్డి ఈ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో నటించారు. మురళీ కాంత్ దర్శకత్వంలో లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 25న రిలీజ్ కానుంది. 'తెలంగాణ గ్రామీణ నేపథ్యంలోని ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూ 'దండోరా' ను తెరకెక్కించామని, ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్రయూనిట్ పేర్కొంది.

**ఈ డిసెంబరు నెలలో రిలీజ్ కానున్న సినిమాలు, రిలీజ్ అయ్యేందుకు సిద్ధం అవుతున్న చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.**

**తెలుగు బాక్సాఫీస్ వద్ద ఈ డిసెంబరు నెలలో డబ్బింగ్ సినిమాలు కూడా గట్టిగానే సందడి చేయనున్నాయి. ఆ సినిమాలు ఏమిటో ఓ లుక్ వేద్దాం...**

● కార్తీ పోలీసాఫీసర్‌గా నటించిన తాజా చిత్రం 'వా వాత్తియార్'. ఈ చిత్రంలో కృతీ శెట్టి హీరోయిన్‌గా నటించగా, సత్యరాజ్, మధుర్ మిట్టల్, ఆనంద రాజ్, రాజ్ కిరణ్, శిల్పా మంజునాథ్, కరుణాకరణ్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ 'వా వాత్తియార్' మూవీకి తెలుగులో 'అన్నగారు వస్తారు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ యాక్షన్ కామెడీ కథకు నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించగా, స్టూడియో గ్రీన్ పతాకంపై కె. ఇ. జ్ఞానవేల్ రాజా ఈ నిర్మించారు. కాగా, ఈ సినిమాను డిసెంబరులో రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రయూనిట్ ఇటీవల ప్రకటించింది. గతంలో ఈ 'వా వాత్తియార్' సినిమాను డిసెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. అయితే ఇప్పుడు ఈ రిలీజ్ డేట్‌లో మార్పు ఉంటుందని, డిసెంబరు 12న ఈ చిత్రం థియేటర్స్‌లోకి రావచ్చని కోలీవుడ్ టాక్.



● 'లవ్‌టుడే, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, డ్యూడ్' వంటి చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గర అయ్యారు ప్రదీప్ రంగనాథన్. ఈ యువ కథానాయకుడు హీరోగా నటించిన తాజా చిత్రం 'ఎల్.ఐ.కే' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ). ఈ సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ డ్రామా సినిమాకు విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించగా, నయనతారతో కలిసి లలిత్‌కుమార్ నిర్మించారు. కృతీ శెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, యోగి బాబు, గౌరీ జీ కిషన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా డిసెంబరు 18న రిలీజ్ కానుంది. దీపావళి సందర్భంగా ఈ 'ఎల్.ఐ.కే' సినిమాను రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ఈ పండగ సందర్భంగానే ప్రదీప్ రంగనాథన్ నటించిన మరో సినిమా 'డ్యూడ్' కూడా విడుదలైంది. ఈ నేపథ్యంలో 'ఎల్.ఐ.కే' సినిమాను రిలీజ్ వాయిదా వేయక తప్పలేదు.

● హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ డైరెక్షన్‌లోని 'అవతార్' సిరీస్ నుంచి వస్తున్న తాజా చిత్రం 'అవతార్:ఫైర్ అండ్ యాష్'. ప్రపంచ వ్యాప్త సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ సినిమా డిసెంబరు 19న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. తెలుగులోనూ ఈ చిత్రం రిలీజ్ కానుంది. సామ్ వర్తింగ్టన్, జోయ్ సల్దానా, సిగోర్నీ వీవర్, స్టీఫెన్‌లాంగ్, ఊనా చాప్లిన్, కేన్ విన్స్‌లెట్, క్లిఫ్ కర్టిస్, జాక్ చాంపియన్ వంటి హాలీవుడ్ నటులు ఈ 'అవతార్ 3' చిత్రంలో నటించారు. జేమ్స్ కామెరూన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు ఓ నిర్మాతగా ఉన్నారు. జాన్ ల్యాండో ఈ సినిమాకు మరో నిర్మాత.




● మోహన్‌లాల్ హీరోగా నటించిన హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'వృషభ'. రాగిణి ద్వివేది, సమర్జిత్ లంకేష్, నయన సారిక ఈ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో నటించారు. తొలుత ఈ సినిమాను దీపావళికి, ఆ తర్వాత నవంబరు 6న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కానీ వీలుపడలేదు. అయితే ఇటీవల ఈ చిత్రాన్ని డిసెంబరు 25న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా ఈ సినిమాను నిర్మించారు. తండ్రీ కొడుకుల ఎమోషన్, మానవ అనుబంధాల మేళవింపుతో ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని చిత్రయూనిట్ పేర్కొంది.

**వీటితో పాటు ఈ నెలలోనే మరికొన్ని ఇతర భాషల చిత్రాలు తెలుగులో రిలీజ్ అయ్యేందుకు సిద్ధం అవుతున్నాయి.**

**- ముసిమి శివాంజనేయులు**

## డ్రీమ్ థియేటర్‌లో ప్రియాంక

● ప్రియాంక మోహన్

ప్రముఖ కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, ధనంజయ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. హేమంత్ ఎం. రావు దర్శకత్వంలో డా. వైశాఖ్ జె. గౌడ నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా ప్రియాంకా మోహన్‌ని ఖరారు చేసినట్లు ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సందర్భంగా ప్రియాంకా మోహన్ మాట్లాడుతూ–''శివ రాజ్‌కుమార్ సార్ సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయన నటిస్తున్న '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'లో భాగం కావడంతో నా కల నిజమైంది. ప్రతిభావంతులైన ధనంజయతో కలిసి సినిమా చేయడం సంతోషంగా ఉంది'' అని తెలిపారు. ''ఈ సినిమాని తెలుగు, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల చేస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.

## వినోదాల త్రీ రోజెస్

● ఎస్‌కేఎన్, ఈషా రెబ్బా, రాశీ సింగ్, ప్రిన్స్ సిసిల్, కుషిత, కిరణ్

ఈషా రెబ్బా, రాశీ సింగ్, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, 'సత్యం' రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. రవి నంబూరి, సందీప్ బొల్ల రచనలో కిరణ్ కె. కరవల్ల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్‌కి డైరెక్టర్ మారుతి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్‌కేఎన్ నిర్మించారు. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన 'త్రీ రోజెస్' సీజన్ 2 డిసెంబరు 12 నుంచి ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్ టీజర్‌లాంచ్ ఈవెంట్‌లో కిరణ్ కె. కరవల్ల మాట్లాడుతూ–''డైరెక్టర్‌గా నా డెబ్యూ సిరీస్ ఇది. పూర్తిస్థాయి వినోదాత్మకంగా రూపొందింది'' అని తెలిపారు. ఎస్ కేఎన్ మాట్లాడుతూ–''త్రీ రోజెస్' కాన్సెప్ట్‌తో ఎన్ని సిరీస్‌లు అయినా చేయొచ్చు. అలాంటి యూనిక్ కాన్సెప్ట్‌ని మారుతి ఇచ్చారు. 'త్రీ రోజెస్' సీజన్ 1ను మించిన ఎంటర్‌టైన్‌మెంట్ సీజన్ 2లో చూస్తారు. 'త్రీ రోజెస్' సీజన్ 3 కూడా ఉంటుంది.. ఆ సీజన్‌ను సినిమాలా రిలీజ్ చేస్తాం'' అని చెప్పారు. ''త్రీ రోజెస్' సీజన్ 1 అంత పెద్ద సక్సెస్ అవుతుందని నేను ఊహించలేదు. సీజన్ 2 స్క్రిప్ట్ చదివినప్పుడే మొదటి దానికంటే పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం కలిగింది'' అన్నారు ఈషా రెబ్బా. ''ఈ సిరీస్‌లో నేను చేసిన మేఘన పాత్రకి, నా పర్సనల్ లైఫ్‌కు చాలా పోలికలు ఉన్నాయి'' అని రాశీ సింగ్ పేర్కొన్నారు. ''ఈ సిరీస్‌లో నేను చేసిన స్రష్టి క్యారెక్టర్‌కు కొంచెం తిక్క ఉంది, కానీ దానికి ఓ లెక్క ఉంటుంది'' అన్నారు కుషిత కల్లపు. ఈ కార్యక్రమంలో ఆహా కమర్షియల్ హెడ్ రాజేశ్ వాసిరెడ్డి, కంటెంట్ హెడ్ కవిత, రైటర్ సందీప్ బొల్ల, యాక్టర్ సూర్య శ్రీనివాస్ మాట్లాడారు.

## బిజినెస్ రీల్

### సీడీఎస్ఎల్ ఐడియాథాన్‌కి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ముంబై: విద్యార్థుల కోసం తొలిసారిగా రీఇమేజిన్ ఐడియాథాన్ నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ ఇండియా (సీడీఎస్ఎల్) వెల్లడించింది. మార్కెట్లలో పెట్టుబడుల గురించి తెలుసుకోవడంలోను, ఇన్వెస్ట్ చేయడంపైన అవగాహన పెంచే సొల్యూషన్స్‌ను రూపొందించేలా ప్రోత్సహించేందుకు తమ 3వ వార్షిక రీఇమేజిన్ సింపోజియం కింద దీన్ని చేపట్టినట్లు వివరించింది. ఒక్కో సంస్థ నుంచి నలుగురు విద్యార్థులు, ఒక మెంటార్ కలిసి బృందంగా ఏర్పడి, ఇందులో పాల్గొనవచ్చు. మొత్తం రూ. 11.5 లక్షల ప్రైజ్ మనీ ఉంటుంది. విజేతగా నిల్చే ఐడియాకి రూ. 5 లక్షలు, రన్నర్స్ అప్‌కి రూ. 3 లక్షలు, రూ. 2 లక్షల చొప్పున బహుమతులు ఉంటాయి. గేమిఫికేషన్, డిజైన్, టెక్నాలజీ మొదలైన విభాగాల్లో విద్యార్థులు సొల్యూషన్స్‌ని రూపొందించవచ్చు.

### అదానీ గ్రీన్ ఎనర్జీతో బొండాడ గ్రూప్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సౌర విద్యుత్ విభాగంలో అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్)తో దీర్ఘకాలిక వ్యూహాత్మక డిజైన్, కన్‌స్ట్రక్షన్ భాగస్వామ్యానికి సంబంధించి ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు బొండాడ ఇంజినీరింగ్ (బీఈఎల్) తెలిపింది. ఇది అయిదేళ్ల పాటు అమల్లో ఉంటుందని వివరించింది. దీని కింద తొలుత 650 మెగావాట్ల సౌర విద్యుత్ పనులకు సంబంధించిన భారీ ప్రాజెక్టు లభించినట్లు సంస్థ పేర్కొంది. దేశ పునరుత్పాదక విద్యుత్ లక్ష్యాల సాధన దిశగా ఇరు కంపెనీల భాగస్వామ్యం తోడ్పడుతుందని సంస్థ సీఎండీ బొండాడ రాఘవేంద్ర రావు తెలిపారు.

### స్టాన్‌లో హైదరాబాద్ ఏంజెల్స్ పెట్టుబడులు

haf.vc

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సోషల్ గేమింగ్ ప్లాట్‌ఫాం స్టాన్‌లో సిరీస్ ఏ కింద 8.5 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసినట్లు హైదరాబాద్ ఏంజెల్స్ ఫండ్ (హెచ్ఏఎఫ్) వెల్లడించింది. గేమింగ్, క్రియేటర్ ఎకానమీ విభాగంలో ఇది తమకు తొలి పెట్టుబడి అని వివరించింది. సిరీస్ ఏ కింద స్క్వేర్ ఎనిక్స్, రీజాన్ హోల్డింగ్స్, సోనీ గ్రూప్‌కి చెందిన సోనీ ఇన్నోవేషన్ ఫండ్ మొదలైనవి కూడా ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొంది. పార్థ్ చడ్డా, రాహుల్ సింగ్, నౌమాన్ ముల్లా ప్రారంభించిన స్టాన్.. దాదాపు 2.5 కోట్లకు పైగా డౌన్‌లోడ్స్ ఉన్నాయి. 2023లో హైదరాబాద్ ఏంజెల్స్ నెట్‌వర్క్ (హెచ్ఏఎన్) విభాగంగా ప్రారంభమైన హెచ్ఏఎఫ్ సుమారు రూ. 100 కోట్ల ఫండ్ ద్వారా ప్రారంభ దశలో, వృద్ధి దశలో ఉన్న అంకురాల్లో పెట్టుబడులు పెడుతోంది. ఒక్కో స్టార్టప్‌లో రూ. 2–4 కోట్లు ఇన్వెస్ట్ చేస్తోంది. ప్రధానంగా అధిక వృద్ధి అవకాశాలు గల 10–15 సంస్థల్లో పెట్టుబడులు పెట్టడంపై దృష్టి సారించింది.

### మెట్రోకెమ్‌తో హెచ్ఆర్‌వీ ఫార్మా జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏపీఐ డెవలప్‌మెంట్, తయారీ సంస్థ మెట్రోకెమ్ ఏపీఐతో సమగ్ర ఒప్పందం కుదుర్చుకున్నట్లు హైదరాబాద్‌కి చెందిన హెచ్ఆర్‌వీ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ (హెచ్ఆర్‌వీ ఫార్మా) తెలిపింది. నియంత్రిత మార్కెట్ల కోసం పలు ఎన్‌సీఈ–1 (న్యూ కెమికల్ ఎంటిటీ), సంక్లిష్టమైన ఏపీఐలను వేగంగా అభివృద్ధి చేసేందుకు, తయారీ చేసేందుకు ఈ సీడీఎంవో (కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, తయారీ) ఒప్పందం ఉపయోగపడుతుందని వివరించింది. దేశీయంగా తయారయ్యే వినూత్న ఆవిష్కరణలను అంతర్జాతీయంగా విస్తరించాలన్న లక్ష్యానికి ఇది సహాయకరంగా ఉంటుందని సీఈవో హరి కిరణ్ చేరెడ్డి తెలిపారు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

23-11-2025

| | |
|---|---|
| విశాఖ | 635–00 |
| చిత్తూరు | 673–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 645–00 |
| విజయవాడ | 660–00 |
| రిటైల్ ధర (డజను) | 90.00 |
| హైదరాబాద్ | 645–00 |
| వరంగల్ | 647–00 |
| రిటైల్ ధర | 7.05 |

# ఐ-బ్యాంకులకు ఐపీవోల పండగ

- ఈ ఏడాది ఇప్పటివరకు 90 ఇష్యూలు
- ఫీజుల కింద రూ. 3,500 కోట్లు
- టాప్ 10 ఇష్యూల నుంచి రూ. 1,315 కోట్లు
- ఐపీవో పరిమాణంలో 1 శాతం నుంచి 5 శాతం వరకు వసూలు

సాక్షి, బిజినెస్ డెస్క్: ఒకదాని తర్వాత మరొకటిగా లైన్ కట్టిన పబ్లిక్ ఇష్యూలతో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుల (ఐ–బ్యాంకులు) పంట పండుతోంది. ఫీజుల రూపంలో భారీ రాబడులతో అవి పండగ చేసుకుంటున్నాయి. గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఇప్పటివరకు 90 పైగా ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) వచ్చాయి. కంపెనీలు వీటి ద్వారా సుమారు రూ. 1.50 లక్షల కోట్లు సమీకరించాయి. సాధారణంగా ఇష్యూలకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించే సంస్థలు సుమారు 1 శాతం నుంచి 8 శాతం వరకు ఫీజులు తీసుకుంటాయి. ఐపీవోల ద్వారా కంపెనీలు సమీకరించిన నిధులను బట్టి చూస్తే ఐ–బ్యాంకుల ఫీజులు దాదాపు రూ. 3,500 కోట్లకు పైగా ఉంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇంకా ఈ ఏడాది ముగియడానికి మరో నెలన్నర వ్యవధి మిగిలి ఉన్న నేపథ్యంలో ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపాయి. గతేడాది కూడా ఐపీవోలు వెల్లువెత్తిన నేపథ్యంలో దాదాపు ఇదే స్థాయిలో రూ. 3,500 కోట్ల వరకు ఐ–బ్యాంకులకు ఫీజుల రూపంలో ముట్టినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**భారీ ఇష్యూల సందడి**

ఈ ఏడాది వరుసగా భారీ పబ్లిక్ ఇష్యూలు క్యూ కట్టాయి. వీటిలో టాటా క్యాపిటల్, ఎల్‌జీ ఇండియా, హెక్సావేర్ టెక్, బిలియన్ బ్రెయిన్స్ మొదలైన ఇష్యూలు ఉన్నాయి. ప్రైమ్ డేటాబేస్ గణాంకాల ప్రకారం టాటా క్యాపిటల్ రూ. 15,512 కోట్లు సమీకరించగా లీడ్ మేనేజర్లకు రూ. 159 కోట్లు ఫీజుల కింద ముట్టాయి. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ. 12,500 కోట్ల ఇష్యూని నిర్వహించిన సంస్థలు సుమారు రూ. 104 కోట్లు దక్కించుకోగా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తమ రూ. 11,605 కోట్ల ఐపీవోకి రూ. 226 కోట్లు చెల్లించింది. ఇక టెక్నాలజీ సంస్థ హెక్సావేర్ టెక్నాలజీస్ రూ. 8,750 కోట్లు సమీకరించగా ఫీజుల కింద రూ. 215 కోట్లు చెల్లించింది. అటు గ్రో మాతృసంస్థ బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ రూ. 6,632 కోట్ల ఇష్యూకి గాను మర్చంట బ్యాంకర్లకు రూ. 152 కోట్లు ముట్టజెప్పగా, లెన్స్‌కార్ట్ రూ. 7,278 కోట్ల ఇష్యూకి రూ. 129 కోట్ల మొత్తాన్ని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు చెల్లించింది. ఇలా మొత్తం మీద రూ. 76,210 కోట్లు సమీకరించిన టాప్ 10 సంస్థలు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లకు రూ. 1,315 కోట్లు ముట్టచెప్పాయి.

**అనుకూల పరిస్థితులు..**

దేశీయంగా మ్యుచువల్ ఫండ్స్ నుంచి పెట్టుబడులు ప్రవహిస్తుండటం, అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న తరుణంలో స్టార్టప్స్‌లో వాటాలను లాభాలకు అమ్ముకుని వీలైనంత త్వరగా నిష్క్రమించేందుకు ప్రైవేట్ ఈక్విటీ ఫండ్స్ తొందర పడుతుండటం లాంటి అంశాలు ప్రస్తుతం పబ్లిక్ ఇష్యూల వెల్లువకు కారణంగా నిలుస్తున్నట్లు విశ్లేషకులు తెలిపారు. వడ్డీ రేట్లు స్థిరంగా ఉండటం, జీడీపీ వృద్ధి, సెకండరీ మార్కెట్లు పటిష్టంగా ఉండటం వల్ల కూడా ఐపీవోల్లోకి సంస్థాగత ఇన్వెస్టర్లు, రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు గణనీయంగా వస్తున్నట్లు వివరించారు. ఇలాంటి ఐపీవో బూమ్‌తో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు లబ్ధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది పబ్లిక్ ఇష్యూకి వచ్చిన చాలా మటుకు కొత్త తరం టెక్నాలజీ కంపెనీలు సాధారణంగా కంటే అధిక ఫీజులే చెల్లించినట్లు తెలిపారు. ఇష్యూ ధరను ఆకర్షణీయంగా నిర్ణయించడం, కచ్చితంగా ఓవర్ సబ్‌స్క్రయిబ్ కావడం, లిస్టింగ్‌లో లాభాలు వస్తుండటంలాంటి అంశాల వల్ల నిధుల సమీకరణకు మార్కెట్లు మంచి మార్గంగా మారాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. సెకండరీ మార్కెట్లో ట్రేడవుతున్న పోటీ సంస్థల ధరలతో పోలిస్తే ఐపీవో రేటు సుమారు 20–30 శాతం వరకు తక్కువగా ఉండటం ఆకర్షణీయాంశంగా ఉంటుంది. దీనివల్ల – సంస్థలకు పెట్టుబడులు, ఇన్వెస్టర్లకు మార్కెట్లో ఎంట్రీ, బ్యాంకులకు ఫీజులు – ఇలా అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతోంది. దీనితో సానుకూల పరిస్థితులను సొమ్ము చేసుకునే దిశగా ఈ ఏడాది ఆర్థిక సేవలు, టెక్నాలజీ నుంచి కన్జూమర్ రిటైల్ వరకు వివిధ రంగాలకు చెందిన సంస్థలు పెద్ద ఎత్తున ఐపీవోలకు వచ్చాయి. ఇంకా వస్తున్నాయి. దీనితో బ్యాంకర్లు కూడా బిజీగా మారారని, ఐపీవోలు చేపట్టేలా మరిన్ని కంపెనీలకు భరోసానిస్తున్నారని వివరించాయి.

**ఇష్యూ సైజును బట్టి ఫీజులు..**

ఐపీవో విజయవంతమయ్యేందుకు చేసే ప్రయత్నాలకు గాను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు, మర్చంట్ బ్యాంకులు ఇలా ఫీజులు వసూలు చేస్తుంటాయి. సాధారణంగా ఇష్యూ పరిమాణం, అలాగే బ్యాంకరు రకాన్ని బట్టి ఫీజులు ఉంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. రూ. 10 కోట్ల లోపు చిన్న, మధ్యతరహా సంస్థల (ఎస్ఎంఈలు) ఇష్యూలపై ఇది దాదాపు 8–10 శాతం, కొన్ని సందర్భాల్లో 15 శాతం వరకు ఇది ఉంటోంది. చిన్న ఐపీవోలకు ప్రాసెసింగ్ ఫీజుల్లాంటివి రూ. 25,000 నుంచి రూ. 50,000 వరకు ఉంటుండగా, ఇతరత్రా అండర్‌రైటింగ్ ఫీజులు, లీగల్, రెగ్యులేటరీ, ఆడిట్, లిస్టింగ్ ఫీజులు మొదలైనవెన్నో ఉంటాయి. పెద్ద కంపెనీలకు సంబంధించి, ఇష్యూ సైజు రూ. 1,000 కోట్ల వరకు ఉంటే ఫీజులు సుమారు 3–35 శాతం శ్రేణిలో ఉంటుంది. డీల్ సైజు రూ. 2,000 కోట్లు, రూ. 5,000 కోట్ల స్థాయిలో పెరిగే కొద్దీ ఫీజు శాతాల రూపంలో తగ్గినా, అంతిమంగా ఎక్కువగానే ఉంటుంది. దశాబ్దకాలం క్రితం చాలా మటుకు పబ్లిక్ ఇష్యూలపై ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లకు సుమారు 1–2 శాతమే ఫీజులు వచ్చేవి. ఇక భారీ ఇష్యూలకైతే ఇది మరింత తక్కువగా 0.5 – 1 శాతం శ్రేణిలో ఉండేది. ఈ ఏడాది సెకండరీ మార్కెట్ కూడా మెరుగ్గా ఉండటం, ఐపీవోల జోరు కొనసాగుతుండటంతో మధ్య స్థాయి ఇష్యూలపై ఫీజులు 2–2.5 శాతం స్థాయికి, భారీ డీల్స్‌పై 1.75 శాతం స్థాయికి పెరిగాయి.

**కొన్ని ఇష్యూలు.. బ్యాంకర్లు..**

ఎల్‌జీ ఇండియాకి మోర్గాన్ స్టాన్లీ, యాక్సిస్, జేపీ మోర్గాన్, బీవోఎఫ్ఏ, సిటీ సంస్థలు లీడ్ మేనేజర్లుగా వ్యవహరించాయి. అటు టాటా క్యాపిటల్‌కి కోటక్, యాక్సిస్, బీఎన్‌పీ, సిటీ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్ఎస్‌బీసీ, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఐఐఎఫ్ఎల్, జేపీ మోర్గాన్, ఎస్‌బీఐ సేవలందించాయి. ఇక బిలియన్ బ్రెయిన్స్‌కి కోటక్, జేపీ మోర్గాన్, సిటీ, యాక్సిస్, మోతీలాల్ సర్వీసులు అందించగా.. లెన్స్‌కార్ట్ సొల్యూషన్‌కి కోటక్, మోర్గాన్ స్టాన్లీ, ఎవెండస్, సిటీ, యాక్సిస్, ఇంటెన్సివ్ ఫిస్కల్ సంస్థలు లీడ్ మేనేజర్లుగా వ్యవహరించాయి.

## మొబైల్ ఫోన్ల వ్యాపారంలోకి ఇండ్‌కాల్

- వూబుల్ వన్ పేరుతో స్మార్ట్‌ఫోన్ ఆవిష్కరణ
- ప్రారంభ ధర రూ.22,000
- డిసెంబర్‌లో మార్కెట్లోకి

న్యూఢిల్లీ: కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఇండ్‌కాల్ మొబైల్ ఫోన్ల వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా 'వూబుల్ వన్' పేరుతో తొలి స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. తద్వారా భారతీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లోకి మరో నూతన దేశీయ కంపెనీ ప్రవేశించినట్లైంది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో ఆనంద్ దుబే మాట్లాడుతూ... ''కొత్త విభాగంలోకి ప్రవేశించేందుకు ఇప్పటికే రూ.225 కోట్ల పెట్టుబడులు పెట్టాము. పరిశోధన–అభివృద్ధి(ఆర్అండ్‌డీ), థర్డ్‌పార్టీ ద్వారా ఉపకరణాల తయారీ, మార్కెటింగ్, అమ్మకాల తర్వాత సేవలకు పెట్టుబడిని వినియోగిస్తున్నాము.'' అని అన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్‌లో కెమెరా మాడ్యుల్, హార్డ్‌వేర్‌లను స్వయంగా కంపెనీయే రూపకల్పన చేసింది. డిస్‌ప్లే, బ్యాటరీ, ఛార్జర్ భాగాలను దేశీయ కంపెనీల నుంచి సమకూర్చుకుంటుంది.అయితే భారత్‌లో లభ్యం కాని చిప్‌సెట్‌ను మాత్రం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది.

ఆకట్టుకునే ఫీచర్లు: వూబుల్ వన్ స్మార్ట్‌ఫోన్‌లో 6.67 అంగుళాల ఫ్లాట్ అమోలెడ్ డిస్‌ప్లే కలిగి ఉంది. ఇది ఫుల్ హెచ్‌డీ ప్లస్ రిజల్యూషన్‌ను, 120 హెడ్జ్ రిఫ్రెష్ రేట్‌తో వస్తుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7400 ఆక్టాకోర్ ప్రాసెసర్, 12జీబీ ర్యామ్, ఫోన్‌కు వెనుక వైపు 50 మెగాపిక్సెల్ మెయిన్ కెమెరా, 8 మెగాపిక్సెల్ అల్ట్రా వైడ్ కెమెరాలున్నాయి. ప్రారంభ ధరను రూ.22వేలుగా నిర్ణయించారు. డిసెంబర్ మొదటి వారంలో అందుబాటులోకి వస్తుంది.

## వేల్యూ 360 కమ్యూనికేషన్స్ ఇష్యూకి ఎన్ఎస్ఈ అనుమతి

న్యూఢిల్లీ: ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫాంలో తమ షేర్లను లిస్టింగ్ చేసేందుకు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ నుంచి (ఎన్ఎస్ఈ) సూత్రప్రాయ అనుమతులు లభించినట్లు వేల్యూ 360 కమ్యూనికేషన్స్ వెల్లడించింది. ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసే దిశగా ఇదొక కీలక మైలురాయని సంస్థ తెలిపింది.

## బీఈ న్యూబివ్యాక్స్ 14కి ప్రీ-క్వాలిఫికేషన్ హోదా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బయోలాజికల్ ఈ (బీఈ)కి చెందిన న్యూబివ్యాక్స్14 టీకాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నుంచి ప్రీ–క్వాలిఫికేషన్ హోదా లభించింది. బీఈ సంస్థకు సంబంధించి ఈ హోదా దక్కించుకున్న 11వ టీకా ఇది. న్యుమోనియా, మెనింజైటిస్‌లాంటి తీవ్ర వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుంది.

## విదేశీ పెట్టుబడులకు పుష్

**వాణిజ్య మంత్రి గోయల్ సన్నాహాలు**

న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు(ఎఫ్‌డీఐ)లు, విదేశీ సంస్థాగత పెట్టుబడు(ఎఫ్ఐఐ)లను ఆకట్టుకునేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సంబంధిత వర్గాలతో సమావేశమయ్యారు. సమావేశంలో ఇందుకు చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. దేశంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు సరళతర, సమర్థవంత వేగంతోకూడిన విధానాలకు తెర తీయనున్నారు. ఈ బాటలో ఎఫ్‌డీఐ, ఎఫ్ఐఐ విధానాలను మరింత క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్చలు కొనసాగించనుంది. తద్వారా దేశంలోకి మరింత వేగంగా పటిష్టస్థాయిలో పెట్టుబడులు ప్రవహించేలా గోయల్ చర్యలు చేపట్టనున్నారు. సమావేశానికిముందు పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ 98వ వార్షిక సాధారణ సమావేశంలో సభ్యులను ద్దేశించి గోయల్ ప్రసంగించారు. దేశంలోకి మరింత వేగంగా విదేశీ పెట్టుబడులు ప్రవహించేందుకు ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలపై సమావేశాలు నిర్వహించనున్నట్లు గోయల్ తెలియజేశారు. ఉద్యోగ కల్పన, కొత్త టెక్నాలజీలు, పరిశోధన, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలకు విదేశీ పెట్టుబడులు దారి చూపుతాయని ఈ సందర్భంగా గోయల్ పేర్కొన్నారు. దేశీయంగా రక్షణ రంగ పరికరాల తయారీని ప్రోత్సహించడం ద్వారా దేశీ కరెన్సీకి స్థిరత్వాన్ని కల్పించవచ్చని తెలియజేశారు. దీంతో ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టవచ్చని అభిప్రాయపడ్డారు.

**క్యూ1లో 15 శాతం అప్**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో దేశంలోకి 15 శాతం అధికంగా ఎఫ్‌డీఐలు ప్రవహించాయి. ఏప్రిల్–జూన్(క్యూ1)లో 18.62 బిలియన్ డాలర్లను తాకాయి. గత ఆర్థిక సంవత్సరం(2024–25)లో ఎఫ్‌డీఐ ఈక్విటీ పెట్టుబడులు 50 బిలియన్ డాలర్లను అధిగమించగా.. ఎఫ్‌డీఐలు 80.6 బిలియన్ డాలర్లను తాకడం గమనార్హం! పారిశ్రామికంగా సరఫరా వ్యవస్థలు డైవర్సిఫైకావలసి ఉన్నట్లు గోయల్ ప్రస్తావించారు. దీంతో ఒకే ప్రాంతంపై ఆధారపడటం తగ్గుతుందని తెలియజేశారు.

## ఏఐతో సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ వేగవంతం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ ప్రక్రియను కృత్రిమ మేధ దన్నుతో స్మార్ట్‌గా, వేగవంతంగా మార్చేందుకు తోడ్పడేలా క్యూమెంటిస్ఏఐ ప్లాట్‌ఫాంను రూపొందించినట్లు క్వాలిజీల్ వెల్లడించింది. సవాళ్లను వేగంగా గుర్తించేందుకు, టెస్టింగ్ సమయాన్ని 60 శాతం వరకు తగ్గించేందుకు ఇది తోడ్పడుతుందని పేర్కొంది. సాఫ్ట్‌వేర్‌లో అత్యంత ముఖ్యాంశాలపై దృష్టి సారించేందుకు ఇది టెస్టర్లకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించింది.

ఈ సందర్భంగా ఎవరెస్ట్ గ్రూప్‌తో కలిసి ''రీఇమేజినింగ్ ఎంటర్‌ప్రైజ్ క్వాలిటీ'' పేరిట క్వాలిజీల్ నివేదికను విడుదల చేసింది. ఆధునిక సాఫ్ట్‌వేర్ క్వాలిటీ రిస్కులను అధిగమించడంలో ఇంటెలిజెంట్ ఆటోమేషన్, నిరంతరాయ పర్యవేక్షణ ఉపయోగపడే విధానాన్ని నివేదిక వివరించింది. అలాగే, ప్లాట్‌ఫాం ఆధారిత క్వాలిటీ ఇంజినీరింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేసిన అజమారా క్రూయిజెస్ కేస్ స్టడీస్‌ని ఇందులో పొందుపర్చింది.

## గృహ రుణ మార్కెట్లో పీఎస్‌బీల దూకుడు

- నాన్ బ్యాంకింగ్ రుణ సంస్థల వృద్ధి నిదానించొచ్చు
- 2025–26లో 12–13 శాతానికి పరిమితం కావొచ్చు
- రేటింగ్స్ సంస్థ క్రిసిల్ అంచనా

ముంబై: గృహ రుణ మార్కెట్లో ప్రభుత్వరంగ బ్యాంకులు పెద్ద ఎత్తున కార్యకలాపాలను విస్తరిస్తున్న క్రమంలో.. నాన్ బ్యాంకింగ్ రుణ దాతల హౌసింగ్ పోర్ట్‌ఫోలియో వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిదానించొచ్చని రేటింగ్ సంస్థ క్రిసిల్ తెలిపింది. నాన్ బ్యాంక్ రుణదాతల నిర్వహణలోని రుణ ఆస్తుల విలువ 2025–26లో 12–13 శాతం మేర వృద్ధి చెందొచ్చని.. గత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 14 శాతంగా ఉందని పేర్కొంది. బ్యాంకుల నుంచి తీవ్ర పోటీకి తోడు, ప్రీమియం గృహ రుణాల్లో ఆధిపత్యం రూపంలో సవాళ్లను బ్యాంకింగేతర గృహ రుణ సంస్థలు ఎదుర్కొంటున్నట్టు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సంతోపాటు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లోనూ ప్రీమియం గృహ రుణాల్లో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలను ప్రభుత్వరంగ బ్యాంకులు అధిగమించించినట్టు తెలిపింది. బ్యాంకులు తక్కువ రేటుపై గృహ రుణాలను అందిస్తుండడం ధరల్లో పోటీకి దారితీసినట్టు పేర్కొంది. 9 శాతంలోపు వడ్డీ రేట్లతో కూడిన గృహ రుణాల పోర్ట్‌ఫోలియో 2025 మార్చి 31 నాటికి 60 శాతానికి చేరుకుందని, గత ఆర్థిక సంవత్సరంలో ఇది 45 శాతంగానే ఉన్నట్టు వెల్లడించింది. బ్యాలన్స్ ట్రాన్స్‌ఫర్ (మిగిలిన గృహ రుణాన్ని బదిలీ చేసుకోవడం)తో కస్టమర్లు వెళ్లిపోతున్న ధోరణి నెలకొన్నట్టు క్రిసిల్ డైరెక్టర్ శుభశ్రీ నారాయణన్ తెలిపారు.ప్రభుత్వరంగ బ్యాంకులు అసాధారణ స్థాయిలో అతి తక్కువ రేట్లపై గృహ రుణాలను మంజూరు చేస్తుండడం పట్ల కొన్ని సంస్థలు ఇటీవలి కాలంలో ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం.

**నిదానించిన వృద్ధి..**

పెరుగుతున్న పట్టణీకరణ, ఇళ్ల ధరల కంటే, ఖర్చు చేసే ఆదాయం పెరుగుతుండడం, ఆదాయపన్ను, జీఎస్‌టీ తగ్గింపు వంటి సానుకులతలు ఉన్నప్పటికీ.. గృహ రుణ మార్కెట్లో వృద్ధి నిదానించినట్టు క్రిసిల్ నివేదిక తెలిపింది. మొత్తం మీద 2025–26లో మోర్ట్‌గేజ్ ఏయూఎం వృద్ధి 18–19 శాతం స్థాయిలో ఉండొచ్చని, 2024–25లో 18.5 శాతంగా ఉన్నట్టు పేర్కొంది.

## వొడాఫోన్ నెట్‌వర్క్ విస్తరణ

న్యూఢిల్లీ: భక్తులకు సౌకర్యార్థం శబరిమల మార్గంలో కనెక్టివిటీని పెంచే దిశగా తమ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేసినట్లు వొడాఫోన్ ఐడియా తెలిపింది. అలాగే, యాత్రకు వచ్చే బాలల సంరక్షణ కోసం వీఐ సురక్షా రిస్ట్ బ్యాండ్స్‌ను మరింతగా అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించింది. దీనికి సంబంధించి ప్రీ–రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసినట్లు పేర్కొంది. వీఐసురక్ష పోర్టల్‌తో పాటు కేరళ వ్యాప్తంగా 25 వీఐ స్టోర్స్, 103 మినీ స్టోర్స్ మొదలైన వాటిల్లో రిజిస్టర్ చేసుకుని, పంబాలో ఏర్పాటు చేసిన వీఐ సురక్షా కియోస్కుల నుంచి వీటిని పొందవచ్చని వివరించింది.

## స్టార్టప్స్ కోసం యాక్సిస్ బ్యాంక్ ప్రత్యేక శాలరీ ప్రోగ్రాం




బెంగళూరు: అంకుర సంస్థల ఉద్యోగుల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా తమ న్యూ ఎకానమీ గ్రూప్ (ఎన్ఈజీ) విభాగం కింద క్యూరేటెడ్ కార్పొరేట్ శాలరీ ప్రోగ్రాంను ప్రవేశపెట్టినట్లు ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. జీరో–బ్యాలెన్స్ సేవింగ్స్ అకౌంట్, సమగ్ర బీమా కవరేజీ, ఎక్స్‌క్లూజివ్ క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన రుణాలు మొదలైన ప్రయోజనాలు ఇందులో ఉంటాయని వివరించింది. అలాగే, ఖాతాను బట్టి ఉద్యోగులకు వార్షికంగా రూ. 46,000 నుంచి రూ. 2.4 లక్షల వరకు ఆదా చేసే స్విచ్ టు సేవ్ ఫీచర్ కూడా ఉంటుందని బ్యాంక్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ విజయ్ మూల్‌బగల్ తెలిపారు. ప్రధానంగా జెన్ జెడ్, జెన్ ఆల్ఫా ఉద్యోగుల కోసం దీన్ని ఉద్దేశించినట్లు పేర్కొన్నారు.

## 14 నెలల కనిష్టానికి ఉత్పత్తుల ఎగుమతులు

- అమెరికా 50% సుంకాల విధింపు ప్రభావం
- అక్టోబర్‌లో 11.8% క్షీణత
- క్రిసిల్ నివేదిక వెల్లడి

కోల్‌కతా: భారతీయ ఉత్పత్తుల (మర్చండైజ్) ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన అక్టోబర్‌లో 11.8% తగ్గి 34.38 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇది 14 నెలల కనిష్ట స్థాయని క్రిసిల్ నివేదిక తెలిపింది. భారతీయ ఎగుమతులపై అమెరికా 50% సుంకాల విధింపు అగస్టు 27 నుంచి అమల్లోకి రావడంతో వరుసగా రెండో నెలా ఎగుమతులు మందగించినట్లు నివేదిక పేర్కొంది. పెట్రోలియం ఉత్పత్తులు, వజ్రాలు, రత్నాభరణాలతో పాటు ప్రధాన రంగాల ఎగుమతులు అన్నింటిలోనూ క్షీణత కనిపించింది. నివేదికలో మరిన్ని అంశాలు...

- వార్షిక ప్రాతిపదికన అక్టోబర్‌లో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 10.4% తగ్గాయి. అయితే సెప్టెంబర్‌తో పోలిస్తే 15.1% వృద్ధి నమోదైంది. ప్రధాన ఎగుమతుల్లో వార్షిక ప్రాతిపదికన 10.2% క్షీణత, నెలవారీగా పోలిస్తే 6.1% వృద్ధి నమోదైంది.
- అమెరికాకు మర్చండైజ్ ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 8.6% తగ్గి 6.3 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి. అయితే సెప్టెంబర్‌లో మాత్రం 11.9% వృద్ధి నమోదైంది. అమెరికాయేతర మార్కెట్లకు ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 12.5% తగ్గాయి. సెప్టెంబర్‌తో పోలిస్తే 10.9% వృద్ధి నమోదైంది.
- అమెరికాలో ఆహార రేట్లు అధికంగా పెరిగన నేపథ్యంలో దాదాపు 254 ఆహార వస్తువులపై సుంకాలను తగ్గిస్తూ నవంబర్ 16న ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేయడంతో రానున్న రోజుల్లో టీ, మసాల వంటి భారతీయ వ్యవసాయ ఎగుమతులకు కలిసొచ్చే అవకాశం ఉంది.
- సేవల వాణిజ్యం, రెమిటెన్సులు పెరగడం, ముడిచమురు ధరలు తగ్గడంతో కరెంట్ ఖాతా లోటు(క్యాడ్) అదుపులో ఉంటుందని క్రిసిల్ భావిస్తోంది. భారతీయ ఉత్పత్తుల (మర్చండైజ్) దిగుమతులు ఈ అక్టోబర్‌లో 76.06 బిలియన్ డాలర్లతో స్థిరంగా ఉన్నట్లు క్రిసిల్ నివేదిక పేర్కొంది.

## లేబర్ కోడ్‌తో వర్కర్లకు ప్రయోజనం

**స్విగ్గీ, జొమాటో వెల్లడి**

న్యూఢిల్లీ: కొత్తగా నోటిఫై చేసిన నాలుగు లేబర్ కోడ్స్‌ను స్విగ్గీ, జొమాటో మొదలైన అగ్రిగేటర్లు స్వాగతించాయి. ఈ సంస్కరణలతో లక్షల కొద్దీ వర్కర్లకు మేలు జరుగుతుందని స్విగ్గీ పేర్కొంది. తమ వ్యాపార వ్యయాలపై, దీర్ఘకాలికంగా ఆర్థిక పనితీరుపై ఇందుకు సంబంధించిన భారమేమీ ఉండదని వివరించింది. కంపెనీలపై నిబంధనల భారం తగ్గిస్తూ, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో పనిచేసే వర్కర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఇవి ఉన్నాయని స్విగ్గీ తెలిపింది. మరోవైపు గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత మరింత అందుబాటులోకి వస్తుందని జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ పేర్కొంది. వ్యాపారాల నిర్వహణను సులభతరం చేస్తూ, గిగ్ వర్కర్ల నిబంధనల్లో ఏకరూపత తెచ్చే దిశగా ఇది సరైన అడుగని తెలిపింది. దీనివల్ల తమ జొమాటో, బ్లింకిట్ వ్యాపార విభాగాలపై ఆర్థిక భారమేమీ ఉండదని వివరించింది. గిగ్ వర్కర్లకు ఇప్పటికే తాము సమగ్ర బీమాతో పాటు ఇతరత్రా ప్రయోజనాలను ఉచితంగా అందిస్తున్నట్లు ఎటర్నల్ వివరించింది.

# పెర్త్‌లో హెడ్ విధ్వంసం

## 83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123

- యాషెస్ తొలి టెస్టులో 8 వికెట్లతో ఆస్ట్రేలియా ఘన విజయం
- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 164 ఆలౌట్
- ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 205/2

**పేసర్లకు సహకరించిన పిచ్‌పై ఇతర బ్యాటర్లు పరుగులు చేసేదుకు తీవ్రంగా శ్రమించిన చోట... ట్రావిస్ హెడ్ చెలరేగిపోయాడు. ధనాధన్ షాట్‌లతో టెస్టు మ్యాచ్‌ను టి20 తరహాలో మార్చేశాడు. లక్ష్యం చిన్నదే అయినా... పరిస్థితులను బట్టి చూస్తే ఛేదన కష్టమే అనిపించినా... హెడ్ మెరుపు సెంచరీతో ఆతిథ్య ఆస్ట్రేలియా అలవోక విజయం సాధించింది. తద్వారా ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్‌లో కంగారూ జట్టు బోణీ కొట్టింది.**

పెర్త్: ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన తొలి టెస్టులో ఆతిథ్య ఆసీస్ జట్టు 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. ట్రావిస్ హెడ్ (83 బంతుల్లో 123; 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) విధ్వంసక సెంచరీతో జట్టుకు ఒంటి చేత్తో విజయం కట్టబెట్టాడు. పేసర్ల హవా సాగిన పెర్త్ టెస్టులో రెండు రోజుల్లోనే ఫలితం తేలగా... ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1–0తో ముందంజ వేసింది. 205 పరుగుల లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా జట్టు 28.2 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. హెడ్ శతకంతో కదం తొక్కగా... మార్నస్ లబుషేన్ (49 బంతుల్లో 51 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అతడికి అండగా నిలిచాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 123/9తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 3 పరుగులు చేసి 132 వద్ద ఆలౌటైంది. దీంతో 46 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో విఫలమైంది. 34.4 ఓవర్లలో 164 పరుగులకే ఆలౌటైంది. అట్కిన్సన్ (32 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఒలీ పోప్ (57 బంతుల్లో 33; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో స్కాట్ బోలాండ్ 4 వికెట్లు పడగొట్టగా... మిచెల్ స్టార్క్, డగెట్ చెరో 3 వికెట్లు తీశారు. స్టార్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య డిసెంబర్ 4 నుంచి బ్రిస్బేన్‌లో రెండో టెస్టు ప్రారంభం కానుంది.

### హెడ్ కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్

అనూహ్య స్వింగ్, ఊహించని బౌన్స్‌తో బ్యాటింగ్‌కు పరీక్షగా మారిన పిచ్‌పై ఇంగ్లండ్ జట్టు 205 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడంతో... ఆసీస్‌కు ఛేదన కష్టమే అనిపించింది. తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులు చేసేందుకు ఆపసోపాలు పడిన కంగారూ జట్టుకు యాషెస్ సిరీస్ తొలి మ్యాచ్‌లో పరాజయం తప్పకపోవచ్చనే అంచనాల మధ్య ట్రావిస్ హెడ్ అదరగొట్టాడు. గాయంతో ఇబ్బంది పడుతున్న ఉస్మాన్ ఖ్వాజా స్థానంలో ఓపెనర్‌గా బరిలోకి దిగిన హెడ్... పక్కా టి20 ఆటతీరుతో అదరగొట్టాడు. గత కొన్నాళ్లుగా 'బాజ్‌బాల్' ఆటతీరుతో వేగంగా పరుగులు రాబడుతూ ప్రత్యర్థులను భయపెడుతున్న ఇంగ్లండ్ జట్టును తన ట్రేడ్‌మార్క్ హిట్టింగ్‌తో ఓ ఆటాడుకున్నాడు. బంతి ఎక్కడపడ్డా దాని గమ్యం బౌండరీనే అన్న చందంగా భారీ షాట్‌లతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో 36 బంతుల్లోనే 3 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్న హెడ్... 69 బంతుల్లో శతకం తన పేరిట లిఖించుకున్నాడు. ఇది టెస్టు క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరఫున మూడో వేగవంతమైన సెంచరీ. మిగతా ఆటగాళ్లంతా పరుగులు తీసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న చోట... హెడ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఇంగ్లండ్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఎడాపెడా బౌండరీలు బాదుతూ లక్ష్యాన్ని కరిగించాడు. లబుషేన్‌తో కలిసి రెండో వికెట్‌కు 92 బంతుల్లోనే 117 పరుగులు జోడించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో కార్స్ రెండు వికెట్లు పడగొట్టాడు.

### స్టార్క్ సూపర్ క్యాచ్

2010–11 యాషెస్ సిరీస్ అనంతరం ఆస్ట్రేలియాలో ఒక్క టెస్టు మ్యాచ్ కూడా గెలవలేకపోయిన ఇంగ్లండ్ జట్టు... ఈ మ్యాచ్‌లోనూ పరాజయంతోనే సరిపెట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో కాస్త తీవ్రత కనబర్చిన ఇంగ్లండ్ బ్యాటర్లు... రెండో ఇన్నింగ్స్‌లో పూర్తిగా తేలిపోయారు. తొలి ఓవర్‌లో స్టార్క్ పట్టిన కళ్లుచెదిరే రిటర్న్ క్యాచ్‌కు జాక్ క్రాలీ (0) పెవిలియన్ చేరగా... అక్కడి నుంచి ప్రారంభమైన వికెట్ల పతనం చివరి వరకు కొనసాగింది. బెన్ డకెట్ (28), ఒలీ పోప్ కాస్త పోరాడటంతో ఒక దశలో 65/1తో మంచి స్థితిలో కనిపించిన ఇంగ్లండ్... ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. స్టార్ బ్యాటర్ జో రూట్ (8), హ్యారీ బ్రూక్ (0), కెప్టెన్ బెన్ స్టోక్స్ (2) ఘోరంగా విఫలమవడంతో ఆ జట్టు 76/5కు చేరింది. జెమీ స్మిత్ (15), బ్రైడన్ కార్స్ (20; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక పరుగులు చేశారు.

**100** ఇంగ్లండ్‌పై స్వదేశంలో ఆస్ట్రేలియాకు ఇది వందో టెస్టు విజయం. ఇంగ్లండ్ గడ్డపై ఆసీస్ జట్టు 57 టెస్టులు నెగ్గింది.

**7** యాషెస్ సిరీస్‌లో ఒక టెస్టు మ్యాచ్ రెండు రోజుల్లోనే ముగియడం ఇది ఏడోసారి. చివరగా 1921 నాటింగ్‌హామ్ టెస్టులో రెండు రోజుల్లో ఫలితం తేలింది.

**69** ట్రావిస్ హెడ్ సెంచరీకి తీసుకున్న బంతులు. ఆస్ట్రేలియా తరఫున ఇది మూడో వేగవంతమైంది. ఆడమ్ గిల్‌క్రిస్ట్ (57 బంతుల్లో) తొలి స్థానంలో ఉండగా... జాక్ గ్రెగరీ (67 బంతుల్లో) రెండో స్థానంలో ఉన్నాడు. డేవిడ్ వార్నర్ కూడా 69 బంతుల్లోనే శతకం చేశాడు.

స్టోక్స్

# పంకజ్ బరిలోకి దిగినా...

## భారత్‌పై పాకిస్తాన్ విజయం • ప్రపంచ కప్ స్నూకర్ ఫైనల్

మస్కట్: ప్రపంచ స్నూకర్, బిలియర్డ్స్‌లో అసాధారణ విజయాలు, టైటిళ్లు సాధించిన భారత విఖ్యాత ఆటగాడు పంకజ్ అద్వానీ బరిలో ఉన్న టీమ్‌కు అనూహ్య ఓటమి ఎదురైంది. 'క్యూ' స్పోర్ట్స్‌లో భారత్ అంత పటిష్టమైన జట్టు కాకపోయినా పాకిస్తాన్ జట్టు ప్రపంచకప్ స్నూకర్‌లో భారత్ 'ఎ' జట్టుకు షాకిచ్చి ఫైనల్ చేరింది. శనివారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో పాకిస్తాన్ 3–1తో భారత్ 'ఎ'పై గెలుపొందింది. దిగ్గజ క్యూయిస్ట్ ప్లేయర్ అద్వానీ 85–21తో అస్జద్ ఇక్బాల్‌పై ఏకపక్ష విజయంతో భారత్‌కు శుభారంభం ఇచ్చాడు. కానీ తదుపరి మ్యాచ్‌లో బ్రిజేశ్ దమానీ 77–120తో ముహమ్మద్ ఆసిఫ్ చేతిలో పరాజయం చవిచూశాడు. డబుల్స్‌లో అద్వానీ–దమానీ జోడీ 46–75తో ఆసిఫ్–ఇక్బాల్ జంట చేతిలో కంగుతింది. ఇదే ఉత్సాహంతో ఆసిఫ్ 73–61తో అద్వానీని ఓడించడంతో పరాజయం తప్పలేదు. అంతకు ముందు జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 3–0తో ఫ్రాన్స్‌పై గెలుపొందింది. అద్వానీ ఆడిన తొలి మ్యాచ్‌లోనే భారత్ ప్రతీ ఫ్రేమ్‌లోనూ పైచేయి సాధించింది. కానీ ఆ తర్వాతే లయ తప్పింది. బ్రిజేశ్ దమానీతో పాటు పంకజ్ అద్వానీ కూడా డబుల్స్, రెండో సింగిల్స్ ఓడిపోయాడు. రెండు హాంకాంగ్ జట్ల మధ్య జరిగే రెండో సెమీ ఫైనల్ విజేతతో పాకిస్తాన్ ఫైనల్లో తలపడుతుంది.

# న్యూజిలాండ్ 'క్లీన్ స్వీప్'

## మూడో వన్డేలోనూ ఓడిన వెస్టిండీస్

హామిల్టన్ (న్యూజిలాండ్): ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన న్యూజిలాండ్ జట్టు... వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం జరిగిన మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ 4 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచేసింది. టి20 సిరీస్‌ను 3–1తో కైవసం చేసుకున్న కివీస్... వన్డే సిరీస్‌ను 3–0తో చేజిక్కించుకుంది. ఆఖరి పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ 36.2 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. రోస్టన్ ఛేజ్ (51 బంతుల్లో 38; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... జాన్ క్యాంప్‌బెల్ (26; 3 ఫోర్లు, 1 సిక్స్), ఖారీ పియర్ (22 నాటౌట్; 2 సిక్స్‌లు) తలా కొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ షై హోప్ (16), అకీమ్ అగస్ట్ (17), కార్టీ (0), రూథర్‌ఫోర్డ్ (19), జస్టిన్ గ్రేవ్స్ (1) విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి కరీబియన్ జట్టు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. మ్యాట్ హెన్రీ 43 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. జాకబ్ డఫీ, మిచెల్ సాంట్నర్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 30.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసింది. మార్క్ చాప్‌మన్ (63 బంతుల్లో 64; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) చక్కటి హాఫ్‌సెంచరీతో సత్తాచాటగా... మిచెల్ బ్రాస్‌వెల్ (31 బంతుల్లో 40 నాటౌట్; 6 ఫోర్లు) రాణించాడు. ఓపెనర్లు డెవాన్ కాన్వే (11), రచిన్ రవీంద్ర (14)తో పాటు విల్ యంగ్ (3), టామ్ లాథమ్ (10) విఫలమవడంతో ఒక దశలో 70 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన కివీస్ జట్టును చాప్‌మన్ ఆదుకున్నాడు. బ్రాస్‌వెల్‌తో కలిసి జట్టును విజయానికి చేరువ చేశారు. వెస్టిండీస్ బౌలర్లలో మాథ్యూ ఫోర్డ్, జైడెన్ సీల్స్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. న్యూజిలాండ్ ప్లేయర్లు మ్యాట్ హెన్రీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', కైల్ జెమీసన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య డిసెంబర్ 2 నుంచి తొలి టెస్టు ప్రారంభం కానుంది.

# విజయం ముంగిట బంగ్లాదేశ్

## ఐర్లాండ్ లక్ష్యం 509; ప్రస్తుతం 176/6

తైజుల్‌కు సహచరుల అభినందన

మిర్పూర్: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు... సొంతగడ్డపై ఐర్లాండ్‌తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసే దిశగా సాగుతోంది. ఇప్పటికే తొలి టెస్టులో విజయం సాధించి 1–0తో ఆధిక్యంలో ఉన్న బంగ్లాదేశ్... రెండో టెస్టులో ప్రత్యర్థి ముందు 509 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఐర్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 54 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. హ్యారీ టెక్టర్ (80 బంతుల్లో 50; 7 ఫోర్లు)హాఫ్ సెంచరీతో మెరవగా... కర్టిస్ కాంఫెర్ (93 బంతుల్లో 34 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) పోరాడుతున్నాడు. కెప్టెన్ ఆండీ బాల్‌బిర్నీ (13)తో పాటు పాల్ స్టిర్లింగ్ (9), కార్మిచెల్ (10), టకర్ (7) విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 3 వికెట్లు పడగొట్టగా... హసన్ మురాద్ 2 వికెట్లు తీశాడు. నేడు ఆటకు చివరి రోజు కాగా... చేతిలో 4 వికెట్లు ఉన్న ఐర్లాండ్ జట్టు... విజయానికి ఇంకా 333 పరుగులు చేయాల్సి ఉంది. కాంఫెర్‌తో పాటు మెక్‌బ్రిన్ (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 156/1తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్... చివరకు 69 ఓవర్లలో 297/4 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి ప్రత్యర్థి ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచింది. మహ్మదుల్ హసన్ జాయ్ (91 బంతుల్లో 60; 6 ఫోర్లు), షాద్‌మన్ ఇస్లామ్ (119 బంతుల్లో 78; 7 ఫోర్లు), మోమినుల్ హక్ (118 బంతుల్లో 87; 10 ఫోర్లు), ముష్ఫికర్ రహీమ్ (81 బంతుల్లో 53 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలతో కదంతొక్కారు. కెరీర్‌లో వందో టెస్టు ఆడుతున్న ముష్ఫికర్ రహీమ్ తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేయడంతో పాటు... రెండో ఇన్నింగ్స్‌లో అజేయ అర్ధశతకంతో రాణించాడు. ఐర్లాండ్ బౌలర్లలో గవిన్ 2 వికెట్లు పడగొట్టాడు.

**249** తైజుల్ ఇస్లామ్ వికెట్ల సంఖ్య. టెస్టుల్లో బంగ్లాదేశ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా షకీబ్ అల్ హసన్ (246)ను తైజుల్ అధిగమించాడు.

ఫర్హాన్

# మెరిసిన నవాజ్, ఫర్హాన్

## శ్రీలంకపై పాకిస్తాన్ ఘనవిజయం • ముక్కోణపు టి20 టోర్నీ

రావల్పిండి: సొంతగడ్డపై జరుగుతున్న ముక్కోణపు టి20 టోర్నమెంట్‌లో ఆతిథ్య పాకిస్తాన్ వరుసగా రెండో విజయం నమోదు చేసుకుంది. తొలి మ్యాచ్‌లో జింబాబ్వేను చిత్తుచేసిన పాకిస్తాన్... తాజా పోరులో శ్రీలంకను మట్టికరిపించింది. తద్వారా 4 పాయింట్లతో పట్టిక అగ్రస్థానానికి దూసుకెళ్లింది. శనివారం జరిగిన పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. జనిత్ లియనగె (38 బంతుల్లో 41 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... కుషాల్ పెరీరా (25; 2 ఫోర్లు, 1 సిక్స్), కమిల్ మిషారా (22; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. కెప్టెన్ దసున్ షనక (0) డకౌట్ కాగా... కుషాల్ మెండిస్ (3), కమిందు మెండిస్ (3), పాథుమ్ నిసాంక (17), వణిందు హసరంగ (11) విఫలమయ్యారు. పాకిస్తాన్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మొహమ్మద్ నవాజ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ ఆకట్టుకుంది. 15.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ (45 బంతుల్లో 80 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సయీమ్ అయూబ్ (20; 4 ఫోర్లు), బాబర్ ఆజమ్ (16; 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. లంక బౌలర్లలో దుష్మంత చమీర 2 వికెట్లు పడగొట్టాడు. టోర్నీలో భాగంగా నేడు జరగనున్న మ్యాచ్‌లో జింబాబ్వేతో మరోసారి పాకిస్తాన్ తలపడనుంది.



# నోరిస్‌కు పోల్

లాస్ వేగస్: ఫార్ములావన్ తాజా సీజన్‌లో మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ లాండో నోరిస్ లాస్ వేగస్ గ్రాండ్‌ప్రిలో 'పోల్ పొజిషన్' సాధించాడు. ఈ ఏడాది వరుస విజయాలతో డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌కు సమీపించిన నోరిస్... క్వాలిఫయింగ్ రేసులో 1 నిమిషం 47.934 సెకన్లలో ల్యాప్‌ను పూర్తిచేసి అగ్ర స్థానం దక్కించుకున్నాడు. నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ 1 నిమిషం 48.257 సెకన్లతో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. చిరు జల్లుల మధ్య సాగిన రేసులో మొదట వెర్‌స్టాపెన్ దూసుకెళ్లగా... అనూహ్యంగా వేగం పెంచిన నోరిస్ అతడిని దాటేసి 'పోల్ పొజిషన్' దక్కించుకున్నాడు. కార్లోస్ సెయింజ్ (1 నిమిషం 48.296 సెకన్లు; విలియమ్స్) మూడో స్థానంలో నిలవగా... జార్జి రసెల్ (1 నిమిషం 48.803 సెకన్లు; మెర్సిడెస్), ఆస్కార్ పియాస్ట్రి (1 నిమిషం 48.961 సెకన్లు) వరుసగా నాలుగు, ఐదు స్థానాలు దక్కించుకున్నారు.

# శుభారంభమే లక్ష్యంగా...

- అజ్లాన్ షా హాకీ టోర్నీ బరిలో భారత్
- నేడు తొలి మ్యాచ్‌లో కొరియాతో ఢీ

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌లో ఐదు సార్లు చాంపియన్ అయిన భారత హాకీ జట్టు మరో సారి టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. టోర్నీ చరిత్రలో రెండో విజయవంతమైన జట్టుగా ఘనత వహించిన భారత్ ఆదివారం జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో ఢీకొనేందుకు సిద్ధమైంది. నాలుగేళ్ల విరామం తర్వాత భారత్ ఈ ఇన్విటేషనల్ టోర్నీ ఆడుతోంది. 2019 తర్వాత భారత్ ఈ టోర్నీలో ఆడలేకపోయింది. ఈ సారి మొత్తం ఆరు జట్లు బరిలో ఉన్నాయి. భారత్, బెల్జియం, కెనడా, కొరియా, న్యూజిలాండ్ సహా ఆతిథ్య మలేసియా అజ్లాన్ షా సమరానికి సై అంటున్నాయి. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. పాయింట్ల పట్టికలో టాప్–2లో నిలిచిన జట్లు అమీతుమీకి అర్హత సాధిస్తాయి. కొరియాతో మ్యాచ్ ముగిసిన మరుసటి రోజే భారత్ 24న పటిష్టమైన బెల్జియంతో తలపడుతుంది. 26న మలేసియాతో, 27న న్యూజిలాండ్‌తో, చివరి లీగ్ మ్యాచ్‌ను 29న కెనడాతో తలపడుతుంది. టైటిల్ పోరు 30న నిర్వహిస్తారు. వచ్చే ఏడాది ఎఫ్‌ఐహెచ్ పురుషుల హాకీ ప్రపంచకప్‌తో పాటు, ఆసియా క్రీడలు కూడా జరగనున్న నేపథ్యంతో ఈ టోర్నీలో జరుగుతుంది. ఈ టోర్నీలో పలువురు సీనియర్ ఆటగాళ్లు, రెగ్యులర్ కెప్టెన్‌హర్మన్‌ప్రీత్ సింగ్, మన్‌ప్రీత్ తదితరులకు విశ్రాంతి ఇచ్చారు.

దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో జీ20 శిఖరాగ్రం సందర్భంగా శనివారం సభ్యదేశాల అధినేతలతో చేతులు కలిపిన ఆతిథ్య దేశ అధ్యక్షుడు రమాఫోసా, భారత ప్రధాని మోదీ

# తెగిన మోచేతిని అతికించారు

## మణిపాల్ ఆస్పత్రి వైద్యుల ఘనత ● గురుగ్రామ్‌లో ఘటన

**న్యూఢిల్లీ:** ప్రమాదంలో ఎడమ మోచేతి తెగిపోయి రక్తమోడుతున్న ఒక యువకుడికి మళ్లీ మోచేయిని అతికించి వైద్యులు అతనికి ఒకరంగా నూతన జీవితాన్ని ప్రసాదించారు. గురుగ్రామ్‌లోని మణిపాల్ ఆస్పత్రి వైద్యులు ఈ ఘనత సాధించారు. దాదాపు 9 గంటలపాటు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి 28 ఏళ్ల యువకుడి మోచేయిని విజయవంతంగా అతికించారు. అరుదైన కాస్మొటిక్ శస్త్రచికిత్స చేసిన తీరును ఆస్పత్రి శనివారం ఒక ప్రకటనలో వివరించింది. ''ప్రమాదవశాత్తు అతని ఎడమ మోచేయి తెగిపోయింది. అయితే వెంటనే తెగిన మోచేతిని సమీప ఆస్పత్రిలో భద్రపరిచారు. రక్తమోడుతున్న అతడిని మా ఆస్పత్రికి హుటాహుటిన తీసుకొచ్చారు. చేతిని సైతం వెంటనే తరలించారు. అప్పటికే అతడు చాలా రక్తం కోల్పోవడంతో ఆరోగ్య పరిస్థితి దిగజారింది. వెంటనే శస్త్రచికిత్స వైద్యులు శరీరం తెగిన చోట శుభ్రంచేసి విరిగిన ఎముకలను సరిచేశారు. అక్కడ చిద్రమైన కండను సైతం పునరుద్ధరించారు. ఎముక, కండ సమీపంలోని స్నాయువులను సరిచేశారు. సూక్ష్మదర్శిని ద్వారా పరిశీలిస్తూ జాగ్రత్తగా రక్తనాళాలను తెగిపోయిన మోచేయిలోని రక్తనాళాలతో అనుసంధానించేశారు. దీంతో శరీరం నుంచి మళ్లీ ఆ చేతిలోకి రక్తప్రసారం మొదలైంది. ఈ మొత్తం ప్రక్రియకు దాదాపు ఎనిమిది, తొమ్మిది గంటలు పట్టింది. ప్లాస్టిక్, కాస్మొటిక్ సర్జరీ నిపుణుడు డాక్టర్ ఆశిష్ ధింగ్రా సారథ్యంలోని బృందం సంక్లిష్టమైన ఆపరేషన్‌ను పూర్తిచేసింది'' అని ఆస్పత్రి తెలిపింది. ''మొత్తం తెగిపోయిన శరీరభాగాన్ని తిరిగి అతికించడం చాలా చాలా కష్టం. అయితే తెగిపోయిన భాగాన్ని తడిగాకుండా, స్టెరిలైజ్‌చేసి భద్రపరిచి ఆస్పత్రికి తీసుకొస్తే అతికించడం సాధ్యమే. ఆలస్యమయ్యే కొద్దీ ఆపరేషన్ విజయావకాశాలు తగ్గుతూపోతాయి. మారుమూల ప్రాంతంలో ఈ ఘటన జరిగినా వెంటనే పేషెంట్, చుట్టు పక్కల వాళ్లు స్పందించి, అప్రమత్తంగా వ్యవహరించడంతో రీప్లాంటేషన్ సర్జరీ విజయవంతమైంది'' అని వైద్యుడు ధింగ్రా వ్యాఖ్యానించారు.

# బద్దలయ్యేందుకు సిద్ధంగా 42 హిమానీ సరస్సులు

## నేపాల్‌లో దిగువ ప్రాంతాలకు పొంచి ఉన్న పెను ముప్పు

**కాఠ్మాండు:** నేపాల్‌లో అత్యంత ఎత్తయిన పర్వతాల మధ్య ఏర్పడిన హిమానీ సరస్సులు(గ్లేసియర్ లేక్స్) ఇప్పుడు దిగువ ప్రాంతాల ప్రజలపై యమపాశాలుగా మారేందుకు సిద్ధంగా ఉన్నాయన్న వార్త స్థానికులను కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. నేపాల్‌లోని శంఖువసభ జిల్లా కేంద్రమైన ఖంద్‌బారి పట్టణంలో శనివారం జరిగిన అంతర్జాతీయ సమీకృత పర్వతాభివృద్ధి కేంద్రం(ఐసీఐఎంఓడీ) చర్చా కార్యక్రమంలో విషయ నిపుణుడు శరద్ ప్రసాద్ జోషి ఈ వివరాలను వెల్లడించారు. హిమానీనదం (గ్లేసియర్) నుంచి ప్రవహించే నీటి కారణంగా పర్వత సానువుల వద్ద ఏర్పడే సరస్సును గ్లేసియర్ లేక్ అంటారు. ''ఇలాంటి 42 సరస్సులు భారీ స్థాయిలో నీటితో నిండుకుండలా మారాయి. ఇవి ఏ క్షణంలోనైనా బద్దలై దిగువకు పెద్దమొత్తంలో నీరు దూసుకురానుంది. దిగువ ప్రాంతాల ప్రజల ఇళ్లు, వ్యాపారాలు, పంటలు నాశనమవడం ఖాయం. నేపాల్‌లో 2,069 హిమానీ సరస్సులుండగా ఇప్పుడు కోశి ప్రావిన్స్‌లోని 42 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా పరిణమించాయి'' అని జోషి హెచ్చరించారు. శంఖువసభ జిల్లా పరిధిలో భోత్ ఖోలా, మకాలూ ప్రాంతంలోని సరస్సులు సహా నాలుగు గ్లేసియర్ సరస్సుల్లో నీరు భారీగా చేరిందని ఆయన వెల్లడించారు. మూడు కిలోమీటర్ల పొడవు, 206 మీటర్ల లోతైన తల్లో పోఖారి సరస్సు అత్యంత ప్రమాదకారిగా మారిందని చెప్పారు. ఐసీఐఎంఓడీ, హైడ్రోలజీ, మీటియోరాలజీ, ఐరాస అభివృద్ధికార్యక్రమం నేపాల్ సంస్థలు కలిసి ఈ ప్రమాదం నుంచి స్థానికులను, వారి ఆస్తులను పరిరక్షించేందుకు సహాయక చర్యలపై దృష్టిసారించాయి. అరుణ్ లోయలో పలు నివాసాలు, మౌలికవసతుల వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదముందని మరో నిపుణురాలు నీరా శ్రేష్ఠ ప్రధాన్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభావిత ప్రాంత ప్రజల పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషిచేయనుందని ఆమె తెలిపారు.

## బోగీలో 'వంట'లక్క!

**ముంబై:** సాధారణంగా రైలు ప్రయాణంలో ఆకలేస్తే ఏం చేస్తాం? ప్యాంట్రీ కార్ నుండో, ఆన్‌లైన్‌లోనో ఆర్డర్ చేసుకుంటాం. కానీ, ఓ ప్రయాణికురాలు మాత్రం ఏకంగా రైలు బోగీనే 'వంటగది'గా మార్చేసింది. మొబైల్ చార్జింగ్ పెట్టుకునే సాకెట్‌లో ఎలక్ట్రిక్ కెటిల్ పెట్టి.. దర్జాగా వేడివేడి నూడుల్స్ వండేసింది. సెంట్రల్ రైల్వే పరిధిలోని ఓ ఎక్స్‌ప్రెస్ రైలు ఏసీ కోచ్‌లో జరిగిన ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

**టీ కూడా కాచిందట!**

వైరల్ అవుతున్న ఆ వీడియోలో.. సదరు మహిళ మరాఠీలో మాట్లాడుతూ, 'నేను ఇలాగే కెటిల్ పెట్టి 10–15 మందికి టీ కూడా తయారు చేశాను'.. అని గొప్పగా చెప్పుకోవడం కనిపిస్తోంది. సెల్‌ఫోన్ చార్జింగ్ కోసం ఇచ్చిన సాకెట్లను ఇలా వంటల కోసం వాడటం చూసి నెటిజన్లు నోరెళ్లబెడుతున్నారు. ఈ సంఘటనను రైల్వే అధికారులు తీవ్రంగా పరిగణించారు. 'ఇది చాలా ప్రమాదకరం. ఇలా చేయడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి, రైలులో మంటలు చెలరేగే అవకాశం ఉంది'.. అని హెచ్చరించారు.

**వంటలక్క కోసం గాలింపు**

ఆ మహిళను ఇప్పటికే గుర్తించారు. ఆమె ఆచూకీ కోసం గాలిస్తున్నారు. రైల్వే చట్టం సెక్షన్ 147(1) కింద ఆమెపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

మొబైల్ సాకెట్లను కేవలం ఫోన్ చార్జింగ్ కోసమే వాడాలి.. ఇలాంటి ఎలక్ట్రానిక్ వంట సామగ్రిని వాడటం చట్టరీత్యా నేరం. 'రైలు మనదే కదా అని.. వంట గదిలా వాడేస్తే ఎలా?'.. అంటూ రైల్వే పోలీసులు ఆమె కోసం వెతుకుతున్నారు.

## చిరుతకు బుడతడి దబిడిదిబిడి

**పాల్ఘర్ (మహారాష్ట్ర):** స్కూల్ బ్యాగు బరువే ఓ బాలుడి పాలిట 'రక్షక కవచం' అయ్యింది. మృత్యువులా దూసుకొచ్చిన చిరుతపులి నుండి ప్రాణాలు కాపాడింది. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో జరిగిన ఈ సంఘటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. శుక్రవారం సాయంత్రం.. మాలా పద్విపడా ప్రాంతం.. అయిదో తరగతి విద్యార్థి మయాంక్ కువారా (11) బడి ముగించుకుని.. స్నేహితుడితో కలిసి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అడవిని ఆనుకున్న దారిలో.. ఒక్కసారిగా ఓ చిరుతపులి పొదల్లోంచి మయాంక్ మీదకు దూకింది.

**స్కూల్ బ్యాగే కవచం**

చిరుత పంజా విసరగానే మయాంక్ భయంతో వణికిపోలేదు. అద్భుతమైన సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు. తన వీపుపైనున్న స్కూల్ బ్యాగును చిరుత వైపు తిప్పాడు. చిరుత గోళ్లు ఆ బ్యాగులో దిగబడ్డాయి తప్ప, బాలుడి గుండెకు తగలలేదు. ఇదే అదనుగా, పక్కనే ఉన్న మయాంక్ స్నేహితుడు, మయాంక్ ఇద్దరూ కలిసి గట్టిగా కేకలు వేస్తూ, చేతికి దొరికిన రాళ్లను చిరుతపైకి విసిరారు. వారి ధైర్యం, అరుపులు చూసి ఆ చిరుత కంగుతిన్నది. అరుపులు విని గ్రామస్తులు పరిగెత్తుకు రావడంతో, చిరుత భయపడి తిరిగి అడవిలోకి పారిపోయింది.

**ప్రమాదం తప్పింది..**

చిరుత దాడిలో మయాంక్ చేతికి గాయమైంది. స్థానికులు వెంటనే విక్రమ్‌గఢ్ గ్రామీణ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి కుట్లు పడ్డాయని, ప్రస్తుతం క్షేమంగానే ఉన్నాడని వైద్యులు తెలిపారు. 'ఆ సమయంలో స్కూల్ బ్యాగే లేకపోతే పరిస్థితి దారుణంగా ఉండేది'.. అని అటవీ అధికారులు వ్యాఖ్యానించారు. ఈ ఘటనతో అటవీ శాఖ అప్రమత్తమైంది. చిరుత కదలికలను కనిపెట్టడానికి అత్యాధునిక ఏఐ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

చిరుత భయంతో ఆ ప్రాంతంలోని పాఠశాలలను సాయంత్రం 4 గంటలకే మూసివేయాలని ఆదేశించారు. గ్రామాల్లో దండోరా వేయిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మొత్తానికి, పుస్తకాల బ్యాగు మోత భారంతో బాధపడే పిల్లలకు.. అది ప్రాణాలను కూడా కాపాడుతుందని మయాంక్ నిరూపించాడు!

## సర్కారు ఆసుపత్రి బెడ్లపై శునకాల విలాసం

**ఖాండ్వా (మధ్యప్రదేశ్):** అదొక ప్రభుత్వ ఆసుపత్రి. తెల్లటి దుప్పట్లు పరిచిన మంచాలు.. పైన ఫ్యాన్ గాలి.. అక్కడ పడుకుని విశ్రాంతి తీసుకుంటున్నది ఏ రోగో అనుకుంటే పొరపాటే. అక్కడ దర్జాగా కాలు మీద కాలు (క్షమించాలి.. కాలు మీద తోక) వేసుకుని సేదదీరుతున్నది సాక్షాత్తూ వీధి కుక్కలు.

**కుక్కలకు వీఐపీ 'ట్రీట్‌మెంటా!'**

మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖాండ్వా జిల్లాలోని కిల్లొడ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కనిపించిన ఈ దృశ్యం ఇప్పుడు సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించింది. రోగులకు దక్కాల్సిన పడకల మీద.. వీధి కుక్కలు యథేచ్ఛగా విహరిస్తూ, నిద్రపోతున్న వీడియో బయటకు రావడంతో ప్రజలు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మనిషికి మంచం దొరకదు కానీ, కుక్కలకు మాత్రం వీఐపీ ట్రీట్‌మెంటా?'.. అంటూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

**చిరుద్యోగులపై వేటు**

వీడియో వైరల్ కావడంతో ఆసుపత్రి ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు. ఈ నిర్లక్ష్యానికి బాధ్యులుగా చేస్తూ.. అక్కడి స్వీపర్‌ను తక్షణం ఉద్యోగం నుండి తొలగించారు. విధుల్లో ఉన్న నర్సుకు వారం రోజుల జీతం కోత విధించారు. 'బాధ్యులెవరైనా సరే వదిలే ప్రసక్తే లేదు'.. అని జిల్లా కలెక్టర్ రిషబ్ గుప్తా హెచ్చరించారు. మొత్తానికి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల.. కుక్కలు పడకలు ఎక్కాయి, ఉద్యోగులు రోడ్డున పడ్డారు!

# మా నియోజకవర్గాల్లో 50 వేల చొప్పున ఓట్ల తొలగింపునకు కుట్ర

## బీజేపీ, ఈసీలపై అఖిలేశ్ ఆరోపణలు

**లక్నో:** 2024 సాధారణ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించిన నియోజకవర్గాల్లో 50 వేలకు పైగా ఓట్ల తొలగింపునకు బీజేపీ, ఎన్నికల కమిషన్(ఈసీ) కుట్ర పన్నాయని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఎస్పీతోపాటు, ఇండియా కూటమి పార్టీలు గట్టి పోటీ ఇచ్చిన స్థానాలపైనా ఈసీ, బీజేపీ కన్నేశాయన్నారు. యూపీతోపాటు పశ్చిమబెంగాల్‌లో ఈ మేరకు బీజేపీతో కుమ్మక్కయిన ఈసీ ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు తమకు సమాచారం అందుతోందన్నారు. యూపీ సహా 11 రాష్ట్రాల్లో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియ మొదలైన నేపథ్యంలో శనివారం మీడియా ఎదుట ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పెళ్లిళ్ల సీజన్‌లో ఈ కార్యక్రమం చేపట్టాల్సింది కాదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును మరింతగా పెంచాలని ఈసీని ఆయన డిమాండ్ చేశారు.

# కశ్మీర్‌లో టెర్రర్ హ్యాండ్లర్ ఆస్తి అటాచ్

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాకు చెందిన టెర్రర్ హ్యాండ్లర్ ఆస్తులను పోలీసులు అటాచ్ చేశారు. ఇతడు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నాడని అధికారులు తెలిపారు. త్రాల్ ప్రాంతంలోని సయేదాబాద్ పస్తూనాలో ఉన్న ముబిషిర్ అహ్మద్ స్థిరాస్థిని అటాచ్ చేశామన్నారు. పోలీసులు చేపట్టిన దర్యాప్తులో అతడికి ఇక్కడ ఆస్తి ఉన్నట్లు వెల్లడైందన్నారు. ఉగ్రకార్యకలాపాలకు ఊతమిస్తున్న ఇతడు ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్థానిక ఉగ్రవాదులకు సరఫరా చేస్తున్నాడన్నారు.

# ఢిల్లీలో నకిలీ కాల్ సెంటర్ గుట్టురట్టు

**న్యూఢిల్లీ:** బీమా కంపెనీ ప్రతినిధులుగా చెప్పుకుంటూ నిర్వహిస్తున్న ఫేక్ కాల్ సెంటర్ గుట్టును ఢిల్లీ పోలీసులు బయట పెట్టారు. పటేల్ నగర్ ప్రాంతంలోని ఓ భవనం రెండో అంతస్తులోని ఓ గదిలో ఖేమ్ చంద్(35) దీనిని నిర్వహిస్తున్నాడు. టెలీ కాలర్లుగా పది మంది మహిళలు పనిచేస్తున్నట్లు దాడి సందర్భంగా పోలీసులు గుర్తించారు. ఖేమ్ చంద్ నుంచి రూ.10 లక్షల నగదుతోపాటు 11 కీప్యాడ్ మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఫోర్జరీ రబ్బరు స్టాంపులు, వాహన బీమా ఫేక్ పాలసీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ డేటా బేస్ నుంచి ఒక్కో వాహన యజమాని వివరాలను రూ.5 చొప్పున కొనుగోలు చేసి, వీరు దందా సాగిస్తున్నట్లు గుర్తించామని డీసీపీ(సెంట్రల్) నిధిన్ వల్సన్ చెప్పారు. బీమా సంస్థల ప్రతినిధులమని నమ్మబలుకుతూ వాహన యజమానులను బీమా రెన్యువల్ చేసుకోవాలని చెప్తారు. ఒప్పుకున్న వారికి నకిలీ పాలసీ పత్రాలను క్యాష్ ఆన్ డెలివర్ ప్రాతిపదికన పంపిస్తారన్నారు. బ్యాంకు ఖాతాలో నగదు జమ కాగానే ఖేమ్ చంద్ విత్ డ్రా చేసుకుంటాడని చెప్పారు.

# పంజాబ్‌లో 50 కిలోల హెరాయిన్ పట్టివేత

**చండీగఢ్:** పంజాబ్ పోలీసులు శనివారంభారీ మొత్తంలో మాదకద్రవ్యం హెరాయిన్‌ను పట్టుకున్నారు. సరిహద్దుల ఆవలి నుంచి డ్రగ్స్‌ను దొంగచాటుగా రవాణా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు. డీజీపీ గౌరవ్ యాదవ్ ఈ వివరాలను వెల్లడించారు. కపుర్తలా జిల్లా షన్నా షేర్ సింగ్ వాలాకు చెందిన సందీప్ సింగ్ అలియాస్ సీపా కరడుగట్టిన డ్రగ్ స్మగ్లర్. హిస్టరీ షీటర్‌గా నమోదైన ఇతడిపై డ్రగ్స్ రవాణాకు సంబంధించిన 8 కేసులున్నాయి. ఇటీవలే కపుర్తలా జైలు నుంచి విడుదలైన ఇతగాడు ఎప్పటి మాదిరిగానే మాదక ద్రవ్యాలను రవాణాలో పాల్గొంటున్న విషయాన్ని పంజాబ్ పోలీసు యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ గుర్తించింది. శనివారం సరిహద్దుల ఆవలి నుంచి ఐఎస్ఐ మద్దతున్న స్మగ్లర్లు అందించిన డ్రగ్స్‌తో కారులో వస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు జలాలాబాద్‌లోని సరిహద్దు గ్రామం బగ్గెకె ఉటార్ వద్ద అడ్డుకున్నారు. అయితే, అతడు వారిని లక్ష్య పెట్టలేదు. పోలీసు వాహనంపైకి తన కారును పోనిచ్చేందుకు ప్రయత్నించాడు. ఎట్టకేలకు రొకె గ్రామం వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి కారుతోపాటు అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.250 కోట్లకు పైగా విలువైన 50 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో పంజాబీ గాయకుడు మృతి

**చండీగఢ్:** పంజాబ్‌లోని మాన్సా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ పంజాబీ గాయకుడు హర్మన్ సిద్ధు(36) మృత్యువాతపడ్డారు. హర్మన్ శుక్రవారం రాత్రి స్వగ్రామం ఖైలా కలాన్ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఆయన ప్రయాణిస్తున్న కారును వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టిందని చెప్పారు. ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, దర్యాప్తు చేపట్టామన్నారు. 2007లో 'పేపర్ తే పాయర్'పాటతో ప్రాచుర్యం పొందిన హర్మన్.. మేలా, సారీ రాత్ పర్ఛి, తేవన్ జత్తన్ దా, పాయి గయా పయార్ వంటి పాటలు కూడా ఆయనకు పేరు తెచ్చి పెట్టాయి.

# తిరుగులేని నిబద్ధత కలిగిన వారియర్

## వింగ్ కమాండర్ నామాంశ్ సియాల్‌కు ఐఏఎఫ్ నివాళి

**న్యూఢిల్లీ:** దుబాయ్ ఎయిర్ షోలో శుక్రవారం విన్యాసాల సమయంలో ఎల్‌సీఏ తేజస్ యుద్ధ విమానం నేలకూలి అసువులు బాసిన వింగ్ కమాండర్, పైలట్ నామాంశ్ సియాల్‌కు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఘనంగా నివాళులర్పించింది. ఆయన్ను అంకిత భావం, దేశం కోసం అచంచలమైన నిబద్ధత కనబర్చిన వారియర్, యుద్ధ విమాన పైలట్ అని శ్లాఘించింది. ఈ మేరకు శనివారం ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ ఎక్స్‌లో నివాళులర్పించింది.

# గాజాపై మళ్లీ దాడులు

**డెయిర్ అల్–బలాహ్:** గాజాలో హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా శనివారం ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో చిన్నారులు సహా కనీసం 14 మంది చనిపోగా 45 మంది వరకు గాయపడ్డారు. గాజా నగరంలోని రిమాల్ ప్రాంతంలో ఓ వాహనంపై జరిగిన దాడిలో ఏడుగురు చనిపోగా 18 మంది గాయపడ్డారు. గాజా సిటీలోని అల్ ఔదా ఆస్పత్రి సమీపంలోని ఓ ఇంటిపై జరిగిన దాడిలో ముగ్గురు చనిపోగా 11 మంది గాయాలపాలయ్యారు. నుసెయిరత్ శరణార్థి శిబిరంపై జరిగిన మరో దాడిలో చిన్నారి ప్రాణాలు కోల్పోగా 16 మంది క్షతగాత్రులుగా మారారు.

# కిడ్నాపైన విద్యార్థులు 300 పైమాటే..

## నైజీరియా ప్రభుత్వం వెల్లడి

**అబుజా:** నైజీరియాలోని క్రైస్తవ మిషనరీ స్కూలు నుంచి శుక్రవారం వేకువజామున సాయుధులు కిడ్నాప్ చేసిన విద్యార్థుల సంఖ్య 300 పైమాటేనని అధికారులు శనివారం తెలిపారు. నైగర్ రాష్ట్రం పపిరి ప్రాంతంలోని సెయింట్ మేరీ మిషనరీ స్కూలులో 303 మంది విద్యార్థులతోపాటు 12 మంది టీచర్లను కూడా సాయుధులు తీసుకెళ్లారన్నారు. మొదట 215 మంది విద్యార్థులను తీసుకెళ్లారని తాము భావించామని, అయితే, కిడ్నాప్ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన మరో 88 మంది విద్యార్థులను కూడా సాయుధులు బలవంతంగా తీసుకెళ్లినట్లు గుర్తించామన్నారు. బాలురతోపాటు బాలికలు కూడా వీరిలో ఉన్నారు. అంతా 10 నుంచి 18 ఏళ్ల ఏళ్లలోపు వారని వివరించారు. పొరుగునే ఉన్న కెబ్బి రాష్ట్రం మాగా పట్టణంలోని ఓ పాఠశాల నుంచి వారం క్రితం 25 మంది పిల్లలను సాయుధులు ఎత్తుకెళ్లడం తెల్సిందే. ఈ కిడ్నాప్ ఘటనలకు బాధ్యులమంటూ ఎవరూ ప్రకటించుకోలేదని అధికారులు తెలిపారు.

విద్యార్థులు లేక వెలవెలబోతున్న స్కూల్ డార్మిటరీ

ప్రభుత్వ హెచ్చరికలను ఖాతరు చేయకుండా తాము స్కూలు ఓపెన్ చేశామంటూ వస్తున్న వార్తలను మిషనరీ అధికారి ఒకరు ఖండించారు. తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటీసు కూడా అందలేదని స్పష్టం చేశారు. విద్యార్థులను సురక్షితంగా తీసుకువచ్చేందుకు భద్రతా బలగాలు ముమ్మరంగా గాలింపు చేపట్టాయని ఓ అధికారి తెలిపారు.

**డబ్బు కోసమేనా?**

ఆఫ్రికా ఖండంలో అత్యధిక జనాభా కలిగిన నైజీరియాలో సాయుధ గ్రూపులు పేరుతోపాటు డబ్బు కోసం స్కూళ్లను టార్గెట్ చేసుకుంటున్నాయి.

సాయుధ ముఠాలు, జిహాద్ గ్రూపులు క్రైస్తవులనే లక్ష్యంగా చేసుకుంటున్నందున ఆ దేశానికి నిధులను నిలిపివేస్తామంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం గమనార్హం. అయితే, సాయుధులు ఎత్తుకెళ్తున్న పిల్లల్లో క్రైస్తవులతోపాటు ముస్లింలు కూడా ఉంటున్నారు. 2014లో జిహాదీ గ్రూపు బోకో హరామ్ ఓ స్కూలుపై దాడి చేసి 276 మంది బాలికలను అపహరించడం అంతర్జాతీయంగా సంచలనం రేపింది. నాలుగేళ్ల తర్వాత మరో స్కూలు నుంచి 110 మంది బాలికలను ఎత్తుకెళ్లింది. ఆ తర్వాత సంక్షోభం నెలకొన్న రాష్ట్రాల్లో డజను వరకు సాయుధగ్రూపులు పుట్టుకొచ్చాయి. ఇవి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని స్కూళ్లను ఎంచుకుని, పిల్లల కిడ్నాప్‌లకు పాల్పడుతున్నాయి. చిబోక్ దాడి అనంతరం దాదాపు 1,500 మంది విద్యార్థులను కిడ్నాప్ చేసిన సాయుధ ముఠాలు, డబ్బు తీసుకుని వీరిలో చాలామందిని వదిలేశాయి. మత విశ్వాసాల కంటే డబ్బుకే ఈ గ్రూపులు ప్రాధాన్యమిస్తున్నాయని పరిశీలకులు అంటున్నారు.

# మీ దగ్గర ఓట్లు..మా దగ్గర నిధులు..

## అజిత్ పవార్ వివాదాస్పద వ్యాఖ్య

**పుణె:** ఎన్సీపీ నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ అభ్యర్థులను ఎన్నుకుంటే నిధుల కొరత అనేదే లేకుండా చేస్తాం, ఓటేయకుంటే మాత్రం, తామూ పట్టించుకోమంటూ వారిని హెచ్చరించారు. శుక్రవారం బారామతి జిల్లా మాలెగావ్ నగర పంచాయతీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న పవార్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ–ఎన్సీపీ–శివసేన సంకీర్ణ ప్రభుత్వంలో అజిత్ పవార్ ఆర్థిక మంత్రిగా ఉండటం గమనార్హం. 'మా ఎన్సీపీ అభ్యర్థులు 18 మందిని ఎన్నుకుంటే నిధుల కొరత అనేదే ఉండదు. మొత్తం పద్దెనిమిది మందినీ ఎన్నుకుంటే, నేనిచ్చిన హామీలన్నిటినీ నెరవేరుస్తా. మా అభ్యర్థులను తిరస్కరించిన పక్షంలో నిధులివ్వను. మీ వద్ద ఓట్లుంటే, నా దగ్గర నిధులున్నాయి'అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

# బెంగాల్‌లో బీఎల్‌వో ఆత్మహత్య

## ఈసీయే కారణమంటూ సూసైడ్ నోట్: సీఎం మమత

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లోని నడియా జిల్లాలో బూత్ లెవెల్ అధికారి(బీఎల్‌వో)గా వ్యవహరిస్తున్న రింకూ తరఫ్దార్ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. శనివారం ఆమె తన నివాసంలో ఉరి వేసుకున్నారు. ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు సంబంధించిన ఒత్తిడుల వల్లే బలవన్మరణానికి పాల్పడినట్లు ఆమె కుటుంబీకులు ఆరోపిస్తున్నారని పోలీసులు తెలిపారు. బీఎల్‌వో రింకు సూసైడ్ నోట్‌ను సీఎం మమతా బెనర్జీ ఎక్స్‌లో షేర్ చేశారు. కృష్ణనగర్ జిల్లా చప్రాలోని వివేకానంద్ విద్యామందిర్‌లో పారా టీచర్‌గా పనిచేస్తున్న రింకు (52) తన నివాసంలో ఉరి వేసుకున్నారని ఆమె తెలిపారు. ఎస్ఐఆర్ కోసం ఇంకెందరు చనిపోవాలని ఈసీని ఆమె ప్రశ్నించారు. ఈ నెల 4వ తేదీన మొదలైన ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా ఎన్నికల కమిషన్(ఈసీ) ఒత్తిళ్ల కారణంగా ఇప్పటి వరకు 30మందికిపైగా బీఎల్‌వోలు తనువు చాలించినట్లు అధికార టీఎంసీ పేర్కొంది. ఈ మరణాలకు ఈసీయే బాధ్యత వహించాలంది. ఎస్ఐఆర్‌ను తక్షణమే ఆపేయాలంటూ సీఎం మమత గురువారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. సీఎం మమత ఆరోపణలను బీజేపీ ఖండించింది. అది ఫేక్ సూసైడ్ నోట్ అని తెలిపింది. చేతనైతే ఈ ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించి, నిగ్గు తేల్చాలంది. రింకు తరఫ్దార్ టీఎంసీ ఒత్తిడుల వల్లే చనిపోయి ఉంటారని అనుమానం వ్యక్తం చేసింది. కాగా, ఘటనపై తక్షణమే నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎలక్టోరల్ అధికారిని ఈసీ ఆదేశించింది.

# ఉద్రిక్తంగా మారిన విద్యార్థి ఆత్మహత్య ఘటన

**న్యూఢిల్లీ:** పాఠశాల హెడ్‌మాస్టర్, ముగ్గురు ఉపాధ్యాయుల ఎగతాళి, వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైట్ నోట్ రాసి తనువు చాలించిన పదోతరగతి విద్యార్థి అంశం ఇప్పుడు ఢిల్లీ పాఠశాల్లో చర్చనీయాంశమైంది. విద్యార్థులు, తల్లిదండ్రుల, విద్యార్థి సంఘాల నిరసనలతో ఢిల్లీలోని సెయింట్ కొలంబా స్కూల్ పరిసరాలు ఉద్రిక్తంగా మారాయి. 16 ఏళ్ల విద్యార్థి శౌర్య పాటిల్ నవంబర్ 18వ తేదీన ఢిల్లీలోని రాజేంద్ర ప్లేస్ మెట్రో స్టేషన్ ప్లాట్‌ఫామ్ పైనుంచి బయటకు దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెల్సిందే. నిరసనలు పెరగడంతో స్కూల్ యాజమాన్యం ఆ హెడ్‌మాస్టర్‌తోపాటు ముగ్గురు టీచర్లను విధుల నుంచి పక్కనబెట్టింది. శౌర్య స్కూల్‌బ్యాగులో దొరికిన లేఖ ప్రకారం.. గతకొంతకాలంగా శౌర్యను లక్ష్యంగా చేసుకుని టీచర్ల వేధింపులు తారాస్థాయికి చేరాయి. షారుఖ్‌ఖాన్ స్థాయికి ఎదుగుతానని శౌర్య చెప్పిన మాటలపై టీచర్ల నుంచి వెక్కిరింతలు ఎక్కువయ్యాయి. చిన్నపాటి తప్పిదాలకే స్కూల్ పిల్లలందరి ఎదుట శౌర్యను తిట్టడం సర్వసాధరణమైంది. మరో పది రోజుల్లో బోర్డ్ పరీక్షలు ఉన్నాయనగా గత మంగళవారం స్కూల్‌లో నాటకం క్లాసు జరిగింది. ఇందులో శౌర్య ఓవర్‌యాక్టింగ్ చేస్తున్నాడంటూ టీచర్ వెక్కిరించడంతో అతను మరింత కుంగిపోయాడు. ఎవరికీ చెప్పకుండా వెంటనే స్కూల్ నుంచి వెళ్లిపోయి సూసైడ్‌చేసుకున్నాడు. ఈ ఘటనపై ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సంయుక్త డైరెక్టర్ హర్షిత్ జైన్ సారథ్యంలో ఐదుగురు సభ్యుల ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. శనివారం ఆ పాఠశాలలోని పలువురు విద్యార్థుల వాంగ్మూలాలను తీసుకుంది. తరగతి గదుల్లోని సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనంచేసుకుంది. విద్యార్థి ఆరోపించిన టీచర్లందరికీ విచారణకు హాజరుకావాలని సమన్లు జారీచేశారు.

# మెట్రో నిరాకరణపై ప్రజల్లో ఆగ్రహం

## ప్రధాని మోదీకి సీఎం స్టాలిన్ లేఖ

**చెన్నై:** కోయంబత్తూర్, మదురైలలో తలపెట్టిన మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై తమిళనాడు సీఎం స్టాలిన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల్లో ఆగ్రహానికి కారణమైన ఈ నిర్ణయంపై కేంద్రం పునరాలోచన చేయాలని కోరారు. ఆయన ఈ మేరకు ప్రధాని మోదీకి శనివారం లేఖ రాశారు. ప్రగతి చోదకాలుగా ఉన్న నగరాల్లో ప్రజా రవాణాకు సరైన ప్రత్యామ్నాయం మెట్రో రైలు ప్రాజెక్టని ఆయన పేర్కొన్నారు. దేశంలో అత్యధిక నగరీకరణ జరిగిన, వ్యక్తిగత ప్రైవేట్ వాహనాలను అత్యధికంగా కలిగిన తమిళనాడును తక్కువగా చూడరాదన్నారు. ఈ పరిస్థితుల ఆధారంగా కోయంబత్తూర్, మదురై మెట్రో రైల్ ప్రాజెక్టుల కోసం పంపిన ప్రతిపాదనలను కేంద్ర పట్టణ వ్యవహారాలు గృహ నిర్మాణ శాఖ తిరస్కరించడంపై తమ ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి చెందిందని, ఆందోళన చెందుతోందని తెలిపారు.

# కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

**మౌర్య సామ్రాజ్యం అంతమైన తర్వాత మళ్లీ ఉత్తర భారతదేశాన్ని ఏకం చేసి పాలించిన రాజులు గుప్తులు. కుషాణ రాజ్య శిథిలాలపై క్రీ.శ. 4వ శతాబ్దంలో ఆవిర్భవించిన ఈ రాజ్యం 6వ శతాబ్దం వరకూ కొనసాగింది.**

### గుప్త సామ్రాజ్యం

గుప్తుల సమాచారం అనేక సాహిత్య, పురావస్తు ఆధారాల ద్వారా లభిస్తోంది. వీరి కాలంలోని అనేక మంది కవులు గుప్తులకు సంబంధించిన సమాచారాన్ని తమ గ్రంథాల ద్వారా అందించారు. సాహిత్యాధారాలతోపాటు గుప్తులు 42 శాసనాలను జారీ చేశారు. వీటిలో కొన్ని రాజ ప్రశస్తులు కాగా మిగిలినవి దాన శాసనాలు. మొదట కుషాణులకు సామంతులుగా ఉన్న గుప్తులు వారి రాజ్య పతనం తర్వాత అధికార పగ్గాలు చేపట్టారు.

### గుప్తుల రాజకీయ చరిత్ర

#### శ్రీగుప్తుడు

ఇతడు కుషాణుల సామంతుడిగానే పరిపాలన సాగించినట్లు తెలుస్తోంది. అందుకే నాటి సామంత రాజులు, భూస్వాములు ధరించే 'మహారాజ' అనే సాధారణ బిరుదును శ్రీగుప్తుడు ధరించాడు. ఇత్సింగ్ ప్రకారం.. మృగశిఖవనం వద్ద చైనాకు చెందిన బౌద్ధ సన్యాసుల ప్రయోజనార్థం శ్రీగుప్తుడు ఒక దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అంతేగాక దాని నిర్వహణకు 20 గ్రామాలను కూడా అతడు దానం చేశాడు.

#### ఘటోత్కచ గుప్తుడు

ఇతడు క్రీ.శ.300 ప్రాంతంలో రాజ్యానికి వచ్చాడు. ఘటోత్కచుడు కూడా తన తండ్రి శ్రీగుప్తుడిలాగే ఒక సామంతరాజుగానే పరిపాలించాడు. ఇతడు తన కుమారుడైన మొదటి చంద్రగుప్తుడికి లిచ్ఛవీల రాకుమార్తె కుమారదేవితో వివాహం జరిపించాడు. తద్వారా గుప్త రాజ్య పటిష్టతకు కృషి చేశాడు.

#### మొదటి చంద్రగుప్తుడు

ఇతడు తన తాత, తండ్రిలా 'మహారాజ' అనే బిరుదుతో కాకుండా 'మహారాజాధి రాజు'గా ప్రసిద్ధుడయ్యాడు. గుప్తవంశంలో తొలి స్వతంత్ర రాజుగా ఇతడిని భావించాలి. మొదటి చంద్రగుప్తుడు క్రీ.శ.320లో గుప్త శకాన్ని ప్రారంభించాడు. తన భార్య తరఫు నుంచి మగధ రాజ్యాన్ని పొందాడు. అందుకే తన నాణేలన్నింటిపై తన భార్య కుమారదేవి చిత్రంతో పాటు లిచ్ఛవీ వంశస్తుల పేర్లనూ ముద్రించాడు. గుప్త సామ్రాజ్య విస్తరణను చంద్రగుప్తుడే ప్రారంభించాడు.

#### సముద్ర గుప్తుడు

సముద్ర గుప్తుడు రాజ్యానికి రాకముందు..



'కచ' అనే మరో గుప్త రాకుమారుడు ఈ రాజ్యాన్ని పాలించినట్లు కొన్ని నాణేల ద్వారా తెలుస్తోంది. సముద్రగుప్తుడు ఈ వంశంలో అందరి కంటే గొప్ప రాజు. గుప్తుల జైత్రయాత్రను ఆసేతు హిమాచలం కొనసాగించాడు. సముద్రగుప్తుడి విజయాలపై ఇతడి ఆస్థాన కవి హరిసేనుడు ప్రయాగ ప్రశస్తి (అలహాబాద్ ప్రశస్తి)ని జారీ చేశాడు. దక్షిణాపథాన్ని పాలించే 12మంది రాజులను సముద్రగుప్తుడు జయించాడు. తర్వాత వారినే తన సామంతులుగా నియమించుకున్నాడు. ఆర్యావర్తాన్ని పాలించే 8 మంది రాజులను ఓడించి వారి రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత నేపాల్, బెంగాల్, అస్సాం మొదలైన సరిహద్దు రాజ్యాలను జయించాడు. అనేక ఆటవిక రాజ్యాలూ సముద్రగుప్తుడికి దాసోహమన్నాయి. ఆ తర్వాత దైవపుత్ర షహానుషాహీలు, శక మురుండులు, సింహళీయులూ ఇతడి సార్వభౌమత్వాన్ని స్వచ్ఛందంగా అంగీకరించారు. సముద్రగుప్తుడిలో సైనిక సామర్థ్యంతో పాటు, కవితా గుణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇతడికి 'కవిరాజు' అనే బిరుదు ఉంది. తన విజయాలకు గుర్తుగా సముద్రగుప్తుడు అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు. పులిని వేటాడుతున్నట్లు, వీణను సాధన చేస్తున్నట్లు ఉండే చిహ్నాలతో పలు నాణేలు జారీ చేశాడు. అప్రతిరథ, సర్వరాజాచ్ఛేత, అశ్వమేధ పరాక్రమ, వ్యాఘ్ర పరాక్రమ.. తదితర బిరుదులు ఇతడికి ఉన్నాయి.

#### రెండో చంద్రగుప్తుడు

ఇతడికి విక్రమాదిత్య, నరేంద్రచంద్ర, సింహచంద్ర, సింహ విక్రమ.. తదితర బిరుదులున్నాయి. విశాఖదత్తుని 'దేవీచంద్రగుప్తం' అనే గ్రంథం ప్రకారం.. రెండో చంద్రగుప్తుడు తన అన్న రామగుప్తుడిని వధించి సింహాసనాన్ని ఆక్రమించినట్లు తెలుస్తోంది. ఇతడు సౌరాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలను తన సామ్రాజ్యంలో విలీనం చేశాడు. దీంతో పశ్చిమాసియాతో పెద్ద ఎత్తున వ్యాపార-వాణిజ్యాలు నిర్వహించే అవకాశం కలిగింది. రెండో చంద్రగుప్తుడు.. తన కుమార్తె ప్రభావతీ గుప్తను వాకాటక రెండో రుద్రసేనుడికిచ్చి వివాహం చేశాడు. ఇతడు తన సైనిక విజయాలను చంద్ర అనే పేరుతో మెహ్రౌలీ ఇనుప స్తంభ శాసనాన్ని జారీచేశాడు. తన తండ్రి సముద్రగుప్తుడిలాగే రెండో చంద్రగుప్తుడు కూడా అనేక బంగారు నాణేలు జారీ చేశాడు. సింహాన్ని వధిస్తున్నట్లుగా, చేతిలో పుష్పాన్ని ధరించినట్లుండే చిహ్నాలతో ఇతడు బంగారు నాణేలు జారీ చేశాడు. ఇతడు ఉజ్జయినీని తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులున్నట్లు ప్రతీతి.

#### కుమార గుప్తుడు

తన సోదరుడు గోవింద గుప్తుడితో వారసత్వ తగాదాల అనంతరం ఇతడు రాజ్యానికి వచ్చాడు. క్రీ.శ.415 నుంచి క్రీ.శ.455 వరకు దాదాపు 40 ఏళ్లపాటు ఇతడు గుప్త సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. కుమారగుప్తుడు జారీచేసిన 1,400 నాణేలు మహారాష్ట్రలోని సామంద్ అనే ప్రాంతంలో బయటపడ్డాయి. తాను నిర్వహించిన అశ్వమేధ యాగానికి గుర్తుగా.. సముద్రగుప్తుడిలాగే ఇతడు కూడా అశ్వమేధ నాణేలు జారీ చేశాడు. కుమారు గుప్తుడు.. మహేంద్రాదిత్య, అశ్వమేధ మహేంద్ర అనే బిరుదులతో నాణేలు జారీ చేశాడు. మయూర వాహనంపై కార్తికేయుడి చిత్రంతో బంగారు నాణేలు ముద్రించాడు.

#### స్కంద గుప్తుడు

ఇతడు విక్రమాదిత్యుడు అనే బిరుదును ధరించాడు. వారసత్వ యుద్ధాల్లో పురు గుప్తుడిని ఓడించి రాజ్యానికి వచ్చాడు. జునాగఢ్, భిటారి ప్రశస్తుల్లో.. స్కందగుప్తుడు తన శత్రువుల గురించి పేర్కొన్నాడు. హూణులపై ఇతడు సాధించిన విజయాల వల్ల 50 ఏళ్లపాటు గుప్త సామ్రాజ్యానికి హూణుల నుంచి ప్రమాదం తొలగిపోయింది.

#### బుధ గుప్తుడు

బుధ గుప్తుడి కాలంలో గుప్తసామ్రాజ్య పతనం ప్రారంభమైంది. ఇతడి తర్వాత భానుగుప్తుడు, నరసింహ గుప్త, బాలాదిత్యుడు, 3వ కుమారగుప్తుడు, విష్ణుగుప్తుడు పాలించారు. గుప్తవంశ పాలన క్రీ.శ. 550లో అంతమైంది.

### మాదిరి ప్రశ్నలు

1. 'ఆర్య మంజుశ్రీ మూలకల్ప' గ్రంథం ప్రకారం బౌద్ధులను హింసించిన గుప్తరాజు?
   ఎ) సముద్ర గుప్తుడు బి) కచ గుప్తుడు
   సి) నరసింహ బాలాదిత్యుడు డి)విష్ణు గుప్తుడు
2. భూమిపై ఉన్న సమస్త రాజులను ఓడించినట్లు ఎరాన్ ప్రశస్తిలో పేర్కొన్న రాజు?
   ఎ) మొదటి చంద్రగుప్తుడు
   బి) రెండో చంద్రగుప్తుడు
   సి) సముద్రగుప్తుడు డి) స్కంద గుప్తుడు
3. గుప్తుల అధికారిక చిహ్నం?
   ఎ) పులి బి) గరుడ
   సి) వీణ డి) సింహం
4. కామరూపలో సముద్రగుప్తుడి ప్రతినిధిగా నియమితుడైన రాజు?
   ఎ) భాస్కర వర్మన్ బి) సూర్య వర్మన్
   సి) పుష్య వర్మన్ డి) గృహ వర్మన్
5. సముద్రగుప్తుడికి కానుకలు పంపిన గాంధార రాజు?
   ఎ) కిదార బి) చిరాతదత్త
   సి) సిద్ధార్థ డి) నరసింహన్
6. రోమ్‌కు రాయబార బృందాన్ని పంపిన గుప్తరాజు?
   ఎ) పురు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
   సి) కుమార గుప్తుడు డి) బుధ గుప్తుడు
7. బోధ్‌గయలో సింహళ విహారాన్ని నిర్మించిన శ్రీలంక రాజు?
   ఎ) శ్రీ మార విజయోత్తుంగ వర్మ
   బి) శ్రీ మేఘవర్మ
   సి) విజయబాహు డి) కుమార బాహు
8. తాను వీణ వాయిస్తున్నట్లుగా బంగారు నాణేలను జారీ చేసిన రాజు..?
   ఎ) కుమార గుప్తుడు
   బి) చంద్రగుప్త విక్రమాదిత్యుడు
   సి) సముద్ర గుప్తుడు
   డి) శ్రీ గుప్తుడు
9. కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?
   ఎ) సముద్ర గుప్తుడు
   బి) నరసింహ గుప్తుడు
   సి) మొదటి చంద్రగుప్తుడు
   డి) రెండో చంద్రగుప్తుడు
10. అశ్వమేధ నాణేలు జారీ చేసిన గుప్తరాజు?
    ఎ) విష్ణు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
    సి) కుమార గుప్తుడు డి) బి, సి
11. సముద్ర గుప్తుడిని 'ఇండియన్ నెపోలియన్' అని పిలిచినవారు ?
    ఎ) సర్ విలియం జోన్స్
    బి) వి.ఎ.స్మిత్
    సి) హెచ్.సి. రామచౌదరి
    డి) కె.పి. జయస్వాల్
12. రెండో చంద్రగుప్తుడి చేతిలో హతుడైన శకరాజు?
    ఎ) రెండో రుద్రసేనుడు
    బి) మూడో రుద్రసేనుడు
    సి) రెండో రుద్రసింహుడు
    డి) మూడో రుద్రసింహుడు
13. సాహసాంక, శకారి అనే బిరుదులున్న గుప్త రాజు?
    ఎ) మొదటి చంద్రగుప్తుడు
    బి) రెండో చంద్రగుప్తుడు
    సి) సముద్ర గుప్తుడు డి) కుమార గుప్తుడు
14. నవ రత్నాలు ఏ రాజు ఆస్థాన కవులు?
    ఎ) సముద్రగుప్తుడు బి) కచ గుప్తుడు
    సి) రెండో చంద్రగుప్తుడు డి) బుధ గుప్తుడు
15. రెండో చంద్రగుప్తుడి కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు?
    ఎ) ఇత్సింగ్ బి) పాన్‌చావో
    సి) హుయాన్‌చాంగ్ డి) ఫాహియాన్
16. ఖడ్గమృగాన్ని సంహరిస్తున్నట్లుగా నాణేలు జారీ చేసింది?
    ఎ) కుమార గుప్తుడు బి) 2వ చంద్రగుప్తుడు
    సి) సముద్రగుప్తుడు డి) మొదటి చంద్రగుప్తుడు
17. సుదర్శన తటాకానికి మరమ్మతులు నిర్వహించినట్లు శాసనం జారీ చేసింది?
    ఎ) స్కంద గుప్తుడు బి) కుమార గుప్తుడు
    సి) పురు గుప్తుడు డి) బుధ గుప్తుడు
18. హూణుల దాడిని విజయవంతంగా ఎదుర్కొన్న గుప్తరాజు?
    ఎ) సముద్ర గుప్తుడు బి) నరసింహ గుప్తుడు
    సి) స్కంద గుప్తుడు డి) బి, సి
19. వంద రాజులకు అధిపతిగా ప్రశస్తుడైన గుప్త రాజు?
    ఎ) స్కంద గుప్తుడు
    బి) సముద్ర గుప్తుడు
    సి) మొదటి చంద్రగుప్తుడు
    డి) రెండో చంద్రగుప్తుడు
20. సముద్రగుప్తుడి పాలనలో హరిసేనుడు అధిష్ఠించిన పదవి?
    ఎ) మహాదండ నాయకుడు
    బి) కుమారామాత్యుడు
    సి) సంధి విగ్రాహకుడు
    డి) పైవన్నీ
21. గుప్తుల కాలంలో రాష్ట్ర పాలకులను ఎలా పిలిచేవారు?
    ఎ) విషయపతి బి) ఉపారిక
    సి) కుమారామాత్య డి) అమాత్యా
22. గుప్తుల కాలంలో భూమి శిస్తు ఎంత?
    ఎ) 1/6వ వంతు బి) 1/4వ వంతు
    సి) 1/4 నుంచి 1/6వ వంతు
    డి) 1/8వ వంతు
23. గుప్తుల కాలంనాటి అధికారులను సరిగా జతపరచండి?
    A) టిలుపతి 1) గజదళ అధ్యక్షుడు
    B) పుస్తపాల 2) భూ విక్రయాల రికార్డులు
    C) దివిర 3) లేఖకుడు
    D) శౌల్కిక 4) సుంకాల వసూలు అధికారి
    A) B) C) D)
    ఎ) 1 2 3 4
    బి) 2 1 4 3
    సి) 4 3 2 1
    డి) 3 4 1 2
24. గుప్తుల కాలంలో ఉపారికార, హిరణ్య అనేవి?
    ఎ) పన్నులు బి) అధికారులు
    సి) భూమి కొలబద్దలు డి) నాణేలు
25. గుప్తుల కాలంలో గుజరాత్ నుంచి మాందసోర్‌కు వలస వెళ్లిన వ్యాపార సంఘం ఏ వృత్తికి సంబంధించింది?
    ఎ) కుండల తయారీ
    బి) సిల్క్ తయారీ
    సి) దంతపు వస్తువుల తయారీ
    డి) ఇనుప వస్తువుల తయారీ

#### సమాధానాలు

1) బి; 2) సి; 3) బి; 4) సి; 5) ఎ; 6) బి; 7) బి; 8) సి; 9) ఎ; 10) డి; 11) బి; 12) డి; 13) బి; 14) సి; 15) డి; 16) ఎ; 17) బి; 18) డి; 19) ఎ; 20) డి; 21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) బి.

# వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

### మాదిరి ప్రశ్నలు

1. భూమిపై ఉన్న వృక్షాలన్నీ నశిస్తే జీవులన్నీ మరణిస్తాయి. కారణం? *(సివిల్స్, 1988)*
   1) కార్బన్ డై ఆక్సైడ్ లేకపోవడం
   2) ఆక్సిజన్ లేకపోవడం
   3) 1, 2 4) ఏదీకాదు
2. మడ వృక్షాలు (మంగ్రూవ్ అడవులు) అంటే? *(గ్రూప్-1, 1999)*
   1) నీటి మొక్కలు 2) ఉప్పునీటి వృక్షాలు
   3) పండ్లనిచ్చే వృక్షాలు
   4) ఆల్గే
3. హైడ్రోఫోనిక్స్ అంటే ఏమిటి? *(సివిల్స్, 2000)*
   1) ధ్వని తరంగాలతో నీటిని శుద్ధిచేయడం
   2) వాతావరణం, నీరు అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
   3) మృత్తిక అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
   4) తడి గాలిని పంపి మొక్కలను పెంచే పద్ధతి
4. హెర్బేరియం అనేది ఒక.. ? *(ఎఫ్ఆర్‌వో, 2005)*
   1) ఎండు ఔషధ మొక్కల సంకలనం
   2) వివిధ ఔషధ మొక్కల తోట
   3) విత్తనాలను నిల్వచేసే సంస్థ
   4) ఎండు మొక్కల నమూనాలను భద్రపరిచే సంస్థ
5. కాఫీలో కలిపే చికోరి పౌడర్‌ను మొక్క ఏ భాగం నుంచి గ్రహిస్తారు? *(గ్రూప్-1, 2010)*
   1) కాండం 2) వేరు
   3) ఆకులు 4) విత్తనాలు
6. 'రాడిష్' అనేది ఒక ..? *(ఏఈఈ, 2009)*
   1) బల్బ్ 2) మొక్కజొన్న
   3) మార్పుచేసిన వేరు
   4) ట్యూబర్
7. వేరు బుడిపెలు ఉన్న పంటలను ఎక్కువగా సాగు చేస్తే నేలలో స్థాపితమయ్యే మూలకం ఏది? *(వీడీవో, 1992)*
   1) కాల్షియం 2) పొటాషియం
   3) భాస్వరం 4) నత్రజని
8. అల్లం అనేది ఒక ..? *(గ్రూప్-1, 2003, గ్రూప్-4, 1996)*
   1) కండ కలిగిన వేరు
   2) కండ కలిగిన కాండం
   3) నిల్వచేసే వేరు
   4) ఉపవాయుగత కాండం
9. 'జెనెటిక్స్' అనే పదాన్ని ప్రతిపాదించింది ఎవరు?
   1) హ్యూగో డీవ్రీస్ 2) మెండల్
   3) బేట్‌సన్ 4) సట్టన్-జొహెన్‌సన్
10. ఆకుల ద్వారా జరిగే ట్రాన్స్పిరేషన్ ప్రక్రియలో పాల్గొనే నిర్మాణాలేవి? *(గ్రూప్-2, 2003)*
    1) క్యూటికిల్ 2) లెంటిసెల్స్
    3) స్టొమాట 4) హైడథోడ్స్
11. కుంకుమపువ్వును మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? *(గ్రూప్-1, 1999)*
    1) ఎండిన రక్షక పత్రాలు
    2) ఎండిన పూమొగ్గలు
    3) కీలాగ్రం 4) ఆకర్షణ పత్రాలు
12. కింద పేర్కొన్న పత్రరంధ్రాల ద్వారా నీరు బిందువుల రూపంలో స్రవితమవుతుంది. ఆ నిర్మాణాలను ఏమంటారు? *(సివిల్స్, 1996)*
    1) లెంటిసెల్స్ 2) ఫయలోపోర్
    3) హైడథోడ్స్ 4) స్టొమాట
13. పీచర్ ప్లాంట్‌లోని ఏ భాగం పీచర్‌గా మార్పు చెందుతుంది? *(సివిల్స్, 2007; ఎఫ్ఆర్‌వో, 2009)*
    1) కాండం 2) ఆకు
    3) స్టిప్యూల్స్ 4) పిటియోల్
14. కింది వాటిలో మాంసాహార మొక్క ఏది? *(సివిల్స్, 1996)*
    1) నెపంథిస్ 2) డ్రాసిరా
    3) డయోనియా 4) పైవన్నీ
15. జీవితకాలంలో కొన్ని మొక్కలు ఒకేసారి పుష్పిస్తాయి. వాటిని ఏమని పిలుస్తారు? *(గ్రూప్-4, 2010)*
    1) మోనోకార్పిక్ 2) మోనోగామస్
    3) మోనోజెనిక్ 4) మోనోమార్ఫిక్
16. అతిపెద్ద పుష్పం ఏది? *(గ్రూప్-4, 2010)*
    1) క్రైసాంథిమమ్ 2) రఫ్లేషియా
    3) సన్‌ఫ్లవర్ 4) జిన్నియా
17. ఆపిల్‌లో తినే భాగం ఏది? *(గ్రూప్-4, 1998)*
    1) కార్పెల్ 2) థాలమస్
    3) పెడిసిల్ 4) ఎండోకార్ప్
18. పప్పుధాన్యాల్లో ప్రధానంగా ఉండే పోషక విలువలేవి? *(ఏఈఈ, 2009)*
    1) పిండి పదార్థాలు 2) విటమిన్లు
    3) కొవ్వులు 4) మాంసకృత్తులు
19. సుగంధద్రవ్యంగా ఉపయోగపడే లవంగం అనేది ఒక..? *(డీఎల్, 2012)*
    1) వేరు 2) ఫలం
    3) ఎండిన విప్పారని పూమొగ్గ
    4) కాండం
20. 'చందన వృక్షం' శాస్త్రీయ నామం? *(గ్రూప్-4, 2002)*
    1) సాంటాలమ్ ఆల్బం
    2) షోరియా రొబెస్టా
    3) సిడ్రస్ డియోడరా 4) పైనస్ రాక్స్‌బర్గై
21. 'మార్ఫిన్'ను మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? *(గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2003)*
    1) పుష్పం 2) ఆకు
    3) పండు/కాయ లేటెక్స్ 4) కాండం
22. వృక్ష కణం, జంతు కణానికి మధ్య తేడా? *(వాటర్‌వర్క్స్ మేనేజర్, 2008)*
    1) కేంద్రకం 2) ప్లాస్మాత్వచం
    3) క్లోరోప్లాస్ట్ 4) మైటోకాండ్రియా
23. సూక్ష్మదర్శిని ద్వారా కణాన్ని పరిశీలించిన తొలి శాస్త్రవేత్త ఎవరు? *(గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2000)*
    1) రాబర్ట్ హుక్ 2) ఎ.వి. లీవెన్‌హుక్
    3) టి. ష్వాన్ 4) ఎం.జె. ష్లైడన్
24. కింది వాటిలో ప్రోకారియోటిక్ (కేంద్రక పూర్వ) కణం కానిది?
    1) క్లోరెల్లా 2) ఈస్ట్
    3) క్షయ బ్యాక్టీరియా 4) 1, 2
25. వాణిజ్యపరంగా 'కార్క్' అనేది ఏ వృక్షం నుంచి తీసిన బెండు?
    1) ఎల్మ్ 2) విల్లో
    3) ఆర్కిడ్ 4) ఓక్
26. 'ప్రతి జీవి దేహం కణాలతో నిర్మితమవుతుంది. జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం కణం' అని కణ సిద్ధాంతాన్ని వివరించినవారు? *(సివిల్స్, 1998)*
    1) లూయిపాశ్చర్ 2) రాబర్ట్ హుక్
    3) ష్లైడన్-ష్వాన్ 4) లీవెన్‌హుక్
27. జన్యువు (Gene) అంటే? *(గ్రూప్-1, 1988)*
    1) ప్రోటీన్‌లోని అమైనో ఆమ్లం
    2) ఆర్ఎన్ఏలో కొంత భాగం
    3) డీఎన్ఏ ముక్క
    4) సహలగ్న సముదాయం
28. అంతర్లీనంగా దాగి ఉండే లక్షణాన్ని ఏమంటారు? *(గ్రూప్-4, 1989)*
    1) డామినెంట్ 2) $F_1$ జనరేషన్
    3) రెసిసివ్ 4) పైవేవీకాదు
29. హరగోవింద్ ఖురానా చేసిన పరిశోధన ఏమిటి? *(పాలిటెక్నిక్ లెక్చరర్, 2011)*
    1) నూతన కణాల గుర్తింపు
    2) ప్రయోగశాలలో కృత్రిమ జన్యువు సృష్టి
    3) మొక్కల్లో పరివర్తన
    4) జన్యు మార్పిడి
30. 'జన్యువు' అని పేరు పెట్టినవారెవరు?
    1) బేట్‌సన్ 2) మెండల్
    3) జొహెన్‌సన్ 4) క్రిక్-వాట్సన్
31. జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలిసారిగా శాస్త్రీయంగా ప్రతిపాదించినవారు? *(గ్రూప్-1, 1987-88)*
    1) లామార్క్ 2) డార్విన్
    3) డేవ్రీస్ 4) మెండల్
32. 'ది ఆరిజన్ ఆఫ్ స్పెసీస్' గ్రంథకర్త? *(గ్రూప్-1, 2003)*
    1) లామార్క్ 2) చార్లెస్ డార్విన్
    3) డీవ్రీస్ 4) మెండల్
33. సముద్రంలో ఏర్పడిన, కిరణజన్య సంయోగ క్రియ జరిపే మొదటి జీవులేవి? *(గ్రూప్-2, 2002)*
    1) శైవలాలు 2) సయనో బ్యాక్టీరియా
    3) శిలీంధ్రాలు 4) మొక్కలు
34. ఉత్పరివర్తన పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు? *(సివిల్స్, 2006)*
    1) డార్విన్ 2) లామార్క్
    3) మెండల్ 4) హ్యూగో డీవ్రీస్
35. 'ప్రోటీన్ల కర్మాగారాలు' అని వేటిని పిలుస్తారు?
    1) పెరాక్సీజోమ్‌లు 2) రైబోజోమ్స్
    3) హరితరేణువు 4) మైటోకాండ్రియా
36. మానవుడి శుక్రకణంలోని క్రోమోజోమ్‌ల సంఖ్య?
    1) 46 2) 44+XX
    3) 22 4) 23
37. కొబ్బరి అంకురచ్ఛద స్థితి?
    1) ఏక స్థితికం 2) ద్వయ స్థితికం
    3) త్రయ స్థితికం 4) బహు స్థితికం
38. సమ విభజనను పరిశీలించడానికి అనువైన స్థానం ఏది?
    1) కాండం 2) ఉల్లి వేరుకొన
    3) మొగ్గ 4) పుష్పంలోని పరాగకోశం
39. డీఎన్ఏ డబుల్ హెలిక్స్ నమూనాను ప్రతిపాదించినవారు?
    1) ష్లైడన్ - ష్వాన్ 2) క్రిక్-వాట్సన్
    3) బెంథమ్-హుకర్ 4) ఎంగ్లర్ ప్రాంటల్
40. అంటుకట్టడం, గాయాలు మానడంలో ఇమిడి ఉన్న ప్రక్రియ ఏది?
    1) ద్విదావిచ్ఛిత్తి 2) బహుదావిచ్ఛిత్తి
    3) సమ విభజన 4) క్షయకరణ విభజన
41. పాకిటీన్ ఉపదశ దేనిలో ఉంటుంది?
    1) సమ విభజన 2) క్షయకరణ విభజన
    3) అసమ విభజన 4) ఏదీకాదు
42. కిరణజన్య సంయోగక్రియ ఏ కాంతిలో ఎక్కువగా జరుగుతుంది?
    1) నీలి కాంతి 2) సూర్య కాంతి
    3) అరుణ కాంతి
    4) అతినీలలోహిత కాంతి
43. క్లోరోఫిల్ అణువులో ఏ మూలకం ఉంటుంది? *(గ్రూప్-1, 1999)*
    1) ఇనుము 2) మెగ్నీషియం
    3) కోబాల్ట్ 4) కాల్షియం
44. మానవ నిర్మిత ధాన్యపు మొక్క (Man made cereal)?
    1) ఓట్స్ 2) రెపానో బ్రాసికా
    3) ట్రిటికేల్ 4) షర్బతి సానోరా
45. నీటిలో కరిగే వర్ణద్రవ్యాలు?
    1) క్లోరోఫిల్స్ 2) కెరోటినాయిడ్స్
    3) జాంతోఫిల్స్ 4) పైకోబిలిన్లు
46. శిలీంధ్రం నుంచి రూపొందించిన ఫైటోహార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
    3) సైటోకైనిన్ 4) ఇథిలీన్
47. అగ్రాధిక్యతకు కారణమైన హార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
    3) సైటోకైనిన్ 4) ఇథిలీన్
48. కింది వాటిలో జిబ్బరెల్లిన్ల చర్య ఏది?
    1) మొక్కల పొడవు పెంచుతుంది
    2) అన్ని రకాల మొక్కల పొడవు పెంచుతుంది
    3) పొట్టి మొక్కల పొడవు మాత్రమే పెంచుతుంది
    4) పొడవు మొక్కల పొడవు పెంచుతుంది
49. విత్తన రహిత ఫలాలు ఏర్పడటానికి దోహదపడే హార్మోన్ ఏది?
    1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) సైటోకైనిన్
    3) ఆక్సిన్ 4) జిబ్బరెల్లిన్లు
50. ఫ్రూట్ రైపనింగ్ హార్మోన్ ఏది?
    1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) ఇథిలీన్
    3) సైటోకైనిన్ 4) జిబ్బరెల్లిన్
51. వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) సైటోకైనిన్
    3) ఇథిలీన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
52. కణ విభజనను ప్రోత్సహించే హార్మోన్?
    1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
    3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
53. సుప్తావస్థను కలుగజేసే హార్మోన్ ఏది?
    1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
    3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
54. మొక్కల ఆకులు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం? *(ఏఈ, 2009)*
    1) మెలనిన్ 2) టానిన్
    3) క్లోరోఫిల్ 4) బ్యాక్టీరియా
55. మొక్కల పెరుగుదలకు కావాల్సిన ప్రధాన సమ్మేళనం ఏది? *(ఏఈ, 2009)*
    1) సల్ఫర్ 2) సోడియం
    3) కార్బన్ 4) నైట్రోజన్
56. క్వినైన్ దేని నుంచి లభిస్తుంది? *(గ్రూప్-2, 2002)*
    1) మల్బరీ 2) కోకో
    3) సింకోనా 4) యూకలిప్టస్
57. 'ద్వి ఫలదీకరణం' ఏ మొక్కల ముఖ్య లక్షణం? *(ఎంపీడీవో, 1997)*
    1) శైవలాలు 2) బ్రయోఫైటా
    3) వివృత బీజాలు 4) ఆవృత బీజాలు
58. లిట్మస్ పేపర్ తయారీకి ఉపయోగించే మొక్క ఏది?
    1) శైవలాలు 2) శిలీంధ్రం
    3) లైకేన్లు 4) ఫెర్న్
59. పిండి పదార్థాలను గుర్తించే రసాయనం?
    1) కోబాల్ట్ క్లోరైడ్ 2) అయోడిన్
    3) సోడియం హైడ్రాక్సైడ్
    4) కాపర్ సల్ఫేట్
60. పాక్షిక స్వయం ప్రతిపత్తి ఉన్న కణాంగం?
    1) హరిత రేణువు 2) మైటోకాండ్రియా
    3) రైబోజోమ్స్ 4) 1, 2
61. జీవ పరిణామంలో ప్రకృతి ఎన్నిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త? *(వీడీవో, 1988)*
    1) లామార్క్ 2) డార్విన్
    3) డీవ్రీస్ 4) మెండల్
62. జీవుల్లో వంశపారంపర్య లక్షణాలు కలిగించేది ఏది? *(గ్రూప్-2, 1991)*
    1) ఆర్ఎన్ఏ 2) ఏటీపీ
    3) డీఎన్ఏ 4) హిమోగ్లోబిన్
63. క్రోమోజోమ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు? *(గ్రూప్-4, 1996)*
    1) డార్విన్ 2) మెండల్
    3) సట్టన్-బవేరి 4) లామార్క్
64. శిశువు లింగ నిర్ధారణ ఎవరిపై ఆధారపడి ఉంటుంది?
    1) తల్లి 2) తండ్రి
    3) తల్లి, తండ్రి 4) పూర్వీకులు
65. డీఎన్ఏలోని క్రియాత్మక ప్రమాణం?
    1) సిస్ట్రాన్ 2) రేకాన్
    3) మ్యూటాన్ 4) ఏదీకాదు
66. ఏక సంకర సంకరణంలో $F_2$ సంతతి జన్యురూప నిష్పత్తి?
    1) 3 : 1 2) 9 : 3 : 3 : 1
    3) 1 : 2 : 1 4) 1 : 3
68. ద్విసంకర సంకరణం $F_2$ తరం దృశ్య రూప నిష్పత్తి?
    1) 3:1 2) 9:3:3:1
    3) 1:2:1 4) 1:3
69. ఆధునిక జన్యుశాస్త్ర పితామహుడు?
    1) మెండల్ 2) టి.హెచ్. మోర్గాన్
    3) నిరెన్‌బర్గ్ 4) ఖురానా
70. ఒక జన్యువు - ఒక ఎంజైమ్ సిద్ధాంతం ప్రతిపాదించింది?
    1) మెండల్ 2) టి.హెచ్.మోర్గాన్
    3) బీడిల్-టాటమ్ 4) ఖురానా

#### సమాధానాలు

1) 2; 2) 2; 3) 3; 4) 4; 5) 2; 6) 3; 7) 4; 8) 2; 9) 3; 10) 3; 11) 3; 12) 3; 13) 2; 14) 4; 15) 1; 16) 2; 17) 2; 18) 4; 19) 3; 20) 1; 21) 3; 22) 3; 23) 1; 24) 4; 25) 4; 26) 3; 27) 3; 28) 3; 29) 2; 30) 3; 31) 2; 32) 2; 33) 2; 34) 4; 35) 2; 36) 4; 37) 3; 38) 2; 39) 2; 40) 3; 41) 2; 42) 3; 43) 2; 44) 3; 45) 4; 46) 2; 47) 1; 48) 3; 49) 4; 50) 2; 51) 2; 52) 2; 53) 4; 54) 3; 55) 4; 56) 3; 57) 4; 58) 3; 59) 2; 60) 4; 61) 2; 62) 3; 63) 3; 64) 2; 65) 1; 66) 3; 67) 3; 68) 2; 69) 2; 70) 3.

# ఉజ్వల పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

## జనరల్ స్టడీస్

### ఎకానమీ

### పేదరిక, నిరుద్యోగ నిర్మూలన పథకాలు

1. కింది వాటిలో దేన్ని ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి పథకంగా భావించలేం?
   ఎ) కరువు ప్రాంతాల అభివృద్ధి పథకం
   బి) ఎడారి ప్రాంతాల అభివృద్ధి పథకం
   సి) అటవీ ప్రాంతాల అభివృద్ధి పథకం
   డి) గ్రామీణ యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ
2. 'సరళీకరణ ఫలితాలు గ్రామీణ పేదలకు చేరడం లేదని, తద్వారా ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయ'ని 2001 ఆగస్టు 15న ఎవరు అభిప్రాయపడ్డారు?
   ఎ) రాజీవ్ గాంధీ బి) వి.పి.సింగ్
   సి) అటల్ బిహారీ వాజ్‌పేయి
   డి) దేవెగౌడ
3. వ్యవసాయరంగంలో కౌలు చట్టాలు, మిగులు భూమి పంపిణీ, కమతాల సమీకరణ మొదలైన వాటితో భూసంస్కరణలపై, వ్యవసాయ దారులపై జాతీయ విధానం శ్రద్ధ వహించాలని ఎన్నో ప్రణాళిక ముసాయిదా పేర్కొంది?
   ఎ) 9వ బి) 10వ సి) 11వ డి) 12వ
4. ఇందిరా ఆవాస్ యోజన ద్వారా భారత్‌లో ఏ ఏడాది నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది?
   ఎ) 2017 బి) 2020
   సి) 2025 డి) 2026
5. ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ప్రారంభించిన పథకం?
   ఎ) సామాజిక అభివృద్ధి పథకం
   బి) ఎడారి ప్రాంత అభివృద్ధి పథకం
   సి) కనీస అవసరాల కార్యక్రమం
   డి) కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్
6. ఉపాధి హామీ పథకాన్ని మొదటగా ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1952 బి) 1972-73
   సి) 1973-74 డి) 1975
7. భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ప్రారంభించిన పథకం?
   ఎ) సామాజిక అభివృద్ధి పథకం
   బి) కనీస అవసరాల కార్యక్రమం
   సి) కరవు పీడిత ప్రాంతాల కార్యక్రమం
   డి) ఎడారి ప్రాంత అభివృద్ధి పథకం
8. 'క్రాష్ స్కీమ్ ఫర్ రూరల్ ఎంప్లాయిమెంట్'ను ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1955 బి) 1963
   సి) 1970 డి) 1973
9. సాంకేతిక, విత్తపర సహాయం లక్ష్యంగా ప్రారంభమైన పథకం?
   ఎ) ఉపాంత రైతులు, వ్యవసాయ కార్మికుల అభివృద్ధి ఏజెన్సీ
   బి) ఉపాధి హామీ పథకం
   సి) పనికి ఆహారపథకం
   డి) ఆక్సిలరేటెడ్ రూరల్ వాటర్ సప్లయ్
10. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రకటించిందెవరు?
   ఎ) మొరార్జీదేశాయ్ బి) ఇందిరా గాంధీ
   సి) రాజీవ్ గాంధీ డి) వి.పి.సింగ్
11. ఎడారి ప్రాంత అభివృద్ధి కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1965 బి) 1972
   సి) 1975 డి) 1977
12. చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ కింది ఏ ప్రణాళికలో ప్రారంభమైంది?
   ఎ) 2వ బి) 3వ
   సి) 4వ డి) 5వ
13. అభివృద్ధి పనుల్లో శ్రామికులకు ఆహార ధాన్యాలను వేతనాలుగా ఇవ్వడం లక్ష్యంగా ప్రారంభమైన పథకం?
   ఎ) 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం
   బి) పనికి ఆహార పథకం
   సి) సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
   డి) పైవేవీకావు
14. స్వయం ఉపాధి పథకాల్లో గ్రామీణ ప్రాంత యువకులకు శిక్షణ ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ)1979 బి)1980
   సి)1983 డి)1985
15. గ్రామీణ పేదల సంపూర్ణ అభివృద్ధి లక్ష్యంగా 1980లో ప్రారంభమైన పథకం?
   ఎ) 20 సూత్రాల ఆర్థిక పథకం
   బి) చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ
   సి) సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
   డి) ఉపాధి హామీ పథకం
16. గ్రామీణ పేదలకు లాభదాయకమైన ఉపాధి లక్ష్యంగా 1980లో ప్రారంభమైన పథకం?
   ఎ) సామాజిక అభివృద్ధి పథకం
   బి) జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం
   సి) నేషనల్ ఫండ్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్
   డి) పైవేవీకావు
17. పనికి ఆహార పథకాన్ని పునర్నిర్మించి ప్రారంభించిన కార్యక్రమం?
   ఎ) మధ్యాహ్న భోజన పథకం
   బి) విద్యావంతులైన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి
   సి) జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం
   డి) ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన
18. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదల కోసం ఉపాధి హామీ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1983 బి) 1985
   సి) 1987 డి) 1989
19. గ్రామీణాభివృద్ధికి విత్త సహాయాన్ని అందించడం లక్ష్యంగా 1985లో ఏర్పాటు చేసింది?
   ఎ) జవహర్ రోజ్‌గార్ యోజన
   బి) నేషనల్ ఫండ్ ఫర్ రూరల్ డెవలప్ మెంట్
   సి) నెహ్రూ రోజ్‌గార్ యోజన
   డి) జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం
20. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి లక్ష్యంగా 1982-83లో ప్రారంభమైన పథకం?
   ఎ) డ్వాక్రా బి)ఆర్.ఎల్.ఇ.జి.పి
   సి) ఎన్.ఆర్.ఇ.పి
   డి) కనీస అవసరాల కార్యక్రమం
21. సబ్సిడీలు, బ్యాంకు విత్తం కల్పన లక్ష్యంగా 1986లో ప్రారంభమైన పథకం?
   ఎ) డ్వాక్రా
   బి) పట్టణ పేదలకు స్వయం ఉపాధి కార్యక్రమం
   సి) మహిళా సమృద్ధి యోజన
   డి) గంగా కల్యాణ్ యోజన
22. కింది వాటిలో దేన్ని వేతన ఉపాధి కార్యక్రమంగా భావించవొచ్చు?
   ఎ) జవహర్ రోజ్‌గార్ యోజన
   బి) సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
   సి) డ్వాక్రా
   డి) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
23. ప్రధానమంత్రి సమీకృత పట్టణ పేదరిక నిర్మూలన పథకాన్ని ఎప్పుడు ప్రకటించారు?
   ఎ) 1993 బి) 1995
   సి) 1997 డి) 1999
24. కింది వాటిలో పట్టణ ప్రాంతాలకు సంబం ధించిన వేతన ఉపాధి పథకం?
   ఎ) నెహ్రూ రోజ్‌గార్ యోజన
   బి) జవహర్ రోజ్‌గార్ యోజన
   సి) కమాండ్ ఏరియా అభివృద్ధి కార్యక్రమం
   డి) పైవేవీ కావు
25. స్పెషల్ గ్రూప్ ఆన్ టార్గెటింగ్ టెన్ మిలియన్ ఎంప్లాయిమెంట్ ఆపర్చునిటీస్ (2002) కమిటీ అధ్యక్షుడు?
   ఎ) ఎస్.పి. గుప్తా బి) టెండూల్కర్
   సి) విజయ్ కేల్కర్ డి) బరూచా
26. గ్రామీణ ప్రాంతాల్లో వంద రోజుల ఉపాధి కల్పన లక్ష్యంగా 1993లో ప్రారంభించిన పథకం?
   ఎ) జవహర్ రోజ్‌గార్ యోజన
   బి) నెహ్రూ రోజ్‌గార్ యోజన
   సి) ఉపాధి హామీ పథకం
   డి) మహిళా సమృద్ధి యోజన
27. పోస్టాఫీసుల్లో గ్రామీణ మహిళల పొదుపును ప్రోత్సహించడానికి ప్రారంభించిన పథకం?
   ఎ) మహిళా సమృద్ధి యోజన
   బి) గంగా కల్యాణ్ యోజన
   సి) కనీస అవసరాల కార్యక్రమం
   డి) రాజ రాజేశ్వరి మహిళా కల్యాణ్ యోజన
28. స్వర్ణ జయంతి శహరీ రోజ్‌గార్ యోజనను ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1994 బి) 1995
   సి)1996 డి) 1997
29. పేదల ఆహార భద్రత లక్ష్యంగా 2000 సంవత్సరంలో ప్రారంభించిన పథకం?
   ఎ) ఆశ్రమ బీమా యోజన
   బి) జనశ్రీ బీమా యోజన
   సి) అంత్యోదయ అన్నయోజన
   డి) అన్నపూర్ణ యోజన
30. 'రాజ రాజేశ్వరి మహిళా కల్యాణ్ యోజన (1998)' లక్ష్యం?
   ఎ) మహిళలకు విద్యావకాశాల పెంపు
   బి) మహిళలకు బీమా రక్షణ
   సి) మహిళలకు ఆహార భద్రత
   డి) గర్భిణుల సంరక్షణ
31. పెన్షన్ పొందని వృద్ధులకు 10 కిలోల బియ్యం లక్ష్యంగా ప్రారంభించిన పథకం?
   ఎ) శిక్షా సయోగ్ యోజన
   బి) జనశ్రీ బీమా యోజన
   సి) భారత్ నిర్మాణ్
   డి) అన్నపూర్ణ యోజన
32. ఇళ్లు, తాగునీరు, పరిశుభ్రత కల్పన లక్ష్యంగా 1999లో ప్రారంభించిన పథకం?
   ఎ) భారత్ నిర్మాణ్
   బి) స్వర్ణ జయంతి ఆవాస్ యోజన
   సి) వందేమాతరం
   డి) పైవేవీకావు
33. జవహర్ గ్రామీణ సమృద్ధి యోజనను ఎప్పుడు ప్రారంభంచారు?
   ఎ) 1997 బి) 1998
   సి) 1999 డి) 2000
34. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక అవసరాలు తీర్చడానికి ఉద్దేశించిన పథకం?
   ఎ) ప్రధానమంత్రి గ్రామోదయ యోజన
   బి) స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన
   సి) వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన
   డి) సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన
35. 'సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (2001)' లక్ష్యం?
   ఎ) పేద వర్గాలకు బీమా
   బి) ఉపాధి, ఆహారభద్రత
   సి) గర్భిణుల సంరక్షణ
   డి) బాలింతల సంరక్షణ
36. పేద జిల్లాల్లో ఉపాధి కల్పన లక్ష్యంగా 2001లో ప్రారంభించిన పథకం?
   ఎ) జయప్రకాశ్ నారాయణ్ రోజ్‌గార్ గ్యారంటీ యోజన
   బి) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
   సి) జవహర్ గ్రామీణ సమృద్ధి యోజన
   డి) నేషనల్ ఫుడ్ ఫర్ వర్క్ ప్రోగ్రామ్
37. అనుబంధ వేతన ఉపాధి లక్ష్యంగా 2004లో ప్రారంభమైన పథకం?
   ఎ) జాతీయ పనికి ఆహార పథకం
   బి) ఎన్ఆర్ఈపీ
   సి) భారత్ నిర్మాణ్ డి) వందేమాతరం
38. సోషల్ సెక్యూరిటీ పైలెట్ స్కీం (2004) లక్ష్యం?
   ఎ) అనుబంధ వేతన ఉపాధి
   బి) అసంఘటిత రంగంలోని శ్రామికులకు బీమా, పెన్షన్, వైద్య సదుపాయాల కల్పన
   సి) గర్భిణుల సంరక్షణ
   డి) పేద జిల్లాల్లో ఉపాధి కల్పన
39. నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్‌ను ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1992 బి) 1993
   సి) 1994 డి) 1995
40. పక్కా రోడ్ల ద్వారా గ్రామాలను కలపడానికి ఉద్దేశించిన పథకం?
   ఎ) ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన
   బి) భారత్ నిర్మాణ్
   సి) ఇందిరమ్మ
   డి) సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన
41. భూమి లేని వ్యవసాయ కార్మికులకు బీమా లక్ష్యంగా 2001లో ప్రారంభమైన పథకం?
   ఎ) జనశ్రీ బీమా యోజన
   బి) కేటీహార్ మజ్దూర్ బీమా యోజన
   సి) జననీ సురక్ష యోజన
   డి) శిక్షా సంయోగ్ యోజన
42. పట్టణ ప్రాంతాల్లోని మురికివాడల ప్రజలకు గృహ నిర్మాణానికి ఉద్దేశించిన పథకం?
   ఎ) వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన
   బి) ఇందిరా ఆవాస్ యోజన
   సి) జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం
   డి) పీఎం గ్రామోదయ యోజన
43. గర్భిణుల సంరక్షణకు ఉద్దేశించిన పథకం?
   ఎ) జననీ సురక్ష యోజన
   బి) జనశ్రీ బీమా యోజన
   సి) వందేమాతరం
   డి) గంగా కల్యాణ్ యోజన
44. తల్లుల సంరక్షణ లక్ష్యంగా 2005లో ప్రారంభించిన పథకం?
   ఎ) జననీ సురక్ష యోజన
   బి) వందేమాతరం
   సి) రాజ రాజేశ్వరి మహిళా కల్యాణ్ యోజన
   డి) ఆశ్రయ బీమా యోజన
45. ఉపాధి కోల్పోయిన వారికి నష్ట పరిహారాన్ని అందించే ఆశ్రయ బీమా యోజన ఎప్పుడు ప్రారంభమైంది?
   ఎ) 1997 బి) 1999
   సి) 2001 డి) 2005
46. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎప్పుడు ప్రారంభమైంది?
   ఎ) 2005 ఫిబ్రవరి 2
   బి) 2006 ఫిబ్రవరి 2
   సి) 2007 ఫిబ్రవరి 2
   డి) 2008 ఫిబ్రవరి 2
47. 'ఉజ్వల' పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 2005 డిసెంబర్
   బి) 2006 డిసెంబర్
   సి) 2007 డిసెంబర్
   డి) 2008 జనవరి
48. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సౌకర్యాల కల్పనను 'పుర' పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 2002 బి) 2003
   సి)2004 డి) 2005
49. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన, జాతీయ పనికి ఆహార పథకం కార్యక్రమాలు దేనిలో విలీనమయ్యాయి?
   ఎ) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
   బి) జె.ఆర్.వై.
   సి) ఎస్.ఆర్.వై.
   డి) ఉజ్వల
50. 2007 అక్టోబర్ 2న ప్రారంభమైన పథకం?
   ఎ) భారత్ నిర్మాణ్
   బి) ఆమ్ ఆద్మీ బీమా యోజన
   సి) నేషనల్ రెన్యువల్ ఫండ్
   డి) నేషనల్ రూరల్ హెల్త్ మిషన్

### సమాధానాలు

| | | | |
|---|---|---|---|
| 1) డి; | 2) సి; | 3) సి; | 4) బి; |
| 5) ఎ; | 6) బి; | 7) సి; | 8) డి; |
| 9) ఎ; | 10) బి; | 11) డి; | 12) సి; |
| 13) బి; | 14) ఎ; | 15) సి; | 16) బి; |
| 17) సి; | 18) ఎ; | 19) బి; | 20) ఎ; |
| 21) బి; | 22) ఎ; | 23) బి; | 24) ఎ; |
| 25) ఎ; | 26) సి; | 27) ఎ; | 28) డి; |
| 29) సి; | 30) బి; | 31) డి; | 32) బి; |
| 33) సి; | 34) ఎ; | 35) బి; | 36) ఎ; |
| 37) ఎ; | 38) బి; | 39) డి; | 40) ఎ; |
| 41) బి; | 42) ఎ; | 43) సి; | 44) ఎ; |
| 45) సి; | 46) బి; | 47) సి; | 48) బి; |
| 49) ఎ; | 50) బి. | | |

# India is younger than the world!

BANK EXAMS

GENERAL ENGLISH

***Directions (Q. No. 1-10):*** Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. They're charging an exorbitant price (1)/ for fixing the car, (2)/ but they've get us over a barrel (3)/ because we can't do without it. (4)/ No error (5)
2. He accepted (1)/ her apology (2)/ very (3)/ graceful. (4)/ No error (5)
3. His words caused (1)/ a great deal (2)/ of dissension about (3)/ his followers. (4)/ No error (5)
4. The film was highly praised, (1)/ but is (2)/ not a (3)/ commercial success. (4)/ No error (5)
5. I didn't have (1)/ any money to give him; (2)/ the much I could do (3)/ was offer him my support. (4)/ No error (5)
6. He was asked (1)/ the same question so many time (2)/ that the answer (3)/ became mechanical. (4)/ No error (5)
7. An ounce in liquid (1)/ was different (2)/ from an ounce (3)/ in dry measure. (4)/ No error (5)
8. She was holding (1)/ the wheel with one hand (2)/ and waves (3)/ with the other. (4)/ No error (5)
9. It wasn't really (1)/ a propitiate moment (2)/ to raise the subject (3)/ of my pay rise. (4)/ No error (5)
10. Now that television has become (1)/ important in elections, (2)/ a new set off circumstances (3)/ has come into play. (4)/ No error (5)

***Directions (Q. No. 11-20):*** Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

In seven years, India will **surpass** China to become the world's most **populous** country and will have 1.7 billion residents by 2050, new projections from the United Nations show. Experts, however, caution that India might be lowering its fertility at a faster rate than what the U.N.'s projections indicate. The 2015 revision to the U.N.'s World Population Projections was released early on Thursday. The world population reached 7.3 billion as of mid-2015, adding approximately one billion people in the past 12 years. The world population, however, is growing slower now; 10 years ago, the growth rate was 1.24 per cent a year, while today, it is growing by 1.18 per cent or approximately, an additional 83 million people annually. It will take 15 years to add the next billion people, taking the world population to 8.5 billion in 2030. By 2050, the world will have 9.7 billion people and 11.2 billion by 2100. As a region, Africa will have its population - **propelled** to a large extent by Nigeria which will be the third largest populated country in the world in 2050 overtaking the U.S. — grow the fastest. The population of 48 countries, most of them in Europe and including Japan, will in contrast **shrink** between 2015 and 2050.

The median age of the global population — that is, the age at which half the population is older and half is younger — is 29.6. About one-quarter (26 per cent) of the world's people are under 15 years of age, 62 per cent are aged 15 to 59, and 12 per cent 60 or above. India is younger than the world; the median age is a full three years younger and 28.8 per cent are under the age of 15, while just 8.9 per cent are 60 or over. By 2050, India will have aged significantly, and the share of people over 60 will be twice as big, while the median age will be 37.3.

China's population will start declining by the 2030s, while India's is projected to **decline** only after 2069 when its population is around 1.75 billion. However, demographic experts say the U.N.'s projections may not be keeping pace with the speed at which India is reducing its fertility. As of 2013, India's Sample Registration System (SRS) — the official source of fertility statistics, which come from the Registrar-General's office — said the total fertility rate (average number of children per woman) was down to 2.3. However, the U.N. projects a rate of 2.34 for 2015-20. By the SRS rates, India could reach **replacement** fertility levels — when every woman has just enough children to replace the parents on average — by 2020, but the U.N. projections would see this happening around a decade later.

11. The concern expressed in the passage is
    1) The growing age
    2) World old age ratio
    3) Exponential growth in population
    4) Median age of people in Africa
    5) Japan's mortality rate
12. The third largest populated country in the world is located in
    1) Nigeria 2) Asia3) Japan
    4) Africa 5) Europe
13. India is younger than the world means:
    1) India is a budding country
    2) India is a developing nation
    3) India is a country with lower fertility rate
    4) Every woman has just enough children to replace the parents
    5) The population of the younger folks is relatively high
14. What does the author say about the world population?
    1) It is steadily making a progress
    2) It is showing larger growth beyond control
    3) It is difficult to control the population for the next ten years
    4) It is growing slower now when compared with the last decade
    5) The rise in population indicates rise of problems

***Directions (Q. No. 15-17):*** Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in bold.

15. **Surpass**
    1) Beside 2) Besides 3) Exceed
    4) Limit 5) Confide
16. **Populous**
    1) Crowded 2) Demur
    3) Protest 4) Cozy 5) Homely
17. **Replacement**
    1) Postpone 2) Proxy 3) Privy
    4) Pilferage 5) Procrastinate

***Directions (Q. No.18-20):*** Choose the word which is OPPOSITE in meaning to the word printed in bold.

18. **Decline**
    1) Refuse 2) Reject 3) Reflect
    4) Rebuff 5) Recognize
19. **Shrink**
    1) Shrivel 2) Shiver
    3) Nurture 4) Wither
    5) Smallest
20. **Propel**
    1) Force 2) Boost 3) Vigor
    4) Weakness 5) Energy

***Directions (Q. No. 21-30):*** In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Former President, top scientist, Bharat Ratna, Missile Man of India.... These are just some of the ____ (21) that come ____ (22) the name of APJ Abdul Kalam who died in Shillong, collapsing in the middle of what he loved doing most - talking to students. He was 83. Born on 15th October 1931 in Rameswaram ____ (23) Tamil Nadu to humble parents - his father was a boat owner - APJ Abdul Kalam distributed newspapers at ____ (24) time to support his family and his education. He graduated with physics from the Madras University, went on to study aerospace engineering, wanted to be a fighter pilot but just missed that bus. But there was no stopping him. The DRDO, ISRO, chief scientific advisor to the prime minister in 1992, the Pokhran 2 nuclear tests... Abdul Kalam straddled them all, till he ____ (25) India's 11th President in 2002. It was the ____ (26) he will probably be most remembered for - a president who brought Rashtrapati Bhavan to the people.... earning him the tribute of the People's President. Signing the Office of Profit Bill was the toughest decision he had taken during his tenure - that's what Abdul Kalam himself was once quoted saying. There were also controversial decisions - his response to mercy petitions from death row ____ (27) and the imposition of President's Rule in Bihar in 2005. But what he will be ____ (28) for was his engagement with the people ____ (29) children - even after his presidency and the books that he wrote - India 2020 and, of course, Igniting minds. "If you want to shine like a sun, first burn like a sun," APJ Abdul Kalam ____ (30) in one of his inspirational speeches.

21. 1) titles 2) tag 3) names
    4) identity 5) headings
22. 1) beside 2) before
    3) besides4) forefront
    5) in front
23. 1) for 2) at 3) in
    4) with 5) from
24. 1) an 2) the 3) previous
    4) one 5) early
25. 1) elected 2) elect
    3) is elected
    4) has elected 5) was elected
26. 1) role 2) character
    3) attitude 4) behavior
    5) roll
27. 1) acquit 2) convicts
    3) exonerates
    4) release 5) guilty
28. 1) thought 2) taught
    3) remembered
    4) added
    5) recollect
29. 1) special 2) specialty
    3) specialist
    4) especially
    5) particular
30. 1) will say 2) says
    3) has said
    4) would say
    5) had said

### Answers

| | | | | |
|---|---|---|---|---|
| 1. 3 | 2. 4 | 3. 3 | 4. 2 | 5. 3 |
| 6. 2 | 7. 2 | 8. 3 | 9. 2 | 10. 3 |
| 11. 3 | 12. 4 | 13. 5 | 14. 4 | 15. 3 |
| 16. 1 | 17. 2 | 18. 5 | 19. 3 | 20. 4 |
| 21. 1 | 22. 2 | 23. 3 | 24. 4 | 25. 5 |
| 26. 1 | 27. 2 | 28. 3 | 29. 4 | 30. 5 |